విశాఖపట్నం
విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ AP EAPCET CODE VIVP AUTONOMOUS
విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్ AP EAPCET CODE VIEW AUTONOMOUS

ఈనాడు

గుంటూరు
విజ్ఞాన్స్ లారా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & సైన్స్ AP EAPCET CODE VLIT AUTONOMOUS
విజ్ఞాన్స్ నిరుల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & సైన్స్ ఫర్ ఉమెన్ AP EAPCET CODE VNIW AUTONOMOUS

విజయవాడ 16-7-2025 బుధవారం సిటీ సంపుటి 51 . సంచిక 337 | THE LARGEST CIRCULATED TELUGU DAILY | రూ. 6-50 పేజీలు 16 | www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

విజ్ఞాన్ ఇంజినీరింగ్ & ఫార్మసీ సంస్థలు

విజ్ఞాన్ అంటేనే 48 సం॥ల నమ్మకం

అన్నిచోట్ల... అదే స్టాండర్డ్స్... అదే నమ్మకం - విజ్ఞాన్

మన యువత గొప్ప గొప్ప ఉద్యోగాలు సాధించాలి..
దిగువ, మధ్యతరగతి కుటుంబాలు పైస్థాయికి ఎదగాలి...
– అదే ధ్యేయం.. అదే లక్ష్యంతో...

ప్రగతి పథంలో... పదండి ముందుకు...

గత సంవత్సరం, చాలా చోట్ల ఉద్యోగాలు రావడం కష్టంగా ఉన్నా..
విజ్ఞాన్‌లో దాదాపు అన్నిచోట్ల 70-75 శాతం మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని తెలియజేయుటకు సంతోషిస్తున్నాము.

ప్రతి బ్యాచ్‌లో విజ్ఞాన్ అన్ని ఇంజినీరింగ్ & ఫార్మసీ కాలేజీల విద్యార్థులకు
70-75% ఉద్యోగాలు 25-30% ఉన్నత చదువులు



ఇదెలా సాధ్యమయింది...

యూనివర్సిటీ సిలబస్, పరీక్షలకే పరిమితమవకుండా విజ్ఞాన్‌లో నిర్వహిస్తున్న విశిష్ట కార్యక్రమాలు...

- సిలబస్‌కు అతీతంగా అనేక కోర్సులు నిర్వహించుట
- బోధనా నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ
- ప్రతి విద్యార్థి అభివృద్ధిని ప్రోత్సహించేలా అధ్యాపకులకు బలమైన శిక్షణ
- సాధారణ ట్రైనింగ్ కాకుండా, కంపెనీల అవసరాలకనుగుణంగా ప్రత్యేక శిక్షణ
- అంకితభావం, ప్రతిభావంతులైన అధ్యాపక బృందం.

కాబట్టి..

- నాలెడ్జి, నైపుణ్యతతో పాటు సరైన ఆలోచనా ధోరణి, భావవ్యక్తీకరణ, దృఢ సంకల్పం, ఆత్మవిశ్వాసంతో కూడిన పరిపూర్ణ వ్యక్తిత్వ నిర్మాణం జరగడం ద్వారా విద్యార్థులలో ఈ విధమైన ప్రగతి సాధ్యమవుతుంది.

గుంటూరు

విజ్ఞాన్స్ లారా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & సైన్స్ — AP EAPCET CODE VLIT — AUTONOMOUS — NAAC GRADE A+
Vadlamudi, Guntur. AP - 522213.
Cell : 98856 39015, 94410 63389

విజ్ఞాన్స్ నిరుల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & సైన్స్ ఫర్ ఉమెన్ — AP EAPCET CODE VNIW — AUTONOMOUS — NBA CSE IT ECE
Peda Palakaluru Road, Peda Palakaluru, Guntur, A.P - 522 009.
Cell : 98663 42224, 98662 22280

విజ్ఞాన్ ఫార్మసీ కాలేజ — AP EAPCET CODE VPCV — AUTONOMOUS — NAAC GRADE A++
Vadlamudi, Guntur. AP - 522213.
Cell : 98663 99382, 91212 14736

విశాఖపట్నం

విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ — AP EAPCET CODE VIVP — AUTONOMOUS — NAAC GRADE A+
Besides VSEZ, Duvvada, Visakhapatnam - 530 049.
Cell : 91333 00359, 98663 99930

విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్ — AP EAPCET CODE VIEW — AUTONOMOUS — NAAC GRADE A+
Vadlapudi post, Backside of VSEZ Kapujaggaraju peta, Visakhapatnam - 46
Cell : 91333 00350, 91333 00357

విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్ టెక్నాలజీ — AP EAPCET CODE VIPV — AUTONOMOUS — NAAC GRADE A++
Besides VSEZ, Vadlapudi, Visakhapatnam.
Cell : 98663 99928, 80197 97018

* Yearwise and program wise placement details can be obtained from respective college websites.

www.vignan.ac.in

విజ్ఞాన్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ

BiPC చదివిన విద్యార్థులకు ఈ క్రింది కోర్సులతో ఉజ్వల భవిష్యత్తు...

బీఎస్సీ అగ్రికల్చర్ (Hons)	బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ)
బీటెక్ (బయోటెక్నాలజీ)	బీ. ఫార్మసీ
బీటెక్ (బయోఇన్ఫర్మేటిక్స్)	ఫార్మా-డీ
బీటెక్ (బయోమెడికల్)	

అందుబాటులోగల ఇతర కోర్సులు...

బీఏ ఎల్ఎల్‌బీ (Hons)	ఎమ్మెస్సీ (సైకాలజీ)
బీబీఏ ఎల్ఎల్‌బీ (Hons)	ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ)
బీఎస్సీ (డేటా సైన్స్)	ఎమ్మెస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ)
ఎమ్మెస్సీ (డేటా సైన్స్)	ఎంఏ (ఇంగ్లీష్)
బీఎస్సీ (సైకాలజీ)	డిప్లొమా (ఈసీఈ, మెకానికల్, ఈఈఈ)
బీసీఏ, బీబీఏ	ఎంసీఏ, ఎంబీఏ



85-90 శాతం ఉద్యోగాలు | 10-15 శాతం ఉన్నత చదువులు

- ✦ 4 సంవత్సరాల బీ.ఎస్సీ అగ్రికల్చర్ కోర్సులో మొదటి 3 సంవత్సరాలు నేర్చుకున్న విద్యను ప్రయోగాత్మకంగా అవగాహన చేసుకునేందుకు చివరి ఏడాది పూర్తిగా వ్యవసాయ క్షేత్రంలో ఉండి అభ్యసిస్తారు.
- ✦ విద్యార్థులు పరిశోధనలు నిర్వహించేందుకు సువిశాల 41 ఎకరాల వ్యవసాయ క్షేత్రం ఏర్పాటు.
- ✦ ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్, ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ వంటి డిజిటల్ సాంకేతికతను వ్యవసాయ విద్యకు అనుసంధానించి నైపుణ్యతను పెంచటం.
- ✦ లా కోర్సులకు ప్రాక్టీసింగ్ అడ్వకేట్స్ చేత 50% క్లాసులు బోధించబడతాయి.
- ✦ సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ క్రైమ్స్ వంటి టెక్నాలజీలను ఉపయోగించి ఇంటిగ్రేటెడ్ లీగల్ ఎడ్యుకేషన్.
- ✦ సివిల్స్ మరియు ఇతర కాంపిటీటివ్ పరీక్షలకు ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ నిర్వహించటం.

NAAC GRADE A+ | NIRF RANK 72 | ABET (CSE, EEE, ECE, MECH, BT)

విజ్ఞాన్స్
Foundation for Science, Technology & Research
(డీమ్డ్ టు బీ యూనివర్సిటీ)
(Estd u/s 3 of UGC Act of 1956)
గుంటూరు – హైదరాబాద్

వడ్లమూడి, గుంటూరు - 522 213.
Cell : 88869 84299, 98661 81233, 73581 82806

Vijayawada, West Godavari - 99499 83666, 88855 59373 Guntur, Nellore, Ongole - 83286 66589 Vizag, East Godavari - 70130 97630, 91004 68711 Tirupati - 80999 16859 Anantapuram - 79899 87921 Kurnool - 96429 92312 Nandyala-86392 46411 YSR Kadapa-99669 74514 Ranga Reddy-98661 81233, 93984 40311 NTR, Khammam-93942 44999

ఈనాడు

విజయవాడ 16-7-2025 బుధవారం సిటీ సంపుటి 51 . సంచిక 337

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

శుభప్రదం.. జయప్రదం!

భారత ఆస్ట్రోనాట్‌కు అభినందనల వెల్లువ

- క్షేమంగా భూమికి తిరిగొచ్చిన శుభాంశు
- మరో ముగ్గురు వ్యోమగాములు కూడా..
- సాఫీగా సాగర జలాల్లో దిగిన డ్రాగన్ వ్యోమనౌక
- యాక్సియం-4 రోదసియాత్ర దిగ్విజయం



కాలిఫోర్నియా సమీపంలో సముద్ర జలాల్లో దిగిన డ్రాగన్ గ్రేస్ స్పేస్‌క్రాఫ్ట్

వాషింగ్టన్, దిల్లీ: భారత రోదసి చరిత్రలో ఒక కీలక అంకం దిగ్విజయంగా పూర్తయింది. స్వీయ మానవసహిత అంతరిక్షయాత్ర 'గగన్‌యాన్'కు మార్గం సుగమమైంది. భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో 18 రోజులపాటు గడిపిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా.. చిరునవ్వులు చిందిస్తూ భూమికి చేరుకున్నారు. 41 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత పౌరుడొకరు రోదసి యాత్రను పూర్తిచేసుకొని సగర్వంగా తిరిగొస్తున్న అద్భుత ఘట్టాన్ని వీక్షించి యావద్దేశం పులకించింది. గగనయాత్రికుడికి ఘన స్వాగతం పలికింది. నింగిని చుంబించి వచ్చిన కుమారుడిని (మిగతా 2లో)

భావి పరిశోధనలకు వెన్నుదన్నుగా... – సంపాదకీయం 4లో

చరిత్రాత్మక యాత్ర: మోదీ

యాక్సియం-4 మిషన్‌లో పైలట్‌గా శుక్లా పాత్రను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కొనియాడారు. దేశ అంతరిక్ష పరిశోధనల్లో, అంతర్జాతీయ భాగస్వామ్యాల్లో ఒక కొత్త మైలురాయిని ఆయన స్థాపించారని చెప్పారు. చరిత్రాత్మక యాత్ర ముగించుకొని వచ్చిన శుభాంశుకు దేశ ప్రజలందరితో కలిసి స్వాగతం పలుకుతున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ఆయన తన అంకితభావం, ధైర్యం, మార్గదర్శకత్వంతో కోట్లమంది భారతీయుల్లో స్ఫూర్తిని రగిలించారని కొనియాడారు. గగన్‌యాన్ యాత్ర దిశగా ఇదో ముఖ్య మైలురాయి అని పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలువురు రాజకీయ నేతలు శుక్లాకు అభినందనలు తెలిపారు.



డ్రాగన్ గ్రేస్ స్పేస్‌క్రాఫ్ట్ నుంచి బయటకు వస్తూ అభివాదం చేస్తున్న శుభాంశు శుక్లా

మనకూ వస్తోంది.. మైక్రోసాఫ్ట్!

Microsoft

అమరావతి క్వాంటమ్ వ్యాలీలో పరిశోధన కేంద్రం

ఐబీఎంకు భిన్నమైన సాంకేతికతతో క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు

4 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రత్యేక భవనం

ఈనాడు, అమరావతి: సాంకేతిక రంగంలో దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ రాష్ట్రానికి రానుంది. అమరావతి క్వాంటమ్ వ్యాలీలో 'క్వాంటమ్ పరిశోధన' కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతోంది. దీనికోసం క్వాంటమ్ కంప్యూటర్‌తో రాబోతోంది. ఆ సంస్థ ప్రతినిధులతో అధికారుల సంప్రదింపులు ఓ కొలిక్కి వచ్చాయి. పరిశోధన కేంద్రం ఏర్పాటుపై కొద్దిరోజుల్లో ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకోనుంది. దీనిపై సంస్థతో తుదిదశ సంప్రదింపులు పూర్తయ్యాయి. ఇప్పటికే ఐబీఎం 156 క్యూబిట్‌ల సామర్థ్యంతో క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. మరికొన్ని ప్రముఖ సంస్థలూ రాష్ట్రానికి వరుస కట్టబోతున్నాయని అధికారులు చెబుతున్నారు.

రెండూ వేర్వేరు సాంకేతికతలు

ఐబీఎం సంస్థ 'ఒక డెకో' సిస్టమ్ క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటుచేస్తే.. దీనికి భిన్నమైన క్వాంటమ్ కంప్యూటర్‌ను మైక్రోసాఫ్ట్ ఏర్పాటుచేయనుంది. రెండు సంస్థలు వేర్వేరు టెక్నాలజీ కంప్యూటర్లను ఏర్పాటుచేస్తుండటంతో.. ఎన్ని క్యూబిట్‌ల సామర్థ్యం ఉన్న కంప్యూటర్‌ను మైక్రోసాఫ్ట్ ఏర్పాటు చేయనుందనే (మిగతా 2లో)

కరవుసీమను ఆదుకోవడానికే బనకచర్ల

> వైకాపా పాలనలో ధ్వంసమైన ఆర్థిక వ్యవస్థను కేంద్ర ప్రభుత్వ సహకారంతో గాడిలో పెడుతున్నాం. ఇప్పటికీ ఆర్థిక వనరుల పరంగా తీవ్రమైన కొరత ఎదుర్కొంటున్నందున కేంద్రం నుంచి మరింత సహకారం అందించాలి.
> \- కేంద్ర హోంమంత్రితో చంద్రబాబు

గోదావరిలో 90-120 రోజులు మిగులు జలాలు

చివరి రాష్ట్రంగా ఏపీకి వాటిని వాడుకొనే హక్కు

హోం మంత్రి అమిత్‌షాకు వివరించిన సీఎం చంద్రబాబు

ఎరోస్పేస్, డిఫెన్స్ పరిశ్రమల ఏర్పాటుపై నీతిఆయోగ్ సభ్యుడు సారస్వత్‌తో చర్చ

విశాఖ, విజయవాడల్లో మెట్రోరైల్‌పై దిల్లీ మెట్రో ఎండీతో భేటీ



దిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో చర్చిస్తున్న సీఎం చంద్రబాబు

ఈనాడు, దిల్లీ: కరవు పీడిత రాయలసీమ ఎదుర్కొంటున్న నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకే కీలకమైన పోలవరం- బనకచర్ల ప్రాజెక్టును ప్రతిపాదించామని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు వివరించారు. పోలవరం నుంచి కర్నూలు జిల్లా బనకచర్ల రెగ్యులేటర్ వరకు 200 టీఎంసీల వరదనీటిని తరలించేలా ప్రాజెక్టును ప్రతిపాదించినట్లు చెప్పారు. సముద్రంలోకి వెళ్లే వరద జలాలను ఉపయోగించుకోవడానికి ఉద్దేశించిన ఈ ప్రాజెక్టు పూర్తయితే రాయలసీమకు దక్కే ప్రయోజనాల గురించి వెల్లడించారు. ఎగువ, దిగువ రాష్ట్రాల అవసరాలు తీరిన తర్వాత కూడా గోదావరి నదిలో 90 నుంచి 120 రోజుల దాకా మిగులు జలాలు ఉంటాయని.. నదీ పరీవాహక ప్రాంతంలో చివర ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు వాటిని పూర్తిగా వినియోగించుకొనే హక్కు ఉంటుందని చంద్రబాబు వివరించారు. మంగళవారం ఇక్కడ (మిగతా 2లో)

మిథున్‌రెడ్డికి బెయిలు నిరాకరణ





వైకాపా ఎంపీ ముందస్తు బెయిలు పిటిషన్ కొట్టివేత

మద్యం కుంభకోణంలో ఆయన పాత్ర స్పష్టమవుతోంది

వెలికితీసేందుకు కస్టోడియల్ విచారణ అవసరం

నేర తీవ్రత దృష్ట్యా బెయిలివ్వలేం ● తేల్చిచెప్పిన హైకోర్టు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితుడు (ఏ4), వైకాపా ఎంపీ పీవీ మిథున్‌రెడ్డికి హైకోర్టు షాకిచ్చింది. ఈ కేసులో ముందస్తు బెయిలు కోసం ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసింది. దర్యాప్తులో సేకరించిన ఆధారాలను బట్టి చూస్తే మద్యం కుంభకోణంలో మిథున్‌రెడ్డి పాత్ర ఉన్నట్లు ప్రాథమికంగా స్పష్టమవుతోందని తేల్చిచెప్పింది. సేకరించిన ఆధారాలను మిథున్‌రెడ్డి ముందు ఉంచి ఎక్సైజ్ పాలసీ అమల్లో చోటుచేసుకున్న కుట్ర కోణాన్ని వెలికితీసేందుకు ఆయన్ను కస్టడీలోకి తీసుకుని విచారించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. మద్యం కుంభకోణం విషయంలో ప్రాసిక్యూషన్ (సీఐడీ/సిట్) చేస్తున్న తీవ్ర ఆరోపణలను విస్మరించడానికి వీల్లేదని పేర్కొంది. ఈ కేసులో నేర తీవ్రత, లిక్కర్ సిండికేట్ కోసం రూ.3,500 కోట్ల ముడుపులు చేతులు మారాయన్న ఆరోపణలు, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ముందస్తు బెయిల్ మంజూరు చేయలేమని స్పష్టం చేసింది. ముందస్తు బెయిలు పొందేందుకు మిథున్‌రెడ్డి అనర్హులంది. తీవ్ర ఆరోపణలున్న ఇలాంటి కేసులో దర్యాప్తు అధికారికి స్వేచ్ఛ ఇవ్వాలని.. ఈ దశలో ముందస్తు బెయిలు మంజూరు చేస్తే దర్యాప్తునకు అవరోధం కలుగుతుందని పేర్కొంది. ఆరోపణల విషయంలో సమగ్ర విచారణ జరిపేందుకు మిథున్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని విచారించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు మంగళవారం ఈ మేరకు (మిగతా 2లో)

మిథున్‌రెడ్డిపై లుకౌట్ సర్క్యులర్

విదేశాలకు పారిపోకుండా జారీ చేసిన సిట్

ఇప్పటికే అజ్ఞాతంలోకి వెళ్లిన వైకాపా ఎంపీ


2లో

మహిళా ఎమ్మెల్యేపై.. ఏంటా మాటలు!

- ఇలాంటి వాటిని ఉపేక్షించం
- వైకాపా నేత ప్రసన్నకుమార్‌రెడ్డిపై మండిపడ్డ హైకోర్టు
- ముందస్తు బెయిలుపై విచారణ నేటికి వాయిదా

ఈనాడు, అమరావతి: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు తెదేపా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో వైకాపా మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి హైకోర్టు తలంటింది. ఈ వ్యవహారంలో తనపై పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిలు మంజూరు చేయాలంటూ ప్రసన్నకుమార్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం హైకోర్టు విచారణ జరిపింది. 'మహిళా ఎమ్మెల్యేపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారా? ఆ వ్యాఖ్యలను ఉపేక్షించం. మాజీ ఎమ్మెల్యే అయి ఉండి ఓ మహిళా ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖలు ఎలా చేస్తారు? అలాంటి వ్యాఖ్యలు (మిగతా 2లో)

ఇదీ సంగతి!



అన్ని రంగాలకూ విస్తరించడమే కాదు.. పాలనా పగ్గాలు మేమే చేపట్టే రోజు వస్తుంది.. అదే మా తదుపరి లక్ష్యం

నేటి నుంచి మూడు రోజులపాటు.. రాష్ట్రంలో ఓ మోస్తరు వర్షాలు

ఈనాడు, విశాఖపట్నం: రాజస్థాన్ పరిసరాల్లో వాయుగుండం కొనసాగుతోంది. ఇది బుధవారం నాటికి పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ ఉత్తర రాజస్థాన్ మీదుగా ప్రయాణించనుంది. మరోవైపు ఉత్తర ఝార్ఖండ్, దక్షిణ బిహార్ పరిసరాల్లో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది బుధవారం నాటికి పశ్చిమ-వాయవ్య దిశగా పయనిస్తూ.. ఉత్తర్ ప్రదేశ్ వైపు వెళ్లనుంది. రాజస్థాన్, ఝార్ఖండ్, బిహార్ మీదుగా బంగాళాఖాతం వరకు రుతుపవన ద్రోణి కొనసాగుతోంది. ఈ పరిస్థితుల కారణంగా బుధ, గురువారాల్లో పలు రాష్ట్రాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలకు అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. రాబోయే మూడు రోజుల్లో మన రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది. బుధ, గురువారాల్లో రాష్ట్రంలో తేమ, ఉక్కపోత వాతావరణం కొనసాగే అవకాశముందని పేర్కొంది. మంగళవారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 36 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి. విశాఖపట్నం, తుని, కాకినాడ, నరసాపురం, మచిలీపట్నం, నందిగామ, గన్నవరం, బాపట్ల తదితర ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 4 డిగ్రీల నుంచి 7 డిగ్రీల వరకు పెరిగాయి.



మిథున్‌రెడ్డికి బెయిలు నిరాకరణ

(మొదటి పేజీ తరువాయి)

తీర్పు ఇచ్చారు. మద్యం కుంభకోణం ద్వారా వచ్చిన సొమ్ము మిథున్‌రెడ్డి కుటుంబసభ్యులకు చెందిన పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ సంస్థకు చేరిందని సిట్ అనుమానం వ్యక్తం చేస్తున్నప్పటికీ.. ఆ సొమ్ము మద్యం ముడుపులకు సంబంధించినది కాదని చెప్పేందుకు పిటిషనర్ ఎలాంటి ఆధారాలనూ కోర్టు ముందు ఉంచలేదని హైకోర్టు పేర్కొంది. ఈ కేసులో మిథున్‌రెడ్డి పాత్ర ఉన్నట్లు ప్రాథమిక ఆధారాలు కోర్టు ముందు కనిపిస్తున్నాయని చెప్పింది. అలాంటప్పుడు ప్రస్తుత ప్రభుత్వానికి, పిటిషనర్‌కు మధ్య రాజకీయ విభేదాలు ఉన్నాయన్న కారణంతో ముందస్తు బెయిలు మంజూరు చేయలేమంది. ఉద్దేశపూర్వకంగానే గతంలో ఉన్న మద్యం విధానంలో మార్పులు చేసి మద్యం తయారీ కంపెనీల నుంచి పెద్ద ఎత్తున ముడుపులు వసూలు చేసినట్లు ప్రాసిక్యూషన్ వాదిస్తోందని గుర్తుచేసింది. సాక్షుల వాంగ్మూలాలను పరిగణనలోకి తీసుకుంటే మద్యం విధానం రూపకల్పనకు సంబంధించిన నేరపూరిత కుట్రలో మిథున్‌రెడ్డి పాత్ర ఉన్నట్లు ప్రాథమికంగా స్పష్టమవుతోందని పేర్కొంది. ఈ కేసులో మిథున్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి, సీఐడీ/సిట్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. ఇటీవల తీర్పును రిజర్వు చేసిన న్యాయమూర్తి.. బెయిల్ పిటిషన్‌ను కొట్టేస్తూ మంగళవారం నిర్ణయాన్ని ప్రకటించారు.

మిథున్‌రెడ్డిపై లుకౌట్ సర్క్యులర్

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితుడు (ఏ-4), వైకాపా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై సిట్ అధికారులు మంగళవారం సాయంత్రం లుకౌట్ సర్క్యులర్ (ఎల్వోసీ) జారీ చేశారు. ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసిన నేపథ్యంలో.. విదేశాలకు పారిపోకుండా అడ్డుకునేందుకు ఈ ఎల్వోసీ ఇచ్చారు. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేసే అవకాశముందని ముందే గ్రహించిన మిథున్‌రెడ్డి అప్పటికే అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆయన ఎక్కడ దాక్కున్నారో తెలుసుకునేందుకు సిట్ బృందాలను ఏర్పాటు చేసింది. మద్యం కుంభకోణం కేసు వెలుగులోకి వచ్చిన తర్వాత మిథున్‌రెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లిపోవటం ఇది రెండోసారి. ఈ కుంభకోణంలో తన ప్రమేయం సిట్ దర్యాప్తులో బయటపడిందని తెలియగానే మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ కోసం మార్చిలో హైకోర్టుకు వెళ్లారు. అప్పటికి ఆయన్ను ఈ కేసులో నిందితుడిగా చేర్చకపోవడంతో కోర్టు ఆ పిటిషన్‌ను కొట్టేసింది. తనను అరెస్టు చేస్తారేమోననే భయంతో మిథున్‌రెడ్డి అప్పట్లో అజ్ఞాతంలో ఉంటూనే.. సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కోర్టులో విచారణ కొనసాగినంత కాలం అరెస్టు నుంచి మధ్యంతర రక్షణ కల్పిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలివ్వటంతో బయటకొచ్చారు. ఇప్పుడు మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. మిథున్‌రెడ్డి ఆచూకీ తెలిస్తే.. ఆయన్ను సిట్ అధికారులు వెంటనే అరెస్టు చేస్తారా? లేదా ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో అప్పీలుకు వెళ్లి అక్కడ ఏదో తేలే వరకూ వేచిచూస్తారా అనే దానిపై ఆసక్తి నెలకొంది.

మహిళా ఎమ్మెల్యేపై.. ఏంటా మాటలు!

(మొదటి పేజీ తరువాయి)

చేయకుండా నియంత్రించుకోండి. మీ వ్యాఖ్యలతో న్యూసెన్స్ చేశారు. ఓ మాజీ ఎమ్మెల్యే.. ఓ మహిళా ఎమ్మెల్యేను గౌరవించేది ఇలాగేనా? ఆ వ్యాఖ్యలు చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? మాట్లాడేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండండి అని ఆయనపై తీవ్రస్థాయిలో మండిపడింది. ముందస్తు బెయిలు పిటిషన్‌పై ప్రసన్నకుమార్‌రెడ్డి తరఫు న్యాయవాది అభ్యర్థనను తోసిపుచ్చింది. సీనియర్ న్యాయవాది హాజరై వాదనలు వినిపిస్తూ, పోలీసులు నమోదు చేసిన సెక్షన్లన్నీ ఏడేళ్లలోపు జైలుశిక్షకు వీలున్నవేనని, విచారణను బుధవారానికి వాయిదా వేయాలని కోరారు. దీంతో విచారణను బుధవారానికి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

బీసీలను రెచ్చగొట్టేందుకు పేర్ని నాని కుట్ర

శాసనమండలిలో చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ ధ్వజం

ఈనాడు, అమరావతి: బీసీ మహిళను రాజకీయాల్లోకి లాగి, కులాల మధ్య చిచ్చుపెట్టి రాష్ట్రంలో శాంతిభద్రతలు దెబ్బతీయాలని పేర్ని నాని చేసిన ప్రయత్నం విఫలమైందని శాసనమండలిలో చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ అన్నారు. అది బెడిసికొట్టడంతో పిచ్చెక్కి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. 'కులాల మధ్య చిచ్చుతోనే వైకాపాను మళ్లీ పైకి తేవాలన్న ఉద్దేశంతో పేర్ని నాని కృష్ణా జిల్లాను ఎంచుకున్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన 34% రిజర్వేషన్లను స్థానిక సంస్థల ఎన్నికల్లో తగ్గించి 16,800 మంది బీసీలను నాయకులుగా ఎదగకుండా చేసిన మీకు బీసీల గురించి మాట్లాడే అర్హత ఎక్కడ ఉంది? పేర్ని నాని ఇప్పటికైనా చిల్లర రాజకీయాలు మానుకోవాలి' అని అనురాధ హితవు పలికారు.

21న ప్రైవేటు కళాశాలల బంద్

ఈనాడు, అమరావతి: డిగ్రీ విద్యలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న ప్రైవేటు డిగ్రీ కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణజీ, రాజ్‌కుమార్ చౌదరి ఓ ప్రకటనలో తెలిపారు.

ప్రవేశాల కోసం ధర్నా 17న: విద్యార్థి సంఘాలు

ఈనాడు, అమరావతి: డిగ్రీ ప్రవేశాలు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న ఉన్నత విద్యామండలి కార్యాలయం వద్ద ధర్నాకు విద్యార్థి సంఘాలు ఉమ్మడిగా పిలుపునిచ్చాయి. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఏ, పీడీఎస్ఓ రాష్ట్ర నాయకులు ఈ మేరకు పోస్టర్ ఆవిష్కరించారు.

గ్రహం అనుగ్రహం

16-7-2025 బుధవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; గ్రీష్మ రుతువు, ఆషాఢ మాసం, బహుళపక్షం; షష్ఠి: రా. 8-24 తదుపరి సప్తమి
పూర్వాభాద్ర: ఉ. 6-13 ఉత్తరాభాద్ర తె. 4-57; తదుపరి రేవతి
వర్జ్యం: మ. 3-18 నుంచి 4-49 వరకు; **అమృత ఘడియలు:** రా. 12-24 నుంచి 1-55 వరకు; **దుర్ముహూర్తం:** ఉ. 11-39 నుంచి 12-31 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.5.37; **సూర్యాస్తమయం:** సా.6.34
కర్కాటక సంక్రమణం తె. 5.14

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ	ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	40.5	28.5	ఒంగోలు	37.9	29.0
నరసాపురం	39.0	29.2	తిరుపతి	37.5	27.4
విజయవాడ	38.8	30.0	తాడేపల్లిగూడెం	37.4	27.6
నెల్లూరు	38.6	29.5	గుంటూరు	37.0	29.0
విశాఖపట్నం	38.0	28.4	కడప	37.0	27.0
విజయనగరం	38.0	27.0	అనంతపురం	34.7	25.0
			కర్నూలు	34.0	25.0
			శ్రీకాకుళం	33.0	27.0
			హైదరాబాద్	32.0	23.3

'శుభ' ప్రదం.. జయప్రదం!

(మొదటి పేజీ తరువాయి)

టీవీలో చూసిన శుభాంశు తల్లిదండ్రులు భావోద్వేగానికి లోనయ్యారు. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా శుక్లాతోపాటు పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ-విస్నియెస్కీ (పోలండ్), టిబర్ కపు (హంగరీ)లు గత నెల 25న ఫ్లోరిడాలోని అంతరిక్ష కేంద్రం నుంచి నింగిలోకి బయల్దేరిన సంగతి తెలిసిందే. 28 గంటల ప్రయాణం తర్వాత.. 26న వారి వ్యోమనౌక ఐఎస్ఎస్‌తో అనుసంధానమైంది. అనంతరం 18 రోజుల పాటు ఈ వ్యోమగాములు రోదసిలో 60 ప్రయోగాలు నిర్వహించారు. ఇందులో భారత్‌కు సంబంధించిన 7 ప్రయోగాలను శుక్లా నిర్వహించారు. అక్కడి నుంచి ప్రధాని నరేంద్ర మోదీ, విద్యార్థులు, శాస్త్రవేత్తలతో ముచ్చటించారు. 1984లో రాకేశ్ శర్మ రోదసియాత్ర చేశాక భారత వ్యోమగామి ఒకరు అంతరిక్షంలోకి వెళ్లడం ఇదే మొదటిసారి. అలాగే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి ప్రవేశించిన తొలి భారతీయుడిగా, రోదసిలో అత్యధిక కాలం (ప్రయాణ సమయంతో కలిపి 20 రోజులు) గడిపిన భారతవాసిగా ఆయన రికార్డు సృష్టించారు.

యాత్ర లక్ష్యాలను పూర్తిచేసుకున్న యాక్సియం-4 వ్యోమగాములు సోమవారం సాయంత్రం స్పేస్ఎక్స్‌కు చెందిన డ్రాగన్ గ్రేస్ వ్యోమనౌకలో తిరుగుప్రయాణమయ్యారు. గంటకు 28వేల కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్న ఈ క్యాప్సూల్ రోదసిలో పలు విన్యాసాలు నిర్వహించింది. దశలవారీగా రాకెట్లను మండించడం ద్వారా వేగాన్ని తగ్గించుకొని భూవాతావరణంలోకి ప్రవేశించింది. చివర్లో పారాచూట్ల ద్వారా వేగాన్ని మరింత కట్టడి చేసుకొని భారత కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 3.01 గంటలకు అమెరికాలోని కాలిఫోర్నియా తీరానికి చేరువలో పసిఫిక్ మహాసముద్రంలో దిగింది. స్థానికంగా అది రాత్రి సమయం కావడంతో శక్తిమంతమైన లైట్ల వెలుగులో సహాయ బృందాలు బోట్ల సహాయంతో వ్యోమనౌకను చేరుకున్నాయి. దాన్ని వెలికితీసి స్పేస్ఎక్స్‌కు చెందిన రికవరీ నౌక 'షానన్'పైకి చేర్చాయి. అనంతరం డ్రాగన్ వ్యోమనౌక తలుపును తెరిచి.. వ్యోమగాములను బయటకు తెచ్చాయి. తొలుత విట్సన్ వెలుపలికి వచ్చారు. అనంతరం శుక్లా చిరునవ్వులు చిందిస్తూ, అభివాదం చేస్తూ బయటకు వచ్చారు. 20 రోజుల పాటు రోదసిలోని భారరహిత స్థితికి అలవాటు పడ్డ వ్యోమగాములు.. తిరిగి భూ గురుత్వాకర్షణ శక్తికి అనుగుణంగా సర్దుబాటు చేసుకోవడంలో ఇబ్బందిపడ్డారు. వారు నిలబడటానికి, నడవడానికి స్పేస్ఎక్స్ సిబ్బంది సాయపడ్డారు. వ్యోమగాములకు నౌకలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం హెలికాప్టర్‌లో తీరానికి తరలించారు. భూవాతావరణ పరిస్థితులకు అలవాటుపడటానికి వీరు ఏడు రోజులు పునరావాస శిబిరంలో గడుపుతారు.

తల్లిదండ్రుల ఉద్వేగం..

శుభాంశు తిరిగిరాక సందర్భంగా లఖ్‌నవూలోని సిటీ మాంటిస్సోరి స్కూల్‌లో ఉత్సాహం, ఉద్వేగంతో కూడిన వాతావరణం నెలకొంది. ఆయన విద్యాభ్యాసం ఈ పాఠశాలలోనే సాగింది. అక్కడ ఏర్పాటుచేసిన భారీ తెరపై ఉపాధ్యాయులు, విద్యార్థులు, పలువురు ప్రముఖులతోకలిసి శుభాంశు కుటుంబం యాక్సియం-4 తిరుగుప్రయాణాన్ని వీక్షించింది. యాత్ర సాఫీగా ముగియడంతో అందరూ ఊరట చెందారు. ఈ క్రమంలో భావోద్వేగానికి లోనైన శుక్లా తండ్రి శంభుదయాల్ శుక్లా, తల్లి ఆశాదేవి, సోదరి శుచి మిశ్రల కళ్ల వెంట ఆనంద బాష్పాలు రాలాయి. అందరూ జాతీయ జెండాలను చేతబట్టి.. భారత్‌మాతాకీ జై అంటూ నినదించారు.

ఆగస్టు 17న భారత్‌కు రాక

రోదసి యాత్ర అనంతరం అమెరికా చేరుకున్న శుభాంశు.. లాంఛనాలన్నీ పూర్తిచేసుకొని వచ్చే నెల 17న భారత్‌కు చేరుకునే అవకాశం ఉందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక వ్యవహారాల శాఖ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. ఐఎస్ఎస్‌లో శుక్లా నిర్వహించిన ప్రయోగాలు అసాధారణమని, అవి మానవాళికి ప్రయోజనం కలిగిస్తాయన్నారు.





డ్రాగన్ గ్రేస్ స్పేస్‌క్రాఫ్ట్ నుంచి బయటకు వస్తున్న భారత వ్యోమగామి శుభాంశు శుక్లా ✦ ఐఎస్ఎస్ నుంచి శుభాంశు శుక్లా సురక్షితంగా భూమిపైకి చేరిన సందర్భంగా ఆయన తల్లిదండ్రులు, బంధువుల హర్షాతిరేకాలు

కరవుసీమను ఆదుకోవడానికే బనకచర్ల

(మొదటి పేజీ తరువాయి)

మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు స్మారకోపన్యాస కార్యక్రమం ముగిసిన తర్వాత చంద్రబాబు హోం మంత్రి అమిత్‌షా నివాసంలో ఆయనతో సుమారు 40 నిమిషాలు భేటీ అయ్యారు. రాష్ట్ర ఆర్థిక, రాజకీయ పరిస్థితుల గురించి మాట్లాడారు.

క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు ఏడాది కాలంగా అండగా నిలిచినందుకు అమిత్‌షాకు చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థిక సాయం అందించాల్సిన ఆవశ్యకతను వివరించారు. వైకాపా పాలనలో ధ్వంసమైన ఆర్థిక వ్యవస్థను కేంద్ర ప్రభుత్వ సహకారంతో గాడిలో పెడుతున్నామని చెప్పారు. ఇప్పటికీ ఆర్థికవనరుల పరంగా తీవ్రమైన కొరత ఎదుర్కొంటున్నందున కేంద్రం నుంచి మరింత సహకారం అందించాలని కోరారు. విభజన కారణంగా ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొంటున్న ఆర్థిక నష్టాన్ని పరిగణనలోకి తీసుకొని కేంద్ర ప్రభుత్వ వనరుల్లో వాటా కేటాయించాలని కోరుతూ 16వ ఆర్థిక సంఘానికి నివేదించామని హోం మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అశోక్‌గజపతిరాజును గోవా గవర్నర్‌గా నియమించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి, హోం మంత్రికి చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు చంద్రబాబు 1-జన్‌పథ్‌లోని తన అధికార నివాసంలో నీతిఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్‌ను కలిసి రాష్ట్రంలో ఏరోస్పేస్, డిఫెన్స్ పరిశ్రమల ఏర్పాటు గురించి చర్చించారు. బెంగళూరుకు సమీపంలోని లేపాక్షి ప్రాంతంలో భూములు అందుబాటులో ఉన్నందున అక్కడ ఈ రంగాల పరిశ్రమల ఏర్పాటుకు నీతిఆయోగ్ తరఫున సహకారం అందించాలని కోరారు. దిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఎండీ వికాస్‌కుమార్‌తోనూ భేటీ అయ్యారు. విశాఖపట్నం, విజయవాడల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న మెట్రోరైల్ ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన సహాయ సహకారాలు కోరారు.





దిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసి జ్ఞాపిక అందజేస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి, కేంద్రమంత్రులు కె.రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ✦ చంద్రబాబును కలిసిన నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్

కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు పరామర్శ

కేంద్ర రైల్వే, ఐటీ, ఎలక్ట్రానిక్ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ తండ్రి దౌలాల్ వైష్ణవ్ అనారోగ్యంతో ఇటీవల కన్నుమూశారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు కేంద్ర మంత్రిని పరామర్శించారు. దౌలాల్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

నేడు పలువురు మంత్రులతో భేటీ

ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో పోలవరం- బనకచర్ల ప్రాజెక్టుపై జరిగే ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో పాల్గొంటారు. ఆ తర్వాత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అవుతారు. ఉదయం కేంద్ర కార్మిక, క్రీడలు, యువజన శాఖల మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో సమావేశం కానున్నారు. రాత్రికి కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సీఐఐ) సదస్సుకు హాజరవుతారు.



చంద్రబాబును కలిసిన దిల్లీ మెట్రోరైల్ కార్పొరేషన్ ఎండీ వికాస్‌కుమార్

డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానం

- ఇంటర్న్‌షిప్‌లో 20 క్రెడిట్ల నుంచి నాలుగు క్రెడిట్లకు తగ్గింపు
- మూడేళ్ల డిగ్రీలో 10 క్రెడిట్లు తగ్గుదల
- ఈ ఏడాది నుంచి అమలుకు ప్రభుత్వం ఆదేశాలు

ఈనాడు, అమరావతి: డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానం అమలుకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఇప్పటివరకు ఉన్న సింగిల్ మేజర్‌లో కొన్ని మార్పులు చేసింది. సింగిల్ మేజర్ సబ్జెక్టుకు ప్రస్తుతం 60 క్రెడిట్లు ఉండగా.. దీన్ని మేజర్ కోర్, ఎలెక్టివ్‌గా పేర్కొంటూ 60 క్రెడిట్లు కేటాయించింది. మూడేళ్ల డిగ్రీలో ప్రస్తుతం 136 క్రెడిట్లు ఉండగా.. దీన్ని 126 క్రెడిట్లకు కుదించింది. మూడేళ్లలో 10 నెలల ఇంటర్న్‌షిప్‌నకు 20 క్రెడిట్లు ఉండగా.. వాటిని నాలుగు క్రెడిట్లకు తగ్గించింది. ప్రస్తుతం మొదటి ఏడాది వేసవి సెలవుల్లో రెండు నెలల కమ్యూనిటీ ప్రాజెక్టు వర్క్, రెండో ఏడాది సెలవుల్లో రెండు నెలల స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్‌నకు నాలుగేసి చొప్పున మొత్తం 8 క్రెడిట్లు ఇస్తున్నారు. మూడో ఏడాది సెమిస్టర్ ఇంటర్న్‌షిప్‌నకు 12 క్రెడిట్లు ఉన్నాయి. ఇప్పుడు దీని వెయిటేజీ నాలుగు క్రెడిట్లకు తగ్గించారు. మేజర్ కోర్ సబ్జెక్టుకు 44 క్రెడిట్లు, మేజర్ ఎలెక్టివ్‌కు 16 క్రెడిట్ల చొప్పున కేటాయించింది. మూడు సెమిస్టర్ల పాటు ఆంగ్లం, మాతృభాష సబ్జెక్టులు ఉంటాయి. వీటికి సెమిస్టర్‌కు మూడు క్రెడిట్ల చొప్పున 18 క్రెడిట్లు కేటాయించింది. ప్రస్తుతం నాలుగేళ్ల డిగ్రీ అమల్లో ఉండగా.. మూడో ఏడాదిలో బయటకు వెళ్లే ఐచ్ఛికం ఉంది. ప్రస్తుతం జారీచేసిన క్రెడిట్ ఫ్రేమ్‌లో మూడేళ్ల డిగ్రీ మాత్రమే ఉంది. నాలుగో ఏడాది ఉంటుందా? లేదా అనేదానిపై సందిగ్ధత నెలకొంది.

మూడేళ్ల డిగ్రీ ఇలా..

యూజీ ప్రోగ్రాం	క్రెడిట్లు
మేజర్ సబ్జెక్టు కోర్	44
మేజర్ ఎలెక్టివ్	16
మైనర్ సబ్జెక్టు	24
బహుళ కోర్సులు	6
సామర్థ్య పెంపుదల కోర్సులు(భాషలు)	18
నైపుణ్యాల పెంపుదల కోర్సులు	12
వాల్యూ యాడెడ్ కోర్సులు	2
ఇంటర్న్‌షిప్	4
మొత్తం క్రెడిట్లు	126

మనకూ వస్తోంది.. మైక్రోసాఫ్ట్!

(మొదటి పేజీ తరువాయి)

దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

క్వాంటమ్ కంప్యూటర్ల సాంకేతికత పలు రకాలు

✦ సూపర్ కండక్టింగ్ ✦ ట్రాప్డ్ అయాన్
✦ ఫోటానిక్ ✦ టోపోలాజికల్ ✦ న్యూట్రల్ ఆటమ్

మైక్రోసాఫ్ట్ కోసం.. 4వేల చదరపు అడుగుల భవనం

మైక్రోసాఫ్ట్ కోసం క్వాంటమ్ వ్యాలీలో 4వేల చదరపు అడుగుల విస్తీర్ణం ఉండే మరో భవనాన్ని నిర్మించాల్సి ఉంది. దీన్ని సంస్థ సొంతంగా నిర్మించుకుంటుందా? ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలా? అనే దానిపై ఎంఓయూ కుదుర్చుకునే సమయానికి స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు. అమెరికాలోని ప్రధాన కేంద్రంలో 50 క్యూబిట్స్ సామర్థ్యంతో క్వాంటమ్ కంప్యూటర్‌ను మైక్రోసాఫ్ట్ ఏర్పాటుచేసింది. దీన్ని విస్తృతపరిచే ఆలోచనలో సంస్థ ఉంది. మన రాష్ట్రం క్వాంటమ్ టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో ముందడుగు వేయడంతో.. పరిశోధన కేంద్రం ఏర్పాటుకు అమరావతిని ఎంచుకుంది.

✦ దిగ్గజ సంస్థల రాకతో విదేశాలకు సేవలు ఎగుమతి చేయడం ద్వారా ప్రపంచ స్థాయిలో రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు వస్తుంది.

✦ మైక్రోసాఫ్ట్ సాఫ్ట్‌వేర్ తయారీ, ఎగుమతుల కోసం అమెరికాలోని ప్రధాన కేంద్రం తర్వాత హైదరాబాద్‌లో ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటుచేసింది. దీంతో హైదరాబాద్ స్థాయి బాగా పెరిగింది.

✦ అమరావతి క్వాంటమ్ వ్యాలీలో దశల వారీగా 90 లక్షల చ.అడుగుల్లో సదుపాయాలను కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఐబీఎం సంస్థ, ఐటీ హార్డ్‌వేర్ తయారీ కంపెనీల కోసం 40వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐకానిక్ భవనాన్ని ప్రభుత్వం నిర్మించనుంది.

ఎక్కువ సంస్థలను తీసుకొచ్చే దిశగా..

క్వాంటమ్ కంప్యూటింగ్‌లో అనేక సాంకేతికతలు ఉన్నాయి. దీన్ని విస్తృతపరిచేందుకు గూగుల్, అమెజాన్, అయాన్‌క్యూ, రిగెట్టి కంప్యూటింగ్, క్వాంటిన్యూమ్ లాంటి సంస్థలు పరిశోధనలు చేస్తున్నాయి. ఈ దృష్ట్యా ఒక్క ఐబీఎం సంస్థతోనే ముందుకెళ్తే.. అది ఎంతమేరకు విజయవంతం అవుతుందనే సందిగ్ధత అధికారుల్లో ఉంది. 'ఉదాహరణకు నోకియా.. శామ్‌సంగ్.. యాపిల్.. బ్లాక్‌బెర్రీ పేరుతో సెల్‌ఫోన్లు గతంలో వచ్చాయి. అందులో శామ్‌సంగ్.. యాపిల్ మాత్రమే ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఇదే తీరులో వివిధ రకాల క్వాంటమ్ టెక్నాలజీల్లో.. ఏది ఎక్కువగా ప్రపంచమార్కెట్‌ను ఆకర్షిస్తుందో ఇప్పటికిప్పుడు అంచనా వేయడం కష్టం. ఈ దృష్ట్యా వివిధ సంస్థలను అమరావతి క్వాంటమ్ వ్యాలీకి తీసుకువచ్చేలా సంప్రదింపులు జరుపుతున్నాం' అని ఒక ఉన్నతాధికారి చెప్పారు.

దేశవ్యాప్తంగా ఇంటి నంబర్లు ఒకేలా ఉండాలి

- స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఉద్దేశాన్ని ప్రజలకు స్పష్టంగా చెప్పండి
- ఇది పౌరసత్వ తనిఖీ కాదని భరోసా కల్పించండి
- కేంద్ర ఎన్నికల సంఘానికి తెదేపా ప్రతిపాదనలు





తెదేపా ప్రతినిధి బృందంతో సమావేశంలో పాల్గొన్న కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్‌కుమార్. చిత్రంలో కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్ సంధు, వివేక్ జోషి ✦ సమావేశంలో తెదేపా ప్రతినిధులు జ్యోత్స్న, బైరెడ్డి శబరి, లావు శ్రీకృష్ణదేవరాయలు, పల్లా శ్రీనివాసరావు, కూన రవికుమార్, దగ్గుమళ్ల ప్రసాదరావు

ఈనాడు, దిల్లీ: ఓటర్ల జాబితా తనిఖీని బలోపేతం చేసేందుకు దేశవ్యాప్తంగా ఇంటి నంబర్లు ఒకే తరహాలో ఉండేలా చూడాలని తెలుగుదేశం పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదించింది. ప్రస్తుతం బిహార్‌లో మొదలుపెట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణను (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) మిగతా రాష్ట్రాలకు విస్తరించే ముందు దాని ఉద్దేశాన్ని ప్రజలకు స్పష్టంగా చెప్పాలని కోరింది. ఈ ప్రక్రియ పౌరసత్వ తనిఖీకి సంబంధించినది కాదని తెలియజేయాలని, ఈ మేరకు క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించాలని కోరింది. ఓటర్ల జాబితా తయారీ, ఎన్నికల నిర్వహణలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను రాజకీయ పార్టీల ద్వారా నేరుగా తెలుసుకొనేందుకు గత కొన్ని నెలలుగా దేశవ్యాప్తంగా జాతీయ, ప్రాంతీయ పార్టీలతో సమావేశమవుతున్న కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఇతర కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషీలు.. మంగళవారం తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీలు దగ్గుమళ్ల ప్రసాదరావు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే కూన రవికుమార్, తెదేపా అధికార ప్రతినిధి తిరునగరి జ్యోత్స్నలతో భేటీ అయ్యారు. దేశవ్యాప్తంగా చేపట్టబోయే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ గురించి కొన్ని సూచనలు చేశారు. ఎన్నికలకు ఆర్నెల్ల ముందే సవరణలు పూర్తిచేయాలని సూచించారు.

తెదేపా సూచనలివి..

✦ ఓటర్ల జాబితా తయారీలో లోపాలను గుర్తించడానికి ఏటా కాగ్ ఆధ్వర్యంలో థర్డ్ పార్టీ ఆడిట్ నిర్వహించాలి. డూప్లికేషన్లు, వలసలు, చనిపోయినవారి ఎంట్రీలను గుర్తించడానికి ఏఐ ఆధారిత టూల్స్ ఉపయోగించాలి.

✦ దేశవ్యాప్తంగా ఓటర్లందరికీ విశిష్ట ఓటరు గుర్తింపు కార్డులు ఇవ్వాలి. వ్యక్తిగత గోప్యతను పాటిస్తూనే ఆధార్‌తో ఓటరు కార్డులను క్రాస్ వెరిఫికేషన్ చేయడానికి అనుమతివ్వాలి.

✦ జాబితాల సవరణలో గుర్తింపు పొందిన అన్ని పార్టీలకు చెందిన బూత్ లెవెల్ ఏజెంట్లను భాగస్వాములను చేయాలి. ముసాయిదాలను బూత్ స్థాయిలో అందుబాటులో ఉంచి రియల్ టైమ్ వెరిఫికేషన్‌కు అవకాశమివ్వాలి.

✦ జాబితాలో చేర్చిన, తొలగించిన వారి వివరాలు, అందుకు కారణాలను వెల్లడిస్తూ ఈసీఐ వెబ్‌సైట్‌లో జిల్లాల వారీగా ప్రకటించాలి. ఓటర్ల ఫిర్యాదులు, పరిష్కారాలను తెలుసుకోవడానికి రియల్ టైమ్ డ్యాష్‌బోర్డును అమల్లోకి తేవాలి.

✦ విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఎన్నికల అధికారులపై చర్యలపై కాలపరిమితి ఉండాలి.

✦ ఓటర్ల జాబితాకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న రాజకీయ ఫిర్యాదుల పరిష్కారానికి ఈసీఐ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో అంబుడ్స్‌మన్‌ను నియమించాలి.

✦ తాజాగా ధ్రువీకరించిన జాబితాలో పేరు నమోదు చేసుకున్న వారిని ప్రత్యేక కారణాలుంటే తప్ప మళ్లీ అర్హత ధ్రువీకరించుకోవాలని అడగొద్దు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. జాబితా నుంచి పేర్లు తొలగించాలనుకుంటే ముందస్తు విచారణ తప్పనిసరిగా చేపట్టాలి. ఓటరు జాబితాలో పేర్లపై ఫిర్యాదు చేసినప్పుడు ఆ ఆరోపణలను నిరూపించాల్సిన బాధ్యత ఈఆర్ఓ లేదంటే అభ్యంతరం పెట్టిన వ్యక్తులదే తప్ప, ఓటరుది కాకుండా చూడాలి.

✦ ఆంధ్రప్రదేశ్‌లో సీజన్ల వారీగా వలసలు ఉంటాయి. అందువల్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేపట్టేటప్పుడు మొబైల్ బీఎల్ఓ యూనిట్లను మోహరించాలి. వలస కార్మికులు, నిర్వాసిత కుటుంబాలను జాబితా నుంచి తొలగించకుండా ఉండేందుకు వారి తాత్కాలిక చిరునామాలను పరిగణనలోకి తీసుకోవాలి.

✦ ఏ ఓటరు పేరునైనా తొలగించేటప్పుడు అందుకు కారణాలు చెప్పాలి. తగిన నోటీసు ఇవ్వాలి. బాధితుల అభిప్రాయం వినేందుకు అవకాశమివ్వాలి. ఎన్నికల సిబ్బంది తనిఖీకి వచ్చినప్పుడు ఎవరైనా డాక్యుమెంట్లు సమర్పించలేకపోతే వారికి దశల వారీగా అవకాశం ఇవ్వాలి' అని తెదేపా ప్రతినిధి బృందం సూచించింది. అనంతరం తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ తాము చేసిన సూచనల అమలుకు ఈసీ సానుకూలత వ్యక్తం చేసిందన్నారు. ఓటరు జాబితాల సవరణ సమయంలో 11 డాక్యుమెంట్లను పరిగణనలోకి తీసుకుంటామని, అందువల్ల ఎవరికీ ఇబ్బంది ఉండదని హామీ ఇచ్చారన్నారు. డూప్లికేషన్లను తొలగించే ప్రయత్నం తప్పితే ఎవరినీ తొలగించడానికి తాము ప్రయత్నించడం లేదని తెలిపారన్నారు.

విలీన గ్రామాలతో సంబంధం లేకుండా మున్సిపల్ ఎన్నికలు

మంత్రి నారాయణ వెల్లడి

తాడేపల్లిగూడెం టౌన్, న్యూస్‌టుడే: విలీన గ్రామాలతో సంబంధం లేకుండా మూడు నెలల్లో పురపాలక సంఘాల ఎన్నికలు నిర్వహిస్తామని మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ స్పష్టం చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో మంత్రి మంగళవారం మాట్లాడారు. 'రాష్ట్రంలో 21 పురపాలక సంఘాలకు విలీన గ్రామాల సమస్యలు, కోర్టు కేసుల వల్ల ఎన్నికలు నిర్వహించలేదు. ఫలితంగా 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలకాక అభివృద్ధికి విఘాతం ఏర్పడింది. సీఎం చంద్రబాబు సూచనలతో ఆ సమస్యలు పరిష్కరించి మూడు నెలల్లో ఎన్నికలు నిర్వహిస్తామ'ని చెప్పారు. అమృత్ పథకంలో భాగంగా తాడేపల్లిగూడేనికి సుమారు రూ.200 కోట్లు మంజూరు చేశామన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తవగానే పట్టణంలో తాగునీటి అవసరాలకు ఉపయోగపడే పనులు, రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పనులు పూర్తి చేస్తామన్నారు.

ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు

రూ.10.33 కోట్ల విలువైన ఉత్పత్తుల విక్రయాల నిలిపివేత

ఈనాడు, అమరావతి: అధిక ధరలకు ఎరువుల విక్రయం, నాణ్యతలేని విత్తనాలు, పురుగు మందుల అమ్మకాలపై ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. రాష్ట్రవ్యాప్తంగా సోమ, మంగళవారాల్లో 219 విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై వ్యవసాయ, విజిలెన్స్ శాఖల ఆధ్వర్యంలోని 30 సంయుక్త బృందాలు తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా వివిధ లోపాలు గుర్తించి.. రూ.10.33 కోట్ల విలువైన ఉత్పత్తుల విక్రయాలు నిలిపివేస్తూ అధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఇందులో ఎరువుల విలువే రూ.6.38 కోట్లు ఉంది. 2 విత్తన, ఒక ఎరువుల దుకాణాల లైసెన్సుల రద్దు, ఒక ఎరువుల దుకాణంపై 6ఎ కేసు, ఇంకో ఎరువుల దుకాణం లైసెన్సు సస్పెండ్ చేశారు. ఆయా దుకాణాల నుంచి ఎరువులు, పురుగు మందులు, విత్తన నమూనాలు సేకరించారు. రూ.5.38 లక్షల విలువైన 41 టన్నుల ఎరువులు, పురుగు మందులు సీజ్ చేశారు.

పిండ మార్పిడితో ఒంగోలు జాతి దూడ జననం



సంకర జాతి ఆవు, ఒంగోలు జాతి దూడతో రైతు లక్ష్మమ్మ

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లాలో సంకర జాతి ఆవుకు పిండ మార్పిడి చేయగా మేలు జాతి ఒంగోలు దూడ జన్మించినట్లు పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మాలకొండయ్య తెలిపారు. రాయచోటి మండలం గుంటిమడుగుకు చెందిన లక్ష్మమ్మకు చెందిన ఆవుకు పశువైద్యుడు జగన్నాథరెడ్డి పిండ మార్పిడి ప్రక్రియ చేశారని వెల్లడించారు. మంగళవారం ఆయన దూడను పరీక్షించారు. అంతరించిపోతున్న పశు జాతులను కాపాడటమే లక్ష్యంగా ఈ ప్రక్రియ చేపట్టినట్లు వివరించారు.

మామిడి వివాదం వెనుక సిండికేటులు!

- ఇన్నాళ్లూ తోతాపురికి సరైన ధర ఇవ్వని యాజమాన్యాలు
- సీజన్ చివర్లో నిర్ణీత రూ.8 ధర ఇస్తామంటున్న వైనం

మొన్నటి వరకు..

రెండేళ్లుగా మామిడి గుజ్జు నిల్వ ఉండిపోయింది. అంతర్జాతీయంగా డిమాండ్ లేదు. ప్రభుత్వం ప్రకటించినట్లు కిలోకు రూ.8 ఇవ్వలేం
– ఈ సీజన్లో అధికారులు, మంత్రుల సమావేశాల్లో మామిడి గుజ్జు పరిశ్రమల మాటలివి

ఈ నెల 10 తర్వాత..

సరకు మండీలు, ర్యాంపులు, పొరుగు రాష్ట్రాలకు వెళ్లకుండా కట్టడి చేయండి. ప్రభుత్వం చెప్పినట్లు కిలోకు రూ.7-8 ఇచ్చేందుకు మేం సిద్ధమే
– గుజ్జు పరిశ్రమల యాజమాన్యాల వైఖరిలో హఠాత్తుగా వచ్చిన మార్పు ఇది..



గుజ్జు పరిశ్రమ వద్ద మామిడి సరకుతో వచ్చిన ట్రాక్టర్లు

ఈనాడు– చిత్తూరు, తిరుపతి: సీజన్ ప్రారంభంలో.. తాము కష్టాల్లో ఉన్నామని, ప్రభుత్వం చెప్పిన ధర చెల్లించలేమని తేల్చిచెప్పిన మామిడి గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలు.. ఇప్పుడు అదేం లేదు సరకు పంపాలంటూ కోరుతుండడం విస్మయానికి గురిచేస్తోంది. సిండికేట్‌గా మారి ధరలు తగ్గించి రైతాంగాన్ని ముంచేందుకే వారు ఇలా నాటకం ఆడారని స్పష్టమవుతోంది. ఈ విషయంలో కావాలనే ప్రభుత్వానికి అపఖ్యాతి తెచ్చేలా వ్యవహరించారని, దీనిపై లోతుగా విచారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటే భవిష్యత్తులో ఇలా సిండికేట్ అయ్యే అవకాశం ఉండదని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

గత ఏడాది తోతాపురి మామిడికి కిలోకు రూ.20-30 వరకు చెల్లించారు. అంతక్రితం సీజన్‌లో ఆడించిన గుజ్జు నిల్వ ఉండిపోయిందని అప్పట్లో పరిశ్రమల ప్రతినిధులెవరూ సాకులు చూపలేదు. ఈ ఏడాది మాత్రం జనవరి నుంచే దాదాపు 2 లక్షల టన్నుల గుజ్జు అమ్ముడుపోలేదని.. ఎగుమతులు నిలిచిపోయాయంటూ వారు చెబుతూ వచ్చారు. అధికారులు కూడా ఇందులో వాస్తవమెంత అనేదానిపై దృష్టి పెట్టలేదు. ఉద్యాన శాఖ అధికారులు గుడ్డిగా వ్యవహరించారే తప్ప పరిశ్రమల వద్దకు వెళ్లి ఆరా తీయలేదు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు కూడా యాజమాన్యాలు చెప్పిందే నిజమనుకున్నారు.

ఎంత చెప్పినా మెట్టు దిగకుండా..

ప్రభుత్వ ఆదేశాల మేరకు తోతాపురి మామిడికి కిలోకు రూ.12 ఇవ్వాలని సీజన్ ప్రారంభంలోనే చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కానీ పరిశ్రమలు రూ.5-6 ఇవ్వగా, ర్యాంపుల వద్ద రూ.2-3, మండీల వద్ద రూ.4 మాత్రమే ఇచ్చారు. చివరకు రాష్ట్ర ప్రభుత్వం కిలోకు అదనంగా రూ.4 చొప్పున చెల్లిస్తానని ప్రకటించింది. రూ.260 కోట్ల భారం పడుతున్నా భరించేందుకు సిద్ధమైంది. పరిశ్రమల ఎగుమతులకు తోడ్పాటునిస్తూ బ్యాంకర్ల నుంచి ఒత్తిడి రాకుండా చూసింది. ఇలా యాజమాన్యాలకు ఉపశమనం కలిగించినా.. వారు మాత్రం రైతుల విషయంలో నిర్దయగా వ్యవహరించారు. ఏ దశలోనూ కిలోకు రూ.8 ఇవ్వలేదు. గట్టిగా ఒత్తిడి తెస్తే పరిశ్రమలు మూసేస్తామని బెదిరించడంతో రెండు జిల్లాల కలెక్టర్లూ వెనక్కు తగ్గారు. ఈ నెల 3న ముఖ్యమంత్రి చంద్రబాబు తన నివాసంలో జరిపిన సమావేశంలో కూడా కనీస ధర ఇవ్వాలని చెప్పినా పరిశ్రమలు మెట్టు దిగలేదు. ఇదే సందుగా వైకాపా శ్రేణులు నడిరోడ్డుపై ఆడిన వీరంగం గురించి తెలిసిందే.

చర్యలు తీసుకోవాలంటున్న రైతులు

ప్రస్తుతం తిరుపతి జిల్లాలో తోతాపురి మామిడి పరిశ్రమలకు రావడంలేదు. దామలచెరువులో రోజుకు ఒకట్రెండు ట్రాక్టర్లే వస్తున్నాయి. చిత్తూరు జిల్లాలో గతంతో పోలిస్తే తగ్గాయి. ర్యాంపుల వద్ద కిలోకు రూ.7.50 వరకు చెల్లించి కొనుగోలు చేస్తూ తమిళనాడు, ఉత్తరాది రాష్ట్రాలకు పంపిస్తున్నారు. దీంతో సరకు తరలిపోతోందనే భయంతో సర్కార్ నిర్దేశించిన ధర చెల్లిస్తున్నామని.. సరకు తమకే పంపండంటూ పరిశ్రమలు ఇప్పుడు అధికారులను కోరుతున్నాయి. మొన్నటి వరకుససేమిరా అన్నవాళ్లే.. నేడు ఇలా మాట మార్చడం వెనుక కారణాలపై ఆరా తీసి చర్యలు తీసుకుంటే రాబోయే రోజుల్లో ఇప్పటిలా సిండికేట్ కాకుండా దారికి వస్తారని రైతులు అంటున్నారు. ఈ పరిణామాల వెనుక రాజకీయ కుట్ర కోణం కూడా ఉండవచ్చని వారు అనుమానిస్తున్నారు.

లక్ష టన్నులకే సర్కారు ధర అమలు

తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో కలిపి ఈ ఏడాది 5 లక్షల టన్నుల దిగుబడి రాగా, ఇప్పటివరకూ 4.10 లక్షల టన్నులు కొనుగోలు చేశారు. ఈ నెలాఖరుకు కొనుగోళ్లు పూర్తవుతాయి. ప్రభుత్వం నిర్దేశించిన ధర లక్ష టన్నులకే అమలైంది. పరిశ్రమలవారు సీజన్ మొదటి నుంచీ ఆ ధర అమలు చేసి ఉంటే రైతులకు న్యాయం జరిగి ఉండేది.

సిట్ చేతిలో.. 'బ్రాండ్ కిల్లింగ్' వాయిస్ రికార్డులు

- అనామక బ్రాండ్లకు ఇండెంట్‌లు
- వాట్సప్ కాల్‌లో... ఏ3 సత్యప్రసాద్ ఇచ్చిన ఆదేశాల గుట్టురట్టు
- మద్యం కుంభకోణం కేసులో కీలక మలుపు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణంలో ముడుపులు కొల్లగొట్టేందుకు వైకాపా ముఠా అనుసరించిన 'బ్రాండ్ కిల్లింగ్.. బ్రాండ్ ప్రమోటింగ్' నేర విధానాన్ని సాంకేతిక, శాస్త్రీయ ఆధారాలతో నిరూపించే కీలక వాయిస్ రికార్డులను సిట్ వెలికితీసింది. ఆధారాలు దొరక్కుండా.. లిఖితపూర్వక ఆదేశాల్లేకుండా.. వాట్సప్ కాన్ఫరెన్స్ కాల్‌లో సాగించిన దందా ఆధారాలు సిట్‌కు లభ్యమయ్యాయి. కాన్ఫరెన్స్ కాల్‌లో బెవరేజెస్ కార్పొరేషన్ నాటి ప్రత్యేక అధికారి సత్యప్రసాద్(ఏ3) సాగించిన సంభాషణలను... కేసులో కీలక సాక్షిగా ఉన్న ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్ ఒకరు అప్పట్లో తన ఫోన్‌లో రికార్డు చేసుకున్నారు. ఆ మేనేజర్‌ను కొన్నాళ్ల కిందట సిట్ అధికారులు విచారణకు పిలిచారు. ముడుపులివ్వడానికి నిరాకరించిన వారి బ్రాండ్లను తప్పించి.. వారు అనుకున్న బ్రాండ్లను ప్రోత్సహించేందుకు అప్పట్లో కాన్ఫరెన్స్ కాల్‌లో సత్యప్రసాద్ ఎలా ఆదేశాలిచ్చేవారనే అంశాన్ని సిట్ ఎదుట డిపో మేనేజర్ పూసగుచ్చినట్లు వివరించారు. వాట్సప్ సంభాషణల్ని రికార్డు చేసిన ఫోన్‌ను అప్పగించారు. దాన్ని ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపిన సిట్ అధికారులు.. వాయిస్ రికార్డులను రిట్రైవ్ చేసి, విశ్లేషించారు. ముడుపులు చెల్లించటానికి అంగీకరించిన వారి బ్రాండ్లకు ఎక్కువగా... నిరాకరించిన వారి బ్రాండ్లకు తక్కువగా ఇండెంట్‌లు పెట్టేలా ఆదేశాలున్నాయని తేల్చారు. మరో 2 రోజుల్లో దాఖలు చేయనున్న ప్రాథమిక ఛార్జిషీట్‌కు అనుబంధంగా ఈ వాయిస్ రికార్డులను జత పరచాలని నిర్ణయించారు. నేర నిరూపణలో ఇవి అత్యంత కీలకం కానున్నాయి.

వాటిని వద్దంటున్నారని చెప్పినా...

'నేను చెప్పిన బ్రాండ్లనే ఇండెంట్ పెట్టండి. కావాలంటే ప్రాచుర్యం పొందిన బ్రాండ్లకు సంబంధించి ఒకటి, రెండు కేసులను కొన్ని దుకాణాల్లో అందుబాటులో ఉంచండి. వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించకుండా మూలకు పెట్టేయండి. నేను చెప్పినట్లుగానే ఇండెంట్ ఉండాలి' అంటూ డిపో మేనేజర్లకు సత్యప్రసాద్ ఆదేశాలిచ్చారు. అనామక బ్రాండ్లను ప్రస్తావిస్తూ.. వాటికి ఎక్కువగా ఇండెంట్‌లు పెట్టాలని కాన్ఫరెన్స్ కాల్‌లో సత్యప్రసాద్ ఆదేశించగా.. 'సార్ వినియోగదారులు ఆ బ్రాండ్లను వద్దంటున్నారు. ప్రాచుర్యం పొందిన వాటినే అడుగుతున్నారు. వాటినే ఇండెంట్ పెడతాం' అని డిపో మేనేజర్ చెప్పారు. దానికి స్పందిస్తూ... తాను చెప్పినట్లు చేయాలని.. అంతకు మించి ఇంకేమీ మాట్లాడొద్దంటూ ఆ మేనేజర్‌తో సత్యప్రసాద్ గట్టిగా అన్నారు.

బీజం ఇక్కడే... 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా... ముడుపులు కొల్లగొట్టాలనే నేరపూరిత కుట్రలో భాగంగా నూతన మద్యం విధానాన్ని తీసుకొచ్చింది. అప్పటివరకూ మార్కెట్‌లో విస్తృతంగా అందుబాటులో ఉన్న బ్రాండ్లనన్నింటినీ పక్కకు నెట్టేసింది. వాటి స్థానంలో ముడుపులివ్వడానికి అంగీకరించిన సంస్థల బ్రాండ్లను విపరీతంగా ప్రోత్సహించింది. దీన్నే 'బ్రాండ్ కిల్లింగ్... బ్రాండ్ ప్రమోటింగ్' నేర విధానంగా పరిగణిస్తున్నారు. కుంభకోణానికి ఇక్కడే బీజం పడింది.

ఇండెంట్‌లు వచ్చేది పైనుంచే

ప్రభుత్వ మద్యం దుకాణాలకు వచ్చే వినియోగదారులు ఏ బ్రాండ్లను అడుగుతున్నారనేది పరిశీలించి.. ఆయా బ్రాండ్ల కోసం మద్యం దుకాణాల సూపర్‌వైజర్లు.. ఏపీఎస్‌బీసీఎల్‌కు ఇండెంట్ పెట్టాలి. దీనికోసం రాష్ట్రంలోని అన్ని మద్యం దుకాణాల సూపర్‌వైజర్లకు ఒక లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ కేటాయించారు. 3 వేలకు పైగా మద్యం దుకాణాలు ఉండటం, వారందరితో తాము అనుకున్నట్లుగా ఇండెంట్‌లు పెట్టించుకోవడం ఇబ్బందవుతుందని భావించిన వైకాపా ముఠా.. ఆ లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌లను ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్ల చేతుల్లో పెట్టి.. తాము చెప్పినట్లుగా వారి చేత ఇండెంట్‌లు పెట్టించింది.

- మద్యం దుకాణాల నుంచి వచ్చే ఇండెంట్‌లన్నింటినీ క్రోడీకరించి తదనుగుణంగా ఏపీఎస్‌బీసీఎల్... మద్యం సరఫరా ఆర్డర్లను డిస్టిలరీలకు ఇవ్వాలి. అందుకు విరుద్ధంగా రాజ్ కెసిరెడ్డి నేతృత్వంలోని వైకాపా ముఠాయే... వారికి అందిన ముడుపులను బట్టి ఏ కంపెనీకి ఎంత మేర సరఫరా ఆర్డర్లివ్వాలో నిర్ణయించేది. దాని ఆధారంగా ముసాయిదా ఇండెంట్‌ను సిద్ధం చేసి.. రోజూ రాత్రి వేళ సత్యప్రసాద్‌కు పంపించేది. మరుసటి రోజు ఉదయం రాష్ట్రంలోని డిపో మేనేజర్లందరితో వాట్సప్ కాన్ఫరెన్స్ కాల్‌లో సత్యప్రసాద్ మాట్లాడి ఆ మేరకు ఇండెంట్‌లను నిర్దేశించేవారు.

విశాఖ నుంచి పోర్టు బ్లెయిర్, ముంబయిలకు విమాన సర్వీసులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖలోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి పోర్టు బ్లెయిర్, ముంబయిలకు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఇండియన్ ఎయిర్‌లైన్స్ సంస్థలు కొత్తగా విమాన సర్వీసులు నడపనున్నాయి. ఆగస్టు ఒకటో తేదీ నుంచి సర్వీసు అందుబాటులోకి వస్తుంది. సోమ, శుక్ర, శనివారాల్లో నడుస్తుంది. విశాఖ నుంచి ఉదయం 8 గంటలకు బయలుదేరి 10 గంటలకు పోర్ట్ బ్లెయిర్ చేరుకుంటుంది. అక్కడి నుంచి ఉదయం 10.30కి బయలుదేరి మధ్యాహ్నం 12.25కు విశాఖకు వస్తుంది.

- విశాఖ-ముంబయి మధ్య ఆగస్టు ఒకటి నుంచి ఉదయం సర్వీసు ప్రారంభం కానుంది. ముంబయిలో ఉదయం 7 గంటలకు బయలుదేరి 9.05కు విశాఖ చేరుకుంటుంది. ఇక్కడి నుంచి 9.40కి బయలుదేరుతుందని విమానాశ్రయ వర్గాలు తెలిపాయి. టికెట్ల విక్రయాలు ప్రారంభమయ్యాయి. విశాఖ-ముంబయి మధ్య ఇప్పటికే సాయంత్రం ఓ సర్వీసు నడుస్తోంది.

ఎస్ఆర్ఎంలో 18, 19 తేదీల్లో జాతీయ గ్రీన్ హైడ్రోజన్ సదస్సు

ఈనాడు, అమరావతి: అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 'జాతీయ గ్రీన్ హైడ్రోజన్ సదస్సు- 2025'ను ఈ నెల 18, 19 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఎస్ఆర్ఎం గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రీసెర్చ్) ఆచార్య డి.నారాయణ రావు తెలిపారు. ఈ సదస్సును ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభిస్తారని తెలిపారు. విజయవాడలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఇక డిజిటల్ ఏపీ!



- రాష్ట్రాన్ని డిజిటల్ విలేజ్‌గా మార్చేందుకు ప్రభుత్వ ప్రణాళిక
- ఫైబర్‌నెట్ ద్వారా సాంకేతిక విస్తరణ
- కేంద్రం నుంచి రూ.2,781 కోట్లు
- ప్రైవేటుకు 'ఫైబర్' నిర్వహణ

ఈనాడు, అమరావతి: రాష్ట్రాన్ని డిజిటల్ విలేజ్‌గా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. మారుమూల గ్రామాలకూ అంతరాయం లేని ఇంటర్నెట్.. కేబుల్ సదుపాయాలను అందుబాటులోకి తీసుకురానుంది. విద్యార్థులకు ఆన్‌లైన్ కోర్సులు, వర్క్‌ఫ్రం హోం చేసే వారికి హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా ఏపీ ఫైబర్‌నెట్‌ను బలోపేతం చేయనుంది. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుమారు రూ.3 వేల కోట్లు ఖర్చు చేయనున్నాయి. ఇప్పుడు 10-15 కి.మీ. లైన్లు మండల కేంద్రాల నుంచి గ్రామాలకు వేస్తే నెట్ సేవలు అందుతాయి. ఇందుకు ఇప్పుడు ప్రతి గ్రామంలోనూ ఆప్టికల్ టెర్మినల్ లైన్ (ఓఎల్‌టీ) వేస్తారు. దీని నుంచే కేబుల్, నెట్ సేవలను ప్రజలు పొందే అవకాశం ఉంటుంది. గ్రామ పంచాయతీల్లో అందించే సేవలను రియల్‌టైంలో ఆర్టీజీఎస్ ద్వారా తెలుసుకునే వెసులుబాటు ఉంటుంది.

కేంద్రం నుంచి రూ.2,781 కోట్లు

కేంద్రం అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రాం (ఏబీపీ) కింద వివిధ ప్రాజెక్టుల ద్వారా రూ.2,781 కోట్లను అందించనుంది. ఈ మొత్తంతో ఫైబర్‌నెట్ నిర్వహణను పదేళ్ల పాటు ప్రైవేటు సంస్థకు ఈపీసీ విధానంలో అప్పగించడంతో పాటు 4 లక్షల కొత్త సెట్‌టాప్ బాక్సుల కొనుగోలు, సాంకేతిక విస్తరణ వంటివి ప్రభుత్వం చేపట్టనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఏటా సుమారు రూ.80 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. మూలధన వ్యయం కింద మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం రూ.432 కోట్లు ఖర్చు చేయనుంది.

★ భారత్‌నెట్ ఫేజ్-1 కింద చిత్తూరు, విశాఖపట్నం జిల్లాల్లోని 79 మండలాల పరిధిలోని 1,692 గ్రామ పంచాయతీలకు ఆప్టికల్ ఫైబర్ కేబుల్‌ను ఏర్పాటు చేసింది. దీన్ని రింగ్ ఆర్కిటెక్చర్ టెక్నాలజీకి అప్‌గ్రేడ్ చేయనుంది. బీబీఎన్ఎల్ ఫేజ్-2, 3లో కొత్త సాంకేతికతను ప్రభుత్వం తీసుకువచ్చింది.

★ కొత్తగా ఏర్పాటైన 480 పంచాయతీలను ఫైబర్‌నెట్ పరిధిలోకి తీసుకువస్తారు.

★ విశాఖలోని నెట్‌వర్క్ ఆపరేషన్స్ సెంటర్(ఎన్‌వోసీ) సాంకేతికత అప్‌గ్రేడ్ చేసి బీఎస్ఎన్ఎల్ ఎన్‌వోసీతో అనుసంధానం చేస్తారు.

పదేళ్ల పాటు నిర్వహణ: రాష్ట్రంలోని భారత్‌నెట్ మౌలిక సదుపాయాలను (ఫేజ్-1, 2, 3) నిర్వహణను ఈపీసీ విధానంలో ప్రైవేటు గుత్తేదారు సంస్థకు ప్రభుత్వం అప్పగించనుంది. దీనికి పదేళ్లలో రూ.1,949 కోట్లు ఖర్చు చేయనుంది.

ఫైబర్ టు హౌస్ హోల్డ్ (ఎఫ్‌టీటీహెచ్) కనెక్షన్లు: 4 లక్షల కొత్త కనెక్షన్లు ఇచ్చేందుకు అవసరమైన బాక్సుల కొనుగోలుకు భారత్‌నెట్ ఉద్యమి పథకం కింద రూ.400 కోట్లు కేటాయించి, వాటిని సరఫరా చేసే కంపెనీలతో ఈ నెలాఖరులోగా ఎంప్యానల్‌మెంట్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

రూ.763 కోట్లు చెల్లించేందుకు..

ఏబీపీ పథకం కింద కేంద్రం నుంచి సాయం పొందాలంటే సంస్థకు ఉన్న రుణాలను పూర్తిగా చెల్లించాలన్న నిబంధనను కేంద్రం విధించింది. ఈ కారణంగా ప్రస్తుతం సంస్థకు ఉన్న రూ.763.97 కోట్ల రుణాన్ని చెల్లించేందుకు కేంద్రం నుంచి 50 ఏళ్లలో తిరిగి చెల్లించేలా దీర్ఘకాలిక రుణాన్ని తీసుకోవాలని నిర్ణయించింది.

ప్రాజెక్టు అమలుకు..

★ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఐదుగురు చొప్పున అధికారులతో ప్రత్యేక వాహక నౌకను ఏర్పాటు చేస్తారు.

★ వచ్చే ఆదాయాన్ని ఎస్‌పీవీ, బీఎస్ఎన్ఎల్, రాష్ట్రం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికాం మధ్య పంపిణీ చేస్తారు.

విద్యార్థినిపై ఇద్దరు అధ్యాపకుల అత్యాచారం

- కర్ణాటకలో వెలుగుచూసిన ఘటన

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: 'ఆచార్య దేవోభవ' అనే మాటకే మచ్చతెచ్చేలా ప్రవర్తించారు.. కర్ణాటకకు చెందిన ఇద్దరు అధ్యాపకులు. పాఠ్యాంశాల్లోని సందేహాలు తీర్చుతామని విద్యార్థినితో సాన్నిహిత్యం పెంచుకొని ఆమెపై అత్యాచారం చేశారు. ఇది ఆసరాగా తీసుకొని వారి మిత్రుడూ బాధితురాలిపై మృగంలా ప్రవర్తించాడు. ఆ గాయాల నుంచి తేరుకొని.. బాధితురాలు కళాశాలకు వెళ్తుంటే సదరు నిందితులు వేధింపులకు దిగారు. కన్నడనాట కలకలం రేకెత్తించిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. దక్షిణ కన్నడ జిల్లా మూడుబిదిరెలోని ఓ కళాశాలకు చెందిన నరేంద్ర అనే అధ్యాపకుడు పాఠ్యాంశాల సందేహాలు తీర్చే నెపంతో ఓ విద్యార్థిని(19)తో తరచూ ఫోన్‌లో మాట్లాడేవాడు. కొన్నాళ్లు ఆమెకు సన్నిహితంగా ఉంటూ వచ్చాడు. ఈ క్రమంలోనే నరేంద్ర, మరో అధ్యాపకుడు సందీప్ ఇటీవల కళాశాల పని మీద బెంగళూరుకు వెళ్తున్నామని.. ఆ విద్యార్థినినీ తీసుకెళ్లారు. ముగ్గురూ సందీప్ స్నేహితుడైన అనూప్ గదిలో దిగారు. ఇదే సమయం కోసం ఎదురుచూస్తున్న నరేంద్ర గదిలో విద్యార్థిని ఒక్కరే ఉన్నప్పుడు ఆమెపై అత్యాచారం చేశాడు. ఆ తర్వాత వచ్చిన సందీప్.. నరేంద్ర చేసిదంతా వీడియో తీశానని బెదిరించి, అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం బయటికి పొక్కనివ్వద్దని హెచ్చరించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆ సమయంలో అనూప్ వచ్చి.. 'నీవు నా గదిలో ఏ స్థితిలో ఉన్నది రికార్డు చేశా. సహకరించకపోతే ఆ వీడియోలు బయటపెడతా' అంటూ బెదిరింపులకు దిగారు. అప్పటికే నిస్తేజంగా ఉన్న ఆమెపై అత్యాచారం చేశాడు. ఇటీవల కళాశాలకు వెళ్తుండగా, మళ్లీ అధ్యాపకుల వేధింపులు మొదలయ్యాయి. బాధితురాలు తల్లిదండ్రుల సాయంతో రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలికి ఫిర్యాదు చేశారు. కమిషన్ సూచనతో మారతహళ్లి రాణా పోలీసులు కేసు నమోదు చేసి, ముగ్గురు నిందితులను మంగళవారం అరెస్టు చేశారు. సదరు అధ్యాపకులు గతంలోనూ కొందరిపై అత్యాచారాలకు పాల్పడినట్లు విచారణలో తేలిందని పోలీసులు వెల్లడించారు.

కరేడు రైతుల ఆందోళనకు వైకాపా మద్దతు: జగన్ హామీ

ఈనాడు, అమరావతి: కరేడు గ్రామ రైతుల ఆందోళనకు వైకాపా మద్దతు ఇస్తుందని.. వారి తరఫున ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చారు. కరేడు రైతులు మంగళవారం జగన్‌ను తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి మాట్లాడారు. రైతులను అక్కడకు తీసుకువచ్చిన కందుకూరు నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త బుర్రా మధుసూదన్ యాదవ్, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు తర్వాత విలేకర్లతో మాట్లాడారు. వైకాపా హయాంలో రామాయపట్నం పోర్టును ఆనుకుని అనుబంధ పరిశ్రమల ఏర్పాటు కోసం ఇండోసోల్ కంపెనీకి చేవూరులో 3వేల ఎకరాలు ఇప్పించాం. ఆ కంపెనీ నుంచి రైతులకు పరిహారంగా రూ.417 కోట్లు ఇప్పించాం. కూటమి ప్రభుత్వం ఆ కంపెనీకి భూములు అప్పగించకుండా తాత్సారం చేసింది. ఇండోసోల్‌ను అక్కడ నుంచి కరేడు గ్రామానికి తరలిస్తున్నారు. భూములు ఇవ్వబోమని కరేడు పంచాయతీలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఆ కంపెనీకి గతంలో కేటాయించిన భూములు వారికివ్వండి, అభ్యంతరం లేదు' అని ఎమ్మెల్సీ మాధవరావు అన్నారు.

కరేడు ఉద్యమం నుంచి తప్పుకొంటున్నా

బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్

అసలు సమస్యకు మూల కారకుడైన జగన్‌ను కరేడు రైతులు కలవడం ముమ్మాటికీ తప్పేనని బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ అన్నారు. 'ఇండోసోల్ కంపెనీ జగన్ బినామీలదే, ఆ కంపెనీ ఆవిర్భావం, దానికి భూముల కేటాయింపులు ఇవన్నీ జగన్ హయాంలోనే జరిగాయి. ఆ సంస్థకు తెరవెనుక వెన్నుదన్నుగా నిలిచిన జగన్‌ను రైతులు కలవడమంటే దొంగచేతికి తాళాలిచ్చినట్లే. దీని వెనుక పెద్ద కుట్రే దాగి ఉన్నట్టు అనుమానం వస్తోంది' అని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఈనాడు

భావి పరిశోధనలకు వెన్నుదన్నుగా...

అంతరిక్ష ప్రయోగాలే చాలా సంక్లిష్టభరితమైనవి. అందులోనూ వ్యోమనౌకల తిరుగు పయనం మరీ ప్రమాదకరమైనది. వేగంగా దూసుకొచ్చే స్పేస్‌షిప్ భూవాతావరణంలోకి ప్రవేశించగానే చోటుచేసుకునే ఘర్షణలోంచి తీవ్రస్థాయిలో ఉష్ణం ఉత్పన్నమవుతుంది. కల్పనాచావ్లాతో పాటు మరో ఆరుగురు వ్యోమగాములను నింగి నుంచి నేలపైకి తీసుకొస్తూ భగ్గున మండిపోయిన 'కొలంబియా'ను గుర్తుచేసుకుంటే ఇప్పటికీ ఒళ్లు జలదరిస్తుంది. 'ప్రాణాలతో తిరిగి రాలేననుకున్నాను. చివర్లో విపరీతమైన శబ్దం వచ్చింది. దానికి మేము సిద్ధంగా లేము...' అంటూ 41 ఏళ్ల కిందటి తన ప్రయాణంలోని ఉద్విగ్న క్షణాలను నిరుడు గుర్తుచేసుకున్నారు రాకేశ్‌శర్మ. అంతరిక్షయానం చేసిన తొలి భారతీయుడిగా ఆయన చరిత్ర సృష్టించే నాటికి శుభాంశు శుక్లా జన్మించనేలేదు. రాకేశ్ తర్వాత రెండో భారతీయ రోదసి యాత్రికుడిగా రికార్డు పుటలకెక్కి, సహచరులతో కలిసి నిన్న సురక్షితంగా భూమికి చేరుకున్న శుభాంశును చూసి యావద్దేశం గర్విస్తోందిప్పుడు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో సూక్ష్మగురుత్వాకర్షణ శక్తిపై శుక్లా చేపట్టిన ప్రయోగాలు- భావి పరిశోధనలకు అత్యావశ్యమైన సమాచారాన్ని క్రోడీకరించడంలో కీలకమైనవి!

శుభాంశు శుక్లా ఐఎస్ఎస్ యాత్ర వ్యక్తిగతంగా ఆయనకు మర్చిపోలేని అనుభూతులను అందించడమే కాదు- మానవ సహిత రోదసి ప్రయోగాలకు సంసిద్ధమవుతున్న భారతావనికి వెలకట్టలేని అనుభవపూర్వక జ్ఞానాన్నీ ప్రత్యక్షంగా సమకూర్చి పెట్టింది. గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా రాబోయే రెండేళ్లలో భారతీయ వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపి, భద్రంగా తిరిగి తీసుకొచ్చేందుకు జరుగుతున్న ప్రయత్నాలకు శుభాంశు అనుభవాలు అమితంగా అక్కరకొస్తాయన్నది ఇస్రో వర్గాల మాట. పరిమిత వనరులతోనే భారత అంతరిక్ష సంస్థ సాధిస్తున్న విజయాలు, చేపడుతున్న ప్రయోగాలు అందరినీ అబ్బురపరుస్తున్నాయి. కానీ, బహుళ ప్రయోజనాలను సిద్ధింపజేసే రోదసి శోధనలకు మరిన్ని నిధులను ప్రత్యేకించాలి. ఇస్రో ఆరంభం నుంచి దానికి దక్కిన మొత్తం కేటాయింపులన్నింటినీ కలిపినా 'నాసా' ఒక సంవత్సర బడ్జెట్ అంత ఉండవని 'నేచర్' నివేదిక వెల్లడించింది. అంతరిక్ష పరిశోధనల కోసం అమెరికా సర్కారు నిరుడు జీడీపీలో 0.27శాతం సొమ్మును ప్రత్యేకిస్తే- రష్యా 0.18శాతం, జపాన్ 0.17శాతం ఖర్చుచేశాయి. చైనా, ఇటలీలు 0.11శాతం చొప్పున వెచ్చించాయి. ఇండియాలో మాత్రం ఆ వ్యయం 0.05శాతమే. ప్రస్తుతం 800 కోట్ల డాలర్లుగా ఉన్న భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ విలువ వచ్చే కాలంలో 4400 కోట్ల డాలర్ల స్థాయికి చేరుకోవచ్చని అంచనా. ఆ స్థాయి ప్రగతి సాధ్యపడాలంటే పెట్టుబడులు పెరగాల్సిందే!

భారత అంతరిక్ష కార్యక్రమాల్లో సుస్థిర ప్రగతికోసం పరిశోధన-అభివృద్ధి (ఆర్‌అండ్‌డీ) కార్యకలాపాలను ప్రోత్సహించాలని జాతీయ రోదసి విధానం(ఐఎస్‌పీ-2023) పిలుపిస్తోంది. దేశీయంగా పౌరసేవలను విస్తృతపరచడానికి ఈ సాంకేతిక పరిజ్ఞానం ఉపకరిస్తుందని ఐఎస్‌పీ సూచిస్తోంది. వ్యవసాయం నుంచి జాతీయ భద్రత వరకు ఉపగ్రహాలు నేడు వివిధ రంగాల్లో వెలకట్టలేని సేవలందిస్తున్నాయి. అంతరిక్ష రంగంలో ఖర్చుచేసే ప్రతి రూపాయికీ అంతకు రెండున్నర రెట్ల ప్రతిఫలం లభిస్తోందని అధ్యయనాలు చాటుతున్నాయి. కాబట్టి ఇస్రోకు సర్కారీ దన్ను ఎంత అధికమైతే- దేశానికి అంత మేలు జరుగుతుంది. ప్రైవేట్ భాగస్వామ్యంతో విస్తరిస్తున్న అంతరిక్ష రంగానికి అవసరమైన నిపుణ మానవ వనరులను తయారుచేసుకోవడంపైనా ప్రభుత్వాలు శ్రద్ధ పెట్టాలి. చిన్నప్పటి నుంచే విద్యార్థుల్లో వైజ్ఞానిక స్పృహను పెంచుతూ, మౌలిక పరిశోధనల వైపు వారిని నడిపించడం దీర్ఘకాలంలో దేశాభివృద్ధికి బాగా దోహదపడుతుంది!



సవాళ్లను ఎదుర్కొనడానికి, రిస్క్ తీసుకోవడానికి ధైర్యం చేయలేనివాళ్లు జీవితంలో ఏదీ సాధించలేరు. మిమ్మల్ని మీరు నమ్మండి. సరైన మార్గాన్ని ఎంచుకుంటే చాలు ఎలాంటి కష్టాన్ని అయినా సరే ఎదుర్కొనవచ్చు.

– అరుణా అసఫ్ అలీ

దాంపత్య సాఫల్యం

ఒక తాత్విక చింతనలోని లోతును, విస్తృతిని, సాంద్రతను శోధన వల్ల తెలుసుకోవచ్చు. ఒక సిద్ధాంతంలోని తార్కికతను, ధర్మసారాన్ని, ఒక ఆచారం లేదా వ్యవస్థలోని గొప్పదనాన్ని అనుభవంలోకి తెచ్చుకోవడం ద్వారా అర్థం చేసుకోవచ్చు. అలా అర్థం చేసుకున్నవాటిని ఆచరించాలి. అప్పుడే వాటి ఘనత లోకానికి వెల్లడవుతుంది.

షోడశ సంస్కారాలలో వివాహం ఒకటి. రుషులు, మహానుభావులు దాని విశిష్టతను లోకానికి బోధించారు. గ్రంథస్థం చేశారు. భార్యా భర్తలు దాంపత్యవిధులు ఆచరిస్తూ, బాధ్యతలు పంచుకోవాలి. దాంపత్య ధర్మమంటే అదే. భార్యాభర్తలిరువురికీ ఇది వర్తిస్తుంది. అటువంటి వివాహవ్యవస్థ ఎక్కడ ఉన్నా, ఎవరిదైనా ఆదర్శమైనదే. ఒక స్త్రీ, పురుషుడు, రెండు విభిన్న కుటుంబ నేపథ్యాలు, అలవాట్లు, అభిరుచులతో వివాహబంధంలోకి ప్రవేశించి ఒక్కటిగా జీవించడం మొదలెడతారు. ఇది సమాజం ఏర్పాటుచేసుకున్న చట్టబద్ధమైన, ధర్మబద్ధమైన వ్యవస్థ. దానికి సంబంధించిన క్రతువు,



వధూవరులు చేసే ప్రమాణాలు పైకి కనిపిస్తూ, వినిపించేవి మాత్రమే. వాటి అర్థం, అంతరార్థాలను ఆ దంపతులు ఆకళింపు చేసుకోవాలి. మనసా, వాచా, కర్మణా వాటిని ఆచరించాలి. 'మనసు, మనసు కలపడమే మంత్రం పరమార్థం' అంటారు ఆరుద్ర. అటువంటి దాంపత్య జీవితమే హాయిగా సాగుతుంది. ఏకమైన మనసుల ప్రేమ మలయమారుతమవుతుంది.

దాంపత్య జీవిత రథానికి భార్యాభర్తలు ఇద్దరూ సారథులే. అధికారం, అహంకారం, ఆధిక్యత అనే ఆ రథాశ్వాలను పరస్పరావగాహన, సంయమనం, వివేచన అనే కళ్లాలతో అదుపులో ఉంచాలి. అప్పుడు వారు ఆనంద పథంలో పయనిస్తారు.

అంతర్యామి

సంసారంలో అలకలు, పొరపాట్లు, కోపతాపాలు సహజం. వాటిని ఎప్పటికప్పుడు తెలుసుకుని సరిదిద్దుకుంటూ ముందుకు సాగాలి. చేసిన తప్పును మళ్లీ చేయకూడదు. అందుకు ఇద్దరికీ సహనం, సహానుభూతి కావాలి. ఒకరినొకరు తప్పుబట్టే ముందు అసలేం జరిగిందో మనసు విప్పి మాట్లాడుకోవాలి.

దాంపత్యం గురించి సంభాషించేటప్పుడు తోడు, నీడ అనే మాటలు వాడుతుంటాం. ఎవరు తోడు, ఎవరు నీడ? ఇద్దరూ ఒకరికొకరు తోడూ నీడా. అంతేకానీ ఎప్పుడూ ఒకరు నీడగానే ఉండాల్సిన అవసరం లేదు. సందర్భాన్ని బట్టి స్థానం మారవచ్చు. అంతమాత్రాన ఒకరు ఎక్కువా మరొకరు తక్కువా కాదు.

దాంపత్య జీవితం తెరచిన గొడుగులాంటిది. దాని నీడన తొలిదశలో భార్యాభర్తలే ఉంటారు. తరవాత పిల్లలు వస్తారు. పిల్లలు పెద్దవాళ్లై తమ జీవితాలు తాము ఏర్పరచుకున్నాక మళ్లీ మలిదశలో దంపతులు ఇద్దరే మిగులుతారు. అంటే జీవితాంతం ఒకరికొకరు తోడు, నీడ అన్నమాట. భార్యాభర్తల మధ్య ఉండే అనురాగానికి, ఆత్మీయతకు, ప్రేమకు నిజమైన అర్థం తెలిసేది, తెలియాల్సింది ఈ దశలోనే. దాంపత్యమనే మరిగిన పాల మీద కట్టే చిక్కటి మీగడ లాంటిది ఈ ప్రేమ. అది కమ్మగా రుచిగా ఉంటుంది. అదే దాంపత్య జీవనసాఫల్యం.

– బొడ్డపాటి చంద్రశేఖర్

నిండా మునిగిపోతున్నారు!

రాజకీయ, మతపరమైన హింస మూలంగానో... మెరుగైన జీవితం కోసమో ప్రజలు వలసపోవడం తెలిసిందే. కానీ- వాతావరణ మార్పుల వల్ల ఇప్పుడు ఏకంగా ఒక దేశ జనాభా యావత్తూ తరలిపోవాల్సి వస్తోంది. ఇలాంటి విషాద సందర్భం ప్రపంచంలో ఇదే ప్రథమం. తువాలు దేశీయులు తమ పుట్టిగడ్డను శాశ్వతంగా విడిచిపెట్టాల్సిన అనివార్య పరిస్థితులు వచ్చేశాయి. కానీ, పిల్లాపాపలతో ఎక్కడికని వెళ్తారు? ఎలా బతుకుతారు?



లేత నీలి రంగు సాగర జలాలు, పగడపు దిబ్బలూ పొడవాటి కొబ్బరి చెట్లతో ప్రకృతి సౌందర్యం తొణికిసలాడే బుల్లి దీవిదేశం- తువాలు! నృత్య సంగీతాలతో మమేకమైన జీవనం, మూడువేల సంవత్సరాల సాంస్కృతిక వైభవం అక్కడి ప్రజల సొంతం. హవాయ్, ఆస్ట్రేలియాల నడుమ పసిఫిక్ మహా సాగరంలో తొమ్మిది దీవులతో కూడిన ఆ చిట్టి దేశానికి అతిపెద్ద ముప్పే వచ్చిపడింది. మరి కొన్ని దశాబ్దాల్లోనే అది పూర్తిగా కనుమరుగు కానుంది. నేలతో పాటు అక్కడి జన జీవితాలనూ వేదిస్తున్న సముద్ర జలాలు కబళిస్తున్నాయి. తువాలు భూభాగం సముద్ర మట్టానికి కనిష్ఠంగా 6.6అడుగులు, గరిష్ఠంగా 15అడుగుల ఎత్తులోనే ఇమిడి ఉంది. అంతా కలిపి 25.14 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం, 10,643 మంది జనాభా! వాతావరణ మార్పుల వల్ల తుపానుల ఉద్ధృతి, సముద్ర మట్టం పెరుగుతుంటే, అలల తాకిడికి నేల కోసుకుపోతోంది. తాగునీటి వనరులు ఉప్పునీటితో కలగలిసిపోతున్నాయి. వ్యవసాయం, జీవనోపాధులు దెబ్బతిని పోతున్నాయి. వెరసి ఇవన్నీ తువాలును నివాసానికి పనికిరాకుండా చేస్తున్నాయి. వాతావరణ మార్పులు ఎంతటి విధ్వంసాన్ని మిగులుస్తాయో తువాలు, ఆ దేశ ప్రజల దుస్థితే చెబుతోంది. భారత్ సహా అనేక దేశాల తీరప్రాంతాల్లో ఇలాంటి దృశ్యాలే ఆగుపిస్తాయి.

ఆశాకిరణం ఆస్ట్రేలియా...

పరిశోధకుల అంచనా ప్రకారం, 2050 నాటికి తువాలు రాజధాని ఫునాఫుటీలో సగం భాగం వరదలతో మునిగిపోనుంది. 2100 నాటికి ఆ దేశంలో 95శాతం భూభాగం జలమయం కావచ్చు. తువాలు ప్రజల సగటు వయసు దాదాపు 29 సంవత్సరాలు. ఏదో ఒక వృత్తిలో కుదురుకుని, కుటుంబ జీవితాన్ని కట్టుకోవాల్సిన తరుణంలో- వారి భవిష్యత్తు గాలిలో దీపం అవుతోంది. అయితే, 2023లో ఆస్ట్రేలియాతో కుదుర్చుకున్న 'ఫలేపిలి యూనియన్ ట్రీటీ' తువాలువాసులకు ఆశాకిరణంలా మారింది. ఈ ఒప్పందాన్ని అనుసరించి ఏటా 280 మంది తువాలు పౌరులకు ఆస్ట్రేలియాలో శాశ్వత నివాసంతో పాటు విద్య, ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. ఇందుకు సంబంధించి ఇటీవలే పసిఫిక్ ఎంగేజ్‌మెంట్ వీసా కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తే, 4052 మందికి సంబంధించి మొత్తం 1124 దరఖాస్తులు అందాయి. త్వరలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేపడతారు. మరోవైపు, వీసా నిషేధాన్ని ఎదుర్కొంటున్న 36దేశాల జాబితా నుంచి తువాలును తొలగిస్తున్నట్లు అమెరికా తాజాగా వెల్లడించింది.

నీటిలో మునిగిపోతున్న నావ మాదిరిగా క్రమంగా కనుమరుగవుతున్న తమ భూభాగాన్ని పరిరక్షించుకోవడానికి తువాలు ప్రభుత్వం ముమ్మరంగా ప్రయత్నిస్తోంది. 'కోస్టల్ అడాప్టేషన్ ప్రాజెక్ట్' కింద ఐక్యరాజ్యసమితి గ్రీన్ క్లైమేట్ ఫండ్, ఆస్ట్రేలియాల సాయంతో ఫొంగఫలె, నానుమగా, నానుమియా దీవుల్లో 3.6 చదరపు కిలోమీటర్ల మేర నేలను ఎత్తు చేస్తోంది. అక్కడ నీటి సరఫరా, ఆహార భద్రతకు చర్యలు తీసుకుంటోంది. 'డిజిటల్ నేషన్ ఇనిషియేటివ్' ద్వారా భావి తరాలకు తన సాంస్కృతిక వారసత్వాన్ని అందించేందుకూ ప్రయత్నిస్తోంది. తువాలు ఒక్కటే కాదు- కిరిబాటి, మాల్దీవులు, మార్షల్ ఐలాండ్స్ వంటి తక్కువ ఎత్తున్న ద్వీపదేశాలు సైతం సముద్రమట్టాల ఉద్ధృతి మూలంగా గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి.

చట్టపరమైన రక్షణేదీ?

ప్రపంచవ్యాప్తంగా 2050 నాటికి సుమారు 21.6 కోట్ల మంది వాతావరణ కారక వలసలకు గురికావచ్చని అంచనా. కాబట్టి, తువాలు వంటి దేశాలవారికి చట్టపరమైన రక్షణ కల్పించాల్సిన బాధ్యత అంతర్జాతీయ సమాజానిదే. ప్రస్తుతమున్న యూఎన్ రెఫ్యూజీ కన్వెన్షన్-1951 వంటివి హింస లేదా రాజకీయ అణచివేతను ఎదుర్కొంటున్న వారికి మాత్రమే వర్తిస్తాయి. 2018 నాటి 'గ్లోబల్ కాంపాక్ట్ ఫర్ మైగ్రేషన్' వాతావరణ వలసలను గుర్తిస్తున్నా, చట్టపరమైన హామీ ఇవ్వదు. కాబట్టి, వాతావరణ కారక నిర్వాసితులను పర్యావరణ వలసదారులుగా ప్రత్యేకంగా గుర్తించాల్సిన అవసరముంది. ముఖ్యంగా మానవతా వీసాల జారీ, ద్వైపాక్షిక ఒప్పందాల ద్వారా దేశాల మధ్య వలసలకు అంగీకారం కుదర్చడానికి గట్టి కృషి జరగాలి. ఇప్పటికే 'నాన్సెన్ ఇనిషియేటివ్' కింద వలసలకు రక్షణ కల్పించే డిజాస్టర్ డిస్‌ప్లేస్‌మెంట్ కార్యక్రమానికి 109 దేశాల మద్దతు ఉంది. దీన్ని చట్టపరంగా బలోపేతం చేయడంతో పాటు వాతావరణ నిధి(జీసీఎఫ్), యూఎన్‌ఎఫ్‌సీసీసీ నష్టపరిహార నిధి(ఎల్అండ్‌డీ)ని బాధితుల పునరావాసానికి వెచ్చించాలి. 1954, 1961 స్టేట్‌లెస్‌నెస్ కన్వెన్షన్లను విస్తరించడం ద్వారా- పూర్తిగా నీటమునిగే తువాలు వంటి దేశీయుల హక్కులను పరిరక్షించాలి.

తీర ప్రాంతాలను రక్షించుకోలేమా?

తువాలు దుస్థితిని హెచ్చరికగా భావించి, మనమూ మేలుకోవాలి. భారతదేశానికి 11,098 కిలోమీటర్ల మేర సముద్ర తీరముంది. సముద్ర మట్టాలు పెరగడం వల్ల సుందర్బన్ అడవులు, లక్షద్వీప్, అండమాన్-నికోబార్ దీవులు, చెన్నై, ముంబయి, కోల్‌కతా, విశాఖపట్నం వంటి చోట్ల నేల కోతకు గురవుతోంది. సముద్ర జీవుల ఆవాసాలు, జీవవైవిధ్యం దెబ్బతినిపోతున్నాయి. ఎంతోమంది మత్స్యకారులు, గ్రామీణులు స్థానికంగా ఉపాధి కోల్పోయి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వీటికి అడ్డుకట్ట వేయాలంటే శిలాజ ఇంధనాల వినియోగాన్ని గణనీయంగా తగ్గించి, ఆ మేరకు పునరుత్పాదక ఇంధన వనరుల వాడకాన్ని ప్రోత్సహించాలి. చెరువులు, నదులు, సాగరాల్లో వ్యర్థాలు, రసాయనాల పారబోతను అడ్డుకోవడంతో పాటు తీర ప్రాంతాల పరిరక్షణకు పెద్దపీట వేయాలి. అందుకు దేశీయంగా మరెంతో కృషి అవసరం. ప్రపంచవ్యాప్తంగా ప్రబలుతున్న వాతావరణ మార్పుల కట్టడికి అన్ని దేశాలూ గట్టి పూనిక వహించకపోతే- ఏదో ఒకరోజు యావత్ మానవాళి మనుగడకు పెనుముప్పు తప్పదు!

– తమ్మిశెట్టి రఘుబాబు



ఎందుకు వాదిస్తున్నారు?

వాళ్లిద్దరూ మంచి మిత్రులు. ఒకరు ఆ పార్టీ అయితే, మరొకరు ఈ పార్టీ. ఒకసారి వాళ్ల మధ్య రాజకీయాల ప్రస్తావన వచ్చింది. ఇంకేముంది... మీ నాయకుడు అలా అంటే, మీ నేత ఇలా... అంటూ వాదులాడుకుని కొట్టుకున్నంత పనిచేశారు. మిత్రులు కాస్తా బద్ధ శత్రువులయ్యారు. మరో జిగిరీ దోస్తుల జంట. ఒకరు ఒక నటుడికి అభిమాని అయితే, రెండోవాడు మరో నటుడికి వీరాభిమాని. ఒకసారి మాటల సందర్భంలో నంబర్ వన్ హీరో ఎవరూ అన్న వాదన రాజుకుంది. 'నువ్వెంత' అంటే 'నువ్వెంత' అంటూ కలబడ్డారు.

ఎవరి భావాలు, అభిప్రాయాలు, ఆలోచనలు, నమ్మకాలు, విశ్వాసాలు, ఆసక్తులు వాళ్లకి ఉంటాయి. తామే కరెక్ట్ అనుకోవడం మనిషి ప్రవృత్తి. వాటి మీద దాడి జరిగితే అదే వాదం. ఆ వాదం ముదిరితే వివాదమై సంఘర్షణకి దారితీస్తుంది. ఒక వాదన జరిగిందనుకుందాం. మన మాటే కరెక్ట్ కావాలని ఏముంది, ఎదుటివారి మాట ఎందుకు కరెక్ట్ కాకూడదు? దాన్ని ఒప్పుకొంటే పోయేదేముంది? లేదూ... ఎదుటవారి అభిప్రాయంతో ఏకీభవించలేకపోతే ఆ విషయం సున్నితంగా చెప్పొచ్చు. వాదన పెరిగేకొద్దీ అసహనం పెరుగుతుంది. అసహనం పెరిగితే ఆలోచన, విచక్షణ నశిస్తాయి. ఆవేశం రగులుతుంది. మాట తూలుతుంది. వాదనలు ముదిరి ఆవేశపరులంతా రెండు పక్షాలుగా మారి బాహాబాహీకి దిగడం చాలా సందర్భాల్లో చూస్తూనే ఉంటాం.

నిజంగా తెలివి కలవాళ్లు ఎన్నడూ వాదనల జోలికి వెళ్లరు. విజ్ఞతతో వ్యవహరిస్తారు. అజ్ఞానులే తమ మూర్ఖత్వ ప్రదర్శన కోసం పిడి వాదనలు చేస్తారు. కార్యశీలురు మౌనంగా తమ పని తాము చేసుకుపోతారు కానీ ఎన్నడూ వ్యర్థమైన వాదనల ఊసెత్తరు. ఎదుటి వారి పొరపాటు అభిప్రాయాలను సరిదిద్దాలనుకుంటే సంభాషణ ద్వారా ప్రయత్నించవచ్చు. అదీ వారు మంచీ చెడూ తెలుసుకుని, మారాలన్న ఉద్దేశం ఉన్నవారైతేనే. తామే కరెక్టని వాదనకు దిగేవారు మారకపోగా తమ అభిప్రాయాలను మరింత బలపరచుకుంటారు. సంభాషణ సరదాగా పూలు విసిరినట్లు ఉంటే, వాదన రాళ్ల దాడిలా ఉంటుంది. పెద్ద గొంతుతో దబాయించి గెలిచామని విర్రవీగినంత మాత్రాన అది విజయం కాదు. పైగా సమాజంలో పలుచన అయిపోతారు. విలువ కోల్పోతారు.

వాదనలో గెలిచి స్నేహాన్ని కోల్పోవడమా, స్నేహంకోసం వాదన ఓడిపోవడమా.. ఏది ముఖ్యమో నిర్ణయించుకోవాల్సింది మనమే. అందుకే సంభాషణ వాదన స్థాయికి వెళ్తోందనగానే విషయాన్ని మళ్లించడానికి ప్రయత్నించాలి. అబ్బే... తగ్గేదేలే అంటారా! జీవితంలో ఒక మిత్రుణ్ని కోల్పోతారు. వాదనలో ఓడిపోయిన వాళ్లు, అవమానంగా భావించి ఇక అవతల వారి ముఖం కూడా చూడటానికి ఇష్టపడరు. అన్నీ తమకు తెలుసనే అహంభావులే సహజంగా వాదనలు పెట్టుకుంటారు. అలాంటి వాళ్లతో మాట్లాడటానికి ఎక్కువ మంది ఇష్టపడరు కూడా! వాదనలతో సమయం వృథా కావడం మినహా ప్రయోజనం ఏదీ లేదు. అందుకే వాదన వద్దు బాసూ!


– మొలకలపల్లి కోటేశ్వరరావు



పెరిగి... తగ్గిపోతోంది!

ఎగుమతుల పేరెత్తగానే మొదట చైనా పేరు గుర్తొస్తుంది. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ పరికరాలు, ప్లాస్టిక్, బొమ్మలు తదితరాలను చైనా పెద్దయెత్తున ఎగుమతి చేస్తోంది. కానీ, డ్రాగన్ జీడీపీలో విదేశీ వాణిజ్య వాటా క్రమంగా తగ్గుతోంది. చైనా జీడీపీలో వస్తు సేవల ఎగుమతులు అయిదున్నర దశాబ్దాల క్రితం అయిదు శాతం ఉంటే, 2006లో అవి గరిష్ఠ స్థాయికి చేరి ఆ తరవాతి నుంచి తగ్గుతున్నాయి. వాస్తవానికి చైనా ఉత్పత్తులు నేటికీ భారీగానే ఉన్నా, దాని ఆర్థికవ్యవస్థ వేగంగా విస్తరిస్తోంది. పెరుగుతున్న మధ్యతరగతి వల్ల స్థానిక వినియోగం ఎగబాకుతోంది. ఈ క్రమంలో అంతర్జాతీయ వాణిజ్యం సన్నగిల్లుతోంది.


ఆయా సంవత్సరాల్లో చైనా జీడీపీలో విదేశీ వాణిజ్య వాటా... (శాతాల్లో)



(ఆధారం: ప్రపంచ బ్యాంక్, ఓఈసీడీ నివేదికలు-2025)

విలువలూ! మీ విలువెంత?

ఉత్తర్ ప్రదేశ్‌లో సత్తెకాలం మనిషి... ఆ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అసిమ్ అరుణ్ ఉదంతం విని అందరూ విస్తుపోతున్నారు. మిగిలిన రాజకీయ నాయకులైతే తెగ తత్తరపడిపోతున్నారు. మంత్రిగా విధులు నిర్వర్తించడానికి ప్రభుత్వం ఆయనకు కారు ఇచ్చింది. వారణాసికి బయలుదేరుతుంటే తన కారుకున్న బుగ్గలైట్లను చూసి ఆయన భగ్గుమన్నారు. ఇవేంటి? వీటిని వాడటం మీద కోర్టు నిషేధం ఉంది కదా! అనుకుని తన కారు పైనే పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. జరిమానా కట్టడానికి సిద్ధమయ్యారు. యమధర్మ రాజు తన దూతలకు రాజకీయ నాయకుల వేషాలు వేసి కార్లలో, మరికొన్ని వాహనాల్లో తిప్పుతున్నట్టు పుకార్లు షికార్లు చేస్తున్న రోజులివి. నేతల కార్లు వస్తుంటే, వాటి 'పుణ్యమా' లేదా 'పాపమా' అని స్వర్గానికో, నరకానికో వెళ్లక తప్పదేమోనని జనాలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని అటో ఇటో పరిగెడుతున్న కాలమిది. ఇలాంటి పరిస్థితుల్లో అసిమ్ చూపిన నైతికత నిజంగా నమ్మశక్యంగా లేదు!




ఎంత కలికాలమైనా ఇంత చిత్రమా? విలువలకు నిలువునా పాతరేసి జాతర చేస్తున్న దేశంలో అసిమ్ అరుణ్ లాంటి వారు ఉండటం నిజంగా ఎంత అదృష్టం! రాజకీయ నాయకుల దెబ్బకు 'చితి'కిపోతూ ఎక్కడెక్కడో దాక్కున్న విలువలన్నింటినీ బయటికి లాక్కొచ్చి బతికి బట్టకట్టించాలని అసిమ్ పరితపిస్తున్నట్లున్నారు. దాన్ని చూసి ఇతర నేతలకు కోపం రాదా? మంత్రులకు మండదా? అందుకే, ఇలా అయితే ఎలా అని బుగ్గలు నొక్కుకుంటున్నారు. స్కీములను స్కాములుగా మార్చి 'కూడ'బెట్టిన 'విలువైన' సంపదంతా విలువల్లో భాగమేగా, సాక్షాత్తు లక్ష్మీ దేవత స్వరూపమేగా అని రాగాలు తీస్తున్నారు. కారుకు రకరకాల రంగులుంటాయ్, డబ్బుకు కూడా రెండు రంగులుంటాయి, తెలుపో నలుపో జానేదోవ్ అంటూ మహాకవి శ్రీశ్రీ వ్యంగ్య గొంతుకను అరువు తెచ్చుకుని మరీ పాడుతున్నారు. ప్రైవేటుగా కారుకొన్న వారిలోనే కొందరు కన్నూ మిన్నూ కానకుండా నిబంధనలన్నింటినీ తుంగలో తొక్కి అడ్డగోలుగా బలాదూర్‌గా ఎంత దూరమైనా తిరుగుతున్నప్పుడు ఉద్దరకు వచ్చిన కారు గురించి మంత్రి చేసిన ఈ పంచాయితీ ఏంటి? ఈ పిచ్చి ఏంటి అని తోటి మంత్రులు గొంతువిప్పకుండానే కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారు. ఎవరి పిచ్చి వారికి ఆనందంలే అని వారంతా సర్దిచెప్పుకోలేకపోతున్నారు. అన్నట్లూ, మంత్రి అసిం అరుణ్ ఒకప్పుడు ఐపీఎస్ ఆఫీసర్. ఆయన తండ్రి ఉత్తర్ ప్రదేశ్ డీజీపీగా పనిచేశారు. ఎంత ఘనమైన వారసత్వం! గంజాయి వనాల్ని పెంచుతూ, గంజాయి బ్యాచుల్ని పోషిస్తున్న నాయకులున్న ఈ రోజుల్లో తులసి మొక్కలు తగలడం నెత్తిన పెట్టుకోవాల్సిన విషయమే!

మన దేశంలో ఇలా ఉంటే, విదేశాల్లో మరో వింత జరిగింది. ఇక్కడిలాగా బాగా అలవాటైన ఉత్తమ భక్తితో లేదంటే ఉత్తుత్తి భక్తితోనైనా థాయ్‌లాండ్‌కు వెళ్లి పాదాభివందనాలు, వంగి వంగి దండాలు పెట్టకండని ఆ ఉదంతం మన నాయకులకు చాటిచెబుతోంది. థాయ్‌లాండ్ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రకు ఈ మధ్య పెద్ద కష్టం వచ్చిపడింది. కాంబోడియా ప్రధానమంత్రితో అతివినయంగా మాట్లాడటం ఏకంగా ఆమె సీటు కిందకే నీళ్లు తెచ్చింది. తద్వారా నైతిక ఉల్లంఘనకు పాల్పడ్డారన్న అభియోగం మీద రాజ్యాంగ న్యాయస్థానం ఆమెను పదవి నుంచి సస్పెండ్ చేసింది. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. ఆమె కాస్త ఖర్చయినా తెలుగు రాష్ట్రాలకు వస్తే ప్రత్యర్థులతో ఎలా మాట్లాడాలో అభినయ పూర్వకంగా నేర్పిస్తారు. అప్పుడు రాళ్లు, కత్తులు, తుపాకులు, బాంబులతో అవసరమే ఉండదు. ఇక్కడ నేర్చుకున్న విద్యను అక్కడ ప్రదర్శిస్తే సరి! స్వదేశీయులు మహా దేశభక్తురాలిగా భజనలు చేసి నెత్తిన పెట్టుకుంటారు. కోర్టువారు క్షమించి కేసును మూసివేసినా ఆశ్చర్యం లేదు. అయినా, మన దేశంలో ఎంతో కాలంపాటు నిలువ ఉండటం వల్ల విలువలు దెబ్బతిన్నాయని కొన్ని 'ఉపరిశోధనల్లో' బయటపడిందట! ఎప్పటికెయ్యది ప్రస్తుత మప్పటికా మాటలాడటమే ఇప్పటి రాజకీయం. అలాంటప్పుడు ఏ పార్టీలో ఉన్నా, ఎవరి గ్రూపులో ఉన్నా రాజకీయం ఫ్రెష్‌గానే ఉంటుంది. కార్యాలయం రష్‌గానే ఉంటుంది. నీతీ నిజాయతీలు, మర్యాదలు ఎవరికి కావాలి? అంతా మనదే... కనిపించేవన్నీ మన పొట్టలోకే! అంతేనా నాయకులూ!

– శంకర నారాయణ

అల్లరే.. అల్లరి!

ఒక నది తీరంలోని అడవిలో మృగరాజు దగ్గర ఏనుగు మంత్రిగా ఉండేది. దానికి ఓ గున్న ఏనుగు పుట్టింది. చిన్నపిల్ల కావడంతో బాగా గారాబం చేసేది తల్లి ఏనుగు. దాంతో అది చాలా అల్లరి చేసేది. మిగతా జంతువులను ఎప్పుడూ ఇబ్బంది పెడుతూ ఉండేది. అవన్నీ వచ్చి.. మంత్రికి ఫిర్యాదులు చేస్తుండేవి. అల్లరి పనులు చేయడం తప్పని చెప్పినా.. అస్సలు వినిపించుకునేది కాదు. 'అసలు దీని అల్లరి మాన్పించడానికి ఏం చేయాలో అర్థంకావడం లేదు' అంటూ బాధపడసాగింది మంత్రి. ఆ మాటలు విన్న కోతి 'గున్న ఏనుగును మార్చడానికి నా దగ్గర ఒక ఉపాయం ఉంది. అది పాటిస్తే కచ్చితంగా తన ప్రవర్తన మార్చుకుంటుంది' అంది. 'అయితే ఏంటో త్వరగా చెప్పు' అంది జింక.



'గున్న కంటే ఎక్కువ అల్లరి చేసే జీవిని దాని పక్కన ఉంచితే సరిపోతుంది' అంది కోతి. 'సరే.. అయితే అలాంటి జంతువును త్వరగా తీసుకురా!' అన్నాయి జంతువులు. 'ఎవరో ఎందుకు? నేనున్నాను కదా' అంది కోతి. మరుసటిరోజు నుంచి గున్న ఏనుగు ఎక్కడికి వెళ్తే అక్కడికి వెళ్లేది. అది అల్లరి చేయడం మొదలుపెట్టేసరికి.. కోతి ఇంకా ఎక్కువ చేసేది. దాంతో.. 'అసలు ఎవరు నువ్వు. ఇంత చిరాకు తెప్పిస్తున్నావు. అల్లరి చేస్తూ ఇంత ఇబ్బంది పెడుతున్నావు' అంది గున్న ఏనుగు. అయినా అలాగే అల్లరి చేయసాగింది కోతి. దాంతో వాళ్లమ్మ దగ్గరికెళ్లి.. కోతి గురించి చెప్పింది గున్న ఏనుగు. 'చూశావా తల్లీ! అల్లరి చేస్తూ మన పనులకు ఆటంకం కలిగిస్తే ఎలా ఉంటుందో. నువ్వు కూడా రోజూ ఇలాగే చేస్తావు. నీ వల్ల కూడా మన అడవిలో చాలా జంతువులు ఇబ్బంది పడ్డాయి తెలుసా!' అంది మంత్రి. 'ఇప్పుడే అర్థమైందమ్మా! ఇంకెప్పుడూ అలా ప్రవర్తించను. బుద్ధిగా ఉంటాను' అంటూ ఇన్ని రోజులు అది ఇబ్బంది పెట్టిన జంతువులన్నింటికీ క్షమాపణలు చెప్పింది.

– కూచిమంచి నాగేంద్ర

చెప్పుకోండి చూద్దాం!

ఇక్కడ ఆంగ్లంలో ఒకే అక్షరంతో ముగిసే అంశాల పేర్లు తెలుగులో ఉన్నాయి. కానీ అందులో కొన్ని వేరేవీ కలిసిపోయాయి. అవేంటో చెప్పుకోండి చూద్దాం.

కుండ	రైలు	ఎలుక
సింహం	ఆవు	కుందేలు
నీరు	చొక్కా	పిల్లి

22, 23 తేదీల్లో ప్రత్యేక పాస్‌పోర్ట్ డ్రైవ్

తుళ్లూరు, న్యూస్‌టుడే: విజయవాడ రీజినల్ పాస్‌పోర్ట్ కార్యాలయం సౌజన్యంతో ఈ నెల 22, 23వ తేదీల్లో తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో ప్రత్యేక పాస్‌పోర్ట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు సీఆర్డీఏ కమిషనర్ కార్యాలయం మంగళవారం తెలిపింది. రోజుకు 35 మంది నుంచి దరఖాస్తులను స్వీకరించి 70 మందికి పాస్‌పోర్టులు జారీ చేయనున్నారు. దీని కోసం passportindia.gov.in అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వివరాలకు గ్రామాల్లోని సీఆర్డీఏ ఫెసిలిటేటర్స్‌ను లేదా సీఆర్డీఏ సీనియర్ లైవ్లీ హుడ్ స్పెషలిస్ట్ శంకర్‌ను 98484 24207 నంబరులో సంప్రదించవచ్చు. సాధారణ పాస్‌పోర్ట్ (మొదటిసారి) దరఖాస్తు చేసేందుకు ఆధార్ కార్డు లేదా జనన ధ్రువీకరణ పత్రంతో పాటు 10వ తరగతి సర్టిఫికెట్, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ, టీసీ, బ్యాంకు పాస్ పుస్తకాల్లో ఏదో ఒకటి తీసుకురావాల్సి ఉంటుంది.

అమ్మవారి దర్శనానికొచ్చే భక్తులకు ఇబ్బందులున్నాయా?

ఈనాడు మీతోడు

రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద ఆలయమైన విజయవాడ దుర్గగుడికి నిత్యం వేల సంఖ్యలో భక్తులొస్తుంటారు. ఏటా కనీసం కోటిన్నర మందికి పైగా భక్తులు దేశవిదేశాల నుంచి తరలివస్తున్నారు. తాజాగా ఆలయంలో భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై అధికారులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు వారి సమస్యలను దుర్గగుడి ఈవో వి.కె. శీనానాయక్ దృష్టికి తీసుకురావొచ్చు. ప్రధానంగా దర్శనాల క్యూలైన్లు, ప్రసాదాల కౌంటర్లు, అన్నదానం, క్లోక్‌రూం, కేశఖండనశాల, చెప్పుల స్టాండ్లు, సెల్‌ఫోన్ కౌంటర్లు, స్నానఘాట్లు, ఆలయ ఉచిత బస్సులు సహా వేటికి సంబంధించిన సమస్యలున్నా ఈవో దృష్టికి తీసుకురావొచ్చు. దిగువ ఇచ్చిన ఫోన్ నంబర్‌కు నిర్ణీత సమయంలో ఫోన్ చేసి మీ సమస్యను తెలియజేస్తే.. ఆలయ ఈవో పరిష్కారాన్ని చూపిస్తారు. – ఈనాడు, అమరావతి

దుర్గగుడి ఈవో శీనానాయక్‌తో ఫోన్‌ఇన్ నేడు



73374 44081 | తేదీ: బుధవారం 16.7.2025 | సమయం: ఉదయం 11 నుంచి 12 వరకు

మునగ.. మురిపించునుగ.!

ఎకరానికి రూ.95వేల ఉచిత పెట్టుబడి సాయం

ఈనాడు, అమరావతి

జిల్లాలో మునగ రైతులకు మంచి రోజులొచ్చాయి. ప్రధాన పంటగా లేదా గట్ల వెంట అంతర పంటగా సాగు చేసేందుకు ఎన్టీఆర్ జిల్లా అధికారులు ప్రోత్సహిస్తున్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ద్వారా పైసా పెట్టుబడి లేకుండా ఎకరానికి రూ.3లక్షల వరకు ఆదాయం పొందేలా రైతులకు దన్నుగా నిలుస్తున్నారు.

పైసా పెట్టుబడి లేకుండా..

పత్తి, మిరప, మొక్కజొన్న కూరగాయలు పండించే రైతులు గట్ల వెంట ఎకరానికి రెండు వరుసల్లో 190 మొక్కలు వేస్తారు. దరఖాస్తు చేసిన రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా రెండేళ్లు రూ.32వేల ఉచిత పెట్టుబడి సాయం అందిస్తున్నారు. ప్రధాన పంటకు మునగ పంట ఆదాయం అదనం. ఒక వేళ ప్రధాన పంటలకు నష్టాలు వచ్చినా రైతును ఆదుకుంటుంది. మునగే ప్రధాన పంటగా వేస్తే ఎకరానికి 448 మొక్కలకు రెండేళ్లలో రూ.95 వేల పెట్టుబడి సాయం ఇస్తారు. భూమిని చదును చేసినందుకు రూ.2వేలు, విత్తన కొనుగోలుకు రూ.2వేలు, లేదా మొక్కకు 8 చొప్పున రూ.3,584 చెల్లిస్తారు. మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వితే నేలను బట్టి రూ.11వేల నుంచి రూ.14,300 వరకు ఇస్తారు. మొక్కలు నాటినందుకు మొక్కకు రూ.5.47 చొప్పున రూ.2451, ఎరువులు, కలుపు మందులకు మొక్కకు రూ.12 చెల్లిస్తారు. కాపలా పర్యవేక్షణకు 98 రోజులకు రూ.30వేలు ఇస్తారు.

వెయ్యి ఎకరాల్లో సాగు..

ఉద్యానానికి ఊతమివ్వాలన్న కూటమి సర్కారు లక్ష్యాన్ని ఎన్టీఆర్ జిల్లా అధికారులు మరింత ముందుకు తీసుకెళ్తున్నారు. మిగిలిన జిల్లాల్లో మునగ పంట లక్ష్యం 50 నుంచి 100 ఎకరాల లోపే ఉంది. జిల్లాలో మాత్రం వెయ్యి ఎకరాల సాగు లక్ష్యం పెట్టుకున్నారు. ఇప్పటికే 601 ఎకరాల్లో మునగ సాగు చేసేందుకు రైతులను గుర్తించారు. ఇబ్రహీంపట్నం, కంచికచర్ల, చందర్లపాడు, పెనుగ్రంచిప్రోలు, నందిగామ, గంపలగూడెంలో రైతులు ఎక్కువ మంది ఉన్నారు.



పెనుగంచిప్రోలులో కాయలు కోస్తున్న రైతులు

అంతరపంటగా వేస్తే ఎకరానికి రూ.1.5లక్షలు, ప్రధాన పంటగా వేస్తే రూ.3లక్షల వరకు ఆదాయం వస్తుంది. నాలుగు నెలల్లో కాపు మొదలు కావడంతో వేగంగా రైతుకు ఆదాయం మొదలవుతుంది. మునగ చెట్ల నీడ పడినా ఇతర పంటలకు నష్టం ఉండదు. మునగాకు రాలితే ప్రధాన పంటలకు ఎరువుగా మారుతుంది. కాయలతో పాటు ఆకులను అమ్ముకోవచ్చు. మునగ పంట నవంబరు, డిసెంబరులో వస్తుంది. పత్తి, మిరప సీజన్ మార్చి, ఏప్రిల్‌లో ఉంటుంది. మునగ అంతర పంటగా వేసినా రైతులకు ఇబ్బంది ఉండదు.

★ 'మునగ వల్లే అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. మార్కెటింగ్ సులభం. ఏటా పంట విస్తీర్ణం పెంచేందుకు ప్రయత్నం చేస్తాం' అని డ్వామా పీడీ రాము తెలిపారు.

ఎగదోసే వేగం.. పడదోసే ప్రాణం

నగరంలో హడలెత్తిస్తున్న ప్రమాదాలు

ఈనాడు, అమరావతి

వాహనంతో రోడ్డెక్కితే క్షేమంగా ఇంటికి తిరిగి వస్తామన్న నమ్మకం లేదు. ఎటువైపు నుంచి ఏ వాహనం ఢీకొంటుందో అని ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే. మనం ఎంత జాగ్రత్తగా ఉన్నా ఎదుటి వ్యక్తి అజాగ్రత్త ప్రమాదానికి కారణమవుతోంది. రోడ్డు రద్దీగా ఉన్నా.. ఖాళీగా ఉన్నా.. అతి వేగంతో ద్విచక్రవాహనాలు దూసుకుపోతుంటాయి. కార్లనూ అడ్డదిడ్డంగా నడుపుతున్నారు. అసలే చాలీచాలని రోడ్లు.. నిర్లక్ష్య డ్రైవింగ్ తోడై విజయవాడలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

నిర్లక్ష్యంగా నడపడంతోనే అనర్థాలు: ఇటీవల కాలంలో చోటుచేసుకుంటున్న ప్రమాదాలు అధికంగా ద్విచక్ర వాహనాల కారణంగా జరుగుతున్నాయి. ఆ తర్వాత భారీ వాహనాల వల్ల సంభవిస్తున్నాయి. తనిఖీలు చేసినప్పుడు మాత్రమే జరిమానాలు విధిస్తారు. మిగిలిన సమయాల్లో ఎవరూ పట్టించుకోరన్న ధీమా వాహనదారుల్లో నెలకొంటోంది.



ఇవే కారణాలు..

అతి వేగం:	60%
వాహనాలను అధిగమించే ప్రయత్నం	10%
తాగి నడపడం	20%
మొబైల్‌లో మాట్లాడుతూ నడపడం, బండి కండిషన్‌లో లేకపోవడం, వ్యతిరేక దిశలో నడపడం...	10%

★ యువకులు బైక్ రేసులు, ర్యాష్ డ్రైవింగ్ వంటి విన్యాసాలు చేస్తున్నారు. వీటికి ఇన్నర్ రింగ్ రోడ్డు, బీఆర్‌టీఎస్ రోడ్లు వేదికలవుతున్నాయి. చాలా మంది నిర్ణీత వయసు లేకుండానే వాహనాలను నడుపుతున్నారు. డ్రైవింగ్ లైసెన్సులూ ఉండడం లేదు.

★ సైడ్ స్టాండు అలాగే ఉంచి, బుల్లెట్ వాహనాలకు సైలెన్సర్లను తొలగించి పెద్ద శబ్దంతో ప్రమాదకరంగా నడుపుతున్నారు. ★ పరిమితి దాటేస్తున్నారు: అధిక వేగానికి అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం పరిమితిని నిర్దేశించింది. ద్విచక్ర వాహనాలు జాతీయ రహదారులపై 80 కి.మీ, నగర పరిధిలో 60 కి.మీ వేగం వరకు వెళ్లొచ్చు. ఆటోలు అన్ని రకాల రోడ్లపై 50 కి.మీ మించకూడదు. కార్లు జాతీయ రహదారులపై 100 కి.మీ, నగర పరిధిలో 70 కి.మీ వరకు వెళ్లొచ్చు. ఈ వేగ పరిమితిని వాహనదారులు మీరుతున్నారు. స్పోర్ట్స్ బైక్‌లపై నగరంలోనే 80 నుంచి 100 కి.మీ వేగంతో దూసుకెళ్తున్నారు.

మూడేళ్లలో కమిషనరేట్ పరిధిలో..

	ప్రమాదాలు	మరణాలు	గాయాలు
2023	1,522	376	1,412
2024	1,343	432	1,154
25 (జూన్)	589	201	512

★ రెండు వారాల కిందట కృష్ణలంకకు చెందిన యువకుడు వ్యక్తిగత పనిమీద బైక్‌పై గుంటూరు వెళ్లి తిరిగి వస్తూ వారధి దాటిన తర్వాత వేగం కారణంగా అదుపు తప్పి వంతెన పైనుంచి కిందపడి చనిపోయాడు.

★ గత నెలలో రామవరప్పాడు రింగ్ వద్ద మితిమీరిన వేగం ఇద్దరు యువకుల ప్రాణాలు తీసింది. అర్ధరాత్రి రోడ్డు మీద ఎవరూ లేకపోవడంతో ఏసు (20) ద్విచక్రవాహనం నడుపుతూ రోడ్డు దాటుతున్న తనుష్‌కుమార్(22)ను ఢీకొన్నాడు. ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. విజయవాడ ఆసుపత్రిలో ఉన్న పినతండ్రిని చూసి తనుష్ తిరిగి వెళ్తుండగా ఈ ఘటన జరిగింది.

కష్టపెట్టె నాడు.. కట్టిపెట్టె నేడు



గేట్లు కిందకి దిగక అడ్డుగా ఇసుక బస్తాలు(పాతచిత్రం)



మరమ్మతుల అనంతరం అమర్చారిలా..

గత వైకాపా పాలనలో నీటి పారుదల వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. వెలగలేరు బుడమేరు హెడ్ రెగ్యులేటర్ గేట్లు తుప్పుపట్టిపోగా కనీసం గ్రీజు పెట్టలేదు. లాకుల వద్ద గేట్లు ఎత్తాలన్నా దించాలన్నా పైకి, కిందికి కదిలే పరిస్థితి లేదు. దీనికి 11 గేట్లు ఉన్నాయి. గతేడాది వరద వచ్చే సమయానికి గేట్లు పైకి, కిందికి కదల్లేదు. దీంతో గేట్లపై నుంచి వరద నీరంతా ఒకేసారి వచ్చి పడడంతో కాల్వ గట్లు తెగిపోయి బుడమేరు పరిసర ప్రాంతాలు, విజయవాడలోని లోతట్టు ప్రాంతాలన్నీ మునిగిపోయి ప్రజలు నానా అవస్థలు పడ్డారు. వరద సమయంలో స్థానికులు, రైతుల సాయంతో గేట్లను మాన్యువల్‌గా ఎత్తి తర్వాత దించారు. వరద తగ్గాక మూడు గేట్లు కిందకి పూర్తిగా దిగకపోవడంతో వాటి కింద ఇసుక బస్తాలు ఉంచారు. కూటమి ప్రభుత్వం ఈ రెగ్యులేటర్‌కు రెండు నెలల నుంచి సుమారు కోటిన్నరతో మరమ్మతులు ప్రారంభించింది. గేట్లన్నీ తొలగించి, మరమ్మతులు చేయించి, రంగులు వేసి మళ్లీ అమర్చారు. –ఈనాడు, అమరావతి

నదుల అనుసంధాన ఆలోచనకు ఆద్యుడు కేఎల్ రావు

విజయవాడ(విద్యాధరపురం), న్యూస్‌టుడే: నదుల అనుసంధాన ఆలోచనకు ఆద్యుడు కేఎల్ రావు అని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. కేంద్ర మాజీ మంత్రి కేఎల్ రావు జయంతి పురస్కరించుకొని విజయవాడ దుర్గాఘాట్ సమీపంలోని ఆయన సమాధి వద్ద విగ్రహానికి మంగళవారం మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ శ్రీశైలం, నాగార్జునసాగర్, హీరాకుడ్ వంటి బహుళార్థక సాధక ప్రాజెక్టుల రూపకల్పనలో కేంద్ర మంత్రిగా నాడు ఆయన కృషి చిరస్మరణీయం అన్నారు. అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేయాలని నిర్ణయించారన్నారు. 2019 నాటికి 70 శాతం పూర్తయిన పోలవరం ప్రాజెక్టును వైకాపా ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. తెదేపా పాలనలో నదుల అనుసంధాన ప్రక్రియకు రూ.1300 కోట్లు వెచ్చించి పట్టిసీమ ఎత్తిపోతల పథకంతో గోదావరి, కృష్ణానదులను కలిపామన్నారు. ఈ పథకంతో రూ.90 వేల కోట్ల సంపదను సృష్టించిన ఘనత తెదేపాకు దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా విశిష్ట సేవలు అందించిన ఇంజినీర్లను ప్రభుత్వం తరఫున సత్కరించారు. కార్యక్రమంలో సాగునీటి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల గోపాలకృష్ణ, కృష్ణా తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ దేవబోయిన వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ అడ్మిన్ శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.



కేఎల్ రావు సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి నిమ్మల తదితరులు

కాలువలకు సాగు నీరు విడుదల

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టాలోని పంట కాలువలకు మంగళవారం 13,156 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 10,149, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 3,007 క్యూసెక్కులు ఇచ్చారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 5,017, ఏలూరు 1,511, బందరు 2,114, కేఈబీ (దివిసీమ) కాల్వకు 1,507 క్యూసెక్కుల చొప్పున నీటిని ఇస్తున్నారు.

ఎన్టీటీపీఎస్‌లో తనిఖీలు...?

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఎన్టీటీపీఎస్‌లో గ్రీన్ ట్రిబ్యునల్ సభ్యులు మంగళవారం పర్యటించి పలు చోట్ల తనిఖీలు నిర్వహించారు. ఎన్టీటీపీఎస్ మొదటి, రెండో దశల్లో ఈఎస్‌పీలు పాడవ్వడంతో కొన్ని నెలల నుంచి బూడిద రేణువులు నేరుగా జనావాసాల్లోకి చేరుకొంటున్నాయి. వీటిపై రెండేళ్లుగా స్థానికుల నుంచి అనేక ఫిర్యాదులు గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్లాయి. ఈ నేపథ్యంలో కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ డైరెక్టర్ మురళీకృష్ణ నేతృత్వంలో గ్రీన్ ట్రిబ్యునల్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పలు దశల్లో యూనిట్లను తనిఖీలు నిర్వహించారు. అయితే ఈ విషయంపై ఎన్టీటీపీఎస్ అధికారులు స్పందించకపోవడం గమనార్హం. కొందరు అధికారులు సమాచారం తెలియజేయడానికి నిరాకరించారు.

తెల్లార్లూ తూగుతున్నారు!

- గత నెలలో ఓ పబ్‌లో పోలీసుల లాఠీఛార్జి
- తాజాగా వెలుగులోకి సీసీ కెమెరా దృశ్యాలు

ఈనాడు, అమరావతి

అది.. జూన్, 14వ తేదీ శనివారం అర్ధరాత్రి దాటింది.. సమయం.. 2 గంటలు ప్రాంతం.. విజయవాడ బందరు రోడ్డులోని ఓ షాపింగ్ మాల్‌లోని పబ్.. రాత్రి గస్తీ తిరుగుతున్న కృష్ణలంక సీఐ నాగరాజు బృందానికి.. అక్కడ పది మంది పొట్టి దుస్తులు వేసుకున్న యువతులు, యువకులు కాపలాదారుడితో గొడవ పడుతున్న దృశ్యం కనిపించింది. అది గమనించి అక్కడకు వెళ్లిన పోలీసులు దానిపై వాకబు చేశారు. మూడో అంతస్తులో ఉన్న బార్‌లోకి అనుమతించాలని వాగ్వాదానికి దిగారని, కాపలాదారుడు పోలీసులకు వివరించాడు. 2 గంటల వరకు బార్ నడపటమేంటని అనుమానం వచ్చి పై అంతస్తుకి వెళ్లారు. అక్కడ.. మద్యం మత్తులో.. సంగీతం మధ్య దాదాపు 200 మంది వరకు యువతీ యువకులు చిందులు వేస్తున్నారు. వెంటనే పోలీసులు లాఠీలకు పనిచెప్పడంతో అందరూ పరారయ్యారు. అప్పటివరకు తీసుకున్న మద్యం, ఆహారానికి బిల్లులు కూడా చెల్లించకుండా తలోదిక్కుకు పారిపోయారు. దాదాపు రూ.2లక్షల వరకు బిల్లులు జమ కాలేదు. గత నెలలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి బార్‌లోని సీసీ కెమెరాలో నిక్షిప్తమైన పోలీసు లాఠీఛార్జి దృశ్యాలు మంగళవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. దీంతో ఇది బయటకు వచ్చింది.



పబ్‌లో లాఠీలు ఝుళిపిస్తున్న పోలీసులు

వేళాపాళలు లేవు.. నగరం మొత్తం 110 బార్లు, రెస్టారెంట్లు, నాలుగు పబ్‌లు ఉన్నాయి. చాలా వాటిల్లో వేళాపాళలు పాటించడం లేదు. నిబంధనల ప్రకారం బార్లు ఉదయం 10 నుంచి రాత్రి 11గంటల వరకు మద్యం విక్రయించేందుకు అనుమతి ఉంది. 12గంటల వరకు ఆహారం అందించేందుకు అనుమతిస్తారు. నిబంధనలు పాటించకుండా చాలా బార్లు ఉదయం నుంచే తెరుస్తున్నారు. జనావాసాల్లో ఉండేచోట మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. పలు బార్లు వారాంతాల్లో తెల్లవారుజామున 4గంటల వరకు నడుస్తున్నాయి.

నేరాలకు పథక రచన: నేరాలకు బీజం బార్లలోనే పడుతున్నట్లు విచారణలో తేలింది. మద్యం మత్తులోనే పలు నేరాలకు పథక రచన జరుగుతున్నట్లు గుర్తించారు. నగరంలో జరుగుతున్న 60 శాతం నేరాలకు బార్, రెస్టారెంట్లు కేంద్రాలుగా మారుతున్నాయని గుర్తించారు. మద్యం మత్తులో చోటు చేసుకుంటున్న చిన్న ఘర్షణలు తర్వాత.. చినికిచినికి దాడులు, హత్యలకు దారి తీస్తున్నాయి. వీటిపై నిఘా పెట్టడంలోనూ పోలీసులు విఫలమవుతున్నారు.

పట్టించుకోని పోలీసు, ఎక్సైజ్ శాఖలు

గతంలో నగర పోలీసులు బార్లు, రెస్టారెంట్ల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ప్రతీ రెస్టారెంట్‌కు ఐపీ చిరునామా ఉన్న సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రెస్టారెంట్ పార్కింగ్, లోపల, వెలుపల పరిసరాలు కనిపించాలని గట్టిగా చెప్పారు. అక్కడి కెమెరాల్లోని దృశ్యాలు నేరుగా కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేయనున్నట్లు ప్రకటించారు. గొడవలను ఆయా ప్రాంత పోలీస్‌స్టేషన్ల అధికారులకు తక్షణం తెలియజేయాలని ఆదేశించారు. ఆ తర్వాత పోలీసులు వీటిని గురించి అనుశీలన చేయకపోవడం, యాజమాన్యాలు కూడా పట్టించుకోకపోవడం మానేశాయి. ఎక్సైజ్ అధికారులు కన్నెత్తి చూడడం లేదు.


నేటితో ఇంజినీరింగ్ ప్రత్యేక కేటగిరీ కౌన్సెలింగ్ పూర్తి

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా వివిధ ట్రేడుల్లో ప్రవేశానికి సంబంధించి విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక కేటగిరీ కౌన్సెలింగ్ బుధవారంతో ముగియనుంది. మంగళవారం జరిగిన కౌన్సెలింగ్‌కు 434 మంది అభ్యర్థులు వచ్చి తమ ధ్రువీకరణ పత్రాలను పరిశీలన చేయించుకున్నారు. ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ విభాగాల్లో 1,50,001 నుంచి ఆఖరి ర్యాంకు వరకు పిలిచారు. ఎన్‌సీసీ విభాగంలో 162, క్రీడా విభాగంలో 112 మంది వచ్చారు. ఆర్మీ సంతతి విభాగంలో 1,00,001 నుంచి 1,50,000 ర్యాంక్ వరకు పిలవగా.. 160 మంది హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపల్ ఎం.విజయసారథి తెలిపారు. చివరి రోజు బుధవారం 16న ఆర్మీ విభాగంలో 1,50,001 నుంచి ఆఖరి ర్యాంకు వరకు, వికలాంగులు, ఆంగ్లో ఇండియన్, స్కౌట్స్ అండ్ గైడ్స్ కేటగిరీలో ఒకటి నుంచి ఆఖరి ర్యాంకు వరకు అభ్యర్థులు వచ్చి ధ్రువీకరణ పత్రాలు పరిశీలన చేయించుకోవాలని తెలిపారు.

17 నుంచి పాలిసెట్ తుది విడత కౌన్సెలింగ్

రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి ఈనెల 17వ తేదీ నుంచి తుది విడత కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. 17 నుంచి 19వ తేదీ వరకు ఫీజు చెల్లింపు, 18 నుంచి ధ్రువీకరణ పత్రాల పరిశీలన, 18 నుంచి 20వ తేదీ వరకు ఐచ్ఛికాలు పెట్టుకోవాలి. 21న సీట్ల కేటాయింపు ఉంటుంది. 24 నుంచి 26వ తేదీ వరకు ఆయా కళాశాలల్లో విద్యార్థులు చేరాలి.

18న ఉద్యోగ మేళా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే గద్దె తదితరులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, పటమట, న్యూస్‌టుడే: కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో ఈ నెల 18న విజయవాడ మొగల్రాజపురంలోని సిద్ధార్థ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) తెలిపారు. మంగళవారం నగరంలోని గురునానక్ కాలనీ ఎన్టీఆర్ భవన్‌లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి ఆయన ఉద్యోగ మేళా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ యువతకు సుస్థిర ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ✪ పదో తరగతి నుంచి బీటెక్, పీజీ పూర్తి చేసిన విద్యార్థులకు వారి విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు. ఉద్యోగ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు ముందుగా http://naipunyam.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99599 84226, 93477 79032 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆదరించాల్సిన తరుణమిదే..!

ప్లాట్లపై రుణాలు అందక రాజధాని రైతుల ఇక్కట్లు

ఈనాడు–అమరావతి, న్యూస్‌టుడే–తుళ్లూరు

రిటర్నబుల్ ప్లాట్లపై బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో తెదేపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన విధంగానే ఇప్పుడూ మంజూరు చేయాలని కోరుతున్నా బ్యాంకర్ల నుంచి స్పందన లేదు. వివిధ అవసరాల కోసం ప్లాట్లను తాకట్టు పెట్టి రుణం తీసుకుందామన్నా చుక్కెదురవుతోంది. అటు సేద్యం లేక, ఇటు కుటుంబ అవసరాల కోసం చేతిలో డబ్బుల్లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

సన్న, చిన్నకారు రైతులే ఎక్కువ

రాజధాని నిర్మాణానికి 34,385 ఎకరాల భూమిని సీఆర్డీఏ సమీకరించింది. రైతులతో ఒప్పందం మేరకు వారికి నివాస, వాణిజ్య ప్లాట్లను కేటాయించింది. భూములిచ్చిన వారిలో సన్న, చిన్నకారు రైతులే ఎక్కువమంది ఉన్నారు. ఎకరాలోపు 20,490 మంది ఇచ్చారు. ఒకటి నుంచి రెండెకరాల్లోపు ఇచ్చిన వారు 5 వేల మందికి పైగా ఉన్నారు. పిల్లల చదువులు, వివాహాలు, ఆరోగ్య అవసరాలు, ఇళ్ల నిర్మాణాలకు ప్లాట్లను తాకట్టు పెట్టి రుణాలు పొందేందుకు అన్నదాతలు బ్యాంకుల చుట్టూ తిరిగినా ఫలితం కనిపించడం లేదు. బిడ్డల ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు పంపాలన్నా చేతిలో చిల్లిగవ్వ లేక దిక్కుతోచని పరిస్థితి. పలువురు రైతులు వచ్చిన కాడికి ప్లాట్లను విక్రయించి పిల్లలను చదివిస్తున్నారు. ఇళ్ల నిర్మాణం, చిరు వ్యాపారాలకూ డబ్బుకు కటకటలాడాల్సిన పరిస్థితులు.



మార్గదర్శకాలు లేవంటూ...

వైకాపా అధికారంలో ఉన్న సమయంలో మూడు రాజధానుల వైఖరితో అమరావతి నిర్మాణ పనులు నిలిపేసింది. అప్పట్నుంచి బ్యాంకులు రుణాలివ్వడం లేదు. సీఆర్డీఏ ఉన్నతాధికారులను కలిసి సమస్యను వివరించినా బ్యాంకర్లతో మాట్లాడి పరిష్కరిస్తామని చెబుతున్నా ఫలితం కనిపించడం లేదు. ప్లాట్లపై రుణాల మంజూరులో తమకు మార్గదర్శకాలు లేవంటూ బ్యాంకర్లు పట్టించుకోవడం లేదు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ)లో సానుకూల నిర్ణయం తీసుకుంటేనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. మూడు నెలల క్రితం జరిగిన సమావేశంలో సీఆర్డీఏ వద్ద రిజిస్టర్ అయిన ప్లాట్లపై రుణాలివ్వాలని అధికారులు కోరినా ఇప్పటి వరకు కార్యాచరణ ప్రారంభం కాలేదు. మార్గదర్శకాలు కూడా ఇవ్వలేదు.

☛ వెంకటపాలేనికి చెందిన సాంబశివరావు.. 81.6 సెంట్ల భూమిని ఇచ్చారు. సీఆర్డీఏ ఆయనకు 810 చదరపుగజాల నివాస, 360 చదరపు గజాల వాణిజ్య ప్లాట్లను కేటాయించింది. పెద్ద కుమార్తెకు వివాహం చేయగా.. మరో కుమార్తె, కుమారుడు ఇంజినీరింగ్ చదువుతున్నారు. పిల్లల చదువులు, సొంతిల్లు నిర్మాణానికి రూ. 10 లక్షల అప్పు చేశారు. ప్రస్తుతం వ్యవసాయం లేక ఖాళీగా ఉంటున్నారు. ప్లాట్లు విక్రయిద్దామనుకున్నా మంచి ధర లేదు. సీఆర్డీఏ ఇచ్చిన ప్లాట్లపై బ్యాంకులో రుణం ఇవ్వకపోవటంతో అప్పులకు వడ్డీ చెల్లించలేని పరిస్థితి.

అప్పుల ఊబి నుంచి బయటపడతా

☛ శాఖమూరుకు చెందిన రాజు.. స్థానికంగా వెల్డింగ్ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఒక కుమార్తె 10వ తరగతి, మరొకరు 4వ తరగతిలో ఉన్నారు. పూలింగ్‌లో తండ్రి సుబ్బారావు, సోదరుడు శ్రీనివాసరావుతో కలిసి ఎకరా ఇచ్చారు. వెయ్యి చదరపు గజాల నివాస ప్లాట్‌ను గతంలో కుటుంబ అవసరాల కోసం తక్కువ ధరకు అమ్ముకున్నారు. ఇంకా 250 చదరపుగజాల వాణిజ్య ప్లాటు మిగిలింది. అప్పులు చేసి సొంతింటి నిర్మాణం చేపట్టారు. సమీప బంధువు వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 15 లక్షల అప్పు చేశారు. ఇంటి నిర్మాణం సగంలో నిలిచిపోయింది. ప్రస్తుతం భార్యతో పాటు కూలి పనులకు వెళ్తున్నారు. ప్లాట్‌పై రుణం ఇప్పిస్తే అప్పుల ఊబి నుంచి బయటపడతామంటున్నారు.

కూలుతున్నా చూడరు.. కట్టమన్నా కదలరు..



ధ్వంసమైన వారధిపై ప్రయాణాలు...



కుంగిన వంతెనపై తప్పని రాకపోకలు...

మండలంలోని హెచ్.ముత్యాలంపాడు వద్ద బుడమేరుపై నాలుగున్నర దశాబ్దాల కిందట నిర్మించిన వంతెన దుస్థితికి చేరింది. ఈ వంతెనకు దిగువున గత వైకాపా నాయకులు ఇసుక అక్రమ తోలకాలు చేయడంతో పునాదులు కదిలి 2022లో కుంగిపోయింది. దీంతో 2023లో తాత్కాలిక వంతెన పూర్తి చేసి రాకపోకలు పునరుద్ధరించారు. గతేడాది వరదలకు ఇది కాస్తా మరింత అధ్వాన స్థితికి చేరడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. మండలంలోని 5 గ్రామాల ప్రజలు జి.కొండూరు చేరుకోవడానికి.. మైలవరం నియోజకవర్గం విజయవాడ వెళ్లేందుకు దీనినే ఉపయోగిస్తారు. అంతేకాక ఇబ్రహీంపట్నం రింగ్ వద్ద ట్రాఫిక్ మళ్లిస్తే విజయవాడ వెళ్లాల్సిన భారీ వాహనాలు సైతం ఇటుగానే ప్రయాణిస్తుంటాయి. పడేలాగా ఉన్నా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో అధికారులు రూ.8.5 కోట్లతో శాశ్వత వంతెనకు ప్రతిపాదనలు సిద్ధం చేయగా గత ప్రభుత్వం ఎటువంటి నిధులు మంజూరు చేయలేదు. దీంతో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం దృష్టికి పరిస్థితి తీసుకెళ్లగా రూ. 10.5 కోట్లతో ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేశారు. ఈ విషయమై సంబంధిత సహాయక ఇంజినీర్‌ను వివరణ కోరగా నిధులు మంజూరైతే త్వరితగతిన వంతెన నిర్మాణం చేపట్టి రాకపోకలకు అవస్థలు తొలగిస్తామని చెప్పారు. **- ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే. జి.కొండూరు**

ఇసుక కొండలు

మండలంలోని కంచల మునేటి ఒడ్డున ఇసుక కుప్పలు కొండలను తలపిస్తున్నాయి. మునేటికి వరదొస్తే వర్షాకాలం ఇసుక కొరత రాకుండా గనుల శాఖ ముందస్తుగా ఇక్కడ భారీగా ఇసుక నిల్వ చేసింది. చాలా ఎత్తైన ఇసుక కుప్పలకు సీసీ కెమెరాలతో రక్షణ కల్పించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఆన్‌లైన్ ద్వారా ఇక్కడి స్టాకు పాయింట్‌లో ఇసుకను తరలిస్తారు. **- కంచల(నందిగామ గ్రామీణం), న్యూస్‌టుడే**



ఆగస్టులో ఆయిల్, మీల్ మేళా

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే :ఈనాడు, అమరావతి: అఖిల భారత సీడ్ క్రషర్స్ అసోసియేషన్, సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్ల అసోసియేషన్ సంయుక్తంగా ఆరో పత్తి విత్తనాలు, ఆయిల్, మీల్ మేళా-2025 కార్యక్రమాన్ని విజయవాడలో నిర్వహించనున్నాయి. ఆగస్టు 2, 3 తేదీల్లో జరిగే ఈ సదస్సును కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించనున్నారు. ఇందులో పత్తి గింజల ప్రాధాన్యం, వినియోగం, శాస్త్రీయ విధానాలు, పశుసంవర్ధక రంగంలో లాభాలపై చర్చించనున్నారు.

అక్షరమే స్ఫూర్తి.. అవస్థలు ఏపాటి?



ఈ పిల్లలను చూశారా.. బడికెళ్లాలంటే నిత్యం 10 కిలోమీటర్లు నడవాల్సిందే..దీనికి తోడు వాళ్లు పాఠశాలకు వెళ్లే రోడ్డు కూడా అధ్వానంగా ఉండడంతో అటుగా పయనించే వాహనదారులు కూడా పిల్లల అభ్యర్థనను సైతం నిరాకరిస్తుంటారు.. పైగా మరే ఇతర వాహనాలు కూడా అటు రాకపోకలు సాగించే పరిస్థితిలేదు...చేసేదేమీ లేక ఆ చిన్నారులు భారమైనా..ఆపసోపాలు పడుతూ సాగుతున్నారు. ఇదీ ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలంలోని కేతనకొండ గ్రామ శివారు మోడల్ కాలనీ విద్యార్థుల పరిస్థితి. ఆ ఊరి నుంచి పది మంది పిల్లలు నిత్యం 5 కి.మీ దూరంలో ఉన్న కాచవరం ప్రాథమిక పాఠశాలకు రాకపోకలు సాగిస్తున్నారు.. ఒక్కోసారి ఆ చిన్నారుల అవస్థలు చూడలేక ఆ బడి ఉపాధ్యాయులే వారిని తమ ద్విచక్ర వాహనాలపై ఇళ్ల వద్ద దింపి వస్తుంటారు. తాము దినసరి కూలీలమని.. ప్రత్యేక ప్రయాణ వాహనాలను ఏర్పాట్లు చేసుకోలేక పిల్లలను అలానే పంపిస్తున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లకు దూరంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం రవాణా ఛార్జీలు చెల్లించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం**

తల్లికి వందనం.. నిరుపేదలకు వరం

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజలకు తమ ప్రభుత్వం ఇచ్చిన అనేక హామీలను అమలు చేస్తున్నామని, తల్లికి వందనం పథకం పేదలకు వరమని రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ తెలిపారు. పాతబస్తీ 54వ డివిజన్‌లో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)తో కలిసి నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలు పారిశుద్ధ్య అవస్థలు, రోడ్లపై గుంతలను నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ...తల్లికి వందనం పథకం ద్వారా రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకే ఎక్కువ లబ్ధి చేకూరిందని, ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికి నగదు జమ చేశామని తెలిపారు. రానున్న నాలుగేళ్లలో ప్రజల ఆకాంక్షల మేరకు అభివృద్ధి జరుగుతుందని వివరించారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ...గత వైకాపా ప్రభుత్వం ముస్లిం మైనార్టీలను విస్మరించిందని, అనేక వర్గాల వారిని మోసం చేసిందన్నారు. పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతి పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అబ్దుల్ అకీబ్ హర్షద్, నాయకులు నాగుల్‌మీరా, ఎండీ ఫతావుల్లా, మైలపల్లి రాజు, షేక్.ఆషా, సోలంకి రాజుజైన్, తాజుద్దీన్, జాహీద్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం అందజేస్తున్న మంత్రి ఫరూఖ్, పక్కన ఎంపీ కేశినేని శివనాథ్, నాగుల్‌మీరా తదితరులు

నూతన విద్యావిధానంతో మెరుగైన ఫలితాలు

బెంజిసర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలనే లక్ష్యానికి అనుగుణంగా ప్రధానోపాధ్యాయులు పని చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు అన్నారు. నాయకత్వ లక్షణాల పెంపొందించుకోవడంపై జిల్లాలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మారిస్ స్టెల్లా కళాశాలలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. రెండో రోజైన మంగళవారం ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో మాట్లాడుతూ.. నూతన విద్యా విధానాల వల్ల మెరుగైన ఫలితాలు సాధించవచ్చుని తెలియజేశారు. నాణ్యమైన విద్యా బోధన చేస్తే, మంచి ఫలితాలు వస్తాయని, దాంతో ప్రభుత్వ బడుల్లో తమ పిల్లలను చేర్పించడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపుతారని అన్నారు. ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులతో మంచి సంబంధాలు కొనసాగుతాయని తెలిపారు. సెంట్రల్ ఎంఈవో విజయ రామారావు, సమగ్ర శిక్ష ఏఎంవో అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో సుబ్బారావు

మహిళల ఆధిపత్య పోరు.. స్టేషన్‌కు వెళ్లిన తీరు

విజయవాడ, న్యూస్‌టుడే: కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ పబ్‌లో ఇద్దరి మహిళల మధ్య ఆధిపత్య పోరు ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడి.. పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకొనేవరకు వెళ్లింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పటమటకు చెందిన గాయని పబ్‌కు వెళ్లేది. అదే పబ్‌కు పటమట ప్రాంతానికి చెందిన ఆమె స్నేహితురాలు కూడా వెళ్లేది. కొద్దిరోజులకు పబ్‌లో ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు మొదలైంది. రెండు నెలల కిందట వారి మధ్య గొడవ చోటుచేసుకుంది. మహిళలిద్దరూ మద్యం మత్తులో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దాంతో తన మెడలోని బంగారం గొలుసు గాయని దొంగిలించినట్లు ఆమె స్నేహితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు గాయనితో పాటు ఆమెకు సన్నిహితంగా ఉండే వ్యక్తిని స్టేషన్‌కు పిలిపించారు. పెద్ద మనుషుల మధ్యవర్తిత్వంతో స్నేహితురాలికి గాయనితో గొలుసు ఇప్పించారు. దాంతో వారి మధ్య వివాదం సద్దుమణిగింది. తనపై పోలీసులకు ఫిర్యాదు చేసిందన్న కోపంతో తన స్నేహితురాలిని కూడా పోలీస్ కేసులో ఇరికించాలని గాయని భావించింది. తన స్నేహితురాలి వద్ద పెద్ద సంఖ్యలో విదేశీ మద్యం ఉన్నట్లు వేరే వారితో గాయని టాస్క్‌ఫోర్స్ పోలీసులకు ఫిర్యాదు చేయించింది. ఫలితంగా ఆ మహిళ ఇంటిపై పోలీసులు దాడులు చేశారు. మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేశారు.

చంపుతానని బెదిరింపులు..

గాయని.. తనకు సన్నిహితంగా ఉండే వ్యక్తి సహకారంతో తనను చంపుతానని బెదిరిస్తోందని ఆమె స్నేహితురాలు సీపీని ఆశ్రయించింది. సీపీ ఆదేశాల మేరకు కృష్ణలంక పోలీసులు గాయనితో సన్నిహితంగా ఉండే వ్యక్తిని స్టేషన్‌కు పిలిపించారు. గాయని స్నేహితురాలిపై దాడి జరిగితే బాధ్యత వహించాలని అతన్ని మందలించారు. అదే సమయంలో కొత్తపేట ప్రాంతానికి చెందిన మహిళ కృష్ణలంక పీఎస్‌కు వచ్చింది. తన భర్త (గాయనికి సన్నిహితంగా ఉండే వ్యక్తి) వేరే మహిళను వివాహం చేసుకుని తనను మోసగించాడని, తన వద్ద రూ.70 లక్షల నగదు, బంగారం తీసుకున్నాడని చెప్పింది. కొత్తపేట పీఎస్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలని కృష్ణలంక పీఎస్ పోలీసులు మహిళకు సూచించారు. ఈ నేపథ్యంలో గత నెలలో గాయని మహిళా పీఎస్‌కు వెళ్లింది. తనకు సన్నిహితంగా ఉన్న వ్యక్తి తనను బెదిరించి రెండో పెళ్లి చేసుకున్నట్లు ఫిర్యాదు చేసింది. గాయని వైఖరిపై అనుమానం వచ్చిన పోలీసులు విచారణ చేపట్టారు. ఆమె గతంలో కొంతమందిని పెళ్లి చేసుకుని మోసానికి పాల్పడినట్లు నిర్ధారించారు. ఈ వ్యవహారాల్లో రాజకీయ జోక్యం ఉండడంతో విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచినట్లు సమాచారం.

లయన్స్ క్లబ్, అమ్మా సంస్థల దాతృత్వం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : విజయవాడ మహానగర్ లయన్స్ క్లబ్, ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మా) సంస్థలు దాతృత్వం చూపాయి. పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మక పీ-4 విధానం కింద బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ముందుకు వచ్చాయి. మహానగర్ లయన్స్ క్లబ్ 245 కుటుంబాలను, అమ్మా అసోసియేషన్ 180 కుటుంబాలను దత్తత తీసుకోనున్నాయి. సదరు బంగారు కుటుంబాలకు తాము మార్గదర్శకులుగా వ్యవహరిస్తామని నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ జి.లక్ష్మీశకు మంగళవారం ప్రతిజ్ఞ పత్రాలు అందజేశాయి. మహానగర్ లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ లంగడ భాస్కరరావు, జోన్ చైర్‌పర్సన్ ఎన్.వి.గుప్తా, కార్యదర్శి ఎల్.నాగలక్ష్మి, పాస్ట్ ప్రెసిడెంట్లు ఎ.లక్ష్మణరావు, కందుల నాగేశ్వరరావు, అమ్మా అసోసియేషన్ అధ్యక్షుడు గారపాటి సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సుంకర చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు దేవినేని దుర్గాప్రసాద్, జి.వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మీ మార్గదర్శకత్వంలో పేదలకు మేలిమి బంగారమన్నారు. ఇప్పటి వరకు సుమారు 1,500 మంది మార్గదర్శకులుగా నమోదైనట్లు ఆయన తెలిపారు.



ప్రతిజ్ఞ పత్రాలను కలెక్టర్ లక్ష్మీశకు అందజేస్తున్న విజయవాడ మహానగర్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు, అమ్మా అసోసియేషన్ ప్రతినిధులు

2029 నాటికి పేదరిక నిర్మూలనే లక్ష్యం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : పేదరిక నిర్మూలనకు ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజా భాగస్వామ్యం (పీ-4) విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక అధికారులు కృషి చేయాలని కలెక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. 2029 నాటికి ఈ లక్ష్యం సాధించాలని పేర్కొన్నారు. నగరంలోని కలెక్టరేట్‌లో ఏడు నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, స్వర్ణాంధ్ర పీ-4 ఫౌండేషన్ జిల్లా చాప్టర్ సభ్యులతో మంగళవారం కార్యశాల నిర్వహించారు. శూన్య పేదరికం-పీ4, జిల్లా, నియోజకవర్గాల దార్శనిక ప్రణాళికలు, కీలక ప్రగతి సూచికలు, జనాభా నిర్వహణ విధానం (పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ)పై చర్చించారు. సీఎం చంద్రబాబు దార్శనికతకు నిదర్శనమైన పీ-4 విధానం అమలుపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని సూచించారు. 30 శాఖల పరిధిలో 523 కీలక ప్రగతి సూచికలు (కేపీఐ) ఉన్నాయని, వీటిలో పురోగతి సాధనే ప్రగతికి కొలమానం అన్నారు. ఉదాహరణకు పశుసంపద, పాడి అభివృద్ధి, మత్స్య శాఖల్లో 28 ప్రగతి సూచికలు ఉన్నాయని వివరించారు. ఈ నెల 18 నుంచి వచ్చే నెల 5 వరకు గ్రామ సభల నిర్వహణ, అవసరాల మదింపు సర్వే, నూతనంగా చేర్చిన అంశాలపై పీ-4 ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ యూనిట్ (పీఎంయూ) కన్సల్టెంట్ సంతోష్ కుమార్ వివరించారు. సీపీవో వై.శ్రీలత, గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా అధికారిణి జి.జ్యోతి, ఆయా నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

మరోసారి వ్యవసాయ సహాయకుల సస్పెన్షన్

ఆలస్యంగా వెలుగులోకి

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని పుల్లూరులో వైకాపా ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న పంట నష్టపరిహారంలో అక్రమాలకు బాధ్యులైన ఇద్దరు గ్రామ వ్యవసాయ సహాయకులను మరోసారి సస్పెండ్ చేసిన వైనం మంగళవారం వెలుగులోకి వచ్చింది. అక్రమాలను 2021లో 'ఈనాడు' వెలుగులోకి తీసుకు రాగా.. అప్పట్లో వ్యవసాయాధికారిగా ఉన్న సంజీవ్‌కుమార్, సహాయకులు జమలయ్య, వంద, వీఆర్వో శ్రీనివాసరెడ్డిలను సస్పెండ్ చేశారు. విచారణలో ఉండగా, సస్పెండైన వారికి కొన్నాళ్లకు వేరే ప్రాంతాల్లో తిరిగి పోస్టింగులు ఇచ్చారు. సుమారు రూ. కోటికి పైగా అక్రమంగా రైతుల ఖాతాల్లోకి వెళ్లాయని, అందుకు ఈ-క్రాప్ నమోదులో చోటుచేసుకున్న అవకతవకలే కారణమని అధికారులు నిర్ధారించారు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మరోసారి ఇద్దరు సహాయకులను సస్పెండ్ చేయాలంటూ నాలుగు నెలల కిందట వ్యవసాయశాఖ కమిషనర్ నుంచి స్థానిక అధికారులకు ఆదేశాలు అందగా.. ఈ నెల 4న ఏడీఏ శ్రీనివాస్ ఇద్దరు సహాయకులను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. సుదీర్ఘకాలం తర్వాత చోటుచేసుకున్న సస్పెన్షన్ వ్యవహారం, వ్యవసాయశాఖలో సంచలనంగా మారడంతో విషయం ఉన్నతాధికారుల దృష్టిలో ఉందని, ఇటీవల ఆదేశాలు అమలు చేసినట్లు ఏడీఏ తెలిపారు.

2020లో సంభవించిన వర్షాలతో దెబ్బతిన్న పత్తి పంటకు సంబంధించి, 2021లో రైతులకు పరిహారాన్ని అందించారు. ఆయా గ్రామాల్లో గతంలో, ప్రస్తుతం పోటా నాయకులుగా చెలామణి అవుతున్న కొందరు, రైతుల నుంచి పత్తి కొనుగోలు చేసి, వారికి తెలియకుండా ఈ-క్రాప్ నమోదు చేయించుకున్నారు. కొంతమంది మామిడి, పామాయిల్ తోటలను సైతం పత్తి పంట వేసినట్లుగా చూపి, పరిహారం నొక్కేశారు. సుమారు రూ.6 లక్షల వరకు మాత్రమే రికవరీ చేయగలిగారు.

దుర్గగుడి సెక్యూరిటీ ఉద్యోగిపై దాడి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: టోల్‌గేట్ నుంచి కారును దుర్గగుడి ఘాట్ రోడ్డులోకి అనుమతించలేదన్న కోపంతో పదిమంది యువకులు సెక్యూరిటీ ఉద్యోగిపై దాడి చేసిన ఘటన మంగళవారం జరిగింది. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన ముగ్గురు యువకులు కారులో దుర్గగుడికి వచ్చారు. దీంతో ఘాట్ రోడ్డులో పార్కింగ్ చేసేందుకు స్థలం లేదని కనకదుర్గానగర్ వైపు వెళ్లమని సెక్యూరిటీ గార్డు చెప్పారు. దీంతో వారి మధ్య మాట మాట పెరిగింది. సదరు ముగ్గురు యువకులు తిరిగి తాడేపల్లి వెళ్లి పదిమంది యువకులతో కలిసి వచ్చి సదరు సెక్యూరిటీ గార్డుపై దాడి చేశారు. ప్రాణభయంతో ఆంజనేయస్వామి గుడి వరకు పరిగెత్తినా వెంటపడి మరీ దారుణంగా కొట్టారు. అడ్డువచ్చిన హోంగార్డు, సెక్యూరిటీ సిబ్బందిని పక్కకు నెట్టేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన సెక్యూరిటీ గార్డు వన్‌టౌన్ పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోకుంటే టోల్‌గేటు వద్ద ఉద్యోగం చేయలేమని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. సెక్యూరిటీ గార్డుపై దాడిచేసిన వ్యక్తిని తప్పించేందుకు అతడి వెంట వచ్చిన వారు రాజకీయంగా ఒత్తిడి తీసుకురావడంతో కేసు నమోదు చేయలేదని సమాచారం.



సిబ్బందిపై చేయి చేసుకుంటున్న తాడేపల్లి యువకులు

ఎరువులు, విత్తనాల దుకాణాల్లో తనిఖీలు

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామలోని ఎరువులు, విత్తనాలు, పురుగుల మందు దుకాణాల్లో మంగళవారం రాష్ట్ర స్థాయి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. దుకాణాల్లో రికార్డులు పరిశీలించారు. అనంతరం గోదాముల్లో స్టాక్ నిల్వలు తనిఖీ చేసి అక్రమాలను గుర్తించారు. స్థానిక వెంకటసాయి విత్తనాల దుకాణంలో జీరో ఫారమ్ లైసెన్స్ నమోదు లేని విషయాన్ని గుర్తించారు. దీంతో రూ.8.37 లక్షలు విలువ చేసే 31.5 మెట్రిక్ టన్నుల ఎరువుల విక్రయాలను నిలిపివేయాలని ఆదేశించారు. అదేవిధంగా బాలాజీ మిత్ర సీడ్స్ దుకాణంలో పురుగుల మందు నిల్వ రిజిస్టరు, డిస్‌ప్లే బోర్డు లేకపోవడాన్ని గుర్తించారు. దీంతో రూ.63,62,807 విలువ చేసే 3747 లీటర్ల విక్రయాలను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అధికారులు తనిఖీలు చేస్తుండటంతో ఆయా దుకాణాల వ్యాపారులు అప్రమత్తమై దుకాణాలను మూసివేశారు. దీనిలో స్క్వాడ్ బృందం ఏడీఏ వి.హనుమంతురావు, సహాయ సంచాలకులు ఐ.కె.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి జి.నాగేశ్వరరావు, టెక్నికల్ ఏవో కె. వెంకటేశ్వరరావు, స్థానిక ఏవో ఖాసీం తదితరులు పాల్గొన్నారు.



గోదాములో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశ్వరరావు


విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం

ఫ్లెక్సీ కడుతుండగా ఘటన

పెనమలూరు, న్యూస్‌టుడే: ఫ్లెక్సీ కడుతుండగా ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయాడు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బలంత ప్రమోద్(19) కానూరులో ఉంటున్నాడు. ఇతను విజయవాడ మాచవరం వద్ద ఉన్న ఎస్ఆర్ఆర్ కళాశాలలో ద్వితీయ ఇంటర్ చదువుతున్నాడు. ఖాళీగా ఉన్న సమయాల్లో ఫ్లెక్సీ, బ్యానర్లు కడుతూ కుటుంబానికి చేదోడుగా ఉంటున్నాడు. సోమవారం రాత్రి పోరంకి కూడలిలో ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తుండగా పెద్దగా గాలి వీచింది. దీంతో ఫ్లెక్సీ బోర్డు పక్కనే ఉన్న విద్యుత్తు తీగలపై పడింది. అప్పటికే ప్రమోద్.. ఫ్లెక్సీకున్న ఇనుపచువ్వ పట్టుకొని ఉండడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. తండ్రి ప్రకాశ్ కానూరులో ఓ అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తుంటారు. తల్లి గృహిణి కాగా.. ప్రమోద్‌కు ప్రవల్లిక అనే సోదరి ఉంది. వీరి కుటుంబం బతుకు దెరువు కోసం ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం శనగపాడు గ్రామం నుంచి ఇక్కడకు వచ్చింది. చేతికందొస్తాడనుకున్న కుమారుడు ఇలా మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కుటుంబ సభ్యులు మంగళవారం పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లక్నో జాతీయ శాస్త్రీయ అధ్యయన సదస్సులో నెట్టెం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : ఆప్కాబ్ ఆధ్వర్యంలో లక్నోలో మంగళవారం ప్రారంభమైన మూడు రోజుల జాతీయ స్థాయి శాస్త్రీయ అధ్యయన సదస్సులో కేడీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురాం పాల్గొన్నారు. నాబార్డ్ అనుబంధ సంస్థ అయిన బ్యాంకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(బర్డ్)లో ఈ సదస్సు జరిగింది. నాయకత్వం, సామర్థ్యం, బోర్డు, కమిటీల బాధ్యతలపై జరిగిన చర్చల్లో నెట్టెం పాల్గొన్నారు. అనంతరం ఆయన అక్కడ ప్రముఖ చేపల జన్యు పరిశోధనా కేంద్రాన్ని సందర్శించి మత్స్య పరిశ్రమలో తాజా విధానాలపై అధ్యయనం చేశారు. వ్యవసాయ సహకార బ్యాంకుల ద్వారా సమకాలీన రంగాలపై మరింత కృషి చేసేందుకు ఈ సదస్సు ఉపయోగకరమని నెట్టెం అభిప్రాయం వ్యక్తం చేశారు.



చేపల పెంపకాన్ని పరిశీలన చేస్తున్న రఘురాం తదితరులు

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరి మృతి

చందర్లపాడు, న్యూస్‌టుడే: ముప్పాళ్ల సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇంద్రకంటి కాశీ(30) మృతి చెందగా మరో విద్యార్థికి గాయాలయ్యాయి. ఎస్సై దుర్గామహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్లపాడు గ్రామానికి చెందిన కనిశెట్టి నాగసాయి, తండ్రి కొండ, కుమారుడు పవన్‌సాయిలు నందిగామ నుంచి తుర్లపాడుకు, నందిగామ ముక్కపాటి కాలనీకి చెందిన కాశీ ముప్పాళ్ల నుంచి నందిగామకు ద్విచక్ర వాహనాలపై వెళుతుండగా ముప్పాళ్ల సమీపంలో ఢీకున్నాయి. ఈ సంఘటనలో కాశీ మృతి చెందగా పవన్ సాయి చేయి విరిగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో/కి రూ.లలో)

నెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -94 రిటైల్ ధర 116 చికెన్ విత్ స్కిన్ - 168, చికెన్ స్కిన్‌లెస్ - 191.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 99, 107, 118 చికెన్ విత్ స్కిన్ - 190 చికెన్ స్కిన్‌లెస్ - 200.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 515 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ, ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్‌పై విచారణ

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: విజయవాడ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ నాగేశమ్మపై శాఖాపరమైన విచారణకు డీఎంఈ నరసింహం మంగళవారం ఆదేశాలిచ్చారు. ఆమె కర్నూలు నుంచి ఎనిమిది నెలల కిందట ఉద్యోగోన్నతిపై విజయవాడ వచ్చారు. తరువాత ఆమెపై అనేక ఆరోపణలు వచ్చినట్లు తెలిసింది. విద్యార్థినులు ఆమెపై ప్రభుత్వానికి, వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. వారి నుంచి నగదు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రస్తుతం కళాశాలలోనే ఆమె నివాసం ఉంటున్నారు. కానీ బయట ఉంటున్నట్లు ప్రభుత్వం నుంచి బిల్లులు పొందుతున్నారని తెలిసింది. పలువురు విద్యార్థినులను దుర్భాషలాడి.. వేధిస్తున్నట్టు ఫిర్యాదులున్నాయి. విద్యార్థినులు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదులు చేశారు. ఆ ఫిర్యాదులు డీఎంఈకి సైతం రావడంతో ఆమెపై విచారణకు కమిటీని నియమించారు. కమిటీ సభ్యులు మంగళవారం విద్యార్థినులను విచారించారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

• పట్టణంలోని 7వ సచివాలయం పరిధిలో 12వ వార్డులో పీటీ కొత్తూరు వద్ద రహదారి పక్కన పిచ్చి మొక్కలు, చెత్త ఉండని, డ్రెయినేజీలో తీసిన పూడికతో అపరిశుభ్రత ఉందని స్థానికులు మేమున్నాం...మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును పురపాలిక కమిషనర్ మనోజ దృష్టికి తీసుకెళ్లాం. ఆమె స్పందించి పురపాలిక కార్మికులతో పూడిక మట్టి, చెత్త, పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రం చేయించారు.


చెత్త తొలగిస్తున్న పురపాలిక కార్మికులు

• పట్టణంలోని 9వ సచివాలయం పరిధిలో 17వ వార్డులో సాయిబాబా గుడి వీధిలో రహదారిపై చెత్త ఉందని స్థానికులు మేమున్నాం...మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లాం.. ఆయన స్పందించి పురపాలిక కార్మికులతో రహదారిపై చెత్త తీయించారు.

• పట్టణంలోని 8వ సచివాలయం పరిధిలో 14వ వార్డులో రైస్ మిల్లు రోడ్డులో మురుగు నీరు పారుదల కాల్వలో పూడిక ఉందని, పిచ్చి చెట్లు పెరిగాయని స్థానికులు మేమున్నాం... మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లాం.. ఆయన స్పందించి పురపాలిక కార్మికులతో పిచ్చి మొక్కలను, డ్రెయినేజీలో పూడిక తొలగించారు. - న్యూస్‌టుడే, తిరువూరు

బోరు మరమ్మతులు చేశారు



వెల్లటూరు శివారు చీమలపాడులో పంచాయతీ బోరు మరమ్మతులకు గురై నీటి సరఫరా నిలిచిపోయిందని స్థానికులు సమస్యను 'న్యూస్‌టుడే'కి చెప్పారు. ఈ విషయాన్ని కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి సిబ్బందితో మంగళవారం మరమ్మతులు చేయించి నీటి సరఫరా పునరుద్ధరించారు. దీంతో ఆ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేశారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు

పూడిక తొలగింపు



స్థానిక పంచాయతీలోని కమ్మర బజార్‌లోని డ్రెయినేజీలో మురుగు నీటి పారుదల సక్రమంగా జరగడం లేదని స్థానికులు మేమున్నాం...మీకు తోడుగా దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావుకు తెలియజేయగా సిబ్బంది పంపి మంగళవారం మురుగు కాల్వలో పూడిక తీత చేయించారు. - న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

వీఆర్వోలకు ఘనంగా సన్మానం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలుగా పని చేస్తూ బదిలీపై మైలవరం మండలానికి వెళ్తున్న శ్రీను, జానీసాహెబ్, ధనలక్ష్మిలను మంగళవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె.సుశీలాదేవి, డీటీ సతీష్ కుమార్, ఆర్ఐ జి.పుల్లయ్య, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకా తిరుమలకు బస్సు ఏర్పాటు

మైలవరం, న్యూస్‌టుడే: ద్వారకా తిరుమల దేవస్థాన ఛైర్మన్ ఎన్వీ సుధాకరరావు (ఎన్వీఎస్) సూచనల మేరకు మైలవరం నుంచి ద్వారకా తిరుమల వరకు ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసినట్లు ఆయన కార్యాలయ వర్గాలు తెలిపారు. ఇబ్రహీంపట్నం డిపోకు చెందిన బస్సు ప్రతి రోజు ఉదయం 6 గంటలకు మైలవరంలో బయలుదేరి 9.30 గంటలకు చేరుకుంటుందని పేర్కొన్నారు. తిరిగి మధ్యాహ్నం 2.40 గంటలకు ద్వారకా తిరుమలలో బయలుదేరి సాయంత్రం 6 గంటలకు మైలవరం చేరుకుంటుందని వివరించారు. దేవస్థాన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బర్డ్ ఆస్పత్రిలో ఎముకలు, కీళ్లు, అంగవైకల్యం, మోకాళ్ల శస్త్ర చికిత్సలను తక్కువ రుసుముతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అతిథి అధ్యాపకుడి నియామకానికి దరఖాస్తులు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని కంభంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గణిత శాస్త్రానికి అతిథి అధ్యాపకుడి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జి.యూసీఫ్ మంగళవారం తెలిపారు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి 50 శాతం మార్కులు ఎమ్మెస్సీ గణితంలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు 18వ తేదీ లోపు దరఖాస్తులను కళాశాలలో అందజేయాలన్నారు. 19న ఉదయం సదరు అభ్యర్థులకు ముఖాముఖీ నిర్వహిస్తామన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలో 11 కేవీ ఫీడర్లలో మరమ్మతుల నేపథ్యంలో బుధవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బైపాస్ రోడ్డు, ఎన్నెస్పీ కాలనీ, గుళ్లపల్లి ఎన్‌క్లేవ్, ప్యాలెస్ సెంటర్, హెడ్‌ఏపీఎస్ బ్యాంకు ప్రాంతం, సుందరయ్య కాలనీ, చింతల కాలనీ, దారా పూర్ణయ్య టౌన్‌షిప్, శాంతినగర్, జూపూడి చర్చి, సూర్యా రెస్టారెంట్, కొత్త కాలనీ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

మేడూరు(గంపలగూడెం): మండలంలోని మేడూరు భ్రమరాంబిక సమేత రామలింగేశ్వర స్వామి గుడిలో మంగళవారం అర్చకులు బాదం పూడి రామలింగప్రసాద్ ఆధ్వర్యంలో శివపార్వతుల ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. పలువురు దంపతులు పాల్గొన్నారు.

అర్హులందరూ అర్జీలు ఇవ్వాలి


కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, రైతులు

గానుగపాడు, కొత్తూరు(తిరువూరు), న్యూస్‌టుడే: మండలంలోని గానుగపాడు, కొత్తూరు గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయాధికారిణి పి.పద్మ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరిలో కలుపు, నీటి యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. పత్తిలో రసం పీల్చు పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత కలిగిన రైతులు జాబితాలో పేర్లు లేకపోతే వెంటనే రైతు సేవా కేంద్రాల్లో అర్జీ ఇవ్వాలన్నారు. ఏఈవో జి.లక్ష్మీకుమారి, వీపీఏలు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను పంపిణీ చేయాలి

తిరువూరు, న్యూస్‌టుడే: మండలంలోని పీటీ కొత్తూరు సమీపంలో ఏళ్ల కిందట నిర్మించిన టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు పంపిణీ చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం టిడ్కో ఇళ్లను పరిశీలించిన నాయకులు పి.శ్రీనివాసరావు, బి.ప్రకాశరావు, జీవరత్నం, యు.లక్ష్మణరావు విలేకర్లతో మాట్లాడారు. 2014-19లో ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టి 70 శాతం పనులు పూర్తి చేశారన్నారు. 2019-24 వరకు అధికారంలో ఉన్న వైకాపా ప్రభుత్వం పూర్తి చేయకుండా తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం.. ప్రశ్నార్థకంగా ప్రజారోగ్యం

● ప్రబలుతున్న వ్యాధులు ● సమన్వయం లేని వ్యవస్థలు

కొండపల్లి, న్యూస్‌టుడే

వ్యాధుల కాలం వచ్చేసింది. వర్షాకాలంతో పాటు వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకోవడం, వారంలో రెండు రోజులు విపరీత ఎండలు, మరో మూడు రోజులు వర్షాలు పడడంతో సీజనల్ జ్వరాలతో పాటు అనేక వ్యాధులు విజృంభిస్తున్నాయి. కొండపల్లి పురపాలిక పరిధిలోని రెండు పీహెచ్‌సీలకు తోడు రెండు అర్బన్ క్లినిక్‌లు ఉన్నాయి. ఈ సమయంలో వైద్య, పురపాలిక వ్యవస్థలు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాల్సిన అవసరం ఉన్నా.. అది ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో ఇంజినీరింగ్ సహాయక సిబ్బంది ఇప్పటికే మూడు రోజుల నుంచి సమ్మెలోకి వెళ్లడం గమనార్హం. దీంతో ఇతర పారిశుద్ధ్య సిబ్బందిపైనే పని భారం పెరిగి పారిశుద్ధ్యం దారుణంగా ఉంటున్నది. దీనికి తోడు తాగునీటి వ్యవస్థ నిత్యం కలుషితంగా మారింది.


కొండపల్లి పురపాలికలోని 5వ డివిజన్ రహదారిపై వ్యర్థాలు


ప్రత్యేక డంపింగ్ యార్డ్ లేక అడవి క్వారీ ప్రాంతంలో చెత్త పోస్తున్న ట్రాక్టర్

కేసుల వివరాలు	జూన్‌లో (రోజుకు)	నిన్నటి వరకు
ఇబ్రహీంపట్నం	180 నుంచి 200	200 నుంచి 220
కొండపల్లి	150 నుంచి 160	180 నుంచి 200

కొరవడిన పర్యవేక్షణ

దాదాపు లక్ష మంది నివాసముంటున్న పురపాలికకు పారిశుద్ధ్య అధికారి లేకపోవడం గమనార్హం. రెండేళ్ల కిందట పారిశుద్ధ్య అధికారి సుధాకర్ బదిలీ అయ్యారు. ఆ తరువాత ఆ పోస్టు నేటికీ భర్తీ కాలేదు. ప్రస్తుతం మేనేజర్‌గా ఉన్న వ్యక్తి డిప్యుటేషన్‌పై అప్పుడప్పుడు విధులు నిర్వహిస్తున్నారు. పారిశుద్ధ్య, ఇతర పనులకు మొత్తం పురపాలికలో 180 మంది ఉండగా వారిలో 30 మంది సమ్మెలో ఉన్నారు. 150 మంది రెండు ప్రాంతాల్లో శానిటేషన్ పనులు చేస్తున్నారు. పారిశుద్ధ్య మేస్త్రీలు సైతం సమ్మెలో ఉన్నారు.

తాగునీరు అనేక కలుషితం

గడిచిన మూడు నెలల్లో ఎనిమిది సార్లు కుళాయిల ద్వారా వచ్చే తాగునీటిలో బురద కలవడం గమనార్హం. పురపాలికలోని 40 శాతం ప్రజలు ఈ నీటినే తాగుతున్నారు. సిబ్బంది కొరతతో వాటర్ స్టోరేజ్ ట్యాంకులు అప్పుడప్పుడు మాత్రమే శుభ్రం చేస్తున్నారు.

సిబ్బంది కొరత కొంత ఇబ్బంది

పురపాలికలో పారిశుద్ధ్య అధికారిగా డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నాను. సిబ్బంది కొరత ఉన్నా దాదాపుగా పారిశుద్ధ్య పనులు సక్రమంగానే చేస్తున్నాం. సమస్య తెలిసిన వెంటనే స్పందిస్తున్నాం. - వెంకటరత్నం, మేనేజర్

పరిస్థితి గమనిస్తున్నాం

సీజనల్ వ్యాధులు వస్తున్నాయి. ఇప్పటికే వీటిపై ఏఎన్ఎంలు సర్వేలు నిర్వహిస్తూ పారిశుద్ధ్య అధికారులకు పరిస్థితిని తెలియజేస్తున్నారు. దోమలు తీవ్రమైన ప్రాంతాలను వారికి వివరిస్తున్నారు. డ్రైనేజ్ నిర్వహించాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పరిస్థితి అదుపులోనే ఉంది. - రాథోడ్, వైద్యుడు

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

ఉమ్మడివరపల్లి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని ఉమ్మడివరపల్లిలో మంగళవారం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. స్థానిక తెదేపా నాయకులతో కలిసి ఇంటింటికీ పర్యటించి ఏడాది కాలంలో ఎన్డీయే ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలు పంపిణీ చేశారు. అంతకుముందు గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు.


కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

కొండపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రతి ఇల్లు సుభిక్షంగా ఉండాలని కూటమి ప్రభుత్వం సుపరిపాలన చేస్తుందని నాయకులు సీతారామయ్య అన్నారు. కొండపల్లి పురపాలికలోని 5వ డివిజన్‌లో సుపరిపాలన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్-6 హామీలు తప్పకుండా నెరవేరుస్తూ అర్హులైన వారికి పథకాలను అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు ధారు నాయక్, పురపాలిక వైస్ ఛైర్మన్ శ్రీను, కౌన్సిలర్ గోపాలరావు, నాయకులు శ్రీనివాసరావు, నెహ్రూ, కోటేశ్వరరావు, అఫ్సర్, రాము తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను అందిస్తున్న తెదేపా సీనియర్ నాయకులు

నదుల అనుసంధానానికి కేఎల్‌రావు నాంది


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఉమామహేశ్వరరావు, నాయకులు

గొల్లపూడి, న్యూస్‌టుడే: ఐదు దశాబ్దాల కిందటే నదుల అనుసంధానానికి ప్రముఖ ఇంజినీర్ కేఎల్‌రావు నాంది పలికారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. కేఎల్‌రావు జయంతి సందర్భంగా గొల్లపూడిలోని కార్యాలయంలో మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేఎల్‌రావు స్ఫూర్తిని ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబులు కొనసాగిస్తున్నారని తెలిపారు. నీటి పారుదల రంగాల్లో ఆయన కృషి మరువలేనిదని, తెలుగు వ్యక్తి కావడం గర్వకారణమన్నారు. విజయవాడ లోక్‌సభ సభ్యుడిగా మూడు సార్లు ఎన్నికై కేంద్రమంత్రిగా పని చేశారన్నారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తి ఎం.శైలజ

మైలవరం, న్యూస్‌టుడే: మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారం జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశంతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు స్థానిక కోర్టు న్యాయమూర్తి ఎం.శైలజ పేర్కొన్నారు. డ్రైవ్‌లో భాగంగా మంగళవారం కోర్టు ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక సదస్సులో పలు అంశాలను న్యాయమూర్తి వివరించారు. న్యాయస్థానంలో నిరంతరం జరిగే మధ్యవర్తిత్వ కార్యక్రమంలో, వివాహ సంబంధమైన వివాదాలు, ప్రమాద, చెక్ బౌన్స్, భూమి పంపకాల తదితర కేసులను పరిష్కరించుకోవచ్చని సూచించారు. సమావేశంలో బార్ సభ్యులు రమేష్‌బాబు, శ్రీనివాసరావు, కిషోర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామాగ్రి వితరణ

మైలవరం, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం అధ్యక్షుడు చనమోలు నాగభూషణం కుమార్తె గ్రీష్మిత పుట్టినరోజు సందర్భంగా మంగళవారం స్థానిక భవిత కేంద్రంలోని విద్యార్థులకు రాత పుస్తకాలు, పెన్సిళ్లు, పలకలు అందజేశారు. ఎస్సైలు కె.సుధాకర్, సతీష్‌కుమార్, మోహన్‌రావు, ఏజీపీ ఏడీ ప్రసాద్, క్లబ్ నాయకులు బాలగోపాలరెడ్డి, శ్రీధర్, వెంకటేశ్వరరావు, రామిరెడ్డి, హరీష్, జి.వెంకటేశ్వరరావు, ఎం.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారికి అడ్డంగా తవ్వి..



కుళాయి కనెక్షన్ అక్రమంగా పొందేందుకు ప్రధాన రహదారులను సైతం తవ్వేస్తున్నారు. కొండపల్లి ఆరు పంపుల కూడలి వద్ద తాగునీటి కుళాయి కనెక్షన్ కోసం కొందరు గత శనివారం రహదారికి గాడి ఏర్పాటు చేసుకున్నారు. మూడు రోజుల కిందట ఏర్పాటు చేసిన గాడిలో పైప్‌లైన్ వేసి సిమెంటుతో పూడ్చాలి. సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో దాన్ని అలా వదిలేశారు. ఇదే రహదారి మీదుగా కమిషనర్, ఇతర పురపాలిక అధికారులు మూడు రోజుల నుంచి రాకపోకలు సాగిస్తున్నా దీని గురించి పట్టించుకోకపోవడం గమనార్హం. ఇటువంటి అక్రమ కుళాయి కనెక్షన్లు పురపాలికలో 2 వేల వరకూ ఉంటాయని సమాచారం. ఇలా కనెక్షన్ ఏర్పాటు చేయడానికి రూ.2 వేల నుంచి 3 వేలు తీసుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. - న్యూస్‌టుడే, కొండపల్లి

మురుగు నీటితో తిప్పలు



చెవుటూరు రామాలయం చివర ఇళ్ల మధ్యలో సీసీ రోడ్డుపై మురుగు నీరు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ మురుగు నీటిలో వల్ల దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. సీసీ రోడ్డు పల్లంగా మారడంతో మురుగు నీరు చేరినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్య పై పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం శూన్యమని వాపోతున్నారు. ఇప్పటికైనా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, జి.కొండూరు

నిర్మించినా... నిరుపయోగం



మూలపాడు, జూపూడి, కేతనకొండ, కాచవరం గ్రామాలు విజయవాడ హైదరాబాద్ జాతీయ రహదారికి ఇరువైపుల విస్తరించాయి. ఆయా గ్రామాలకు చెందిన వారు సమీప గ్రామాలకు వెళ్లేందుకు వ్యతిరేక దిశలో రాకపోకలు సాగిస్తూ తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల మూలపాడు, కేతనకొండ, కాచవరం గ్రామ సెంటర్ నుంచి అపసవ్య దిశలో వివిధ వాహనాల ద్వారా రాకపోకలు సాగిస్తున్న ముగ్గురు మృతి చెందగా మరో నలుగురు గాయపడ్డారు. గతంలో జాతీయ రహదారి విస్తరణ సందర్భంగా ఇబ్రహీంపట్నం, మూలపాడు, కేతనకొండ గ్రామాల వద్ద 'క్యాటిల్ పాస్ వే' పేరిట రహదారి కింది వంతెనలను నిర్మించారు. గ్రామస్థులు వాటిని వినియోగించడం లేదు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో అధికారులు 'క్యాటిల్ పాస్ వే'లను అభివృద్ధి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

ముఠా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు తీర్మానం

తిరువూరు, న్యూస్‌టుడే: ముఠా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం నిర్వహించిన ముఠా కార్మికుల 4వ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. సరకులు ఎగుమతులు, దిగుమతుల్లో కార్మికులు కీలకంగా ఉన్నారని, వారి సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించడం తగదన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ముఠా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. సమావేశంలో అధ్యక్షుడిగా ఎం.సీతారాములు, ఉపాధ్యక్షుడిగా సీహెచ్.నరసింహులు, జి.వెంకట్రావు, ఎం.ఇజ్రాయిల్, ప్రధాన కార్యదర్శిగా వెంకటనారాయణ, కోశాధికారిగా సీహెచ్.దాసు, మరో 17 మంది సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

మైలవరం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ వర్కర్ల సంఘం 10వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ సుప్రజ పేర్కొన్నారు. ఆగస్టు 13న జిల్లాలోని నందిగామలో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రాజెక్టు ముఖ్య కార్యకర్తల సమావేశంలో, మహాసభకు సంబంధించిన కరపత్రాలను కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్కర్లు, హెల్పర్లు చాకిరికే పరిమితమయ్యారని, ప్రభుత్వాలు వారి సంక్షేమం పట్టించుకోవడం లేదన్నారు. డిమాండ్ల సాధనకు పోరాడుతామని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ సుధాకర్, ప్రాజెక్టు నాయకులు పుష్పకుమారి, శారద, కుమారి, అరుణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మోటూరు హనుమంతరావుకు నివాళులు

కొండపల్లి: కొండపల్లి అప్మెల్ కంపెనీ కార్మికులకు మెరుగైన వేతనాలకు అలుపెరుగని కృషి చేసిన హనుమంతరావుకు సీఐటీయూ కొండపల్లి కమిటీ సభ్యులు మంగళవారం నివాళులు అర్పించారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శిగా పదేళ్లపాటు సేవలందించిన ఆయన హైదరాబాద్‌లో తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న సీఐటీయూ నాయకులు ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

సేంద్రియ ఎరువులు వినియోగించండి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: వరి నారుమడి తయారీలో సేంద్రియ ఎరువులను వినియోగించాలని ఏవో వై.రజని రైతులకు సూచించారు. జూపూడి, ఇబ్రహీంపట్నం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆమె నారు మడులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. నాట్లు వేయడానికి వారం ముందు 3జీ గుళికలను వేసుకోవాలని పేర్కొన్నారు. దీనివల్ల నారుమడిలో కాండం తొలుచు పురుగును నివారించవచ్చన్నారు. నారు నాటే ముందు నారు చివరిలో తుంచి నాటాలని చెప్పారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సహాయకురాలు వాసవీ పాల్గొన్నారు.

అప్పుల బాధతో లారీ యజమాని ఆత్మహత్య

పటమట: లారీల యజమాని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అశోక్‌నగర్‌లో చోటుచేసుకుంది. మైలవరం మండలం చంద్రాల వాసి సూరనేని తిరుమల నాగరాజు(48) అశోక్‌నగర్‌కు చెందిన వరలక్ష్మిని 26 ఏళ్ల కిందట వివాహం చేసుకున్నారు. వారికి ఒక కుమారుడు ఉన్నారు. అమెరికాలో చదువుకుంటున్నాడు. భార్య హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. నాగరాజుకు కొన్ని లారీలు ఉన్నాయి. ఆ వ్యాపారం చూసుకుంటూ చంద్రాల, హైదరాబాద్, అశోక్‌నగర్‌లోని అత్త గారింట్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. లారీల వ్యాపారంలో నష్టం రావడంతో కొంతకాలంగా దిగాలుగా ఉన్నారు. సోమవారం రాత్రి అశోక్‌నగర్‌లో అత్త మామలతో కలిసి భోజనం చేసి పడుకున్నారు. ఉదయం లేచి చూడగా హాల్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ప్రాణాలు వదిలారు.

నైపుణ్యాలతో ఉన్నత అవకాశాలు

మైలవరం, న్యూస్‌టుడే: యువత నేర్చుకునే అంశాల్లో నైపుణ్యాలను సాధించడం ద్వారా ఉన్నత అవకాశాలను పొందవచ్చని స్థానిక బాలికోన్నత పాఠశాల ప్లస్ ప్రధానోపాధ్యాయుడు వై.రాజశేఖర్ పేర్కొన్నారు. ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పాఠశాలలో వృత్తి కోర్సుల విద్యార్థినులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ ఎం.బాబూరావు, ఒకేషనల్ శిక్షకులు తిరుమల, కల్యాణి, సారిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో బహుమతులు సాధించిన విద్యార్థినులు

గొల్లపూడి, న్యూస్‌టుడే: యువత నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా ఉన్నత స్థానానికి చేరవచ్చని ఎల్ఐసీ నిర్వహణాధికారి జి.కిషోర్ పేర్కొన్నారు. ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవాన్ని గొల్లపూడిలోని నలంద కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం యువతలో పోటీతత్వం పెరిగిందని, భవిష్యత్తు మొత్తం ఏఐతోనే ముడిపడి ఉందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ షేక్.ఖాసీంషా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవో నంబరు 36 అమలుకు డిమాండ్



తిరువూరు: సమ్మెలో పురపాలిక ఇంజినీరింగ్ కార్మికులు


కొండపల్లిలో..

తిరువూరు, న్యూస్‌టుడే: నగర పంచాయతీ ఇంజినీరింగ్ కార్మికుల నిరవధిక సమ్మె మంగళవారం మూడో రోజుకు చేరింది. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన సమ్మెకు ప్రజలు సహకరించాలని కోరుతూ పట్టణంలో కార్మికులు ప్రదర్శన చేశారు. ప్రభుత్వం జీవో నంబరు 36 అమలు చేయాలని నినాదాలు చేశారు. గత సమ్మెకాలంలో ఆమోదించిన ఒప్పందాలను అమలు చేయాలని నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, పురపాలిక ఇంజినీరింగ్ ఉద్యోగుల సంఘ నాయకులు బాజీ, శ్రీనివాసరావు, వాసు, పావని, సుజాత, అబ్దుల్ రఫీ, నారాయణ, శ్రీను, ప్రసాద్ తదితరులు సమ్మెలో పాల్గొన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతుగా పాల్గొన్నారు.

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి పురపాలిక ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె మూడో రోజుకు చేరుకొంది. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మెలో కార్మికులు 30 మంది పాల్గొన్నారు. తమకు అన్యాయం జరిగిందంటూ చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో మహేష్, శ్రీను, వాసు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల కమిటీ ఎంపిక


సుబ్బారెడ్డి వెంకటేశ్వరరావు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని రెండు ప్రాథమిక వ్యవసాయ పరిపతి సహకార సంఘాలకు (పీఏసీఎస్)లకు త్రీమెన్ కమిటీ సభ్యులు, ఛైర్‌పర్సన్ ఎంపిక చేస్తూ ఉత్తర్వులు వచ్చినట్లు విస్సన్నపేట కేడీసీసీ బ్యాంకు మేనేజర్ లక్ష్మీప్రసాద్ మంగళవారం తెలిపారు. రెడ్డిగూడెం సహకార సంఘానికి ఛైర్‌పర్సన్‌గా ఉయ్యూరు సుబ్బారెడ్డి, సభ్యులుగా చాపలమడుగు కాంతారావు, బలగాని గోపిలు, కూనపరాజుపర్వ సహకార సంఘానికి ఛైర్‌పర్సన్‌గా రాయుడు వెంకటేశ్వరరావు, సభ్యులుగా సంగం శివరావు, పాలంకి గోపాలరెడ్డిలను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

కుమార్తెను అపహరించారని తల్లి ఆవేదన

విస్సన్నపేట, ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: కుమార్తె అపహరణకు సంబంధించి విస్సన్నపేట మండలానికి చెందిన ఓ మహిళ ఖమ్మం టూటౌన్ పోలీసు స్టేషన్‌కు మంగళవారం వచ్చారు. 'నాకు ముగ్గురు కుమార్తెలు. వీరిని ఓ ప్రముఖ ఫౌండేషన్‌లో ఏడాది క్రితం చేర్పించాం. ఫౌండేషన్‌లో రమేశ్ అనే ఓ వ్యక్తి తన కుమార్తెలను చదివిస్తానని తెలిపాడు. దత్తత పేరిట తన రెండో కుమార్తె(17)ను లైంగికంగా లోబర్చుకున్నాడు. ఈ విషయం తెలియటంతో నా కుమార్తెలను కళాశాలకు పంపించకుండా ఇంటి వద్దే ఉంచుకున్నాను' అని ఆమె విలేకరులకు తెలిపారు. రమేశ్ అనే వ్యక్తి మూడు రోజుల క్రితం అర్ధరాత్రి తన ఇంటికి వచ్చి రెండో కుమార్తెను అపహరించాడని ఆరోపించారు. ఈ అంశంపై విస్సన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. మంగళవారం ఫోన్ చేస్తే హైదరాబాద్‌లో ఉన్నానని రమేశ్ బదులిచ్చాడని చెప్పారు. పాపను తీసుకొచ్చి ఖమ్మంలో అప్పగిస్తానని తెలపటంతో విస్సన్నపేట ఠాణాలోని ఓ కానిస్టేబుల్‌ను ఎస్సై తనతో పాటు పంపించారని వెల్లడించారు. ఖమ్మంలో ఓ ఫంక్షన్ హాల్‌లో తనను, తన కుమార్తెను చంపుతానని రమేశ్ బెదిరించాడని ఆరోపించారు. అమ్మాయిని తిరువూరు సీఐ సమక్షంలో అప్పగిస్తామంటూ తీసుకెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఖమ్మం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చానని ఆమె చెప్పారు. దీనిపై ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణను 'న్యూస్‌టుడే' సంప్రదించగా కేసులో గందరగోళం ఉందన్నారు. విస్సన్నపేటలో విచారణ జరుగుతున్నందున తాము ఖమ్మంలో కేసు నమోదు చేయలేదని తెలిపారు.


◆ విస్సన్నపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేశామని ఎస్సై రామకృష్ణ చెప్పారు. బాలిక ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టినట్లు ఆయన చెప్పారు.

కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: ఎ.కొండూరు పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ కె.కాంతారావు మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తిరువూరులోని కోకిలంపాడు రోడ్డులోని ఒక వెంచర్ వద్ద కాంతారావు అపస్మారక స్థితిలో పడిపోయి ఉండడాన్ని కొందరు గమనించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని అతన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. కానిస్టేబుల్ స్పృహలోకి వచ్చాక ఇచ్చే ఫిర్యాదు ఆధారంగా చర్యలు ఉంటాయని పోలీసులు తెలిపారు.

మోసగించిన నిందితుడి అరెస్టు

జి.కొండూరు, న్యూస్‌టుడే: గంగినేని గ్రామంలో రూ.17 లక్షల చిట్టీలు, సుమారు రూ.కోటి టోకరా వేసిన నిందితుడు ఇందుర్తి సత్యనారాయణను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. జి.కొండూరు మండలంలోని దుగ్గిరాలపాడు గ్రామానికి చెందిన సత్యనారాయణ దర్జీ. ఆయనకు ముగ్గురు కుమారులు. .. ఇద్దరు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తుండగా.. మరో కుమారుడు తండ్రితో ఉంటున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడి ముగ్గురు కుమారుల ఆచూకీ తెలుసుకుని అదుపులో తీసుకుని విచారించారు. పరారీలో ఉన్న నిందితుడు ఫోన్ స్విచ్ ఆన్ చేయడంతో సిగ్నల్ ట్రాక్ చేసి విశాఖపట్నంలో ఉన్నట్లు తెలుసుకున్న సీఐ చంద్రశేఖర్, ఎస్సై సతీష్‌కుమార్‌లు సోమవారం రాత్రి సిబ్బందిని పంపి మైలవరం తరలించి విచారణ చేస్తున్నట్లు తెలిసింది. సత్యనారాయణ నేరం ఒప్పుకున్నాడని.. నగదు తిరిగి చెల్లించేందుకు అంగీకరించాడని సమాచారం.



ట్విటర్ (నేటి ఎక్స్) సహ వ్యవస్థాపకుడు జాక్ డోర్సే కొత్త మెసేజింగ్ యాప్‌ను పరిచయం చేశారు. దీని పేరు బిట్‌చాట్. దీనికి ఇంటర్నెట్ కనెక్షన్ అవసరం లేకపోవటం విశేషం. వాట్సప్, టెలిగ్రామ్ వంటి యాప్‌ల మాదిరిగా కాకుండా బ్లూటూత్ ద్వారానే మెసేజ్‌లను పంపుతుంది, స్వీకరిస్తుంది. ఇదో వికేంద్రీకృత వేదిక కూడా. అంటే దీనికి కేంద్రీకృత సర్వర్లేవీ ఉండవన్నమాట.

కొత్త మెసేజింగ్ తరంగం బిట్‌చాట్

తోటి వికేంద్రీకృత నెట్‌వర్క్ పరిజ్ఞానాన్ని వాడుకునే టోరెంట్స్ మాదిరిగా బిట్‌చాట్ పనిచేస్తుంది. సమీపంలో ఉన్న బ్లూటూత్ ఎనేబుల్డ్ పరికరాల మధ్య ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ ద్వారా మెసేజ్‌లను ప్రసారం చేస్తుంది. అంటే ఒక పరికరం నుంచి మరో పరికరానికి నేరుగా మెసేజ్‌లను పంపిస్తుందన్నమాట. నెట్‌వర్క్ మీదున్న ఒక్కో పరికరం ఒక్కో నోడ్‌గా వ్యవహరిస్తుంది. యూజర్ ఒక చోటు నుంచి మరో చోటుకు వెళ్లినప్పుడు పరికరాలు నిరంతరం బ్లూటూత్ కేంద్రాల నుంచి మారుతూ, జతకూడుతూ వస్తుంటాయి. ఇలా ఒక పరికరం నుంచి మరో పరికరానికి మెసేజ్‌లు వెళ్తాయి.

అంతర్జాలం అవసరం లేదు

బిట్‌చాట్‌కు వై-ఫై గానీ సెల్యులర్ సేవలు గానీ అవసరం లేదు. అందువల్ల అంతర్జాల సేవలకు అంతరాయం కలిగినా, పూర్తిగా నిలిపేసినా దీన్ని వాడుకోవటానికి ఎలాంటి ఇబ్బందీ ఉండదు. నెట్‌వర్క్ కనెక్షన్ సరిగా ఉండని కిక్కిరిసిన ప్రాంతాల్లో ఇది బాగా ఉపయోగపడుతుంది. స్నేహితులు, కుటుంబ సభ్యులను గుర్తించటానికి, వారితో కనెక్ట్ కావటానికి దోహదం చేస్తుంది. ఇతర అధునాతన మెసేజింగ్ యాప్‌ల మాదిరిగానే బిట్‌చాట్ సైతం ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్ట్ అయ్యుంటుంది. అందువల్ల మెసేజ్‌లను పంపించినవారు, అందుకున్నవారు మాత్రమే వాటిని చూడగలరు, చదవగలరు.

తక్కువ పరిధిలోనే

బ్లూటూత్ చాలా తక్కువ విస్తీర్ణంతో కూడుకున్నది కావటం వల్ల బిట్‌చాట్ సుమారు 100 మీటర్ల పరిధిలోనే పనిచేస్తుంది. కానీ ఇది 300 మీటర్ల వరకూ మెసేజ్‌లను ప్రసారం చేయగలదని డోర్సే చెబుతున్నారు. సర్వర్‌కు బదులు పరికరంలోనే మెసేజ్‌లు స్టోర్ అవుతాయి కాబట్టి డిఫాల్ట్‌గా అదృశ్యమవుతాయి. ముందు ముందు దీన్ని వైఫై డైరెక్ట్‌ను సపోర్టు చేసేలా తీర్చిదిద్దాలనీ భావిస్తున్నారు. దీంతో విస్తీర్ణ పరిధి, వేగం పరిమితులను అధిగమించటానికి అవకాశముంటుంది.

గ్రూప్ చాట్ సైతం

బిట్‌చాట్‌లో రూమ్స్ ఫీచర్ కూడా ఉంటుంది. దీన్ని ఒకరంగా గ్రూప్ చాట్స్ అనుకోవచ్చు. ఇందులో హ్యాష్‌ట్యాగ్‌తో పేరు మొదలవుతుంది, పాస్‌వర్డ్స్‌తో భద్రంగా ఉంటుంది. రూమ్స్‌లో మెసేజ్‌లను స్టోర్ చేసుకునే సదుపాయమూ ఉంటుంది. తిరిగి ఆన్‌లైన్‌లోకి వచ్చినప్పుడు వీటిని ఫార్వర్డ్ చేసుకోవచ్చు. బిట్‌చాట్‌కు సైన్ అప్ కావటానికి ఈమెయిల్ చిరునామా గానీ ఫోన్ నంబరు గానీ అవసరం లేదు కూడా.

ప్రస్తుతం యాపిల్ యూజర్లకే

బిట్‌చాట్ ప్రస్తుతం టెస్ట్‌ఫ్లైట్ ద్వారా యాపిల్ యూజర్లకు అందుబాటులో ఉంది. దీన్ని పరీక్షిస్తున్నవారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతూ వస్తోంది. ఈ యాప్ ఇప్పుడు సమీక్ష దశలో ఉందని, త్వరలోనే యాపిల్ యాప్ స్టోర్‌లో అందుబాటులోకి తెస్తామని డోర్సే చెబుతున్నారు.

తెలిసింది గోరంత. తెలియాల్సింది కొండంత. ఈ మాట అంతర్జాలానికి అతికినట్టు సరిపోతుంది. మనకు తెలిసిన వెబ్ ప్రపంచం ఒక ఎత్తయితే.. తెలియని డార్క్ వెబ్ మరో ఎత్తు. ఇటీవల కేరళకు చెందిన ఒకరు ఇందులో మాదకద్రవ్యాలను అమ్ముతున్నందుకు గాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ చీకటి లోకాన్ని చాలావరకూ నేరాలకే ఎందుకు వాడుకుంటారు? ఇంతకీ డార్క్ వెబ్ అంటే ఏంటి?

చీకటి వెబ్ సామ్రాజ్యం!



అంతర్జాలంలో అదృశ్య విభాగమే డార్క్ వెబ్. మామూలు సెర్చ్ ఇంజిన్లకు ఇది చిక్కదు. దీన్ని యాక్సెస్ చేయాలంటే ప్రత్యేకమైన టూల్స్ లేదా బ్రౌజర్లు కావాలి. సాధారణంగా ఫైర్‌ఫాక్స్, గూగుల్, యాహూ వంటి ఓపెన్ వెబ్ బ్రౌజర్లు ఐపీ అడ్రస్‌ల ద్వారా యూజర్ల పనులను పర్యవేక్షిస్తాయి. అదే డార్క్ వెబ్‌లో యూజర్ల ఐడెంటిటీ తెలియదు. గోప్యంగా లేదా అజ్ఞాతంగా ఉండాలని కోరుకునేవారికిది ఓ రక్షణ స్థావరాన్ని సృష్టిస్తుంది. ఈ అంతర్జాల రహస్య, అదృశ్య భాగం 90ల్లోనే పురుడు పోసుకుంది. అమెరికా నేవల్ రిసెర్చ్ లేబరేటరీ అప్పట్లో ద ఆనియన్ రూటింగ్ ప్రాజెక్ట్ (టోర్) ప్రాథమిక వర్షన్‌తోనే దీనికి పునాది పడింది. పేరుకు తగ్గట్టుగా ఇది ఉల్లి పొరల మాదిరిగా కమ్యూనికేషన్ నెట్‌వర్క్స్‌లో సంకేత నిక్షిప్త సందేశాలను పొందుపరుస్తుంది. అంతర్జాలంలో ప్రసారమయ్యే ముఖ్యమైన ప్రభుత్వ సమాచారాలను రక్షించటం దీని ఉద్దేశం. దీన్ని దృష్టిలో పెట్టుకునే ఆన్‌లైన్ గోప్యతను మరింత కట్టుదిట్టం చేసే లక్ష్యంతో రోజర్ డింగెల్‌డైన్, ఆయన బృందం టోర్‌ను రూపొందించింది. ఇది స్వచ్ఛంద ఆపరేటెడ్ సర్వర్ల ద్వారా ఆన్‌లైన్ ట్రాఫిక్‌ను మళ్లిస్తుంది. డేటాను ఎన్‌క్రిప్ట్ చేయటం ద్వారా యూజర్ చిరునామాను దాచి పెడుతుంది. మొదట్లో మంచి ఉద్దేశం కోసం రూపొందించినప్పటికీ క్రమంగా అక్రమ కార్యకలాపాలకు వాడుకోవటం ఎక్కువైంది. అక్రమ సరుకులు, సైబర్ నేరాల వంటి పనులకు ప్రసిద్ధి పొందింది.

మొత్తమంతా అక్రమాలేనా?

అక్రమ కార్యకలాపాలకు పెట్టింది పేరైనా డార్క్‌వెబ్ విశ్వసనీయ పనులకూ ఉపయోగపడుతోంది. వేగులు, పాత్రికేయులు, ఉద్యమకారులు పీడిత పాలనలో రహస్య సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవటానికి దీన్ని వాడుకుంటుంటారు. సెక్యూర్‌డ్రాప్ వంటి వేదికలు అజ్ఞాతంగా లీకులు ఇవ్వటానికి అవకాశమిస్తాయి. సోర్సుల వివరాలు బయటకు పొక్కనీయవు. అంతర్జాల సెన్సార్‌షిప్ అధికంగా ఉండే దేశాల్లో నిషేధిత సమాచార ప్రసారానికి డార్క్ వెబ్ వీలు కల్పిస్తుంది. తమ దేశాల ప్రాపకం లేకుండా కొన్ని ఉపయుక్తమైన సమాచారాన్ని ఇతర సంస్థలు సైతం దీన్ని వాడుకుంటున్నాయి. అయితే ఈ అజ్ఞాత ధోరణే సైబర్ నేరాలకు ఆజ్యం పోస్తోంది. నల్ల బజార్లకు ఊతమిస్తోంది. మత్తు పదార్థాలు, దొంగ నోట్లు, మాల్వేర్ లావాదేవీలకు అడ్డాగా నిలుస్తోంది. దొంగిలించిన ఆర్థిక సమాచారం, హ్యాకింగ్ టూల్స్ అమ్మకాలు అక్కడ వెల్లువెత్తుతుంటాయి. ప్రపంచవ్యాప్తంగా చట్టపరమైన సంస్థలు డార్క్ వెబ్ వ్యవహారాలనూ ఓ కంట కనిపెడుతుంటాయి. కానీ అధునాతన ఎన్‌క్రిప్షన్ పద్ధతుల మూలంగా నేరగాళ్లను గమనించటం పెద్ద సమస్యగా నిలుస్తోంది. అయినప్పటికీ అధునాతన విధానాలతో పోలీసులు నేరగాళ్లను పట్టుకుంటున్నారు. కేరళ వ్యక్తి ఉదంతమే దీనికి నిదర్శనం.

ఎలా పనిచేస్తుంది?

సాధారణంగా టోర్‌ను డౌన్‌లోడ్ చేసుకొని డార్క్ వెబ్‌ను ఉపయోగించుకుంటారు. ఇది నోడ్స్ అని పిలుచుకునే పలు సర్వర్ల ద్వారా కనెక్షను దారి మళ్లిస్తుంది. టోర్ వీటిని ప్రపంచవ్యాప్తంగా యాదృచ్ఛికంగా ఎంచుకుంటుంది. ప్రతి దశలోనూ డేటాను రహస్యలిపిలోకి మారుస్తుంది. అందువల్ల డార్క్ వెబ్‌లో జరిగే వ్యవహారాలను పట్టుకోవటం దాదాపు అసాధ్యమనే చెప్పుకోవచ్చు. ఈ చీకటి అంతర్జాలంలో వెబ్‌సైట్లు ".onion" డొమైన్లను వాడుతుంటాయి. సంప్రదాయ సెర్చ్ ఇంజిన్ల సూచీల్లో ఇవి ఉండవు. టోర్ యూజర్ తరచూ వెబ్ పేజీలను శోధించడు. యూజరే సొంతంగా డార్క్ వెబ్ పేజీలను వెతుక్కోవాల్సి ఉంటుంది. మార్కెట్‌ప్లేసెస్, వేదికలు, చివరికి లైబ్రరీలూ డార్క్ వెబ్‌లో ఉంటాయి. కానీ మాదక ద్రవ్యాలు, ఆయుధాలు, దొంగిలించిన డేటా అమ్మటానికి.. హ్యాకింగ్ సర్వీసులకే ఎక్కువగా వాడుకుంటుంటారు.

its@eenadu.in

e-ఈనాడు

వివో ఎక్స్200 ఎఫ్ఈ వచ్చింది



వివో సంస్థ తమ ఎక్స్200 శ్రేణిని విస్తరించింది. కొత్తగా ఎక్స్200 ఎఫ్ఈ ఫోన్‌ను మనదేశంలో విడుదల చేసింది. వివో ఎక్స్ ఫోల్డ్ 5 పరికరంతో పాటే దీన్ని పరిచయం చేసింది. 1.5కే రెజల్యూషన్, 1,216×2,640 పిక్సెళ్లతో కూడిన 6.31 అంగుళాల అమోలెడ్ తెర, 120హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం, 1,800 గరిష్ఠ నిట్స్ ప్రకాశం, 6,500ఎంఏహెచ్ బ్యాటరీ, 90వాట్ల వైర్డ్ ఫాస్ట్ ఛార్జింగ్, ఫింగర్ ప్రింట్ సెన్సర్ ఫీచర్లతో ఆకట్టుకుంటోంది. వెనకాల 50 ఎంపీ సోనీ ఐఎంఎక్స్921 ప్రైమరీ సెన్సర్, 8ఎంపీ అల్ట్రా-వైడ్ కెమెరా, 50ఎంపీ పెరిస్కోప్ టెలిఫొటో లెన్స్. ముందు వైపు సెల్ఫీలు, వీడియో కాల్స్ కోసం 50ఎంపీ కెమెరా ఉన్నాయి. దుమ్ము, నీటిని తట్టుకోవటంలో ఐపీ68, ఐపీ69 రేటింగ్స్ కలిగుంది. పసుపు, నీలం, బూడిద రంగుల్లో ఆకర్షిస్తోన్న ఇది రెండు రకాల్లో వస్తోంది. 12జీబీ ర్యామ్, 256జీబీ స్టోరేజీ రకం ధర రూ.54,999. 16జీబీ ర్యామ్, 512జీబీ స్టోరేజీ రకం ధర రూ.59,999. జులై 23 నుంచి అమ్మకాలు ఆరంభం కానున్నాయి.

ఇన్ఫినిక్స్ హాట్‌గా



ఇన్ఫినిక్స్ తాజాగా ప్రత్యేకమైన ఏఐ బటన్‌తో కూడిన హాట్ 60 5జీ+ ఫోన్‌ను విడుదల చేసింది. మీడియాటెక్ డైమెన్సిటీ 7020 ఎస్ఓసీతో పనిచేసే ఇందులో గూగుల్‌కు చెందిన సర్కిల్ టు సెర్చ్‌తో పాటు ఇన్ఫినిక్స్‌కు చెందిన ఫోలాక్స్ ఏఐ అసిస్టెంట్ కూడా ఉంటుంది. ఏఐ కాల్ అసిస్టెంట్, ఏఐ రైటింగ్ అసిస్టెంట్ ఫీచర్లూ అదనం. ఆండ్రాయిడ్ ఆధారిత ఎక్స్ఓఎస్ 15తో పనిచేసే ఇది 6.7 అంగుళాల హెచ్‌డీ+ తెర, 120హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం, 700 నిట్స్ గరిష్ఠ ప్రకాశం, వెనకాల 50ఎంపీ ప్రైమరీ సెన్సర్, ముందు 8ఎంపీ సెల్ఫీ కెమెరా, 5200ఎంఏహెచ్ బ్యాటరీ వంటి ఫీచర్లతో అలరిస్తోంది. షాడో బ్లూ, స్లీక్ బ్లాక్, టండ్రా గ్రీన్ రంగుల్లో అందుబాటులో ఉంటుంది. 6జీబీ ర్యామ్, 128జీబీ స్టోరేజీతో కూడిన దీని ధర రూ.10,499. జులై 17 నుంచి అమ్మకాలు మొదలవుతాయి.

వన్‌ప్లస్ బడ్స్ 4



వన్‌ప్లస్ సంస్థ మనదేశంలో బడ్స్ 4 పేరుతో టీడబ్ల్యూఎస్ ఇయర్‌బడ్స్‌ను పరిచయం చేసింది. ఇవి 55 డెసిబెల్స్ వరకూ యాక్టివ్ నాయిస్ క్యాన్సలేషన్ (ఏఎన్‌సీ)ను సపోర్టు చేస్తాయి. యూజర్లు ఏఎన్‌సీ, ట్రాన్స్‌పరెన్సీ మోడ్‌లలోకి తేలికగా మార్చుకోవచ్చు. కొన్ని ఎంపిక చేసిన వన్‌ప్లస్ పరికరాలకు వీటి బ్లూటూత్ పరిధి ఈ బడ్స్ 250 మీటర్ల వరకూ విస్తరించి ఉంటుందని కంపెనీ చెబుతోంది. ఇయర్‌ఫోన్ల మీద తాకి పైకీ, కిందికీ జరపటం ద్వారా వాల్యూమ్‌ను పెంచుకోవచ్చు, తగ్గించుకోవచ్చు. కేవలం 10 నిమిషాల్లోనే ఛార్జ్ అవగల ఇవి 11 గంటల వరకూ మ్యూజిక్‌ను ప్లేబ్యాక్ చేస్తాయి. వీటి ధర రూ.5,999.

గజదొంగను పట్టేశారు..!

ముంబయిలో మోస్ట్ వాంటెడ్ ● బెజవాడ పోలీసులకు చిక్కాడు



సురేష్ మోరీ (సీసీ ఫుటేజీ)

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : వరుస నేరాలతో ముంబయి పోలీసులను ముప్పుతిప్పలు పెట్టాడు. 15 పెద్ద పెద్ద దొంగతనాలు చేసి.. గత నాలుగేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ సురేష్ మోరీ... చివరికి బెజవాడ పోలీసులకు చిక్కాడు. నేరం చేసే విధానం, వేషభాషలే అతడిని పట్టించాయి. చిన్నపాటి క్లూతో పట్టేశారు. వరుస నేరాలతో రెండు రాష్ట్రాల పోలీసులను ఉరుకులు పెట్టిస్తున్న గజదొంగ ఆట కట్టించారు.

సీసీ కెమెరాలు జల్లెడ పట్టి...

గత నెలలో విజయవాడ, భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక భారీ దొంగతనం జరిగింది. తలుపులు పగలకొట్టి 15 కాసుల బంగారం, రూ. లక్షల్లో నగదు దోచేశారు. సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగి.. సీసీ కెమెరా ఫుటేజీలు సేకరించారు. ఒక న్యాయవాది ఇంటి ముందు పెట్టిన కెమెరాకు.. ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. అతడి గురించి ఆరా తీస్తుండగానే... భవానీపురం పరిధిలోనే మరో దొంగతనం జరిగింది. అక్కడి ఫుటేజీలు పరిశీలించగా.. అదే వ్యక్తి కనిపించాడు. అతడు ప్రత్యేక వేషధారణలో కనిపించాడు. టోపీ, పాత కాలపు కళ్లద్దాలు, ముక్కుపై నుంచి కర్చీఫ్ కట్టుకోవటం, స్టోన్ వాష్ షర్ట్, జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. నగరంలోని సీసీ కెమెరాలను జల్లెడ పట్టారు. రైల్వేస్టేషన్‌లో కనిపించడంతో దర్యాప్తు ముమ్మరం చేశారు. సీసీఎస్, భవానీపురం పోలీసులు రెండు బృందాలుగా బయలుదేరారు. గుంటూరు రైల్వేస్టేషన్‌కు భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావు నేతృత్వంలో చేరుకున్న బృందం.. రైల్వేస్టేషన్‌లో సేద తీరుతున్న వ్యక్తిని పట్టుకున్నారు. రెండు సార్లు నేరం చేసినప్పుడు, పోలీసులకు చిక్కినపుడు ఒకే రకమైన వస్త్రాలు ధరించి ఉన్నాడు. అదే అతడిని పట్టించింది. వివరాలు సేకరించగా.. ముంబయికు చెందిన సురేష్ మోరీ అని గుర్తించారు. గుంటూరులోనూ 4 నేరాలు చేసినట్లు విచారణలో తేలింది.

ఇక్కడ చేసి అక్కడకు... అక్కడ చేసి ఇక్కడకు..

సురేష్ మోరీ రాత్రి వేళే నేరాలు చేస్తాడు. తాళం వేసి ఉన్న ఇళ్లను ఎంపిక చేసుకుంటాడు. నేరం చేసిన వెంటనే ఊరు విడిచి వెళ్లిపోతాడు. భవానీపురంలో ట్రిపుల్ ఎక్స్ కాలనీలో నేరం చేసి, కర్నూలు వెళ్లిపోయాడు. అక్కడ నేరం చేసి మళ్లీ విజయవాడకు వచ్చాడు. ఇక్కడ నేరం చేసి గుంటూరు వెళ్లిపోయాడు. గుంటూరులో ఉండగా.. బెజవాడ పోలీసులు కనిపెట్టి అదుపులోకి తీసుకున్నారు.

మహారాష్ట్రలో 15 నేరాలు

సురేష్ మోరీ సొంత ఊరు ముంబయి. అక్కడ నేరాలు చేసేవాడు. పోలీసులకు దొరికితే అనారోగ్యం ఉన్నట్లు నటించేవాడు. ఒకసారి గుండె జబ్బు, మరోసారి కాలేయ జబ్బు ఉన్నట్లు నటించి.. పోలీసుల కళ్లు కప్పి పారిపోయాడు. అప్పటికే అక్కడ దాదాపు 15 వరకు నేరాలు చేసి.. ముంబయి పోలీసులకు మోస్ట్ వాంటెడ్ అయ్యాడు. నాలుగు సంవత్సరాలుగా పోలీసులు అతడి కోసం గాలిస్తున్నా.. చిన్న ఆచూకీ కనిపెట్టలేకపోయారు. చివరకు టెక్నాలజీనే ఆయుధంగా చేసుకున్న బెజవాడ పోలీసులకు దొరికిపోయాడు.

ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్‌పై కేసు

కంచికచర్ల, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల ఓసీ క్లబ్‌లో ఈ నెల 13న వైకాపా ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-మోస గ్యారంటీ' పేరుతో నిర్వహించిన సమావేశంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కృష్ణా జిల్లా వైకాపా ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్‌పై సోమవారం రాత్రి కంచికచర్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ సమావేశంలో అరుణ్‌కుమార్ మాట్లాడుతూ తమ పార్టీ నాయకులను, కార్యకర్తలను కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ పేరుతో ఏడాదిగా వేధిస్తోందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీకి మ్యాజిక్ ఫిగర్ దాటిన వార్తలు టీవీల్లో వచ్చిన వెంటనే తమను వేధించిన వారికి తగిన సమాధానం చెబుతామని హెచ్చరించారు. తమను ఇబ్బంది పెట్టిన కూటమి నాయకులను, అధికారులను తమ కార్యకర్తల ఇళ్ల వద్దకే తీసుకొచ్చి రప్పా.. రప్పా.. చేస్తామంటూ ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. వైఎస్ జగన్ ఊరుకున్నా.. తన సోదరుడు జగన్‌మోహనరావు ఊరుకున్నా తాను మాత్రం వదిలిపెట్టనని హెచ్చరించారు. దీనిపై స్పందించిన కంచికచర్ల మండల తెదేపా అధ్యక్షుడు కోగంటి వెంకట సత్యనారాయణ(బాబు) ఆధ్వర్యంలో తెదేపా నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 14న ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీ వ్యాఖ్యలు తమ నాయకులను, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసేలా ఉన్నాయని, తగు చర్యలు తీసుకోవాలని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఎమ్మెల్సీ అరుణ్ కుమార్‌పై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 192, 353(1)(సి), 351(2) ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై బోనగిరి రాజు తెలిపారు.

స్ఫూర్తిప్రదాత కె.ఎల్.రావు



కె.ఎల్.రావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మోహన్‌రావు, గోపాలకృష్ణారావు, శ్రీరామ్ తదితరులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : నాగార్జునసాగర్ ప్రాజెక్టు రూపకర్త డాక్టర్ కె.ఎల్.రావు అని జలవనరుల శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ ఆర్.మోహన్‌రావు పేర్కొన్నారు. ఆయన కాంక్రీట్‌పై రాసిన పుస్తకం నేటికీ ఎన్నో ప్రాజెక్టుల రూపకల్పనకు ఉపయోగపడుతుందని కొనియాడారు. మంగళవారం గవర్నర్‌పేటలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ డాక్టర్ కె.ఎల్.రావుభవన్‌లో ప్రముఖ ఇంజినీర్, మాజీ ఎంపీ డాక్టర్ కె.ఎల్.రావు జయంతి నిర్వహించారు. పలువురు ఇంజినీరింగ్ ప్రముఖులు పాల్గొని కె.ఎల్.రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మోహన్‌రావు మాట్లాడుతూ.. కె.ఎల్.రావు స్ఫూర్తితో యువ ఇంజినీర్లు క్రమశిక్షణతో పనిచేసి, కొత్త ప్రాజెక్టుల రూపకల్పనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ.. నదుల అనుసంధానంతోనే రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయన్న కె.ఎల్.రావు స్ఫూర్తితో తెదేపా హయాంలో 2015లో ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టిసీమ ద్వారా గోదావరి, కృష్ణా నదులను అనుసంధానం చేశారని గుర్తు చేశారు. కృష్ణా డెల్టాలోని ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 13 లక్షల ఎకరాలకు, చేపలు, రొయ్యల చెరువులకు 268 టీఎంసీల గోదావరి జలాలు అందించి.. రైతులకు రూ.50వేల కోట్ల ఆదాయం తెచ్చారన్నారు. ఆయన కృషితోనే నాగార్జునసాగర్ ఎడమకాలువ 3వ జోన్‌లోని తిరువూరు, నూజివీడు, గన్నవరం, మైలవరం, నందిగామ నియోజకవర్గాల్లో 2.36 లక్షల ఎకరాల ఆయకట్టు కొత్తగా సాగులోకి వచ్చాయని వివరించారు. కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ మాజీ ఛైర్మన్లు సి.వి.శ్రీరామ్, ఎం.ఆర్.ఎస్.ప్రకాశరావు, ప్రముఖ ఇంజినీర్లు ఎల్.కృష్ణప్రసాద్, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల సంక్షేమానికి సమగ్ర చట్టం అవసరం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కౌలు రైతులకు అన్యాయం చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజమెత్తారు. కౌలు రైతుల సంక్షేమం, రక్షణకు సమగ్రమైన చట్టాన్ని తేవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం దాసరి భవన్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన



మాట్లాడుతున్న రామకృష్ణ. వేదికపై శోభనాద్రీశ్వరరావు, ప్రసాద్ తదితరులు

మాట్లాడారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడంతో వారికి 'అన్నదాత సుఖీభవ' రాలేదని, పంట రుణాలు దరి చేరడం లేదని వాపోయారు. వ్యవసాయ శాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. ఎలాంటి హామీ లేకుండా కౌలు రైతులకు రూ.2 లక్షల వరకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ ఆధ్వర్యంలో పంటల రుణ ప్రణాళిక విడుదల చేసినప్పుడు ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని కౌలు రైతులకు పంటల రుణాలు ఇచ్చేలా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ మాట్లాడుతూ.. కౌలు రైతులు పండించే అన్ని పంటలకు ఉచిత బీమా పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. ఆలిండియా కిసాన్ సభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.హరినాథ్ మాట్లాడుతూ.. కౌలుదారులకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వకపోవడం సరికాదన్నారు. నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్, జాగృతి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మరీదు ప్రసాదబాబు మాట్లాడుతూ.. ఏటా పెరుగుతున్న కౌలు ధరలను నియంత్రించేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. పలు తీర్మానాలను ఆమోదించారు. రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కన్వీనర్ జి.బాలు, ఏఐకేఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తూమాటి శివయ్య, వివిధ సంఘాల నాయకులు కాటమయ్య, పి.జమలయ్య, ఆర్.రవీంద్రనాథ్, నేతి మహేశ్వరరావు, డి.యలమందరావు, పి.చంద్రానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకంపై విస్తృత ప్రచారం

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : పీఎం సూర్యఘర్ పథకం ప్రయోజనాలు వివరించి, ప్రజలు ఉపయోగించుకునేలా ప్రోత్సహించాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి పేర్కొన్నారు. సౌర విద్యుత్తుతో పర్యావరణ పరిరక్షణ, తగ్గుతున్న విద్యుత్తు బిల్లులపై విస్తృత ప్రచారం చేయాలని కోరారు. సోమవారం సూర్యారావుపేటలోని విద్యుత్తు సర్కిల్ కార్యాలయంలో ఎన్టీఆర్ సర్కిల్ అధికారులతో ఆయన సమీక్షించారు. సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా చూడాలని చెప్పారు. ఆర్‌డీఎస్ఎస్ పథకంలో మండల ప్రాంతంలో మంజూరైన 33 కె.వి., 11 కె.వి. వ్యవసాయ ఫీడర్లను విభజించే పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. తద్వారా మండలాల్లో



మాట్లాడుతున్న సీఎండీ పుల్లారెడ్డి. వేదికపై మురళీకృష్ణ యాదవ్, మూర్తి, వెంకటేశ్వర్లు

గృహ, వాణిజ్య, పరిశ్రమలకు 24 గంటలు 3 ఫేజ్ విద్యుత్తు సరఫరా చేయాలని ఆదేశించారు. 33/11 కె.వి. ఉపకేంద్రాల పరిధిలో అంతరాయాలు గణనీయంగా తగ్గించాలని, నిర్వహణ పనులు ముందుగానే చేసుకోవాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు పాడైపోయాయని, కరెంటు పోయిందని ఫిర్యాదులు వస్తే.. చర్యలు తప్పవని హెచ్చరించారు. వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వ్యవసాయానికి 9 గంటల నిరంతరం సరఫరా అందించాలని, నూతన వ్యవసాయ కనెక్షన్లను తక్షణమే మంజూరు చేసి విడుదల చేయాలని ఆదేశించారు. నిర్ణీత సమయంలో బిల్లులు చెల్లించేలా వినియోగదారులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్లు మురళీకృష్ణయాదవ్ (టెక్నికల్), కె.వి.ఎస్.ఎన్.మూర్తి (ప్రాజెక్ట్స్), ఎస్.వెంకటేశ్వర్లు (ఫైనాన్స్), చీఫ్ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) రాందాస్, సూపరింటెండింగ్ ఇంజినీర్ తోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల 'చలో విజయవాడ' ఉద్రిక్తం



విజయవాడ ధర్నా చౌక్‌లో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు, వర్కర్ల నిరసన

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన 'చలో విజయవాడ' కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. ధర్నా అనంతరం ప్రభుత్వానికి మెమోరాండం ఇచ్చేందుకు వెళుతున్న నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. సమస్యలు పరిష్కరిస్తామంటూ సీఎం ప్రకటనలు చేయడమే తప్ప ఆచరణలో చూపడం లేదని నాయకులు ధ్వజమెత్తారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుబ్బారాయుడు మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను కోతలు లేకుండా ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న 6 డీఏలు, సరెండర్ లీవ్‌ల ఎన్‌క్యాష్‌మెంట్, గ్రాట్యుటీ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వీటిపై ఏడాదిగా మొరపెట్టుకుంటున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని మండిపడ్డారు. 'చలో విజయవాడ'ను అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. నాయకులు సుబ్బారాయుడు, ఎస్. వెంకటసుబ్బయ్య, రాజేష్ గౌడ్, కల్యాణి అప్పలరాజు, ముబారక్, ఇంద్రాణి, చలపతి నాయుడుతో సహా 13 మందిని పోలీసులు అరెస్టు చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, ఎ.రంగనాయకులు, కె.మల్లేశ్వరరావు, కె.మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

జై జగన్ అనాలని భాజపా కార్యకర్తపై దాడి

- ఫోన్ బలవంతంగా లాక్కొని రూ. 3 వేలు బదిలీ
- పెనమలూరు వైకాపా కార్యకర్తలపై కేసు

పెనమలూరు, న్యూస్‌టుడే: జై జగన్ అనాలంటూ భాజపా కార్యకర్తపై ముగ్గురు వైకాపా కార్యకర్తలు దాడి చేసి కొట్టడంతో పాటు దుస్తులు ఊడదీసిన ఘటన కృష్ణా జిల్లా పెనమలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అత్తిరి రమేష్ హైదరాబాద్‌లో కూకట్‌పల్లి వాసి. భాజపా కార్యకర్త కాగా.. అక్కడ ట్రావెల్స్ వ్యాపారం చేస్తుంటారు. ఇతని భార్యా పిల్లలు కృష్ణా జిల్లా పోరంకిలో నివసిస్తుంటారు. ఇతను ప్రతి వారం పోరంకిలోని కుటుంబ సభ్యుల వద్దకు వస్తుంటారు. గత ఆదివారం రాత్రి రమేష్ ఇంట్లో నిద్రిస్తుండగా 11 గంటల సమయంలో ఇతనికి పరిచయం ఉన్న పెనమలూరు వైఎస్ఆర్ కాలనీకి చెందిన గంగాధర్.. బొర్రా వెంకట్‌తో కలిసి కలిసి రమేష్ ఇంటికి వెళ్లి పెనమలూరు వెళదాం రమ్మంటూ తీసుకెళ్లారు. అక్కడి నుంచి మరో వ్యక్తితో సాయంతో రమేష్‌ను వైఎస్ఆర్ విగ్రహం వద్దకు తీసుకెళ్లారు. నువ్వు భాజపా కార్యకర్తవైతే ఏంటి.. జై జగన్ అనాలంటూ చితకబాదారు. అప్పటికీ రమేష్ జై జగన్ అనడానికి ఇష్టపడకపోవడంతో ఒంటిపై ఉన్న దుస్తులు ఊడదీసి మరింతగా కొట్టారు. ఫోన్‌లో డబ్బులు ఎంత ఉన్నాయంటూ రమేష్ ఫోన్ లాక్కున్నారు. ఫోన్‌పే పిన్ నంబరును చెప్పాలంటూ మరోసారి కొట్టడంతో తట్టుకోలేక పిన్ నంబరు చెప్పారు. దీంతో దాడికి పాల్పడ్డ ముగ్గురూ రమేష్ ఫోన్‌పే నుంచి రూ.3 వేలు బలవంతంగా తమ బ్యాంకు ఖాతాకు బదిలీ చేసుకున్నారు. అనంతరం రమేష్‌ను సమీప మెడికల్ షాపు వద్దకు తీసుకెళ్లి కొన్ని మందుబిళ్లలు ఇప్పించి ఇంటికి వెళ్లి పోవాలని లేకపోతే చంపేస్తామంటూ బెదిరించారు. బాధితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇతడిని కొట్టిన గంగాధర్, బొర్రా వెంకట్‌తో పాటు అందుకు సహకరించిన వ్యక్తిపైనా కేసు పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వసుంధర

కన్నబిడ్డలే కాదు.. పంటల్నీ పండించే భూమిని కంటికి రెప్పలా కాపాడుకోగలిగేది మహిళే. హైబ్రిడ్ విత్తనాలు, వాతావరణ మార్పులు, రసాయనాల వాడకంతో సంప్రదాయ పంటలెన్నో అంతరించిపోతున్నాయి... ఆరోగ్యానికి చేటు చేస్తున్నాయి. అందుకే ఆ విత్తనాల్నీ వ్యవసాయ జీవవైవిధ్యాన్నీ, పరిరక్షిస్తూ సేంద్రియ సాగుకు శ్రీకారం చుట్టింది మహిళాలోకం... భూమిని సంరక్షిస్తూ భవిష్యత్తుని చిగురింపచేస్తోంది. ఈ రైతులంతా ఆ కోవకు చెందినవారే. వీళ్ల ప్రయాణం మరెందరికో స్ఫూర్తిదాయకం!

ఎకరాలో 18 రకాలు...



అల్లూరి సీతారామరాజు జిల్లా, డుంబ్రిగుడ మండలం, బలియగుడకు చెందిన **పాంగి వినీత** కుటుంబానికి ఎకరా భూమి ఉంది. రాళ్లు నిండి, నీటి సౌకర్యం లేని ఆ భూమిని సాగులోకి తీసుకు రావాలని నాలుగేళ్ల కిందట సంకల్పించారామె. 'అక్కడ సేద్యమంటే కొండని తవ్వి ఎలుకని పట్టడమే' అన్నారంతా. నేడు ఆ రాళ్ల భూమిలోనే రతనాలు పండిస్తున్నారీ ఆదివాసీ మహిళ. భర్త సహకారంతో రాళ్లను తొలగించారు. కొండ పైనుంచి వస్తున్న ఊట నీటిని పొలానికి మళ్లిస్తున్నారు. ఏడాది పొడుగునా ఆదాయం వచ్చేలా కూరగాయల పెంపకంపై దృష్టి సారించారు. టొమాటో, వంగ, ముల్లంగి, కొత్తిమీర, బెండ, మిరప, మొక్కజొన్న, బీన్స్, తోటకూర, క్యాబేజీ వంటి కూరగాయలను సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌లో రాగులు, సామలను పండిస్తున్నారు. గతేడాది గులి విధానంలో రాగుల్ని సాగు చేసి ఎకరాకు 700 కిలోల మేర దిగుబడిని సాధించారు. ఈ పొలం నుంచి ఏటా రూ.2.50 లక్షల ఆదాయాన్ని పొందుతున్నారు. సేంద్రియ విధానంలోనే సేద్యం చేస్తున్న వినీత... ఆవు, మేకల విసర్జితాలను ఉపయోగించి సొంతంగా ఎరువులు తయారు చేసుకుంటున్నారు. గ్రామంలో 20 కుటుంబాల భూములన్నీ రాళ్లతో నిండినవే. వినీత చూపిన బాటలోనే వాళ్లూ నడుస్తున్నారు. స్థానిక, నాటు విత్తన రకాలకుతోడు ఒడిశా నుంచి కొన్నింటిని సేకరించారు. ఏళ్ల నుంచి చీడపీడలకు గురికాని కూరగాయలు, ఇతర సంప్రదాయ పంటల విత్తనాలను కొద్దికొద్దిగా తెచ్చుకున్నారు. ఏటా పంటలో కొంత భాగాన్ని విత్తనాలకే దాచి పెడతారు. వాటిని గ్రామంలోని ఇతరులకు అందిస్తున్నారు. దీనివల్ల పెట్టుబడి తగ్గడమే కాదు, నాణ్యమైన, నమ్మకమైన విత్తనాలను నాటుకోగలుగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ మహిళా రైతు అవార్డునీ అందుకున్నారు వినీత.

– బంగారం బండి అనీల్‌కుమార్, అరకు

'గట్టు' మేలు తలపెట్టి...



'విత్తు మంచిదైతే పంట కూడా మంచిదవుతుంద'న్న మాటల్ని పక్కాగా పాటిస్తున్నారు గుంటూరు జిల్లా, తెనాలి మండలం ఎరుకలపూడి గ్రామానికి చెందిన **తాడిబోయిన విజయలక్ష్మి**. ఈమె ఒకప్పుడు టైలరింగ్ చేసేవారు. ఓ పొదుపు సంఘ అధ్యక్షురాలు. ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధులు... వీళ్ల సంఘ సభ్యులకు నిర్వహించిన అవగాహన, క్షేత్ర పరిశీలన తరగతుల తర్వాత ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తి ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి 2019 నుంచి వ్యవసాయంలోకి దిగారు. తమకున్న ఎకరాకుతోడు మరో రెండు ఎకరాలను కౌలుకు తీసుకుని ప్రధాన పంటలుగా వరి, మొక్కజొన్న పండిస్తూ, చేను గట్లపైన ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పూల సాగును ప్రారంభించారు. రసాయనాలు లేని పంటలకు ఆదరణ పెరిగిన క్రమంలో పొలం గట్టును 4 అడుగుల నుంచి 10 అడుగులకు పెంచుకుని డ్రాగన్ ఫ్రూట్, అవకాడో వంటి పండ్లకు లవంగాలు, చెక్క, యాలకులు వంటి సుగంధ ద్రవ్యాలను జోడించి మొత్తం మీద 92 రకాల ఉత్పత్తుల సాగుని దఫాల వారీగా చేపట్టారు. రెండు సంవత్సరాల నుంచి ప్రతి పంటలోనూ కొంత భాగం విత్తనాలకు తీస్తూ వస్తున్నారు. అలా 22 రకాల విత్తనాలను తాను వినియోగించుకోవడంతోపాటు ఇతర రైతులకూ అందిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు విజయలక్ష్మి చేస్తున్న ప్రకృతి సాగు, విత్తనాల ఉత్పత్తి తీరును పరిశీలించి, ఆమెను అభినందించారు.

– షేక్ అబ్దుల్ తాజుద్దీన్, తెనాలి

మిల్లెట్ ఉమన్‌గా...

పదేళ్లకే పెళ్లి... వ్యవసాయ కూలీ... **నడిమి దొడ్డి అంజమ్మ** జీవితం ప్రారంభమైంది ఇలానే. అక్షర జ్ఞానం లేకున్నా, సిరిధాన్యాలపై అవగాహనే ఆమెను 'మిల్లెట్ ఉమన్'ను చేసింది. సంగారెడ్డి జిల్లా, గంగ్వార్ గ్రామం ఈమెది.



విత్తనాలు విత్తే సమయం, నేలసారం, తెగుళ్ల సవాళ్లు, నీటి అవసరాలు... ఇలాంటివన్నీ చేతివేళ్ల మీద చెప్పేస్తారీమె. డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ సహకారంతో 80 రకాల వర్షాధార పంటల విత్తనాలతో కూడిన మిల్లెట్ బ్యాంక్‌నూ ఏర్పాటుచేశారు. పదెకరాల పొలంలో సిరిధాన్యాల సాగు చేశారు. 2019లో 'ప్లాంట్ జీనోమ్ సేవియర్'గా కేంద్ర ప్రభుత్వ గుర్తింపునీ పొందారు. 2023లో యూఎన్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్(ఎఫ్ఏఓ)... ప్రపంచవ్యాప్తంగా ఉన్న మిల్లెట్ రైతుల జాబితాలో అంజమ్మను గుర్తించటం ఆమె ప్రతిభకు తార్కాణం.

సాగు, డాక్యుమెంటరీలతో...

తెలంగాణలోని హుమ్నాపూర్ గ్రామం అది. అక్కడి రైతులు ఎవరూ విత్తనాలను బయట కొనరు. **బేగరి లక్ష్మమ్మ** 'సీడ్ బ్యాంక్' ఉండగా వాళ్లకా అవసరం లేదు మరి. 1990ల్లోనే డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ సాయంతో 'సీడ్ బ్యాంక్'ను ప్రారంభించారు. ఏళ్లుగా డీడీఎస్‌లో కమ్యూనిటీ వీడియోగ్రాఫర్‌గానూ పనిచేస్తున్నారు. అప్పట్లో ఆడవాళ్లు కెమెరా పట్టుకోవటమంటే ఓ సాహసం. కానీ, లక్ష్మమ్మ ఆ ధైర్యం చేశారు. మహిళా రైతుల కష్టాలు, సాగు పద్ధతులు... వంటివన్నీ తన కెమెరాలో రికార్డ్ చేస్తూ వారి జీవితాలను ప్రపంచానికి తెలియజేస్తున్నారు.



300లకు పైగా డాక్యుమెంటరీలను రూపొందించిన లక్ష్మమ్మ... కెనడా, థాయ్‌లాండ్, జర్మనీల్లో జరిగిన ఫిల్మ్ ఫెస్టివల్స్‌కి వెళ్లే అవకాశాన్నీ దక్కించుకున్నారు.

చిత్రాడ బీర... సాగులో వీర!



బీర పాదులు వేస్తే ఎక్కడైనా కాయల్ని కోసి వండుకోవడం, అమ్ముకోవడం చేస్తుంటారు. కానీ ఆ గ్రామంలో కాయల నుంచి వచ్చే విత్తనాలతో వ్యాపారం చేస్తుంటారు. పూర్వికుల నుంచి వచ్చిన ఈ ఆచారాన్ని జీవనాధారం చేసుకుని చిత్రాడ బీర(ఏడాకుల బీర)కు దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకొస్తున్నారు. పదుల సంఖ్యలో కుటుంబాలు దీనిపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ గ్రామంలో చాలా ఇళ్ల ముందు ఎండిన బీరకాయలు తోరణాలుగా కనిపిస్తుంటాయి. పాదుల నుంచి వేరు చేసిన ఈ కాయల నుంచి విత్తనాల్ని వేరు చేసి అమ్మకాలు జరుపుతుంటారు. ఈ ప్రక్రియ అంతా మహిళలే చేస్తుంటారు. ఈ విత్తనాలను కేజీ రూ.1500 వరకు అమ్ముతుంటారు. వాతావరణ పరిస్థితులను బట్టి ఎకరాకు 100 నుంచి 150 కేజీల వరకు విత్తనాల దిగుబడి ఉంటుంది. హైబ్రిడ్ బీర వచ్చిన తరవాత చిత్రాడ బీరకు కాస్త గిరాకీ తగ్గింది. కానీ, విదేశాల్లో ఉండేవారు అక్కడ బీర పంట వేసుకునేందుకూ, రాష్ట్రంలో చాలా కుటుంబాలు డాబాలపై సాగు కోసం ఇక్కడ నుంచి విత్తనాలు తీసుకెళ్తుంటారు. రుచిలో ఈ బీర బాగుంటుందని చెబుతుంటారు.

– పి.చిన్నబాబు, పిఠాపురం

సేంద్రియ మంత్రం... సాగులో మమేకం



ప్రకృతి హితంగా సేంద్రియ సాగు చేస్తున్నారు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం ఈదరాడ మహిళలు. తక్కువ వ్యయంతో దేశవాళీ వరి రకాలను సాగు చేస్తూ పోషక విలువలున్న ధాన్యాన్ని ఉత్పత్తి చేస్తున్నారు. రైతు సాధికార సంస్థ శిక్షణతో కషాయాలు, ద్రావణాలు తయారుచేసి వాటిని ఎరువులుగా, క్రిమి సంహారక మందులుగా ఉపయోగిస్తున్నారు. పెసర, మినుము, గోంగూర, జీలుగ, బొబ్బర్లు, శనగ, ఆవాలు, కొత్తిమీర, జొన్న వంటి 21 రకాల విత్తనాలు చల్లి వాటిని భూమిలో కలియదున్నడం ద్వారా నేల సారవంతం చేస్తారు. వీరిలో ఇంటర్ చదివిన **కుడుపూడి జానకి** రెండున్నర ఎకరాల్లో, బీఏ పూర్తి చేసిన **పెల్లబోయిన రాధ**, బీఎస్సీ బీఈడీ చేసిన **కుడుపూడి స్వాతీనాగమణి**, బీఏ బీఈడీ చేసిన **కుసుమ పద్మావతి** ఎకరా చొప్పున కుజిపతాళియ, బ్రౌన్ రైస్, నవర, వరి సహా గట్లపై పలు రకాల కూరగాయలను పండిస్తున్నారు. వీరికి ఎకరాకు 20 నుంచి 25 బస్తాల వరకు దిగుబడి సాధిస్తున్నారు. వీరు వినియోగించే విత్తనాల్ని వారు భద్రపరుచుకున్నవే కావడం విశేషం.

– కె.తిరునాథస్వామి, మామిడికుదురు



'విత్తనం నాటుదాం... సాధికారతని పండిద్దాం'

ఆరోగ్యాన్ని పండిస్తోంది!

రెక్కాడితే కానీ డొక్కాడని బతుకు పరమాత్ముల కోటేశ్వరమ్మది. ప్రమాదంలో కాలు పోగొట్టుకుంది. ఆ బాధ నుంచి కోలుకోకముందే చెయ్యి విరిగింది. అయినా నిరాశను దరిచేరనివ్వలేదు. సేంద్రియ వ్యవసాయం చేస్తూ ఆరోగ్యాన్ని పండిస్తోంది.

మాది పల్నాడు జిల్లా, యడ్లపాడు మండలంలోని ఉన్నవ గ్రామం. వ్యవసాయమే జీవనాధారం. ఏడేళ్ల కిందట వ్యవసాయ శాఖ నుంచి కొందరు వచ్చి రసాయన ఎరువులు తగ్గించి, సేంద్రియ వ్యవసాయం చేయమన్నారు. దానిమీద ఆసక్తి, నమ్మకం లేకపోయినా భూమికి కలుగుతున్న హాని గురించి తెలిశాక... పదిహేను సెంట్లలో రసాయనాలు చల్లకుండా మిర్చి వేశా. మిగిలిన పొలంలో తెగుళ్లు రాకుండా రసాయనాలు చల్లాను. అయినా తెగుళ్లు పట్టాయి. పంట పోయింది. కానీ, సేంద్రియ మిర్చి చెక్కు చెదరలేదు. అప్పట్నుంచీ సేంద్రియ వ్యవసాయం మొదలుపెట్టా. మంచి దిగుబడీ వచ్చింది. మా జిల్లాలో ఇలా చేసిన మొదటి మహిళని నేనే. ఇంతలోనే కొవిడ్... మిర్చి లోడ్ చేసి ఇంటికి వెళ్తుండగా.. వెనక నుంచి ఆటో వచ్చి ఢీకొట్టింది. తీవ్రగాయాలయ్యాయి. లాక్‌డౌన్ వల్ల ఏ ఆస్పత్రిలోనూ చేర్చుకోలేదు. రోజంతా చికిత్స అందలేదు. మరుసటి రోజు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చితే... ఇన్‌ఫెక్షన్ సోకింది, కాలు తీసేయాలన్నారు. ఇద్దరం కష్టపడితేనే మూడుపూటలా తినడం కష్టం... ఇప్పుడు అది కూడా సాధ్యం కాదని తెలిసి చాలా ఏడ్చాను. ఆపరేషన్ కోసం ఉన్న ఎకరం పొలాన్నీ అమ్మేశాం. రూ.6 లక్షలకు పైగానే అప్పు చేశాం. కోలుకుని ఇంటికి వచ్చాక... సేంద్రియ వ్యవసాయం చేసిన మహిళగా నాపై వచ్చిన కథనాలు చూశా. ఆ స్ఫూర్తితోనే... పొలం కౌలుకు తీసుకుని పండించడం మొదలుపెట్టా. సర్జికల్ వాకర్ సాయంతో పొలంలోకి అడుగుపెట్టా. కానీ కొన్ని రోజులకి ఇంట్లో జారిపడితే చెయ్యి విరిగింది. దెబ్బ మీద దెబ్బ... అయినా సాగు మానలేదు. పర్వాలేదు అనుకున్న సమయానికి తుపాను వచ్చింది. పది ఎకరాల్లో వేసిన మిర్చి, కంది, కూరగాయలన్నీ కళ్లముందే తుడిచిపెట్టుకుపోయాయి. రూ.3 లక్షల నష్టం.



అప్పుడే హైదరాబాద్, గుంటూరు నుంచి కొందరు వచ్చి... వ్యవసాయం మానేయొద్దనీ, పండించిన పంటనంతా వాళ్లే కొంటామని ఒప్పందం చేసుకున్నారు. అలా ప్రస్తుతం ఆరెకరాలు కౌలుకు తీసుకుని సేంద్రియ వ్యవసాయం చేస్తున్నా. మిర్చి, పత్తి, కంది, అరటి, క్యాబేజీ, క్యారెట్ ఇలా సుమారు 30 రకాల పంటల్ని పండిస్తున్నా. పదిమందికి ఉపాధీ కల్పిస్తున్నా. గట్టు పైనుంచే అజమాయిషీ చేస్తూ... కూలీలతో పని చేయించడం నాకు ఇష్టం ఉండదు. దుక్కిదున్నడం దగ్గర్నుంచీ కలుపు తీయడం, కూరగాయలు కోయడం, పత్తి ఏరడం లాంటి పనులన్నీ నేను చేస్తూ వాళ్లతోనూ చేయిస్తాను. చుట్టుపక్కల కాలనీలకు, కొన్ని ప్రైవేట్ కళాశాలలకు కూరగాయల్ని విక్రయిస్తున్నా. ప్రభుత్వమూ మాలాంటి వారికి సాయం చేస్తే రసాయన రహిత ఆహారం అందరికీ చేరువవుతుంది.

– భూపతి. సత్యనారాయణ, నరసరావుపేట

యాభై వేలమందికి... విత్తనాలిచ్చా!

అందరికీ ఆరోగ్యం... ఇదే లక్ష్యంగా సాగుతున్నారు ప్రియా రాజ్ నారాయణన్. దాని కోసం విత్తనాలను సేకరించి అందరికీ అందించడమే కాదు, మిద్దెతోట ఏర్పాటు, సంప్రదాయ విత్తనాల పునరుద్ధరణలోనూ సాయపడుతున్నారామె.



మాది తమిళనాడులోని పిలాత్తు గ్రామం. వ్యవసాయ కుటుంబమైనా అమ్మానాన్నలు కష్టపడి చదివించారు. పెళ్లయ్యాక తిరుప్పూర్‌కు వచ్చేశాను. గ్రామంలో సేంద్రియ కూరగాయలు తింటూ పెరిగిన నాకు ఇక్కడి ఆహారం రుచిగా అనిపించలేదు. అన్నీ రసాయనాలతో కూడినవే. నా పిల్లలకు అలాంటి ఆహారం ఇవ్వకూడదనుకుని నా మోటర్ బైక్ మీద దేశీ వంగడాలను వెతకడం ప్రారంభించా. అలా 2007లో ప్రారంభమైన నా ప్రయాణం 18ఏళ్లుగా కొనసాగుతూనే ఉంది. తమిళనాడు గ్రామాల్లో 40ఏళ్ల క్రితంనాటి వంగడాలూ దొరికాయి. తరవాత్తరవాత ఇతర రాష్ట్రాల స్నేహితులు, బంధువుల నుంచి కూడా విత్తనాలు సేకరించి మిద్దె తోటలో సేంద్రియ పద్ధతిలో పండించా. కూరగాయలు, పండ్లలో ఎన్నెన్ని రకాల దేశీ వంగడాలున్నాయో వెతికి మరీ సేకరించా. నేనొక్కదాన్నే ప్రయత్నిస్తే సరిపోదు కదా! అందుకే రైతుల ఉత్పత్తుల ప్రదర్శనల్లో అంతరించిపోతున్న వంగడాలపై అవగాహన కల్పించడమే కాదు, రైతులకు వాటిని అందించేదాన్ని కూడా.

విత్తనాల పునరుద్ధరణ కోసం ఊళ్లో మూడెకరాల పొలంలో పంటలు వేస్తున్నా. ఉద్యోగానికి రాజీనామా చేసి మరీ విత్తనాల సంరక్షణలో నిమగ్నమయ్యా. అలా ఇప్పటివరకూ వెయ్యి రకాలు సేకరించా. వీటితో సీడ్ బ్యాంక్‌ని ఏర్పాటు చేయాలనుంది. ఈ ప్రయాణంలో ఆసక్తి ఉన్నవారెందరో కనిపించారు. అలాంటి 50 వేలమందికి విత్తనాలు అందించా. కూరగాయలను పండించడం వల్ల నా కుటుంబం ఆరోగ్యంగా ఉంది. ఇందుకు కృతజ్ఞతగా ప్రకృతికి నేను చేసే సాయంగా దీన్ని భావిస్తున్నా. అందుకే విత్తనాలను ఉచితంగానే అందిస్తున్నా. మిద్దెతోట, సేంద్రియ వ్యవసాయానికి సంబంధించి వాట్సాప్‌లో 12 గ్రూపులు ఏర్పాటు చేసి, అవగాహన కల్పిస్తున్నా. 'ఇయర్కై వళి వీట్టు తోట్టం' పేరుతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ శిక్షణా తరగతులూ నిర్వహిస్తున్నా. వీటన్నింటి విశేషాలతో నిర్వహిస్తోన్న నా యూట్యూబ్ ఛానెల్‌కి కోట్లలో వీక్షణలున్నాయి. తమిళనాడులో ప్రతి ప్రాంతానికి ప్రత్యేక కూరగాయల రకాలుండేవి. నేడు కొన్నే కనిపిస్తున్నాయి. వాటిని సంరక్షించి, పునరుద్ధరించకపోతే అవన్నీ అంతరించిపోతాయి. అందుకే మహిళల్ని కుండీల్లో అయినా పెంచమని ప్రోత్సహిస్తుంటా. అందరం కృషి చేస్తేనే సంప్రదాయ విత్తనాలు రేపటి తరానికి అందివ్వగలం.

– ఆళ్ల లక్ష్మిహరికృష్ణ, చెన్నై

తనలాంటి వాటిని పుట్టించడం విత్తనం సహజ లక్షణం. కానీ జన్యు పరమైన మార్పులు చేసిన విత్తనాల్లో ఈ ప్రకృతి ధర్మం లోపిస్తుంది. నిజానికి విత్తనాల ఎంపిక, సేకరణ, నిల్వ వీటిలో శాస్త్రవేత్తలకు మించిన పరిజ్ఞానం రైతులకు ఉంటుంది. దీన్ని తెలుసుకోకుంటే... జెనెటిక్ ఇంజినీరింగ్, పేటెంట్‌ల పేరుతో విత్తన కంపెనీలకు బానిసలుగా మారుతాం, అది ఆహార బానిసత్వానికి దారి తీస్తుంది. అందుకే 'నవ్ ధాన్య' సంస్థను ప్రారంభించి... స్థానిక వంగడాల సంరక్షణ దిశగా గత నాలుగు దశాబ్దాలుగా ఉద్యమిస్తున్నాం.

- వందనా శివ, పర్యావరణవేత్త



కలలు కని సాధించిన ఐటీ ఉద్యోగాన్ని... పెళ్లి తరవాత త్యాగం చేయాల్సి వస్తే... నిరాశ ఆవరిస్తుంది. జీవితమే వృథా అయిపోతుందనిపిస్తుంది... ఇలానే ఆమె కూడా బాధపడ్డారు. కానీ, అందులోనే ఉండిపోలేదు. ఉన్నచోటే కొత్త అవకాశాల్ని సృష్టించుకున్నారు. సమీకృత వ్యవసాయ విధానాలతో నష్టాల సాగుని లాభాల బాట పట్టించారు కర్ణాటకకు చెందిన కవితా మిశ్రా. ఆవిడని 'వసుంధర' పలకరించగా...

చందనం చెట్లకు చిప్ కాపలా!

కాలమే జీవిత పాఠాలు నేర్పుతుందని నమ్ముతా. ఈ విషయాన్ని అనుభవపూర్వకంగానూ అర్థం చేసుకున్నా. నా పాఠశాల చదువంతా ధార్వాడ్‌లో సాగింది. హుబ్బళ్లిలో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరింగ్, సైకాలజీలో మాస్టర్స్ చేశా. అప్పుడప్పుడే ఐటీ ఊపందుకుంటోంది. అవకాశాలూ వచ్చాయి. నా లక్ష్యమూ ఆ కొలువే. ఉద్యోగంలో చేరా. ఈలోగా రాయ్‌చూర్‌కి చెందిన ఉమాశంకర్ మిశ్రాతో పెళ్లయ్యింది. తర్వాత జాబ్ చేసేందుకు అత్తారింట్లో ఒప్పుకోలేదు. ఇంట్లో ఖాళీగా ఉండటం నాకిష్టం లేదు. ఆ విషయాన్నే మా వారికి చెప్పా. ఆయన ఎనిమిదెకరాల పొలాన్ని అప్పజెప్పారు. మొదట కాదన్నా... ఆలోచిస్తే అది తప్ప మరే ప్రత్యామ్నాయం కనిపించలేదు. అయితే, అదేమో బంజరుభూమి. దాన్నేం చేయాలో అర్థం కాలేదు. మొదట భూమి చదును చేయించా. నీళ్లకోసం బోరు వేయించినా అది పెద్ద ధార లేదు. ఈ నీటిని నమ్ముకుని వరి సాగు చేయడం కష్టం. అందుకే, ఆ నేల, వాతావరణం గురించి మరిన్ని విషయాలు తెలుసుకోవడం ఆరంభించా.



కవిత

నష్టాలు దాటి...

తొలుత దానిమ్మ తోట వేశా. మంచి లాభాలు వచ్చాయి. కానీ, ఆ తర్వాత తెగుళ్లు సోకడంతో పంట పూర్తిగా దెబ్బతింది. ఒక పంటకే పరిమితమైతే ఇలాంటి ఇబ్బందులే ఎదురవుతాయని అర్థమైంది. ఈ నష్టాలు చూసి అందరూ... ఎందుకింత శ్రమ అన్నారు. నా మనసు మాత్రం వెనకడుగు వేయడానికి ఒప్పుకోలేదు. కొంత పరిశోధన తర్వాత ఉద్యాన పంటలతోపాటూ అటవీ వ్యవసాయం(అగ్రో ఫారెస్ట్) సాగు చేయడం ఆరంభించా. ఈ ఆలోచన నా జీవితాన్నే మార్చేసింది. దీర్ఘకాల ప్రయోజనాల కోసం చందనం చెట్లు నాటా. వాటి మధ్యలో మామిడి, బత్తాయి, నిమ్మ, నేరేడు, జామ, మునగ, ఉసిరి, రేగు... వంటి పండ్ల మొక్కలను వేశా. వీటితోపాటు రోజువారీ స్థిరమైన ఆదాయం కోసం ఆవులు, కోళ్లు, తేనెటీగల పెంపకం చేపట్టా.

ఈ విధానం పెట్టుబడి వ్యయం తగ్గి మంచి రాబడి పొందే అవకాశం కల్పించింది. అందుకే, నా అనుభవాలను ఇతర రైతులకూ పంచాలనుకున్నా. శిక్షణ, సలహాలు ఇవ్వడం ఆరంభించా. ముఖ్యంగా చందనం మొక్కల సాగు... రైతులకు చేర్చాలని ప్రత్యేకంగా నర్సరీని ఏర్పాటుచేశా. ఆరంభంలో మా పొలంలో నాటిన 2500 చందనం మొక్కలు ఇప్పుడు పెరిగి పెద్దయ్యాయి. వీటి విలువ ప్రస్తుతం కోట్ల రూపాయలు. వీటిని దొంగతనం చేయకుండా ప్రతి చెట్టుకీ మైక్రోచిప్‌లను అమర్చా. గొడ్డలి వేటు పడితే చాలు వెంటనే ప్రకంపనలు వస్తాయి. స్మార్ట్‌ఫోన్‌కి అలర్ట్ వస్తుంది. మేం వెళ్లేలోగా దొంగలు వాటిని పట్టుకెళ్లినా జీపీఎస్‌తో ట్రాక్ చేయొచ్చు. డ్రోన్, సీసీ కెమెరాలతో రక్షణ ఏర్పాటుచేశా. ఈ తరహాలో వినూత్నంగా సాగు చేయడంతో ఇన్నోవేటివ్ ఫార్మర్‌గా, ఆంత్రప్రెన్యూర్‌గా నాకో గుర్తింపు దక్కింది. తాజాగా మిలియనీర్ ఫార్మర్ ఆఫ్ ఇండియా అవార్డు అందుకున్నా. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ అందించింది.

– మల్లేపల్లి రమేశ్‌రెడ్డి, హైదరాబాద్

ఒకే రకమైన పంటను పండిస్తే భోజన పళ్లెంలోకి మిగిలిన ఆహారం ఎలా వస్తుంది? అందుకే ఇంటికి ఎంత ఆహారం అవసరమో, ఎన్ని రకాల పంటలు పండించాలో, ఏ పండుగలు చేసుకోవాలో మహిళలే నిర్ణయిస్తారు. వీళ్లే... విత్తన సంరక్షకులు, జ్ఞాన భాండాగారాలు!



- డా. వనజా రాంప్రసాద్, గ్రీన్ ఆర్మీ వ్యవస్థాపకులు

భద్రపరుద్దాం ఇలా..!

ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణపై ఆందోళన, ఆరోగ్యంపైన అవగాహన పెరిగాయి. దాంతో కూరగాయలు, పండ్లు వంటివాటిని సేంద్రియ విధానంలో పెంచాలనుకుంటున్నారు. మరి దానికోసం వాడే విత్తనాలూ అలాంటివే ఉండాలిగా! వాటిని సేకరించి సాగు చేయడమే కాదు... భవిష్యత్తుకోసం దాచుకోవడమూ ముఖ్యమే. అదెలాగో తెలుసా?



- మిరప, టొమాటో, బెండ, వంగ, దోస, బీర, చిక్కుడు... విత్తనాలను సరిగా భద్రపరచకపోతే 15రోజుల్లోనే పురుగులు గుడ్లు పెట్టి రంధ్రాలు చేస్తాయి. దాంతో మొలకశాతం తగ్గిపోతుంది. అలాకాకుండా ఉండాలంటే... వీటిని నిల్వచేయడానికి ముందు కనీసం, 2-3రోజులపాటు నీడలో ఆరబెట్టాలి. ఆపై వీటిని పలుచటి వస్త్రంతో చేసిన సంచుల్లో, తేమ చేరని డబ్బాల్లో పెడితే సరి.



- విత్తనాలకు బూడిద కలిపి ఉంచితే 6-10నెలలపాటు నిల్వ ఉంటాయి. లేదంటే కర్పూరం, ఆముదం పిప్పి కలపొచ్చు.



- వెదురు బొంగులకు మట్టి, పేడ మిశ్రమాన్ని పూతగా వేసి జొన్న, బియ్యం, గోధుమ వంటి వాటిని భద్రపరిస్తే ఎక్కువ కాలం పాడవ్వవు.



- వెల్లుల్లి, వేపాకులు నిల్వ చేసే విత్తనాల్లో వేస్తే పురుగు పట్టి పాడవకుండా ఉంటాయి.



- మట్టి కుండల్లో విత్తనాలను భద్రపరిచి లోపల ఓ చిన్న బొగ్గుముక్క వేసి... గాలి చేరకుండా పల్చటి గుడ్డను చుట్టి పెట్టాలి. ఇలానే గాజు సీసాల్లోనూ ఉంచొచ్చు.



- కిలో విత్తనాలకు సుమారు 200 గ్రాముల ఉప్పు, పసుపు కలిపి నిల్వ చేస్తే 6-8 నెలల పాటు పుచ్చు రాకుండా కాపాడుకోవచ్చు.



- విత్తనాలు భద్రపరిచే పెట్టె లేదా సీసాల కింద... అగ్గిపెట్టె డబ్బాలను పెడితే సరి. వాటిల్లోని ఫాస్ఫరస్ గింజల్లోకి తేమను చేరనివ్వదు.

ఇంటి సాగుకు... చిన్ని సాయాలు!

చినుకులు పడగానే పల్లెలకే కాదు, పట్టణాలకీ సాగు కళ వచ్చేస్తుంది. ఇంట్లోవాళ్లకి ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలి, ఆవరణంతా పచ్చదనంతో నింపేయాలనుకుంటారు మహిళలు. తోట పనిని మొదలుపెట్టడానికీ వాళ్లకిదే అనువైన సమయం మరి. మీరూ ఆ జాబితాలో ఉన్నారా? ఈ చిన్ని సాయాలు సాయపడతాయి... ఓసారి చూసేయండి.

విత్తనాలకు ప్రత్యేకం



విత్తనాలను మొలకెత్తించి, తరవాత కుండీల్లోకి మార్చడం చాలామంది చేసేదే. కానీ ఆ జెర్మినేషన్ ప్రక్రియతోనే ఇబ్బంది. పోషకాలు సమపాళ్లలో అందేలా మట్టిని రూపొందించుకోవాలి. అదంతా తెలియదు లేదా దానికోసం ఎక్కువ సమయం కేటాయించలేం అనుకున్నవాళ్లు కాయిర్ సీడ్ జెర్మినేషన్ కిట్‌ని తెచ్చుకోవచ్చు. ఈ కాయిర్‌ని వేడినీటితో తడపగానే కొన్ని రెట్లు పెద్దది అవుతుంది. కోరుకున్న విత్తనాన్ని దానిలో విత్తుకుని క్రమం తప్పకుండా నీళ్లు అందిస్తే చాలు. ఎలాగూ బయోడిగ్రేడబుల్‌దే కాబట్టి, నేరుగా మొక్కతోసహా కుండీలో నాటుకోవచ్చు. చనిపోతాయన్న భయమూ ఉండదు.

హైడ్రోపోనిక్స్‌కీ వీలుగా...



ఇప్పుడు అందరి ఎంపికా అపార్ట్‌మెంట్లే. అలాంటప్పుడు పెద్ద గార్డెన్లకు చోటేది? అలాగని మొక్కల పెంపకమ్మీద ప్రేమను చంపుకోలేరు కదా! అందుకే హైడ్రోపోనిక్స్ బాట పడుతున్నారు చాలామంది. ఇంట్లోవాళ్లకి ఆరోగ్యకరమైన, తాజా ఆహారాన్ని అందించాలనుకునే వారూ దీన్నే ఎంచుకుంటున్నారు.



ఈ విధానానికి అనువుగా విత్తనాలను మొలకెత్తించేలా 'హైడ్రోపోనిక్స్ గ్రోయింగ్ సీడ్ స్టార్టర్ క్యూబ్స్'ని తెచ్చుకోండి. ఈ క్యూబ్స్‌ని డిస్టిల్డ్ లేదా డీఅయోనైజ్‌డ్ నీటిలో ఒకరోజంతా ఉంచాలి. తరవాత నచ్చిన విత్తనాన్ని దానిలో ఉంచి, తేమని అందిస్తే చాలు. మొక్క కాస్త పెరిగాక హైడ్రోపోనిక్ ట్యూబ్‌ల్లోకి మారిస్తే సరిపోతుంది.


బాల్ వేయండి



ప్రత్యేక సందర్భాలకు గుర్తుగా, ఛాలెంజ్‌ల్లో భాగంగా మొక్కలు నాటడం మామూలే. గుంతలు తీసి, మొక్కలు నాటే ఓపిక లేదనిపిస్తే ఈ సీడ్ బాల్ లేదా బాంబ్‌లను ఖాళీ ప్రదేశాల్లో విసిరేయండి. మట్టి, మినరల్స్‌లో విత్తనాలుంచిన ముద్దే ఈ సీడ్ బాల్. స్వయంగా తయారు చేసుకోవాల్సిన పనిలేదు. మార్కెట్‌లో బోలెడు దొరుకుతున్నాయి. ఇంట్లో పెంచుకోవాలనుకున్నా... కావాల్సిన పూలు, పండ్లు, కాయగూరలు, ఆకుకూరల విత్తనాలతో ఈ బాల్స్ దొరుకుతున్నాయి. తెచ్చుకుని, నీళ్లు అందించడమే!



ఆరు పలకల కోసం... అడ్డదారులు వద్దు!



హైదరాబాద్‌కు చెందిన 25 ఏళ్ల యువకుడు 2-3 నెలల్లోనే కండలు తిరిగిన దేహం వస్తుందన్న మాటలు విని స్టెరాయిడ్ ఇంజక్షన్లు, ప్రొటీన్ పౌడర్లు అదే పనిగా తీసుకున్నాడు. దీంతో కిడ్నీలు దెబ్బతిని ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. పరీక్షల్లో మూత్రపిండాలకు హైఫిల్టరేషన్ గాయాలైనట్లు వైద్యులు గుర్తించారు. చికిత్స చేయడంతో తిరిగి కోలుకున్నాడు.

ఆరు పలకల దేహంపై మోజు పెంచుకుంటున్న కొందరు యువకులు కండల కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. అవగాహన లేని జిమ్ ట్రైనర్లు, శిక్షకుల మాటలు విని ప్రాణాలను పణంగా పెడుతున్నారు.

వైద్యుల సూచనలతో మాత్రమే తీసుకోవాల్సిన ఇంజక్షన్లు, స్టెరాయిడ్లు... మార్కెట్‌లో దొరికే ప్రొటీన్ పౌడర్లను విచ్చలవిడిగా వాడేస్తున్నారు. దీర్ఘకాలంలో ఇవి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని, కొన్నిసార్లు ప్రాణాలకూ ప్రమాదం ఉంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

బలం కాదు... వాపే!

- ఈ తరహా మందులు వాడడం వల్ల చాలా అనర్థాలున్నాయి. గుండె ఆరోగ్యం, కిడ్నీలతో పాటు లైంగిక సామర్థ్యం కూడా దెబ్బతింటుంది. చిత్త భ్రమలు వంటి సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉంది.
- కుటుంబంలో కిడ్నీ వ్యాధుల చరిత్ర ఉన్నవారికి ఈ స్టెరాయిడ్లు మరింత హాని చేస్తాయి.
- స్టెరాయిడ్లు కండర కణజాలం వేగంగా పెరిగేందుకు దోహదం చేస్తాయి. అయితే ఇది ఒక రకమైన వాపు మాత్రమే. ఈ ఇంజక్షన్లు తీసుకున్న 2-3 నెలల్లోపే కండలు పెరిగినట్లు కన్పిస్తాయి.
- వాపును బలుపు అనుకుంటే పొరపాటే. తర్వాత కసరత్తులు ఆపేసినా... స్టెరాయిడ్లు మానేసినా అంతే వేగంగా కనుమరుగై ఆ ప్రాంతంలో శరీరం వదులుగా మారుతుంది.

కిడ్నీలకు దెబ్బ...

- కండలు పెంచేందుకు వాడే స్టెరాయిడ్లు, వివిధ రకాల ప్రొటీన్ల వాడకం వల్ల కిడ్నీలపై ఒత్తిడి పడుతుంది. వాటికి హైపర్ ఫిల్టరేషన్ గాయాలు అవుతుంటాయి.
- నిమ్స్ ఇతర ఆసుపత్రులకు వచ్చే కిడ్నీ బాధితుల్లో ఇలాంటి వారు ఉంటున్నారని వైద్యులు చెబుతున్నారు.

సడన్ కార్డియాక్ ప్రమాదం



జిమ్‌లో కండల కోసం వాడే మెఫెంటెర్‌మైన్ సల్ఫేట్ ఇంజక్షన్‌తో గుండె ఆరోగ్యం పెను ప్రమాదంలో పడుతుంది. నాళాల్లో రక్త ప్రసరణ పెరిగి గుండె వేగంగా కొట్టుకుంటుంది. కొన్నిసార్లు ఇది వెంట్రిక్యులర్ ఫిబ్రిలేషన్, వెంట్రిక్యులర్ టెకీ కార్డియాకు దారి తీస్తుంది. దీనివల్ల ఆకస్మికంగా గుండె ఆగిపోతుంది. జిమ్‌లో కసరత్తులు చేస్తూ యువత చనిపోవడానికి కారణాల్లో ఒకటి.

– డాక్టర్ సాయి సతీశ్, సీనియర్ హృద్రోగ నిపుణులు, నిమ్స్

తాజాగా హైదరాబాద్‌లో ఓ జిమ్ కోచ్ యువతకు 400 మెఫెంటెర్‌మైన్ సల్ఫేట్ ఇంజక్షన్లను విక్రయిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. గతంలో మెహిదీపట్నంలో ఓ జిమ్ ట్రైనర్ వద్ద 217 స్టెరాయిడ్ ఇంజక్షన్లు గుర్తించి అరెస్టు చేశారు. ఒక్క హైదరాబాద్‌లో 70 వరకు కేసులు నమోదు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో తరచూ ఈ తరహా సంఘటనలు నమోదు అవుతున్నాయి.



ఆ ఇంజక్షన్ అసలొద్దు...

- మెఫెంటెర్‌మైన్ సల్ఫేట్ ఇంజక్షన్ రక్తపోటు తగ్గించేందుకు... శస్త్ర చికిత్సల సమయంలో హార్ట్‌బీట్ నియంత్రణ కోసం వైద్యుల పర్యవేక్షణలో వాడతారు.
- ఇది శరీరంలోని నాడీ వ్యవస్థపై పనిచేసి ఎడ్రినలిన్‌ను ఎక్కువ మోతాదులో విడుదల చేస్తుంది.
- దీంతో రక్తప్రసరణ, గుండె లయ పెరిగి శరీరం తాత్కాలిక ఉత్తేజానికి లోనై ఎక్కువ సమయం జిమ్ చేసేందుకు ఇష్టపడతారు.
- వీటిని ఎక్కువగా వాడడం చాలా ప్రమాదమని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ప్రణాళికతోనే సాధ్యం..

- ఆరోగ్యంగా ఉండడం ప్రతి ఒక్కరికీ అవసరం. తగిన ప్రణాళిక, శ్రమతోనే మంచి దేహదారుఢ్యం సాధ్యమవుతుంది. సరైన శిక్షకుల పర్యవేక్షణలో వ్యాయామం చేయాలి.
- మంచి డైట్ చాలా కీలకం. సమతులాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలి. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి.
- నియమబద్ధంగా ప్రయత్నిస్తే మంచి రూపం రావడానికి ఆరు నెలల నుంచి... ఏడాది సమయం పట్టే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.
- ఇంత శ్రమ, ఓపిక లేనివారిని కొంతమంది తప్పుదారి పట్టిస్తున్నారు. సొమ్ము కోసం జిమ్‌లకు వచ్చే వారిని ఈ ఇంజక్షన్లు తీసుకోవాలని ప్రోత్సహిస్తున్నారు.

- ఈనాడు, హైదరాబాద్

సైలెన్స్ ప్లీజ్!



కొందరు యువకులు అందరి దృష్టినీ ఆకర్షించేందుకు.. ద్విచక్ర వాహనాల సైలెన్సర్లు మార్చేసి.. చెవులు చిల్లులు పడేలా శబ్దంతో, పరిమితికి మించిన వేగంతో రోడ్లపై తిరుగుతూ ఇబ్బందులు కలిగిస్తుంటారు. దీనిపై యువతకు అవగాహన కల్పించేందుకు హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు వినూత్నంగా ఆలోచించారు. తనిఖీల సమయంలో స్వాధీనం చేసుకున్న సైలెన్సర్లతో అశోక కూడలిలో టవర్ ఏర్పాటు చేశారు. ఎక్కుపెట్టిన తుపాకీలా అక్షులనేలా దీన్ని తీర్చిదిద్దారు. శబ్ద కాలుష్యానికి పాల్పడితే సైలెన్సర్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు జరిమానా విధిస్తామని.. అందరికీ అవగాహన కలిగేలా దీనిని ఏర్పాటు చేశామని ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి తెలిపారు.

– ఈనాడు, హనుమకొండ



అడవి కోళ్లు.. అదిరే రంగులు

రంగు రంగుల ఈకలతో ఆకర్షణీయంగా కనిపిస్తున్న ఈ అడవి కోళ్లను జిథకోళ్లు అని పిలుస్తారు. వైఎస్సార్ కడప జిల్లాలోని సిద్ధవటం అటవీ ప్రాంతంలో అవి వ్యాహ్యాళికి వచ్చినప్పుడు తీసిన చిత్రమిది. ఈ జాతిలో మగ కోడి ఈకలతో ఆకర్షణీయంగా ఉంటుంది. దాని సంరక్షణ బాధ్యతను ఆడ కోడి చూసుకుంటుంది. ఈ పక్షులు ఏపీతో పాటు దక్షిణాది ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తుంటాయని పక్షి శాస్త్రవేత్త మహ్మద్ హయ్యత్ తెలిపారు.

– ఈనాడు–కడప, న్యూస్‌టుడే–సిద్ధవటం

కొత్త జీవితం.. ఒక్క నిర్ణయం దూరంలో!



'అంతా అయిపోయింది' అని ఎప్పుడూ అనుకోకండి! ఊహించుకుంటున్నంతగా పరిస్థితులు మీ చేయిదాటిపోలేదు. ఒకటో రెండో ప్రతికూల అలవాట్లను మానేస్తే మీరు తిరిగి పుంజుకోగలరు. సరికొత్త వ్యక్తిగా అవతరించగలరు. సోషల్ మీడియా స్క్రోలింగ్‌ను పక్కనపెట్టి రోజూ ఒక గంటసేపు పుస్తకం చదవడం.. మద్యం మానేసి ఆరోగ్య సంరక్షణపై దృష్టి పెట్టడం.. ఇలా ఏదో ఒక మెరుగైన ముందడుగు వేయండి. కొత్త జీవితాన్నిమొదలుపెట్టేందుకు మీరు ఒకే ఒక్క నిర్ణయం దూరంలో ఉన్నారని గుర్తుంచుకోండి.

– ఎడ్డీ క్వాన్, కంటెంట్ క్రియేటర్

అంబరం.. అబ్బురం..





ఒకే నింగి.. ఎన్ని రంగులో..! ఒక చోట నిప్పులు కురిపిస్తున్నట్లు కాషాయం కప్పేయగా.. మరోచోట కరి మబ్బులు కమ్ముకుని ఆ ప్రాంతాన్ని చీకటిమయం చేసింది. రెండు వేర్వేరు ప్రాంతాల్లో అబ్బురపరిచే ఈ అంబరాన్ని చూస్తే వారెవ్వా అనిపించింది. మంగళవారం ఆకాశం ఇలా ఒక్కోచోట ఒక్కో రంగు మార్చుకుని చూపరులను కట్టిపడేసింది. మొదటి చిత్రం మహబూబాబాద్ పట్టణ పరిధిలోని అనంతారం వేంకటేశ్వరస్వామి ఆలయం గోపురంపై కారు మబ్బులు కమ్ముకుని దర్శనమిచ్చింది. రెండో చిత్రం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలో నింగి ఇలా ఎర్రబారింది. ఈ రెండు దృశ్యాలను 'న్యూస్‌టుడే' తన కెమెరాలో బంధించింది.

– న్యూస్‌టుడే, నెహ్రూ సెంటర్ (మహబూబాబాద్), ధర్మసాగర్ (హనుమకొండ)

భారతీయ విద్యార్థులకు గూగుల్ గుడ్ న్యూస్

ఏడాది పాటు ఉచితంగా అడ్వాన్స్‌డ్ ఏఐ టూల్స్



ఇంటర్నెట్ డెస్క్: భారతీయ విద్యార్థులకు గూగుల్ గుడ్‌న్యూస్ చెప్పింది. గూగుల్ అడ్వాన్స్‌డ్ ఏఐ టూల్స్‌ను ఏడాది పాటు ఉచితంగా వినియోగించుకునే అవకాశం కల్పిస్తోంది. జెమినీ ఫర్ స్టూడెంట్స్ పేరిట ఈ అవకాశాన్ని తీసుకొచ్చింది. 18 ఏళ్లు, అంతకు పైబడిన విద్యార్థులు ఏడాది ఉచిత సబ్‌స్క్రిప్షన్‌ను పొందొచ్చు. ఈ కాలంలో 2 టీబీ క్లౌడ్ స్టోరేజీ కూడా ఉచితంగా లభిస్తుంది. జెమినీ సేవలను ఉపయోగించుకోవడానికి విద్యార్థులు ముందుగా గూగుల్ ఆఫర్ పేజీ ద్వారా నమోదు చేసుకోవాలి. దీనికి సెప్టెంబరు 15 చివరి తేదీగా సంస్థ నిర్ణయించింది. ఒకసారి నమోదు చేసుకున్న తర్వాత గూగుల్‌లో పవర్‌ఫుల్ ఏఐ మోడల్ అయిన జెమినీ 2.5 ప్రోను ఉపయోగించుకోవచ్చు. ఈ ప్లాన్‌లో చదువుకోవడానికి, రైటింగ్, రీసెర్చ్, ఉద్యోగానికి కావాల్సిన టూల్స్ ఉన్నాయి. పరీక్షలు, హోంవర్కులు, వ్యాసరచన, కోడింగ్, ముఖాముఖీలకు అన్‌లిమిటెడ్ అకడమిక్ సపోర్ట్ ఉపయోగపడుతుంది. ఈ జెమినీ అడ్వాన్స్‌డ్ ప్లాన్‌ను కొనుగోలు చేయాలంటే రూ.19,500 ఖర్చవుతుంది.

నల్లమల నన్నారి షర్బత్ రెడీ

- గిరిజనులకు ఉపాధే లక్ష్యంగా ప్లాంటు నిర్మాణం



నన్నారి షర్బత్ సీసాలు

ఈనాడు–కర్నూలు, సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: నల్లమలలోని గిరిజనులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో శ్రీశైలం ఐటీడీఏ అధికారులు నన్నారి షర్బత్ తయారీపై దృష్టిపెట్టారు. ఇందుకోసం నంద్యాల జిల్లా ఆత్మకూరులో రూ.25 లక్షల కేంద్ర నిధులతో నన్నారి తయారీ ప్లాంటును నిర్మించారు. 'నల్లమల నన్నారి షర్బత్' పేరుతో సీసాల విక్రయానికి రంగం సిద్ధం చేశారు.

వీడీవీకే కేంద్రాలకు మొక్కల పెంపకం బాధ్యత

నన్నారి మొక్కల సాగుకు నల్లమలలో అనువైన వాతావరణం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆత్మకూరు పట్టణం కొత్తపల్లిలో 20 వేల మొక్కలు పెంచుతున్నారు. ఆయా నర్సరీల నిర్వహణ, మొక్కల పెంపకం బాధ్యతను ఐటీడీఏ వీడీవీకే(వన్ ధన్ వికాస్ కేంద్రం)లకు అప్పగించారు. కేవలం 30 నుంచి 45 రోజుల వ్యవధిలో ఆయా మొక్కలు నాటడానికి సిద్ధమవుతాయి. వాటిని ఒక్కోటి రూ.3 చొప్పున విక్రయిస్తారు. ఫలితంగా వీడీవీకేకు రూ.30 వేల ఆదాయం సమకూరుతుంది. ఆయా మొక్కలను మళ్లీ ఇతర వీడీవీకే గిరిజనులకు ఇచ్చి వేరే చోట పెంపకం చేపడతారు. ఒక్కో మొక్క వేరుకు అరకేజీ బరువుండే నన్నారి గడ్డలు వస్తాయి. కేజీ నన్నారి గడ్డల ధర మార్కెట్లో రూ.500 నుంచి రూ.600 వరకు పలుకుతోంది. వారు పండించే నన్నారి గడ్డలను ఐటీడీఏ ప్లాంటుకు విక్రయించి ఆదాయం పొందుతారు.

- నన్నారి తయారీ ప్లాంటు నిర్వహణను గిరిజనులకే అప్పగించారు. రోజుకు వెయ్యి సీసాల సామర్థ్యంతో నిర్మించారు. కేజీ నన్నారి గడ్డలతో 25 నన్నారి సీసాలను తయారుచేయవచ్చు. ఒక్కో సీసాను(750ఎం.ఎల్.) రూ.150కు విక్రయించినా రూ.50 చొప్పున లాభం వస్తుంది. 'ప్రయోగాత్మకంగా కొన్ని సీసాల షర్బత్‌ను సిద్ధం చేశాం. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ) అనుమతి రాగానే అధికారికంగా ఉత్పత్తిని ప్రారంభిస్తాం' అని శ్రీశైలం ఐటీడీఏ పీవో కె.వి.శివప్రసాద్ తెలిపారు.



ప్రకృతి ఇంజినీరింగ్

చిన్న రాయిపై పెద్ద గుండు నిలబెట్టినట్లుగా ప్రత్యేకంగా ఉన్న ఈ ప్రకృతి విచిత్రం.. కర్నూలు జిల్లా దేవనకొండ సమీపంలోని కరిడికొండలో ఉంది. ఈ ఊర్లోని 500 కుటుంబాలు ఆ కొండపైనే నివాసం ఉంటాయి. బొమ్మదేవర గుండు అని వ్యవహరించే ఈ రాళ్ల వద్ద ప్రతి అమావాస్య రోజు పూజలు చేస్తుంటారు. సందర్శకులు ఇక్కడకు వచ్చి ఈ రాయిని ఆసక్తిగా గమనిస్తారు.

– న్యూస్‌టుడే, దేవనకొండ



ఆ ల్యాబ్‌లలో ఉద్యోగ నైపుణ్యాలు

- కోర్సు పూర్తికాగానే మెకానికల్ విద్యార్థులకు కొలువులు
- ఏలూరులో వెలమాటి జనార్దనరావు చొరవతో ఏర్పాటు



మెకానికల్ ఇంజినీరింగ్ చదివితే ఉద్యోగాలు రావేమోనన్న అపోహ ఉంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం చాలా కాలం వేచి చూడాలని.. ఆ కోర్సు వద్దని వెనక్కి లాగేవారు ఎందరో. ప్యాకేజీలు కూడా తక్కువని విద్యార్థులు, తల్లిదండ్రులు ఇష్టపడరు. కానీ కోర్సు పూర్తిచేసి కళాశాల నుంచి బయటకు రాకుండానే తనకు రూ.5 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగం దక్కిందని ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థి రమేష్ ఆనందం వ్యక్తం చేశారు. దీనికి కారణం కళాశాలలో ఉన్న హైడ్రాలిక్, న్యూమేటిక్స్ ల్యాబ్‌లేనన్నారు. కంపెనీ అవసరాలు.. ఉద్యోగాలకు సరిపడా నైపుణ్యాలు వాటిలో నేర్పిస్తున్నారని తెలిపారు. రూ.కోట్లు వెచ్చించి ఆ ల్యాబ్‌లను జిల్లాలోని కొవ్వలి గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, దివంగత వెలమాటి జనార్దనరావు ఏర్పాటుచేశారు. ఆయన పేరు వచ్చేలా 'వెల్‌జాన్' ల్యాబ్‌లుగా పేరు పెట్టారు. అవే మెకానికల్ విద్యార్థులకు వరంగా మారాయి. 2024-25 విద్యా సంవత్సరంలో ఈ కళాశాలకు చెందిన 53 మంది మెకానికల్ విద్యార్థులు ప్రాంగణ నియామకాల్లో మంచి వేతనాలతో ఉద్యోగాలు పొందారు.

వ్యవసాయ యంత్ర పరికరాలు, ట్రాక్టర్లు, పంప్‌సెట్లు, మోటార్లు, హైడ్రాలిక్ మోటార్ పంపులు, ఆటోమోటివ్ ఇండస్ట్రీ, హెవీ ఎర్త్‌మూవర్స్ రంగాల్లో వస్తూత్పత్తికి హైడ్రాలిక్, న్యూమేటిక్స్ విధానాలు అవలంబిస్తారు. వాటిని వినియోగించి ఆయా పరికరాలు తయారుచేయడం ఎలా? వాటి డిజైన్లు, అసెంబ్లింగ్, నిర్వహణ, సమస్యల పరిష్కారం వంటివి విద్యార్థులకు తరగతి గదుల్లో చెప్పి, ప్రాక్టికల్‌గా ల్యాబ్‌ల్లో చేసి చూపిస్తున్నారు. ల్యాబ్‌ల్లో ఉన్న రూ.కోట్ల విలువ చేసే పరికరాలు మెకానికల్ విద్యార్థులకు ప్రయోజనకరంగా మారాయి. కంపెనీల్లో చూసి తెలుసుకోవాల్సిన అంశాలను తాము కళాశాలలోనే నేర్చుకుంటున్నామని విద్యార్థులు చెబుతున్నారు. మెషీన్‌ను ఆటోమేటిక్‌గా ఆపరేట్ చేయడం, దాన్ని నియంత్రించడంపైనా అవగాహన కల్పిస్తున్నారు. దంతవైద్యంలో వినియోగించే ఇంప్లాంట్స్ నాణ్యతను ఈ ల్యాబ్‌లో పరీక్షిస్తారు. జిల్లాలో పలు దంతవైద్య కళాశాలలు పరికరాలు తీసుకొస్తుండగా.. వాటి నాణ్యతను విద్యార్థులే పరిశీలిస్తున్నారు.

- ఈనాడు, ఏలూరు



చూపు లేకున్నా చెస్‌లో క్వీన్!

పశ్చిమబెంగాల్‌కు చెందిన పద్నాలుగేళ్ల సానియా ఖాతూన్ కంటిచూపు లేకపోయినా జాతీయస్థాయి చెస్ పోటీల్లో టాప్ 10లో నిలుస్తోంది. అసన్‌సోల్ కు సమీపంలోని జమూరియాలో నిరుపేద కుటుంబంలో సానియా జన్మించింది. పుట్టుకతోనే చూపు లేదు. చిన్నవయసులో తండ్రి చనిపోవడంతో ఆమె తల్లి దినసరి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఎనిమిదేళ్ల క్రితం.. సానియాను అసన్‌సోల్ బ్రెయిలీ అకాడమీలో తల్లి చేర్పించింది. ఇక్కడ దొరికిన శిక్షణతో సానియా చదువుతోపాటు చెస్‌లోనూ సత్తా చాటుతోంది. త్రిపుర, కర్ణాటక రాష్ట్రాల్లో జరిగిన జాతీయస్థాయి చెస్ పోటీల్లో టాప్-10లో ఒకరిగా నిలిచింది. టాప్ 3 లక్ష్యంగా ప్రాక్టీసు చేస్తోంది. స్పర్శతో గుర్తించి, ఏ పావును ఎటువైపు జరపాలని భావిస్తున్నామో చెబుతారు. అక్కడున్న పర్యవేక్షకుడు పావులను జరుపుతాడు. పారా ఒలింపిక్స్, పారా ఏషియన్ గేమ్స్‌లో పాల్గొనడం తన జీవిత లక్ష్యంగా సానియా చెబుతోంది.

– ఈటీవీ భారత్



ప్రపంచంలోనే ఖరీదు సింగపూర్

ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన నగరంగా సింగపూర్ నిలిచిందని జూలియస్ బేర్ వార్షిక నివేదిక వెల్లడించింది. వరుసగా మూడో ఏడాదీ ఈ ఘనత సాధించింది. హాంకాంగ్‌ను వెనక్కి నెట్టి రెండో స్థానాన్ని లండన్ కైవసం చేసుకుంది. హాంకాంగ్ మూడో స్థానానికి పరిమితమైంది. తరువాత జాబితాలో షాంఘై 4, మొనాకో 5, జ్యూరిఖ్ 6, న్యూయార్క్ 7, పారిస్ 8, సావో పాలో 9, మిలాన్ 10వ స్థానాన్ని ఆక్రమించాయి. కనీసం 1 మిలియన్ డాలర్ల బ్యాంక్ బ్యాలెన్స్ కలిగిన వ్యక్తులు కొనుగోలు చేస్తున్న వివిధ రకాల ఉత్పత్తులు, వారు అనుభవిస్తున్న విలాసవంతమైన జీవనం ఆధారంగా జూలియస్ బేర్ ఇండెక్స్ ఈ నివేదికను రూపొందించింది. ఈ ఏడాది ఫిబ్రవరి-మార్చి వివరాలను పరిగణనలోకి తీసుకున్నట్లు వివరించింది. స్నేహపూర్వక వ్యాపారం, అధిక పెట్టుబడులు, ఆరోగ్య సంరక్షణ, విద్య కోసం ప్రజలు ఎక్కువగా ఖర్చు చేయడం వంటివి సింగపూర్ మొదటి స్థానంలో ఉండటానికి ప్రధాన కారణాలు.

– ఇంటర్నెట్ డెస్క్



క్లోనింగ్ సాంకేతికత.. పాల వెల్లువలే ఇక!

హరియాణాలోని కర్నాల్ జాతీయ డెయిరీ పరిశోధన సంస్థ (ఎన్‌డీఆర్ఐ) శాస్త్రవేత్తలు పాడి పరిశ్రమలో మరో విప్లవం సృష్టించారు. క్లోనింగ్ టెక్నాలజీ సాయంతో భారత డెయిరీ రంగాన్ని కొంత పుంతలు తొక్కించేందుకు కీలక ముందడుగు వేశారు. ఈ సాంకేతికత ద్వారా సృష్టించిన 'గంగ' అనే గిర్ ఆవు అండాల సాయంతో మరొక ఆవు ఆరోగ్యకరమైన లక్షణాలు గల ఆడదూడకు జన్మనిచ్చింది. మనుషుల్లో ఐవీఎఫ్ లాగే ఒక ఆవు.. దూడకు జన్మనివ్వడం దేశంలో ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ విజయం ద్వారా ఒక ఉన్నత జాతి ఆవు నుంచి పెద్దసంఖ్యలో ఆడ దూడలు జన్మించడానికి (మల్టిప్లికేషన్ టెక్నాలజీ) మార్గం సుగమమైంది. "ఈ సాంకేతికతను విస్తృతంగా అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఇది రైతులకు అందుబాటులోకి వస్తే లాభాలను అందిస్తుంది. డెయిరీ పరిశ్రమలో సమూల మార్పులు వస్తాయి" అని ఎన్‌డీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ధీర్‌సింగ్ తెలిపారు.

– ఈటీవీ భారత్



ఈ ఉపాధ్యాయుడి గురించి ఓ మాట

నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గానికి చివరగా.. కృష్ణా తీర ప్రాంతంలో ఉంటుంది చందంపేట మండలంలోని పొగిళ్ల గ్రామం. పులులు సంచరించే ప్రాంతం కావడంతో ఇటీవల అటవీశాఖ అధికారులు గ్రామాన్ని ఖాళీ చేయాలని.. పునరావాసం కల్పిస్తామని ప్రకటించారు. ఆ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు 2019లో బదిలీపై వచ్చారు ఉపాధ్యాయుడు పి.వెంకటేశ్వర్లు. ఆ సమయంలో పది మంది విద్యార్థులు ఉండగా.. ఇప్పుడు ఆ సంఖ్య 48కి చేరింది. కుటుంబానికి దూరంగా గ్రామంలోనే ఉంటూ.. పిల్లల తల్లిదండ్రులతో మమేకమై పాఠశాలకు పునరుజ్జీవం తెచ్చారు ఈ మాస్టారు. ఐదు తరగతులకు ఒక్కడే ఉపాధ్యాయుడైనా.. నాణ్యమైన విద్యనందిస్తున్నారు. 'మా గ్రామంలో పాఠశాల బతికిందంటే వెంకటేశ్వర్లు కృషి ఎంతో ఉంది. గ్రామంలోనే ఉంటూ తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి, ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలని అవగాహన కల్పిస్తున్నారు' అని గ్రామస్థుడు శేఖర్ చెప్పారు.

– న్యూస్‌టుడే, దేవరకొండ

తిరిగొచ్చిన సన్మానం.. పట్టావచ్చిన ఆనందం



ఈ ఫొటో చూస్తే.. ఏ అధికారినో సన్మానిస్తున్నట్లు ఉంది కదూ.. కానీ, ఆయనో సాధారణ రైతు.. సన్మానించింది తహసీల్దారు. ఇలా జరగడం ఇది మొదటిసారి కాదు. ఆరేళ్ల క్రితం అధికారులు ఇదేవిధంగా శాలువా కప్పి అభినందించారు. అయితే తరువాత నిర్లక్ష్యంగా వ్యవహరించి ఆయనకు తీవ్ర నష్టం చేకూర్చారు. నిజాయతీకి పోయినందుకు ఇదేనా మీరిచ్చే బహుమానం అంటూ అప్పటి నుంచి కార్యాలయాల చుట్టూ తిరిగారు. 'ఈనాడు' వరుస కథనాలతో ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన అధికారులు తాజాగా తిరిగి ఆయన్ను సన్మానించి తప్పును సరిచేశారు. వివరాల్లోకి వెళితే.. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ గ్రామానికి చెందిన రైతు మడెప్పకు గ్రామంలో 4.30 ఎకరాల సాగు భూమి ఉంది. 2019లో తన భూ ఖాతాలో ఇతరులకు చెందిన 1.06 ఎకరాలను అధికారులు కలిపారు. రైతు తనది కాని భూమిని తొలగించాలని అదే ఏడాది సెప్టెంబరులో రెవెన్యూ అధికారులను కోరారు. ఆయన నిజాయతీకి మెచ్చి అధికారులు సన్మానించారు. కానీ, అదనపు విస్తీర్ణం తొలగించే క్రమంలో మడెప్ప భూమిని కూడా ఖాతా నుంచి తొలగించేశారు. అప్పటి నుంచి పెట్టుబడి సాయం డబ్బులు కూడా బందయ్యాయి. తనకు న్యాయం చేయాలని ఆరేళ్లుగా అధికారులను కోరుతున్నారు. ఈ నెల 5న 'ఆరేళ్లుగా అరణ్య రోదన' శీర్షికన మరోమారు 'ఈనాడు' కథనాన్ని ప్రచురించడంతో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందించి పట్టా జారీ చేయించారు. మంగళవారం మునిపల్లి తహసీల్దారు గంగాభవాని ఆయన్ను సన్మానించి పట్టా అందజేశారు.

– ఈనాడు, హైదరాబాద్– న్యూస్‌టుడే, మునిపల్లి

వరితో వర్రీ వద్దంటే..!

వేడివేడి అన్నంలో ఆవకాయ, నెయ్యి కలిపి తినందే ముద్ద దిగని వారున్నారు...

పొగలుగక్కే పులావును చికెన్ కర్రీతో లాగించకపోతే రోజు గడవని వారున్నారు...

కానీ ఒకటే దిగులు. రైస్ తింటే షుగర్ వస్తుందనో, అప్పటికే ఉన్నవాళ్లకు ఇంకా పెరుగుతుందనో భయంతో చాలామందికి ముద్ద దిగట్లేదు. కానీ వరి అన్నం విషయంలో మరీ అంత భయం అవసరం లేదంటున్నారు నిపుణులు. తినడంలో కొన్ని పద్ధతులు, జాగ్రత్తలు పాటిస్తే చాలని చెబుతున్నారు.

ప్రపంచంలో 50 శాతంపైగా ప్రజలు వరి అన్నాన్ని ఆహారంగా తీసుకుంటున్నారు. మూడు పూటలా వరి తింటూ శారీరక శ్రమ చేస్తూ దృఢంగా, ఆరోగ్యంగా ఉన్నవారు కోకొల్లలు. కానీ ఈ విషయంలో కొంతకాలంగా ఆందోళన వ్యక్తమవుతోంది. వరి వాడితే షుగర్ లెవెల్స్ పెరుగుతాయన్న నమ్మకం విస్తృతమవడం దీనికి కారణం. దీంతో చాలామంది క్రమంగా దాన్ని తగ్గించేస్తున్నారు.


ఇలా మేలు...

- అన్నాన్ని పూర్తిగా మానేయడం కంటే.. దానిని సరైన మోతాదులో తీసుకోవడం ముఖ్యం.
- గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండే బ్రౌన్ రైస్, మిల్లెట్స్ వంటి వాటిని ఎంచుకోవచ్చు.
- అన్నంతో పాటు, కూరగాయలు, ఆకుకూరలు, పప్పు, పనీర్ వంటి ప్రొటీన్లు ఎక్కువగా తీసుకోవాలి.

గ్లైసెమిక్ ఇండెక్స్ కీలకం...

గ్లైసెమిక్ ఇండెక్స్ (జీఐ)అనేది ఆహారం తీసుకున్న తర్వాత రక్తంలో చక్కెర స్థాయిని ఎంత త్వరగా పెంచుతుందో కొలిచే సూచిక. అధిక గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగిన ఆహారాలు రక్తంలో చక్కెర స్థాయిని వేగంగా పెంచుతాయి. గ్లైసెమిక్ ఇండెక్స్ అనేది 0 నుంచి 100 వరకు మోతాదును కలిగి ఉంటుంది. బియ్యం రకం, ధాన్యం నుంచి బియ్యం మిల్లు ఆడే పద్ధతిని అనుసరించి జీఐ మారుతుంది. ముడిబియ్యం కంటే తెల్లబియ్యం ఎక్కువ జీఐ కలిగి ఉంటాయి. దేశవాళీ బియ్యం(కృష్ణకాటుకల వంటివి), ఎర్రబియ్యంలో అధిక పీచు, పోషకాల కారణంగా తక్కువ జీఐ విలువ ఉంటుంది. మనం ఎక్కువగా వాడే మసూరి రకంలో తక్కువ నుంచి మధ్యస్థ జీఐ ఉంటుంది.

తక్కువ జీఐ: బెండకాయ, పప్పులు, గోధుమరొట్టె, పచ్చఅరటి
మధ్యస్థ స్థాయి జీఐ: బ్రౌన్‌రైస్, ఓట్స్, పైనాపిల్, తేనె
అధిక జీఐ : బ్రెడ్, స్వీట్ పొటాటో, చక్కెర, మిఠాయిలు



కారణాలు వేరే...

- షుగర్ లెవెల్స్ పెరగడానికి వరి అన్నం తినడం మాత్రమే కారణం కాదు.
- శారీరక శ్రమ తగ్గిపోవటం, జంక్ ఫుడ్, బేకరీ ఫుడ్స్ వల్ల పరిస్థితి గాడి తప్పుతోంది.
- కొంతకాలంగా జీవనశైలిలో వస్తున్న మార్పులు, ఆధునిక పోకడలు దుష్ప్రభావం చూపుతున్నాయి.
- సకాలంలో తినకపోవడం, రాత్రి మరీ ఆలస్యంగా తినటం.. వేగంగా తినటం వల్ల కూడా ఇబ్బందులొస్తాయి.
- రోజంతా కూర్చుని పనిచేయడం, వ్యాయామానికి దూరంగా ఉండడం కూడా మధుమేహానికి కారణాలు.



- ఈనాడు, గుంటూరు

తినడానికి పద్ధతుంది:

ప్రొటీన్, పీచున్న కూరగాయలు, పప్పులు, గింజలు, కొబ్బరినూనె కలిపి అన్నం తినడం వల్ల రక్తంలో గ్లూకోజ్ విడుదల నెమ్మదిస్తుంది.

అన్నంతో పాటు పప్పు, కూరగాయలు, నెయ్యి లేదా మాంసం కలిపి తింటాం కాబట్టి చక్కెర స్థాయిల విషయంలో అంతగా భయం అవసరం లేదు.

అన్నం పరిమితంగానైనా తింటూ... సమతులాహారం తీసుకుంటూ వ్యాయామం చేయడం చాలా అవసరం.

మెల్లగా నములుతూ తినడం వల్ల రక్తంలో చక్కెర పెరగడాన్ని నియంత్రించవచ్చు



వయసును, శారీరక శ్రమను బట్టి తినే అన్నం పరిమాణంలో మార్పు చేసుకోవాలి.

అన్నంలో నిమ్మరసం కలిపి తినటం వల్ల గ్లైసెమిక్ సూచిక తగ్గుతుంది.

- డాక్టర్ పి.వి.సత్యనారాయణ, పరిశోధన సంచాలకులు, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం

19న శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి భక్తుల సౌకర్యార్థం అక్టోబరు నెలకు సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవల కోటాను ఈ నెల 19న ఉదయం పది గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. వీటి లక్కీడిప్ రిజిస్ట్రేషన్ కోసం ఈ నెల 21న ఉదయం పది గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లు 22న ఉదయం 10 గంటలకు.. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను మధ్యాహ్నం మూడు గంటలకు విడుదల చేయనుంది. 23న ఉదయం పదింటికి అంగప్రదక్షిణం, 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ కోటా, మధ్యాహ్నం మూడింటికి వృద్ధులు, దివ్యాంగుల ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. 24న ఉదయం పదింటికి రూ.300 టికెట్ల కోటా, మధ్యాహ్నం మూడింటికి తిరుమల, తిరుపతిలో తితిదే గదుల బుకింగ్ కోటా అందుబాటులో ఉంచనున్నారు. భక్తులు https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్‌లో మాత్రమే బుక్ చేసుకోవాలని తితిదే సూచించింది.

19న తిరుపతికి ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, తిరుపతి: సీఎం చంద్రబాబు ఈ నెల 19న తిరుపతి వెళ్లనున్నారు. ఆ రోజు ఆయన 'స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో పాల్గొంటారు. నగరంలోనే ముఖ్యమంత్రి పర్యటన ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సంబంధించిన పూర్తి షెడ్యూల్ ఖరారు కావాల్సి ఉంది.

డీఎస్‌హెచ్ ఆసుపత్రుల్లోని పడకలపై రోజుకో దుప్పటి

నాటి 'సప్త వర్ణాలు' కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయం

ఈనాడు, అమరావతి: జిల్లా, సామాజిక, ప్రాంతీయ ఆసుపత్రుల్లో 'సప్త వర్ణాల దుప్పట్లు' వినియోగించేందుకు అవసరమైన ఏజెన్సీలను పీపీపీ విధానంలో ఎంపిక చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2014-19 మధ్యకాలంలో ఆసుపత్రుల్లోని పడకలపై రోజుకో రంగు దుప్పటి ఉపయోగించారు. ఈ విధానాన్ని మళ్లీ కొనసాగించేలా ఏజెన్సీలను టెండర్ల ద్వారా ఎంపిక చేస్తారు. గతంలో జీజీహెచ్, స్పెషాలిటీ వైద్యశాలలకు పరిమితమైన ఈ విధానాన్ని డీఎస్‌హెచ్ పరిధిలోని వైద్యశాలలకూ విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఏడాదికి రూ.5.25 కోట్లు ఖర్చయ్యే ఈ పథకంలో.. దుప్పట్లు, దిండ్ల కవర్లు శుభ్రం చేసేందుకు వీలుగా టెండర్లు పిలవనున్నారు.

కృష్ణా ట్రైబ్యునల్ గడువు మరో ఏడాది పొడిగింపు

ఈనాడు, దిల్లీ: జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ ఆధ్వర్యంలో నడుస్తున్న కృష్ణా జల వివాద ట్రైబ్యునల్-2 గడువును వచ్చే ఏడాది జులై 31 వరకు పొడిగిస్తూ కేంద్ర జలశక్తి శాఖ మంగళవారం రాత్రి నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఏడాది ఆగస్టు 1తో ఈ ట్రైబ్యునల్ గడువు ముగుస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొంది. అంతర్రాష్ట్ర జల వివాద చట్టంలోని సెక్షన్ 5(3) కింద ఉన్న అధికారాలను ఉపయోగించి కృష్ణా ట్రైబ్యునల్ తన తుది నివేదికను సమర్పించే గడువును ఈ ఏడాది ఆగస్టు 1కి బదులు 2026 జులై 31కి పొడిగిస్తున్నట్లు జలశక్తి శాఖ తెలిపింది. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య కృష్ణా జలాల పంపిణీ కోసం 2004 ఏప్రిల్ 2న ఏర్పడిన ఈ ట్రైబ్యునల్ 2010 డిసెంబరు 30న తన తొలి నివేదికను అందించింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వాలు వ్యక్తం చేసిన అభ్యంతరాలపై విచారణ జరిపి 2013 నవంబరు 29న రెండో నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. 2014లో రాష్ట్ర విభజన జరిగిన నేపథ్యంలో ఇరురాష్ట్రాల మధ్య జలాల పంపిణీ కోసం దాని పదవీకాలాన్ని రెండేళ్లు పెంచుతూ 2014 మే 15న ఉత్తర్వులు జారీచేశారు. అయితే నదీజలాల వివాదంపై ఇప్పటికీ విచారణ జరుగుతున్నందు.. అప్పటినుంచి ప్రతి ఏటా దాని గడువును పొడిగిస్తూ వస్తున్నారు.



ఆర్థిక నిర్ణయాల్లోనూ సమాన గౌరవం దక్కితేనే..

విద్య, ఉద్యోగ రంగాల్లో మహిళలు ఇటీవలి ఏళ్లలో మంచి పురోగతి సాధించారు. అయితే వారు తమ ఆర్థిక భవిష్యత్తును సైతం స్వయంగా నియంత్రించుకోగలగాలి. అప్పుడే అసలైన సాధికారత సాధించినట్టు! తల్లి, భార్య, కుమార్తె, కోడలు.. ఇలా మహిళలందరికీ ఆర్థికపరమైన నిర్ణయాల్లోనూ సమాన గౌరవం, హక్కు దక్కాలి.

– అనూష్కా సోహం బథ్వాల్, వ్యాపారవేత్త

భారత 'డెంగ్ జియావో పింగ్'.. పీవీ

- భారతరత్న పీవీ నరసింహారావు స్మారకోపన్యాసంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు



ప్రధానమంత్రి సంగ్రహాలయలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గ్యాలరీ వద్ద సీఎం చంద్రబాబు, పీఎం మ్యూజియం, లైబ్రరీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఛైర్మన్ నృపేందర్ మిశ్ర, పీవీ నరసింహారావు మనవడు సుభాష్ తదితరులు

ఈనాడు, దిల్లీ: "ఒకప్పుడు చైనాలో చేపట్టిన సంస్కరణల ఫలితంగా నేడు ఆ దేశం ఏ స్థాయికి చేరిందో మనం చూడొచ్చు. అలాగే పీవీ నరసింహారావు గొప్ప ఆర్థిక సంస్కరణలతో భారత్ భవిష్యత్తును సంపూర్ణంగా మార్చారు. వాటి ఫలాలను ఇప్పుడు మనమంతా అనుభవిస్తున్నాం" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 1978లో చైనాలో డెంగ్ జియావో పింగ్ చేపట్టిన ఆర్థిక సంస్కరణల ఫలితంగా ఆ దేశం ఎలా అభివృద్ధి పథంలో సాగుతుందో మన దేశంలో పీవీ కూడా అలాగే సంస్కరణలకు నాంది పలికారని తెలిపారు. ప్రధానమంత్రి కార్యాలయ మాజీ ముఖ్య కార్యదర్శి నృపేంద్ర మిశ్ర నేతృత్వంలో ప్రధానమంత్రుల సంగ్రహాలయం నిర్వహిస్తున్న 'ప్రైమ్ మినిస్టర్స్ లెక్చర్ సిరీస్'లో భాగంగా మంగళవారం 'ది లైఫ్ అండ్ లెగసీ ఆఫ్ పీవీ నరసింహారావు' స్మారకోపన్యాసంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. 'భారతరత్న' మాజీ ప్రధాని పీవీతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. గొప్ప రాజనీతిజ్ఞుడు, దార్శనికుడైన పీవీ నరసింహారావు దేశ గతిని మార్చిన తెలుగుబిడ్డ అని అభివర్ణించారు. 17 భాషల్లో అనర్గళంగా మాట్లాగలిగిన మేధావి పీవీ అని.. కానీ మనం ఇప్పుడు హిందీ ఎందుకు నేర్చుకోవాలని అడుగుతున్నామని అన్నారు.

సంస్కరణల సాహసి పీవీ

"1991లో భారత్ తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో.. సంకీర్ణ ప్రభుత్వాన్ని నిర్వహిస్తూనే పీవీ ఎంతో ధైర్యంగా, అత్యంత సాహసోపేతంగా ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకోవాల్సిన అవసరాన్ని గుర్తించారు. సాహసోపేతమైన సంస్కరణలకు వెళ్లాలని నిర్ణయించారు. దేశంలో చారిత్రక ఆర్థిక సంస్కరణలకు తెరతీశారు. తద్వారా భారత్ భవిష్యత్తును సంపూర్ణంగా మార్చారు. అందుకే పీవీ నరసింహారావును నేను భారత డెంగ్ జియావో పింగ్‌గా అభివర్ణిస్తున్నా" అని చంద్రబాబు పేర్కొన్నారు. "దానికి తోడు ఐటీని అందిపుచ్చుకోవడం, డెమొగ్రఫిక్ డివిడెండ్‌ల కారణంగా భారత్ ముందడుగు వేయడం ప్రారంభించింది. పీవీ తర్వాత ప్రధాని అయిన అటల్ బిహారీ వాజపేయీ కూడా సంస్కరణలు ముందుకు తీసుకెళ్లి దేశంలో మౌలిక వసతులు, టెలికం విప్లవానికి బలమైన పునాదులు వేశారు. అప్పట్లో ఆయనతో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను. ఆయన సేవలను కూడా ఎవరూ మరిచిపోలేరు. అలాగే ప్రధాని నరేంద్రమోదీ డిజిటల్ ఇండియా, మేకిన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ విధానాలను అమల్లోకి తెచ్చారు. అందుకు ఆయనను మనస్ఫూర్తిగా అభినందించాలి. తెలుపుతున్నా. గత దశాబ్దకాలంలో 11 కోట్ల మంది భారతీయులను పేదరికం నుంచి బయటికి తీసుకురావడం నరేంద్రమోదీ విజయానికి నిదర్శనం.

అప్పుడు ఐటీ.. ఇప్పుడు క్వాంటమ్

ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో చాలామంది ప్రధాన మంత్రులతో చాలా సన్నిహితంగా పనిచేశాను. వాజపేయీ ప్రధానిగా ఉన్నప్పుడు ఆయనకు చైనాలో వస్తున్న మార్పుల గురించి చెప్పి దేశంలో టెలికం రంగంలో సంస్కరణలు తీసుకురావడం వల్ల ఇప్పుడు ప్రతి ఒక్కరి చేతుల్లోకి సెల్‌ఫోన్ రాగలిగింది. అప్పట్లో హైటెక్ సిటీ ద్వారా ఐటీ రంగాన్ని అందిపుచ్చుకున్నట్లుగానే ఇప్పుడు అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ నిర్మాణం ద్వారా క్వాంటమ్ కంప్యూటింగ్‌ను అందిపుచ్చుకోవాలనుకుంటున్నాం" అని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి సంగ్రహాలయం, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నృపేంద్ర మిశ్ర స్వాగతోపన్యాసం చేశారు. ఇందులో ప్రముఖ పాత్రికేయులు ఎ.సూర్యప్రకాశ్, శేఖర్‌గుప్తతోపాటు, పలువురు ఎంపీలు పాల్గొన్నారు. కార్యక్రమం చివరిలో చంద్రబాబు మాజీ ప్రధాని పీవీ కుమారుడు ప్రభాకరరావు, మనవడు సుభాష్‌లను శాలువాలతో సత్కరించారు. వారు తనను సత్కరించబోగా ఆయనే వారికి శాలువాలు కప్పి గౌరవించారు.

బనకచర్లకు ప్రత్యామ్నాయం గోదావరి-కావేరి లింకు ప్రాజెక్టే

- ఏపీ ప్రతిపాదిస్తున్న వరద జలాలకు శాస్త్రీయ ధ్రువీకరణ లేదు
- రాష్ట్రాలు వినియోగించుకోని నీళ్లే సముద్రంలో కలుస్తున్నాయ్
- మీట్ ది ప్రెస్‌లో జలశక్తి శాఖ మాజీ సలహాదారు వెదిరె శ్రీరాం



ఈనాడు, హైదరాబాద్: 'గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టులో భాగంగా ఏపీ పేర్కొంటున్న వరద జలాలకు శాస్త్రీయ ధ్రువీకరణ ఏదీ లేదు. నదుల అనుసంధానంలో కేంద్రం ప్రతిపాదిస్తున్న గోదావరి-కావేరి లింక్ ప్రాజెక్టు బనకచర్లకు ప్రత్యామ్నాయం' అని కేంద్ర జలశక్తి శాఖ మాజీ సలహాదారు, నదుల అనుసంధాన టాస్క్‌ఫోర్స్ మాజీ ఛైర్మన్ వెదిరె శ్రీరాం పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ జర్నలిస్టుల సంఘం ప్రతినిధి కప్పర ప్రసాద్‌రావు అధ్యక్షతన నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని 'గోదావరి నీటి వనరులు: వాస్తవాలు, గణాంకాలు- తెలుగు రాష్ట్రాలకు ముందుకు సాగే దారి' అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. నదీ జలాల చట్టాలు, ట్రైబ్యునల్ అవార్డులు, సీడబ్ల్యూసీ మార్గదర్శకాలు తదితర అంశాలపై విశ్లేషణ చేశారు.

సగటున 1,138 టీఎంసీలు సముద్రంపాలు

"గోదావరిలో ట్రైబ్యునల్ అవార్డు ప్రకారం వరద జలాలు అనేవే లేవు. 75 శాతం నీటి లభ్యత ఆధారంగా 1969లో ట్రైబ్యునల్ బేసిన్‌లోని ఏడు రాష్ట్రాలకు 3,396 టీఎంసీలను పంపిణీ చేసింది. సగటున 1,138 టీఎంసీలు సముద్రం పాలవుతున్నట్లు సీడబ్ల్యూసీ లెక్కగట్టింది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలకు కేటాయించిన నికర జలాలకు అనుగుణంగా పూర్తి స్థాయిలో ప్రాజెక్టుల నిర్మాణం కాలేదు. నిర్మాణాలు పూర్తయిన ప్రాజెక్టుల్లో వినియోగం జరగడం లేదు. ఈ కారణంగానే వరద సముద్రంపాలవుతున్నట్లు కనిపిస్తోంది. నీటి చట్టాల్లో ఎక్కడా ఇప్పటి వరకు వరద జలాలను నిర్వచించలేదు. ఏపీ 200 టీఎంసీలను (భవిష్యత్తులో మరో 100 టీఎంసీలు) తరలించేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఎండమావి లాంటివే. గోదావరి బేసిన్‌లో నికర జలాలకు అనుగుణంగా లేని ఏ ప్రాజెక్టునూ సీడబ్ల్యూసీ అనుమతించదు. భవిష్యత్‌లో కేంద్రం చట్టాలను సవరించి సముద్రానికి 1,138 టీఎంసీలు పోతున్నట్లు పేర్కొన్నా ఆ నీటిలో ఎగువన ఉన్న అన్ని రాష్ట్రాలకు హక్కు ఉంటుంది" అని పేర్కొన్నారు.

'పోలవరం-బనకచర్ల'పై చర్చే ఏకైక ఎజెండా

- నేటి సీఎంల భేటీకి ప్రతిపాదించిన ఏపీ
- చర్చ అసంబద్ధమంటూ తెలంగాణ లేఖ
- ఆ రాష్ట్రం నుంచి 9 అంశాలు

ఈనాడు, అమరావతి: తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీకి... 'పోలవరం-బనకచర్ల' అనుసంధానం ప్రాజెక్టును ఏకైక చర్చనీయాంశంగా ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించింది. దిల్లీలో శ్రమశక్తి భవన్ వేదికగా... రెండు రాష్ట్రాల జల అంశాలపై చర్చించేందుకు కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో చంద్రబాబు, రేవంత్ రెడ్డి బుధవారం భేటీ కానున్నారు. ఈ సమావేశాన్ని సీఆర్ పాటిల్ ఏర్పాటుచేశారు. కేంద్రమంత్రికి తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాసిన లేఖలోని 9 అంశాలను ఆ రాష్ట్ర ప్రతిపాదిత ఎజెండాగా స్వీకరించారు. వీటిని క్రోడీకరించి 10 అంశాల ఎజెండాను కేంద్ర జలశక్తి శాఖ సిద్ధం చేసింది. మధ్యాహ్నం 2.30కు సమావేశం ప్రారంభం కానుంది. ప్రస్తుత దశలో 'పోలవరం-బనకచర్ల'పై చర్చ అసంబద్ధమంటూ కేంద్ర జలశక్తి కార్యదర్శికి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తాజాగా లేఖ రాయడం చర్చనీయాంశమైంది. అయినప్పటికీ పోలవరం-బనకచర్ల అనుసంధానమే కేంద్ర జలశక్తి ఎజెండాలో మొదటి అంశంగా ఉంది.

భేటీ ఎజెండా అంశాలివే...

ఏపీ ప్రతిపాదన...

1. గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు

తెలంగాణ ప్రతిపాదనలు...

2. దిండి, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాల డీపీఆర్‌లకు అనుమతి, 3. శ్రీశైలం జలాశయంలో వివిధ స్థాయుల ఎత్తు నుంచి నీటిని ఇతర బేసిన్లకు మళ్లించకుండా ఆపడం, 4. కృష్ణా ట్రైబ్యునల్ 2 వద్ద తెలంగాణ వాదనలకు ఏపీని ఒప్పించడం. తెలంగాణలో ఇప్పటికే (పూర్వ ఆంధ్రప్రదేశ్) నిర్మాణం ప్రారంభించిన ప్రాజెక్టులకు నీటిని వినియోగించుకునేలా ఏపీ సహకరించాలి, 5. కృష్ణా బేసిన్ బయటకు నీళ్లు తరలించే ముందే బేసిన్‌లో ఉన్న అవసరాలు తీరేలా చూడాలని కృష్ణా బోర్డుకు సలహా ఇవ్వాలి. టెలీమీటర్ల ఏర్పాటును పూర్తి చేయాలి, 6. తుంగభద్ర జలాల మళ్లింపు, 7. శ్రీశైలం ప్రాజెక్టు సంబంధిత అంశాలు (ఎ). రాయలసీమ ఎత్తిపోతల పథకం పనుల విషయంలో జాతీయ హరిత ట్రైబ్యునల్ ఉత్తర్వులకు కట్టుబడి ఉండేలా ఏపీని ఒప్పించాలి. 2014 రాష్ట్ర పునర్ విభజన చట్టం ప్రకారం అవసరమైన చర్యలు తీసుకున్నాకే ఈ పథకం చేపట్టేలా కృష్ణా బోర్డుకు, ఆంధ్రప్రదేశ్‌కు మార్గనిర్దేశం చేయాలి. (బి). శ్రీశైలం కుడిగట్టు కాలువ ప్రవాహ సామర్థ్యాన్ని పెంచకుండా చూడాలి. (సి). శ్రీశైలం నుంచి నీటిని మళ్లిస్తున్న హంద్రీ-నీవా, ముచ్చుమర్రి, వెలిగొండ, గురురాఘవేంద్ర పథకాల నిర్మాణం, విస్తరణలు వద్దు. 7(2). ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో డ్యాంల భద్రతకు అవసరమైన చర్యలపై భరోసా, 7(3). అనధికార ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ నీటిని మళ్లించడం వల్ల విద్యుత్తు ఉత్పత్తికి కలుగుతున్న ఆటంకం, 8. గోదావరి-కావేరి అనుసంధానం ప్రాజెక్టు చేపట్టడంతో పాటు ఇచ్చంపల్లి వద్ద తెలంగాణ 200 టీఎంసీల గోదావరి వరద జలాల వినియోగానికి అనుమతించడం, 9. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు (ఛత్తీస్‌గఢ్‌తో పరిష్కారానికి సంబంధించి), 10. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహట్టి వద్ద కొత్త బ్యారేజీ నిర్మాణానికి ఛత్తీస్‌గఢ్‌తో ఒప్పందం కుదిరేలా కేంద్ర సహకారం. ఏఐబీపీ కింద ఈ ప్రాజెక్టుకు కేంద్ర సాయం.

కార్మికుల సమ్మెతో తాగునీటికి అవస్థలు



గుంటూరులో పలకలూరు రోడ్డు రిజర్వాయర్ వద్ద నీటి కోసం నిల్చున్న ప్రజలు

ఈనాడు, అమరావతి: పుర, నగరపాలక సంస్థల్లో పౌరుగు సేవల ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెతో పలు నగరాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సమ్మె ప్రభావం ఉన్నచోట అధికారులు సరైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. గుంటూరులో మంగళవారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కడపలోనూ పలు ప్రాంతాల్లో ఇబ్బందిపడ్డారు. వార్డు సచివాలయాల కార్యదర్శులకు తాగునీటి వాల్వ్‌ల నిర్వహణ బాధ్యత అప్పగించినా కార్మికులు వారిని అడ్డుకుంటున్నారు. కార్మికుల జీతాలు పెంచాలన్న ప్రధాన డిమాండ్‌తో సీఐటీయూ అనుబంధ ఏపీ మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల ఫెడరేషన్ ప్రస్తుతం సమ్మె చేస్తోంది. జీతాలు పెంచకపోతే సమ్మె ఉద్ధృతం చేస్తామని ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు వెల్లడించారు. 'కార్మికుల డిమాండ్లపై మంత్రివర్గ ఉపసంఘం చర్చించి, సానుకూల నిర్ణయం తీసుకుంది. ఆర్థిక శాఖతో మాట్లాడి ఓ నిర్ణయం తీసుకొని, దాన్ని నాలుగైదు రోజుల్లో అధికారికంగా ప్రకటిస్తాం' అని పురపాలకశాఖ మంత్రి నారాయణ తెలిపారు.

ఏబీ వెంకటేశ్వరరావుపై చర్యల ఉపసంహరణ

ఏసీబీ కేసును హైకోర్టు క్వాష్ చేయడమే కారణం

ఈనాడు, అమరావతి: నిఘా పరికరాల కొనుగోలులో అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలతో విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుపై వైకాపా హయాంలో నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఈ కేసును క్వాష్ చేస్తూ, ఏబీ వెంకటేశ్వరరావుకు క్లీన్‌చిట్ ఇస్తూ మే 7న ఏపీ హైకోర్టు ఆదేశాలిచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. హైకోర్టు ఆదేశాలపై అప్పీలుకు వెళ్లాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఐటీ రంగంలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు

- 95 సంస్థల ఎంఓయూలు గ్రౌండింగ్ చేయాలి
- అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష



ఐటీ, ఎలక్ట్రానిక్స్, జీసీసీ, డేటా సెంటర్లపై ఉండవల్లి నివాసంలో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి లోకేశ్. చిత్రంలో ఆయా శాఖల ఉన్నతాధికారులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటుకు 95 ప్రముఖ సంస్థలు ముందుకొచ్చాయని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. వాటి ద్వారా రూ.లక్ష కోట్ల పెట్టుబడులు రానున్నాయని తెలిపారు. యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన సౌకర్యాలు, అనుమతులు త్వరితగతిన అందించాలని సూచించారు. ఉండవల్లి నివాసంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'రాబోయే నాలుగేళ్లలో ఈ సంస్థల ద్వారా 10 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం. ఎంఓయూలు కుదుర్చుకున్న సంస్థలను అధికారులు నిరంతరం సంప్రదించాలి. రాష్ట్రానికి వచ్చే చిన్న సంస్థల కోసం 26 జిల్లాల్లో కో-వర్కింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయాలి' అని కోరారు. దిగ్గజ సంస్థలు టీసీఎస్, కాగ్నిజెంట్‌లకు విశాఖలో ఇప్పటికే భూములు కేటాయించామని అధికారులు మంత్రికి వివరించారు.

త్వరలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సేవలు

నవీన ఆవిష్కరణలు.. స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు అమరావతిలో ప్రతిపాదించిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ త్వరలో కార్యకలాపాలను ప్రారంభిస్తుందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. 'అమరావతి క్వాంటమ్ వ్యాలీకి అవసరమైన మౌలిక సదుపాయాలపై దృష్టిపెట్టాలి. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 400 ఎకరాల్లో ప్రతిపాదించిన డ్రోన్ సిటీని ఏడాదిలో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలి. మనమిత్ర ద్వారా అందించే వాట్సప్ గవర్నెన్స్ సేవలను మరింత విస్తృతపరచాలి. రాష్ట్రంలోని 45వేల ప్రభుత్వ పాఠశాలలకు ఇంటర్నెట్ కనెక్టివిటీ ఉండేలా చర్యలు తీసుకోవాలి. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమహేంద్రవరం విమానాశ్రయాలకు అంతరాయం లేని ఫోన్ కనెక్టివిటీ కల్పించాలి' అని సూచించారు.

ప్రతి ఉన్నత పాఠశాలకు ఇంటర్నెట్, కంప్యూటర్ ల్యాబ్

ఈనాడు, అమరావతి: ప్రతి ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ ల్యాబ్‌లు, ఇంటర్నెట్ సదుపాయం కల్పించాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని నివాసంలో మంగళవారం పాఠశాల విద్య, ఇంటర్మీడియట్, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖలపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. "బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్‌ను పునర్ వ్యవస్థీకరించి, నిపుణులను భాగస్వామ్యం చేయాలి. త్వరలోనే బోర్డు మీటింగ్ నిర్వహించాలి. అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్టెమ్ కార్యకలాపాలు చేపట్టాలి. ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికను పారదర్శకంగా చేపట్టాలి" అని సూచించారు.

విదేశాల్లో మెరుగైన అవకాశాలు కల్పించాలి

'నైపుణ్య పోర్టల్‌ను సెప్టెంబరు ఒకటి నుంచి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలి. జిల్లా ఉపాధి కల్పన అధికారి పోస్టును జిల్లా ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి అధికారిగా మార్చాలి. వీరి ఆధ్వర్యంలో జాబ్ మేళాలు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలి. నైపుణ్య శిక్షణతో విదేశాల్లో మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఉపాధి కోసం విదేశాలకు వెళ్తున్న వారికి ఇబ్బందులు తలెత్తకుండా సహాయ మార్గదర్శకాలను రూపొందించాలి. వారికి ఏమైనా ఇబ్బందులు తలెత్తితే హెల్ప్‌లైన్ నంబరు 0863-2340678 లేదా వాట్సప్ నంబరు 85000 27678ని సంప్రదించాలి.

ఏపీవైపు చూడండి

ఏరోస్పేస్ పరిశ్రమను ఆహ్వానించిన లోకేశ్

ఏరోస్పేస్ పరిశ్రమను మంత్రి లోకేశ్ ఆంధ్రప్రదేశ్‌కు ఆహ్వానించారు. బెంగళూరుకు సమీపంలోనే 8 వేలు ఎకరాలు సిద్ధంగా ఉందని ఎక్స్‌లో పేర్కొన్నారు. రైతుల ఆందోళన నేపథ్యంలో బెంగళూరు విమానాశ్రయం సమీపంలో ప్రతిపాదిత ఏరోస్పేస్ పార్కు ఏర్పాటుకు భూ సేకరణను విరమించుకుంటున్నట్లు కర్ణాటక సీఎం మంగళవారం ప్రకటించారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ.. "ప్రియమైన ఏరోస్పేస్ పరిశ్రమ, దీని గురించి బాధగా ఉంది. మీ కోసం నా దగ్గర మంచి ఆలోచన ఉంది. మీరు ఏపీ వైపు ఎందుకు చూడకూడదు? మీ కోసం మా వద్ద ఆకర్షణీయమైన ఏరోస్పేస్ పాలసీ ఉంది. అత్యుత్తమ ప్రోత్సాహకాలు, బెంగళూరు సమీపంలో 8 వేల ఎకరాలకుపైగా భూమి సిద్ధంగా ఉంది. త్వరలో మిమ్మల్ని కలవాలని ఆశిస్తున్నాను" అని పేర్కొన్నారు.

హంద్రీ-నీవాకు సుజలాం.. సుఫలాం!

రేపు నీటిని విడుదల చేయనున్న సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ఏళ్ల తరబడి పెండింగులో ఉన్న హంద్రీ-నీవా సుజల స్రవంతి కాలువల విస్తరణ పనులు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏడాదిలోనే సాకారమయ్యాయి. 2014-19 మధ్య ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉండగా ఈ పనులు ప్రారంభమయ్యాయి. జగన్ హయాంలో మూలనపడి మళ్లీ ఇన్నాళ్లకు పూర్తయ్యాయి. వంద రోజుల్లోనే తొలిదశలో కాలువల విస్తరణ పనులు పూర్తిచేశారు. ఈ కాలువ ప్రవాహ సామర్థ్యాన్ని 3,850 క్యూసెక్కులకు పెంచారు. ఫలితంగా రాయలసీమ జిల్లాలకు పూర్తిస్థాయిలో 40 టీఎంసీలు మళ్లించే ఆస్కారం ఏర్పడింది. ఇంతకుముందున్న ప్రవాహ సామర్థ్యం కన్నా అదనంగా 1,600 క్యూసెక్కులు మళ్లించే వీలు కలిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 17న నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మల్యాల పంపింగ్ స్టేషన్ నుంచి హంద్రీ-నీవాకు నీళ్లు విడుదల చేయనున్నారు. వంద రోజుల్లోనే ఈ పనులు దాదాపు పూర్తిచేశారు. కాలువ ప్రవాహానికి ఇబ్బంది లేనంత మేరకు తొలిదశలోని రెండు ప్యాకేజీల్లో 8 లక్షల క్యూబిక్ మీటర్ల మేర పని... కాలువలకు నీళ్లు వదిలాక చేస్తారు.

ఛాంపియన్

0, 4, 0, 0, 0, 2, 11, 4*, 0, 0, 0

వర్ణనాతీతమైన వెస్టిండీస్ వేదనకు అద్దం పట్టే నంబర్లివి. పడిపోయిన వెస్టిండీస్ క్రికెట్ ప్రమాణాలకు తాజా సాక్ష్యాలివి. కింగ్‌స్టన్‌లో కరీబియన్ జట్టు కుదేలైంది. ఆస్ట్రేలియా పేస్ దెబ్బకు గజగజా వణికిపోయింది. మిచెల్ స్టార్క్ సంచలన బౌలింగ్‌కు దాసోహమన్న విండీస్.. నమ్మశక్యం కాని రీతిలో కేవలం 27 పరుగులకే కుప్పకూలి టెస్టు క్రికెట్ చరిత్రలో రెండో అత్యల్ప స్కోరును నమోదు చేసింది. ఆసీస్ బంతితో నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడగా.. బ్యాటర్లకు పట్టుమని పది బంతులాడడమే గగనంగా మారింది. వికెట్ల పతనం హైలైట్స్‌లా సాగిన వేళ.. వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్ కేవలం 87 బంతుల్లోనే ముగియడం విశేషం. ఏడుగురు బ్యాటర్లు డకౌట్ కాగా.. ఒకే ఒక్కడు రెండంకెల స్కోరు చేశాడు. తన వందో టెస్టులో గులాబీ బంతితో భీకర పేస్‌తో విశ్వరూపం చూపించిన స్టార్క్.. కేవలం 15 బంతుల్లోనే అయిదు వికెట్ల ఘనత సొంతం చేసుకున్నాడు. స్కాట్ బోలాండ్ హ్యాట్రిక్ సాధించాడు. మూడో టెస్టులోనూ విండీస్‌ను చిత్తుచేసిన ఆసీస్.. సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది.


మిచెల్ స్టార్క్ (6/9)

15
అయిదు వికెట్లు తీయడానికి స్టార్క్‌కు అవసరమైన బంతులు. టెస్టుల్లో అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన బౌలర్‌గా అతడు రికార్డు సృష్టించాడు.

87 బంతులు.. 27 పరుగులు.. ఓ ఇన్నింగ్స్

● స్టార్క్ ధాటికి వెస్టిండీస్ గజగజ

● టెస్టు క్రికెట్ చరిత్రలో రెండో అత్యల్ప స్కోరు నమోదు ● బోలాండ్ హ్యాట్రిక్ ● మూడో టెస్టులో ఆసీస్ ఘనవిజయం

కింగ్‌స్టన్: మిచెల్ స్టార్క్ (6/9) సంచలన బౌలింగ్‌తో మూడో టెస్టు (డే/నైట్)లో ఆస్ట్రేలియా 176 పరుగుల తేడాతో వెస్టిండీస్‌పై ఘనవిజయం సాధించింది. 204 పరుగుల లక్ష్యంతో మూడో రోజు బరిలోకి దిగిన వెస్టిండీస్.. 14.3 ఓవర్లలో 27 పరుగులకే కుప్పకూలింది. జస్టిన్ గ్రీవ్స్ (11) టాప్ స్కోరర్. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 99/6తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్ 121 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 225 పరుగులు చేయగా.. వెస్టిండీస్ 143కే ఆలౌటైంది. ఈ టెస్టులో గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ఆస్ట్రేలియా 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. స్టార్క్ తన వందో టెస్టులో 400 వికెట్ల మైలురాయిని చేరుకోవడం విశేషం.

బ్యాటర్లు తేలిపోయారు..: బౌలర్ల హవా సాగిన టెస్టులో మూడో రోజు బ్యాటర్లు మరింత బెంబేలెత్తిపోయారు. రెండో ఇన్నింగ్స్‌లో విండీస్ తేలిపోయింది. స్టార్క్ స్వింగ్ బౌలింగ్‌ను ఎదుర్కోవడం ఆ జట్టుకు చాలా కష్టమైపోయింది. బ్యాటర్లను గడగడలాడించిన స్టార్క్.. తొలి ఓవర్లోనే మూడు వికెట్లు పడగొట్టాడు. క్యాంప్‌బెల్, అండర్సన్, కింగ్‌ను వెనక్కి పంపాడు. ఖాతా అయినా తెరవకుండానే విండీస్ ఆ మూడు వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత పతనం ఏ దశలోనూ ఆగలేదు. ఏ ఒక్క బ్యాటరూ నిలవలేదు. ఆతిథ్య జట్టు కాస్తయినా ప్రతిఘటించలేకపోయింది. పూర్తిగా తేలిపోయింది. స్టార్క్ అయిదో ఓవర్లో లూయిస్, హోప్‌ను ఔట్ చేశాడు. ఆ తర్వాతి ఓవర్లో ఛేజ్‌ను హేజిల్‌వుడ్ ఔట్ చేయడంతో 11/6తో నిలిచింది వెస్టిండీస్. కాసేపటి తర్వాత బోలాండ్ హ్యాట్రిక్‌తో ఆ జట్టును దెబ్బతీశాడు. బోలాండ్ వరుస బంతుల్లో గ్రీవ్స్, షమర్ జోసెఫ్, వారికన్‌ను ఔట్ చేయడంతో వెస్టిండీస్ 26/9తో అత్యల్ప స్కోరు రికార్డును సమం చేసే ప్రమాదంలో పడింది. సామ్ కొన్‌స్టాస్ ఫీల్డింగ్‌లో పొరపాటు చేయడంతో మరో పరుగు చేసి ఆ ముప్పును తప్పించుకుంది. కానీ ఆ వెంటనే ఆఖరి వికెట్‌ను కోల్పోయింది. టెస్టుల్లో విండీస్ గత అత్యల్ప స్కోరు 47 (2004లో ఇంగ్లాండ్‌పై) పరుగులు.


బోలాండ్

27
టెస్టు క్రికెట్ చరిత్రలో ఇది రెండో అత్యల్ప స్కోరు. రికార్డు న్యూజిలాండ్ పేరిట ఉంది. ఆ జట్టు 1955లో ఆక్లాండ్‌లో ఇంగ్లాండ్‌పై 26 పరుగులకే కుప్పకూలింది.

516
కింగ్‌స్టన్ టెస్టులో ఆస్ట్రేలియా, వెస్టిండీస్ కలిసి చేసిన పరుగులు. ఓ టెస్టులో జట్లు రెండుసార్లు ఆలౌటైన సందర్భంలో ఇది ఏడో అత్యల్పం. 1910 తర్వాత ఇదే అత్యల్పం.

19062
టెస్టుల్లో 400 వికెట్ల మైలురాయిని అందుకోవడానికి స్టార్క్ వేసిన బంతులు. బంతుల పరంగా వేగంగా ఆ ఘనత సాధించిన బౌలర్ల జాబితాలో స్టెయిన్ (16634 బంతులు) తర్వాత అతడు రెండో స్థానంలో ఉన్నాడు.

14.3
రెండో ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ ఆడిన ఓవర్లు. టెస్టు క్రికెట్లో ఇది మూడో అతి చిన్న ఆలౌట్ ఇన్నింగ్స్. అతి చిన్న ఇన్నింగ్స్ రికార్డు (12.3 ఓవర్లు) దక్షిణాఫ్రికా పేరిట ఉంది. శ్రీలంక (13.5)ది రెండో స్థానం.

6
వెస్టిండీస్ తొలి ఆరుగురు బ్యాటర్లు కలిసి చేసిన పరుగులు. టెస్టు ఇన్నింగ్స్‌లో ఓ జట్టు టాప్-6 బ్యాటర్లు చేసిన అతి తక్కువ పరుగులివే.

7
వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో డకౌట్లు. ఓ టెస్టు ఇన్నింగ్స్‌లో ఏడుగురు బ్యాటర్లు ఖాతా తెరవకపోవడం ఇదే తొలిసారి. ఓ ఇన్నింగ్స్‌లో ఆరు డకౌట్లు నమోదైన సందర్భాలు గతంలో 9 ఉన్నాయి.

సంక్షిప్త స్కోర్లు: ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 225; వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్: 143; ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 121; వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్: 27 (క్యాంప్‌బెల్ 0, లూయిస్ 4, కెవ్లాన్ అండర్సన్ 0, బ్రెండన్ కింగ్ 0, రోస్టన్ ఛేజ్ 0, షై హోప్ 2, గ్రీవ్స్ 11, అల్జారి జోసెఫ్ 4 నాటౌట్, షమర్ జోసెఫ్ 0, వారికన్ 0, సీల్స్ 0; స్టార్క్ 6/9, బోలాండ్ 3/2)

బౌలింగ్ సూపర్‌స్టార్క్

క్రికెట్ ఎంతోమంది ఎడమచేతి వాటం బౌలర్లను చూసింది. కానీ అతడి శైలి వేరు. ఆ దూకుడే వేరు. రనప్ మామూలుగానే అనిపిస్తుంది. వేగం కూడా ఎక్కువేం కాదు. కానీ ఫలితం మాత్రం అనూహ్యంగా ఉంటుంది. ఆఫ్‌సైడ్ వెళ్తుంది అనుకున్న బంతి లోపలికి ఇన్‌స్వింగ్ అయి వికెట్లను కూల్చేస్తుంది. ఇన్ స్వింగర్‌కు సిద్ధమైతే ఔట్ స్వింగర్ బ్యాటర్‌ను అయోమయానికి గురి చేస్తుంది. ఇక బుల్లెట్ యార్కర్లకు స్టంప్స్ గాల్లోకి లేవాల్సిందే! అతడి బౌలింగ్‌ను రీప్లేలో చూస్తే కదులుతున్న కవిత్వంలాగే ఉంటుంది. మిచెల్ స్టార్క్ గురించే ఈ ఉపోద్ఘాతమంతా! మెక్‌గ్రాత్ స్థిరత్వం.. బ్రెట్‌లీ వేగం కలబోసిన ఈ ఆస్ట్రేలియా పేసర్.. వెస్టిండీస్‌తో మూడో టెస్టులో అసాధారణ బౌలింగ్‌తో అదరగొట్టాడు. వందో టెస్టులో 400 వికెట్ల మైలురాయి దాటి ఈ టెస్టును చిరస్మరణీయం చేసుకున్నాడు.




2011 న్యూజిలాండ్‌పై తొలి టెస్టు ఆడిన స్టార్క్.. ఆరంభం నుంచి ఆకట్టుకున్నాడు. అదిరే బౌలింగ్‌తో స్టార్లతో కూడిన ఆసీస్ లైనప్‌లో తన ప్రత్యేకతను చాటుకున్నాడు. తక్కువ కాలంలోనే ప్రధాన బౌలర్‌గా ఎదిగాడు. నియంత్రణతో కూడిన కచ్చితత్వంతో అనుకున్న ప్రదేశంలో బంతిని వేయడంలో స్టార్క్ దిట్ట. ఇన్‌స్వింగింగ్ యార్కర్ అతడి అమ్ములపొదిలో ప్రధాన అస్త్రం. అందరూ ఉపయోగించేది ఒక బంతినే. కానీ స్టార్క్ చేతికొచ్చేసరికి ఆ బంతే ఏదో మాయ చేస్తుంది. అతడు చెప్పినట్లే వింటుంది. అరంగేట్రం నుంచి గాయాల కారణంగా స్టార్క్ చాలా ఏళ్లు టెస్టు మ్యాచ్ ఆడకుండా లేడు. 2023లో మాత్రమే ఒకసారి గాయంతో దూరమయ్యాడు. స్థిరత్వానికి చిరునామాగా ఉండే స్టార్క్.. ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే 20సార్లు వికెట్ పడగొట్టాడు. ఓపెనర్ల వికెట్లే అతడి ఖాతాలో 107 ఉన్నాయి. ముఖ్యంగా ఎడమచేతి వాటం బ్యాటర్లకు స్టార్క్ కొరకరాని కొయ్యే. స్వింగ్‌కు అనుకూలించే పిచ్‌లపై బంతి ఎటుపడి ఎటు వెళ్తుందో తెలుసుకునే లోపే ఔటైన సందర్భాలు ఎన్నో. తన కెరీర్‌లో అతడు 125 మంది లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లను పెవిలియన్ చేర్చాడు. వన్డే, టీ20ల్లో స్టార్క్ వేరు.. టెస్టుల్లో వేరు అన్నట్లుగానే అనిపిస్తుంది అతడి బౌలింగ్. ఆరంభంలోనే వికెట్లు తీయడంతో పాటు ఛేంజ్ బౌలర్‌గా వచ్చి మధ్యలోనూ వికెట్లు పడగొట్టి భాగస్వామ్యాలను విడదీస్తాడు. ఇలా అతను మలుపు తిప్పిన మ్యాచ్‌లు ఎన్నో! ఇక గులాబి బంతితో స్టార్క్ ఇంకా ప్రమాదకరంగా మారతాడు. ఈ మ్యాచ్‌ల్లో 18 సగటుతో 74 వికెట్లు పడగొట్టాడు. తాజాగా వెస్టిండీస్‌తో డే/నైట్ టెస్టు మ్యాచ్ స్టార్క్ ఉత్తమ ప్రదర్శనకు వేదికగా నిలిచింది. స్టార్క్ స్వింగ్‌కు విండీస్ బ్యాటర్ల నుంచి సమాధానమే లేదు. బ్యాక్ ఆఫ్ లెంగ్త్, షార్ట్ పిచ్ బంతులతో అతడు ప్రత్యర్థి పనిపట్టాడు. విండీస్‌పై స్టార్క్ తీసిన 6 వికెట్లలో తొలి 5 వికెట్లను కేవలం 15 బంతుల వ్యవధిలో పడగొట్టాడు. షేన్‌వార్న్, మెక్‌గ్రాత్, నాథన్ లైయన్ తర్వాత టెస్టుల్లో 400 వికెట్లు తీసిన ఆస్ట్రేలియా బౌలర్ స్టార్కే. బంతుల పరంగా 400 వికెట్ల మైలురాయిని వేగంగా అందుకున్న రెండో పేసర్ స్టార్క్ (19064). డేల్ స్టెయిన్ (16334) ఈ జాబితాలో ముందున్నాడు. 35 ఏళ్ల స్టార్క్ ఈ జోరునే మున్ముందు కూడా కొనసాగిస్తే మరిన్ని రికార్డులు కొల్లగొట్టడం ఖాయం.

ఈ సిరీస్‌నూ పట్టేయాలని..

● నేడే ఇంగ్లాండ్‌తో భారత మహిళల తొలి వన్డే

సాయంత్రం 5.30 నుంచి


హర్మన్‌ప్రీత్


స్మృతి మంధాన

సౌథాంప్టన్: అంచనాలను మించిన ప్రదర్శనతో టీ20ల్లో అదరగొట్టి, తొలిసారి ఇంగ్లాండ్‌పై సిరీస్ విజయం (3-2) సాధించిన భారత జట్టు.. ఇప్పుడిక వన్డే సిరీస్‌పై గురి పెట్టింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారమే తొలి వన్డే. ఈ సిరీస్‌నూ గెలిస్తే స్వదేశంలో జరిగే ప్రపంచకప్‌నకు మరింత ఆత్మవిశ్వాసంతో సిద్ధం కావొచ్చని హర్మన్‌ప్రీత్ సేన భావిస్తోంది. చివరగా మేలో దక్షిణాఫ్రికా, శ్రీలంక కూడా పాల్గొన్న ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత్ విజేతగా నిలిచింది. వన్డేల్లో తరచూ 300 స్కోర్లు చేయడం హర్మన్‌ప్రీత్ బృందం బ్యాటింగ్ బలానికి నిదర్శనం. బౌలర్లు కూడా నిలకడగా రాణిస్తున్నారు. టీ20ల్లో సత్తా చాటిన స్మృతి మంధానపై మంచి అంచనాలున్నాయి. మరో ఓపెనర్ ప్రతీక రావల్ వన్డేల్లో నిలకడగా రాణిస్తోంది. హర్మన్‌ప్రీత్ నిలకడ అందుకోవాల్సి ఉంది. టీ20 సిరీస్‌లో అదరగొట్టిన తెలుగమ్మాయిలు శ్రీచరణి, అరుంధతిరెడ్డి బౌలింగ్‌లో కీలకం కానున్నారు. ఇంగ్లాండ్‌ను సొంతగడ్డపై తక్కువ అంచనా వేస్తే కష్టమే. ప్రపంచ నంబర్‌వన్ వన్డే బౌలర్ సోఫీ ఎకిల్‌స్టోన్ ఫామ్‌లో ఉంది. బ్యాటింగ్‌లో నాట్ సీవర్, సోఫీ డంక్లీ, క్యాప్సీ, బ్యూమాంట్‌లను కట్టడి చేయడం కీలకం.

టాప్-10లో షెఫాలి


షెఫాలి

దుబాయ్: ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లో రాణించిన భారత మహిళల జట్టు ఓపెనర్ షెఫాలి వర్మ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మళ్లీ టాప్-10లో అడుగుపెట్టింది. మంగళవారం ఐసీసీ ప్రకటించిన బ్యాటింగ్ జాబితాలో 4 స్థానాలు మెరుగైన షెఫాలి 9వ ర్యాంకు సాధించింది. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన మూడో స్థానంలో కొనసాగుతోంది. జెమీమా రోడ్రిగ్స్ 14, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 15వ స్థానాల్లో ఉన్నారు. బౌలింగ్‌లో దీప్తి శర్మ 3, రేణుక సింగ్ 11వ ర్యాంకులు సాధించారు. ఆల్‌రౌండర్లలో దీప్తి మూడో స్థానాన్ని నిలబెట్టుకుంది.

యశ్ దయాళ్ అరెస్టుపై హైకోర్టు స్టే


యశ్ దయాళ్

ప్రయాగ్‌రాజ్: లైంగిక వేధింపుల కేసులో క్రికెటర్ యశ్ దయాళ్‌కు ఊరట లభించింది. అతడి అరెస్టుపై అలహాబాద్ హైకోర్టు మంగళవారం స్టే విధించింది. తనపై ఎఫ్ఐఆర్‌ను సవాలు చేస్తూ దయాళ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు.. ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ వరకు దయాళ్‌ను అరెస్ట్ చేయరాదని ఆదేశించింది. దయాళ్ తనను లైంగికంగా వేధించాడని, పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేశాడని ఓ మహిళ ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ నెల 6న దయాళ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

భారత్-ఎ హాకీ జట్టుకు రెండో ఓటమి

ఆమ్‌స్టెల్‌వీన్ (నెదర్లాండ్స్): ఐరోపా పర్యటనలో భారత్-ఎ హాకీ జట్టుకు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. మంగళవారం 2-3తో ఇంగ్లాండ్ చేతిలో పరాజయం పాలైంది. మణిందర్ సింగ్, ఉత్తమ్ సింగ్ భారత్ తరఫున గోల్స్ చేసినా.. ఇంగ్లాండ్ విజయాన్ని అడ్డుకోలేకపోయారు. "ఈ పర్యటనలో ఆరంభంలో మూడు మ్యాచ్‌లు గెలిచాం. ఇప్పుడు వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడిపోయాం. తప్పులు దిద్దుకుని ముందుకు సాగుతాం" అని కోచ్ శివేంద్ర సింగ్ తెలిపాడు. గురువారం బెల్జియంతో భారత్ తలపడనుంది. తర్వాత 18, 20 తేదీల్లో నెదర్లాండ్స్‌తో ఆడనుంది.

రుతుపర్ణ జోడీ పరాజయం


రుతుపర్ణ, శ్వేతపర్ణ

టోక్యో: జపాన్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 750 టోర్నీలో భారత డబుల్స్ జోడీ రుతుపర్ణ పాండా- శ్వేతపర్ణ పాండాకు చుక్కెదురైంది. మంగళవారం జరిగిన మహిళల డబుల్స్ తొలి రౌండ్లో రుతుపర్ణ- శ్వేతపర్ణ జోడీ 13-21, 7-21తో కొకొన ఇషికావా- మైకో కవాజొయె (జపాన్) జంట చేతిలో పరాజయం చవిచూసింది. 32 నిమిషాల్లోనే ముగిసిన మ్యాచ్‌లో జపాన్ జోడీకి రుతుపర్ణ- శ్వేతపర్ణ జంట ఏమాత్రం పోటీనివ్వలేకపోయింది. ఈ టోర్నీలో భారత స్టార్ క్రీడాకారులు పి.వి.సింధు, లక్ష్యసేన్, సాత్విక్ సాయిరాజ్-చిరాగ్‌శెట్టి పోరాటం బుధవారం ప్రారంభమవుతుంది.

చివరి బ్యాటర్ ఔటయ్యాక ఏమనిపించింది?


భారత క్రికెటర్లతో బ్రిటన్ రాజు చార్లెస్-3

లండన్: 'చివరి బ్యాటర్ ఔటయ్యాక ఏమనిపించింది'... భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను బ్రిటన్ రాజు చార్లెస్-3 అడిగిన ప్రశ్న ఇది. మంగళవారం భారత పురుషులు, మహిళల జట్లు క్లారెన్స్ హౌస్ గార్డెన్స్‌లో మర్యాదపూర్వకంగా రాజును కలిసినప్పుడు ఇలా సంభాషించారు. "బ్రిటన్ రాజు చార్లెస్ మాతో సరదాగా మాట్లాడారు. 'బంతి అనుకోకుండా స్టంప్స్‌పైకి వెళ్లడంతో చివరి బ్యాటర్ ఔటయ్యాడు. అప్పుడు మీకేమనిపించింది' అని అడిగారు. 'అది దురదృష్టకరం. వచ్చే రెండు మ్యాచ్‌ల్లో రాణిస్తామని భావిస్తున్నాం' అని సమాధానం చెప్పా" అని గిల్ తెలిపాడు. ఇంతకుముందు ఇంగ్లాండ్‌కు వచ్చినా తొలిసారి బ్రిటన్ రాజు చార్లెస్‌ను కలిసే అవకాశం వచ్చిందని.. ఆయన ఎంతో స్నేహపూర్వకంగా సంభాషించారని భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తెలిపింది.

బషీర్ స్థానంలో డాసన్


డాసన్

లండన్: భారత్‌తో నాలుగో టెస్టు కోసం ఎడమ చేతి వాటం స్పిన్నర్ లయామ్ డాసన్‌ను ఇంగ్లాండ్ తమ జట్టులోకి తీసుకుంది. గాయంతో జట్టుకు దూరమైన స్పిన్నర్ షోయబ్ బషీర్ స్థానంలో డాసన్‌ను ఎంపిక చేసుకుంది. భారత్‌తో మూడో టెస్టులో తన బౌలింగ్‌లోనే ఫీల్డింగ్ చేస్తుండగా బషీర్ ఎడమ వేలికి గాయమైంది. అయినా కూడా బౌలింగ్‌ను కొనసాగించిన బషీర్.. సిరాజ్‌ను ఔట్ చేసి ఇంగ్లాండ్‌కు విజయాన్ని అందించాడు. ఈ నెల 23న మాంచెస్టర్‌లో ప్రారంభమయ్యే నాలుగో టెస్టుకు బషీర్ అందుబాటులో ఉండకపోవడంతో డాసన్‌కు అవకాశం లభించింది. సుమారు ఎనిమిదేళ్ల తర్వాత ఇంగ్లాండ్ టెస్టు నుంచి డాసన్‌కు పిలుపు రావడం గమనార్హం. తన కెరీర్‌లో 3 టెస్టులాడిన డాసన్ ఏడు వికెట్లు తీశాడు.

జడేజా సాహసం చేయాల్సింది


అనిల్ కుంబ్లే

దిల్లీ: ఇంగ్లాండ్‌తో మూడో టెస్టు చివరి ఓవర్లో స్పిన్నర్ షోయబ్ బషీర్ బౌలింగ్‌లో మహ్మద్ సిరాజ్‌ను రవీంద్ర జడేజా మూడు బంతులు ఎదుర్కొనేలా చేయాల్సింది కాదని భారత మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే అన్నాడు. సిరాజ్‌కు బ్యాటింగ్ ఇచ్చే బదులు జడేజా భారీ షాట్ల కోసం సాహసం చేయాల్సిందని అభిప్రాయపడ్డాడు. "చెన్నైలో పాకిస్థాన్ చేతిలో 12 పరుగుల తేడాతో ఓడిపోయిన సంగతి నాకు గుర్తొచ్చింది. సిరాజ్ ఔటైన విధానం సరిగ్గా అలాగే ఉంది. మరో 22 పరుగులు మాత్రమే చేయాలి. జడేజా ఒంటరిగా మిలిగిపోయాడు. అతను జట్టును విజయానికి చేరువ చేయాలని ప్రణాళిక రచించాడు. కానీ ఇంగ్లాండ్ మాత్రం తన పనిని పూర్తిచేయడంలో నిమగ్నమైంది. తను లక్ష్యం చేసుకోవాల్సిన బౌలర్లను జడేజా గుర్తించి ఉండేవాడు. కాస్త నెమ్మదిగా వేస్తున్న క్రిస్ వోక్స్, జో రూట్ లేదా బషీర్ వారిలో ఉంటారు. ఆ సమయంలో ఎవరైనా సాహసం చేయాల్సి ఉందంటే అది సిరాజ్ కాదు జడేజా. బుమ్రా, సిరాజ్‌లతో మరో ఎండ్‌లో బ్యాటింగ్ చేస్తూ జడేజా ఎక్కువ స్ట్రైకింగ్‌లో ఉండేలా చూసుకున్నాడు. అయితే బషీర్ బౌలింగ్‌లో సిరాజ్‌ను ఎక్కువ బంతులు ఆడించడం సాహసమే. బషీర్ ఓవర్లో జడేజా భారీ షాట్లు ఆడాల్సింది" అని కుంబ్లే పేర్కొన్నాడు.

భారత్ గెలవాల్సింది


గంగూలీ

ముంబయి: మూడో టెస్టులో టీమ్‌ఇండియా గెలవాల్సిందని మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ అభిప్రాయపడ్డాడు. టాప్‌ఆర్డర్ మెరుగైన ప్రదర్శన చేసి ఉంటే సిరీస్‌లో భారత్ ఆధిక్యంలో ఉండేదని అన్నాడు. "ఈ సిరీస్‌లో భారత జట్టు బ్యాటింగ్ కాస్త నిరాశ కలిగించింది. లార్డ్స్‌లో ఆ జట్టు లక్ష్యాన్ని ఛేదించాల్సింది. జడేజా పోరాటం చూశాం. జట్టులో ప్రతిభావంతులైన బ్యాటర్లు ఉన్నారు. సిరీస్‌లో 2-1 ఆధిక్యం సంపాదించే అవకాశం చేజారినందుకు టీమ్‌ఇండియా నా కన్నా ఎక్కువే నిరాశ చెంది ఉంటుంది" అని గంగూలీ చెప్పాడు. "బ్యాటింగ్ బలంగా ఉన్నప్పటికీ 193 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేకపోవడం భారత్‌కు నిరాశ కలిగించి ఉంటుంది. టాప్ ఆర్డర్ కాస్త పోరాడి ఉంటే భారత్ గెలిచేది" అని అన్నాడు.

ఇంగ్లాండ్, కివీస్‌లతో భారత్ వార్మప్

దుబాయ్: మహిళల వన్డే ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్, న్యూజిలాండ్‌లతో భారత జట్టు వార్మప్ మ్యాచ్‌లు ఆడనుంది. ఈ ఏడాది సెప్టెంబరు-అక్టోబరులో భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ప్రపంచకప్ వార్మప్ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను మంగళవారం ఐసీసీ ప్రకటించింది. బీసీసీఐ, పీసీబీల మధ్య ఒప్పందం ప్రకారం పాకిస్థాన్ తన వార్మప్, ప్రపంచకప్ మ్యాచ్‌లను శ్రీలంకలో ఆడనుంది. సెప్టెంబరు 25న బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో జరిగే తొలి వార్మప్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌తో భారత్ తలపడనుంది. 27న చిన్నస్వామి స్టేడియంలో కివీస్‌తో రెండో వార్మప్ పోరు ఉంటుంది. సెప్టెంబరు 30న చిన్నస్వామి స్టేడియంలో ప్రపంచకప్ ఆరంభ పోరులో భారత్, శ్రీలంక పోటీపడనున్నాయి.

వార్మప్ షెడ్యూల్

సెప్టెంబరు 25
బెంగళూరు
భారత్ × ఇంగ్లాండ్
దక్షిణాఫ్రికా × న్యూజిలాండ్
కొలంబో
శ్రీలంక × పాకిస్థాన్
బంగ్లాదేశ్ × శ్రీలంక-ఎ

సెప్టెంబరు 27
బెంగళూరు
ఆస్ట్రేలియా × ఇంగ్లాండ్
భారత్ × న్యూజిలాండ్
కొలంబో
శ్రీలంక × బంగ్లాదేశ్

సెప్టెంబరు 28
బెంగళూరు
దక్షిణాఫ్రికా × ఇండియా-ఎ
కొలంబో
పాకిస్థాన్ × శ్రీలంక-ఎ

ప్రపంచ విద్యార్థులకు అందుబాటులో దిల్లీ

క్యూఎస్ జాబితా వెల్లడి

దిల్లీ: ప్రపంచంలో విద్యార్థులకు అనుకూలంగా ఉండే అగ్రశ్రేణి 130 నగరాల్లో మన దేశంలోని దిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నైలకు చోటు దక్కింది. జీవనవ్యయం పరంగా దిల్లీ నగరం అన్ని దేశాల విద్యార్థులకు అత్యంత అందుబాటులో ఉందని లండన్ నుంచి వెలువడిన '2026 ఉత్తమ క్యూఎస్ విద్యార్థుల నగరాలు' జాబితా వెల్లడించింది. ఈ నాలుగు నగరాల ర్యాంకులు మునుపటికంటే మెరుగుపడ్డాయి. ముంబయి నగరం 15 స్థానాలు ఎగబాకి 98కి చేరింది. దిల్లీ 104లో, బెంగళూరు 108లో నిలిచాయి. చెన్నై 12 స్థానాలు మెరుగుపరచుకుని 128లో నిలిచింది. అందుబాటు జీవన వ్యయం విషయంలో మాత్రం దిల్లీ తొలిస్థానంలో నిలవగా.. ముంబయి, బెంగళూరు గణనీయంగా మెరుగుపడి తొలి 15 స్థానాల్లో చోటు దక్కించుకున్నాయి. పట్టభద్రులకు ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉండే నగరాల్లో దిల్లీ, ముంబయి తొలి 50 నగరాల్లో స్థానం పొందాయి. బెంగళూరు 59లో నిలిచింది. ప్రపంచంలో విద్యార్థులకు ఉత్తమమైన నగరంగా సియోల్ అవతరించింది. వరుసగా ఆరేళ్లపాటు తొలి స్థానంలో నిలిచిన లండన్ మూడో స్థానానికి పరిమితమైంది.

ప్రపంచ కురువృద్ధ మారథాన్ అథ్లెట్ ఫౌజా సింగ్ దుర్మరణం



చండీగఢ్: ప్రపంచంలో అత్యంత వృద్ధ మారథాన్ అథ్లెట్‌గా గుర్తింపు పొందిన ఫౌజా సింగ్(114) ఓ ప్రమాదంలో మృతిచెందారు. ఈ ఘటనకు కారణమైన వాహనాన్ని పోలీసులు మంగళవారం గుర్తించారు. పంజాబ్‌లోని జలంధర్ జిల్లాలో తన స్వగ్రామమైన బియాస్‌లో సోమవారం సాయంత్రం రోడ్డుపై నడుస్తున్న ఆయన్ని గుర్తుతెలియని కారు ఢీకొంది. గాల్లో ఏడ అడుగులు ఎగిరిపడి తీవ్ర గాయాలతో ఆయన ప్రాణాలు కోల్పోయారు. ఫౌజా మృతిపట్ల ప్రధాని నరేంద్రమోదీ సహా పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు.




మీ విశ్వాసాలను ఉన్నతీకరించుకోండి

వాస్తవికతతో సరిపోలాలన్న ఉద్దేశంతో మీ కలల స్థాయిని ఎప్పుడూ తగ్గించుకోకండి. దానికి బదులు- మీ దృక్పథానికి తగ్గట్టుగా స్వీయ విశ్వాసాలను ఉన్నతీకరించుకోండి. మనకు మనం కల్పించుకునేవి తప్ప.. జీవితానికి నిజమైన పరిమితులేవీ ఉండవు.

– లెవిస్ హోవెస్, రచయిత

ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో దేశ విజ్ఞాన చరిత్ర

దిల్లీ: ప్రాచీన తత్వవేత్త ఆచార్య కణాదుడి 'పరమాణువు' సిద్ధాంతం నుంచి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) విజయవంతంగా చేపట్టిన అంతరిక్ష యాత్రలకు సంబంధించిన అంశాలతో జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్‌టీ) పుస్తకాన్ని తయారు చేసింది. 'క్యూరియాసిటీ' పేరుతో 8వ తరగతి కొత్త సైన్స్ పాఠ్య పుస్తకాన్ని తీసుకొచ్చింది. 'సంప్రదాయ విజ్ఞానాన్ని ఆధునిక శాస్త్రీయతతో అనుసంధానించడం ద్వారా ఉత్సుకత, పర్యావరణంపై అవగాహన, నైతిక విలువలు, విమర్శనాత్మక ఆలోచనలను పిల్లల్లో అభివృద్ధి చేయవచ్చు' అని పుస్తకం ముందుమాటలో పేర్కొంది. ఈ పుస్తకంలో పరమాణువు సిద్ధాంతం గురించి నుంచి పురాతన కాలంలో ఔషధ మిశ్రమాలను ఎలా తయారు చేశారన్న దానిపై వివిధ అధ్యాయాలు ఉన్నాయి. అదేవిధంగా చంద్రయాన్ 1, 2, 3 మిషన్లు, సూర్యుడి గురించి అధ్యయనానికి సంబంధించిన ఆదిత్య ఎల్1, అంగారకుడి పరిశోధనకు ఉద్దేశించిన మంగళయాన్ గురించి పాఠాలను పుస్తకంలో ఉంచారు.



ఏడీహెచ్‌డీ వల్ల నిద్రలేమితో అనర్థాలు

దిల్లీ: నరాల సంబంధ రుగ్మత వల్ల ఏకాగ్రత కోల్పోవడం, అతిచురుకుదనం కనిపిస్తే దాన్ని అటెన్షన్ డెఫిసిట్ హైపరాక్టివిటీ డిజార్డర్ (ఏడీహెచ్‌డీ) అని పిలుస్తారు. బాల్యం, టీనేజర్లలో కనిపించే ఈ రుగ్మత మెదడు ముందు భాగం ఆలస్యంగా ఎదగడం వల్ల సంభవిస్తుంది. ముందూవెనుక ఆలోచించకుండా అక్కడికక్కడ నిర్ణయాలు తీసుకోవడం, తొందరపాటుతో పనిచేయడం ఏడీహెచ్‌డీలో కనిపిస్తుంది. దీంతో ఏడీహెచ్‌డీ పీడితుల్లో నిద్రలేమి ఏర్పడుతుంది. అది ఆలోచన, ఆచరణలను దెబ్బతీస్తుందని బ్రిటన్, డచ్ పరిశోధకులు తేల్చారు. సాధారణ వ్యక్తుల కన్నా ఈ బాధితుల్లో నిద్రలేమి ఎనిమిదింతలు ఎక్కువగా కనిపిస్తుంది. వెంటనే నిద్ర పట్టకపోవడం, ఆలస్యంగా నిద్ర లేవడం, మగత నిద్రలో అటూఇటూ మసలడం, పగటిపూట నిద్రతో జోగడం వంటివి బాధితుల జీవితాన్ని వెనక్కులాగుతాయి. ఈ నిద్రలేమిపై మరింత లోతుగా పరిశోధన జరిపి సరైన చికిత్సా విధానాలను రూపొందించాల్సి ఉందని నిపుణులు సూచించారు.

ఒకరి భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ మరొకరి హక్కును హరించరాదు

- సామాజిక మాధ్యమాల్లో పరుష వ్యాఖ్యల కట్టడికి మార్గదర్శకాలు రూపొందించండి : సుప్రీం



దిల్లీ: దేశ పౌరులందరూ గౌరవప్రదంగా, స్వేచ్ఛగా జీవించే హక్కును రాజ్యాంగం కల్పించింది, వీటికి ఇతరులు భంగం కలిగించకుండా నడుచుకోవాలని సుప్రీంకోర్టు తెలిపింది. ఒకరి భావ వ్యక్తీకరణ, మాట్లాడే స్వేచ్ఛ ఇతరుల హక్కులను హరించరాదని స్పష్టం చేసింది. సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసే పరుష పదాలు, అవాంఛితమైన వ్యాఖ్యలను నివారించేలా మార్గదర్శకాలు రూపొందించాలని, అదే సమయంలో భావ వ్యక్తీకరణ, వాక్ స్వాతంత్ర్యం, పౌరుల ప్రాథమిక విధులకు భంగంకలిగించని విధంగా సమతుల్యతను పాటించాలని కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణికి స్పష్టం చేసింది. వెన్నెముక కండర సంబంధిత రుగ్మతలతో బాధపడుతున్న, చూపులేని దివ్యాంగులను పరిహసించారనే కేసులో ఆరోపణలున్న సామాజిక మాధ్యమ ఇన్‌ఫ్లుయెన్సర్లు అయిదుగురు మంగళవారం సుప్రీంకోర్టు ఎదుట హాజరయ్యారు. ఆరోపణలకు రెండు వారాల్లో సమాధానాలివ్వాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి ధర్మాసనం వారిని ఆదేశించింది. తదుపరి విచారణకు కూడా తప్పనిసరిగా హాజరుకావాలని ఇన్‌ఫ్లుయెన్సర్లను హెచ్చరించింది. సామాజిక మాధ్యమాల్లో తరచూ వివాదాలకు కారణమవుతున్న పోస్టులను ప్రస్తావిస్తూ వాటి కట్టడికి మార్గదర్శకాలు రూపొందించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. దీనికి సమగ్ర పరిశీలనతో పాటు న్యాయ నిపుణులతో విస్తృత సంప్రదింపులు అవసరమని అటార్నీ జనరల్ తెలిపారు. కొంత సమయం ఇవ్వాలని కోరారు.

కార్టూనిస్టు హేమంత్‌కు అరెస్టు నుంచి రక్షణ

దిల్లీ: సామాజిక మాధ్యమాల్లో ఎవరినైనా ఏదైనా అనేస్తున్నారని, అటువంటి వారి కట్టడికి ఏదో ఒకటి చేయాలని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. అభ్యంతరకర వ్యాఖ్యలు పెరిగిపోతున్నాయని, ఈ జాడ్యాన్ని అడ్డుకోవడానికి న్యాయపరమైన ఆదేశాలివ్వాల్సిన అవసరముందని స్పష్టం చేసింది. ప్రధాని మోదీ, ఆరెస్సెస్ కార్యకర్తలపై అభ్యంతరకర కార్టూన్లు వేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న కార్టూనిస్టు హేమంత్ మాలవీయ కేసు విచారణ సందర్భంగా మంగళవారం అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను దుర్వినియోగం చేయవద్దని హెచ్చరిస్తూ జస్టిస్ సుధాంశు ధూలియా, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఆయనకు అరెస్టు నుంచి రక్షణ కల్పించింది. ఇకపై సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకర పోస్టులు పెడితే అతడిపై చట్టప్రకారం చర్యలు తీసుకునే అధికారం రాష్ట్రానికి ఉందని స్పష్టం చేసింది. ప్రధాని, సంఘ్‌పై వేసిన కార్టూన్ అభ్యంతరకరంగా ఉండటంతో మాలవీయపై న్యాయవాది, ఆరెస్సెస్ కార్యకర్త వినయ్ జోషి ఫిర్యాదు చేశారు. ఈ కేసులో అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ.. మాలవీయ మధ్యప్రదేశ్ హైకోర్టులో ముందస్తు బెయిలు పిటిషన్ వేయగా న్యాయస్థానం దానిని తోసిపుచ్చింది. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హేమంత్ క్షమాపణ చెప్పారని ఆయన తరఫు న్యాయవాది బృందా గ్రోవర్ వెల్లడించడంతో అరెస్టు నుంచి ధర్మాసనం రక్షణ కల్పించింది.

రష్యా ఇంధనం కొంటే 500% సుంకం తప్పదు

భారత్‌కు మరోసారి అమెరికా హెచ్చరిక

వాషింగ్టన్: రష్యాతో వ్యాపారాన్ని కొనసాగిస్తే భారత్‌సహా ఇతర దేశాలపై 500 శాతం సుంకాలను విధిస్తామని అమెరికా మరోసారి హెచ్చరించింది. చైనా, భారత్, బ్రెజిల్, ఇతర దేశాలు రష్యా నుంచి చౌకగా చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తున్నాయని, ఈ దేశాలు యుద్ధ పరిస్థితులను ఆసరాగా చేసుకుంటున్నాయని ఆరోపించింది. 'రష్యాకు సహాయం చేసే దేశాలపై 500 శాతం వరకూ సుంకాలు విధించాలి. రష్యా- ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించడానికి అంతిమ అవకాశం చైనా, భారత్, బ్రెజిల్ వంటి దేశాలపై సుంకాలు విధించడమే. రాబోయే 50 రోజుల్లో శాంతి ఒప్పందం కుదరకపోతే రష్యాపై 100 శాతం సుంకాలను అమలు చేయాలనే అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాన్ని గౌరవిస్తున్నాం. వీటి లక్ష్యం పుతిన్ శాంతి ఒప్పందానికి వచ్చేలా చేయడమే' అని సెనేటర్లు లింజ్ గ్రాహం, రిచర్డ్ బ్లూమెంటల్ స్పష్టం చేశారు.

వర్గపోరులో హింస.. కాల్పుల విరమణ ప్రకటించిన సిరియా

డమాస్కస్: విభిన్న పరిణామాల నేపథ్యంలో సిరియా రక్షణ మంత్రి ముర్హాఫ్ అబు ఖస్రా మంగళవారం కాల్పుల విరమణను ప్రకటించారు. వర్గపోరుతో నెలకొన్న ఉద్రిక్తత నడుమ స్వీడా ప్రావిన్సులోని కీలక నగరంలో ప్రభుత్వ దళాలు అడుగుపెట్టిన కొంతసేపటి తర్వాత ఈ ప్రకటన విడుదలైంది. పొరుగున ఉన్న ఇజ్రాయెల్ మళ్లీ ఆ ప్రాంతంపై దాడులు మొదలుపెట్టింది. బుస్రా అల్-హరీర్ నగర ప్రముఖులతో కుదిరిన ఒప్పందం మేరకు ఇకపై కాల్పులకే తాము ప్రతిస్పందిస్తామని ఖస్రా తెలిపారు. స్థానిక తెగల మధ్య పోరు, అపహరణలు, దాడుల నేపథ్యంలో భద్రతాబలగాలకు, సాయుధ దళాలకు మధ్య కొన్నిరోజులుగా కాల్పులు జరుగుతూ వస్తున్నాయి. స్వీడా నగరంలోకి దళాలు వెళ్లినప్పుడు సిరియా సైనిక ట్యాంకుపై ఇజ్రాయెల్ దాడిచేసింది. దీనిలో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. ఘర్షణల్లో 48 గంటల్లో 135 మంది ప్రాణాలు కోల్పోయారు.

చివరి 'నిమిష'ంలో ఉరిశిక్ష వాయిదా

- కేరళ నర్సుకు ఊరట



దిల్లీ: మరికొన్ని గంటల్లో ఉరికంబం ఎక్కాల్సిన కేరళ నర్సు నిమిష ప్రియకు ఊరట లభించింది. బుధవారం అమలు కావాల్సిన ఆమె ఉరిశిక్షను యెమెన్ ప్రభుత్వం వాయిదా వేసింది. ఈ విషయాన్ని భారత విదేశీ వ్యవహారాల శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. యెమెన్ జైలు అధికారులతోపాటు ప్రాసిక్యూషన్ కార్యాలయంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. 'నిమిష, బాధిత కుటుంబాలు పరస్పర అంగీకారానికి వచ్చి కేసును పరిష్కరించుకునేందుకు మరింత సమయం ఇవ్వాలని గత కొన్ని రోజులుగా యెమెన్ ప్రభుత్వాన్ని భారత్ కోరుతోంది. ఈ విషయంలో స్థానిక జైలు అధికారులు, ప్రాసిక్యూటర్‌తో నిరంతరం జరిపిన సంప్రదింపులు ఫలించాయి. ఉరిశిక్ష అమలును వాయిదా వేసేందుకు యెమెన్ అధికారులు అంగీకారం తెలిపారు' అని విదేశీ వ్యవహారాల శాఖ వర్గాలు వెల్లడించాయి. ఇక ఈ కేసులో బ్లడ్ మనీ (క్షమాధనం)గా రూ.8.6 కోట్లు తీసుకునేలా బాధిత కుటుంబాన్ని ఒప్పించేందుకు మత గురువు కాంతాపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ సంప్రదింపులు జరుపుతున్నారు. ఆ చర్చలు సానుకూలంగా జరుగుతున్నట్లుగా తెలుస్తోంది.

భద్రత సవాళ్లకు దీటుగా ఎస్‌సీవో

- కట్టుదిట్టమైన రక్షణ సమకూర్చుకుందాం: జిన్‌పింగ్

తియాంజిన్ (చైనా): భద్రతపరంగా ఎదురవుతున్న సవాళ్లను, ముప్పును ఎదుర్కొనేలా 'షాంఘై సహకార సంస్థ' (ఎస్‌సీవో)లోని దేశాలు తగిన వ్యవస్థను మెరుగుపరచుకుని, తిరుగులేని రక్షణ కవచాన్ని తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఉందని చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ అభిప్రాయపడ్డారు. కూటమి ఏర్పడిన 24 ఏళ్ల కాలంలో షాంఘై స్ఫూర్తిని నిలబెట్టుకుంటూ వస్తోందని, ఎంతో పరిపక్వతతో వ్యవహరిస్తోందని చెప్పారు. మంగళవారం చైనాలోని తియాంజిన్‌లో ఎస్‌సీవో సభ్యదేశాల విదేశాంగ మంత్రుల సదస్సులో ఆయన ప్రసంగించారు. దానికంటే ముందు భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ సహా 10 సభ్యదేశాల మంత్రులతో జిన్‌సింగ్ భేటీ అయ్యారు. ప్రపంచంలో నెలకొన్న కల్లోల పరిస్థితులు, మారుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకుని ఎస్‌సీవో విశ్వాసంతో, సమర్థతతో పనిచేసి.. స్థిరత్వాన్ని, సానుకూల శక్తిని ప్రపంచంలో నింపేందుకు పాటుపడాలని పిలుపునిచ్చారు. సభ్య దేశాలు సుసంపన్నమయ్యేలా, ఉమ్మడి భవితవ్యానికి కలిసికట్టుగా పనిచేసేలా చూడాలని చెప్పారు. సంప్రదింపులు, కలిసి పంచుకోవడం ద్వారా ఆర్థిక ప్రపంచీకరణ ప్రయోజనాలు అందరికీ లభిస్తాయన్నారు.



తియాంజిన్‌లో జిన్‌పింగ్‌తో జైశంకర్

ద్వైపాక్షిక సంబంధాలపై జైశంకర్ చర్చ

2020 గల్వాన్ ఘర్షణల తర్వాత తొలిసారిగా చైనాలో పర్యటించిన జైశంకర్ మంగళవారం జిన్‌పింగ్‌తో భేటీ అయినప్పుడు ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో ఇటీవలి పరిణామాల గురించి చర్చించారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ- ఉగ్రవాద సవాళ్లను ఎదుర్కొనే విషయంలో ఏమాత్రం రాజీపడకూడదని గట్టిగా చెప్పారు. జమ్మూకశ్మీర్‌ను పర్యాటకంగా దెబ్బతీసి, మతపరమైన విభజన తెచ్చేందుకే పహల్గాంలో ఉగ్రవాదులు దాడిచేశారని.. పాక్, చైనా మంత్రుల సమక్షంలోనే తెలిపారు. సభ్యదేశాల ప్రాదేశిక సార్వభౌమత్వాన్ని అందరూ గౌరవించాల్సిందేనన్నారు.



హిమాచల్‌లో వేలల్లో యాపిల్ చెట్ల నరికివేత

ఈటీవీ భారత్: యాపిల్ ఉత్పత్తికి ప్రసిద్ధమైన హిమాచల్ ప్రదేశ్‌లో స్వయానా అటవీశాఖ అధికారులు వేలల్లో పండ్లచెట్లను రంపాలతో కోసి తొలగిస్తున్నారు. శిమ్లాలో 13 కుటుంబాలు దాదాపు 560 ఎకరాల అటవీభూమి (2,800 బిఘాలు) ఆక్రమించిన కేసు గత పదేళ్లుగా హైకోర్టులో నడుస్తోంది. ఈ భూమిలో యాపిల్ తోటలను అభివృద్ధి చేసి శాశ్వత కట్టడాలు నిర్మించారు. విద్యుత్తు, నీటి కనెక్షన్లను కూడా పొందారు. 2014లో ఓ వ్యక్తి అప్పటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయడంతో ఈ వ్యవహారం వెలుగు చూసింది. ఆక్రమణకు గురైన ప్రతి అంగుళం భూమిని ఖాళీ చేయించాలన్న హైకోర్టు ఆదేశాలు పలు కారణాలు, రాజకీయ ఒత్తిళ్లతో ఇప్పటిదాకా అమలుకు నోచుకోలేదు. ఈ ఆక్రమణల క్రమబద్ధీకరణ యోచన తమకు లేదని ప్రస్తుత సుఖ్వీందర్‌సింగ్ సుఖూ సర్కారు జూన్ 19న హైకోర్టుకు స్పష్టం చేసింది. దీంతో తక్షణం ఆక్రమణల తొలగింపునకు హైకోర్టు జారీ చేసిన తాజా ఆదేశాలతో అధికారులు రంగంలోకి దిగారు. వేలాది యాపిల్ చెట్లను నరికివేయడానికి బదులుగా, ప్రభుత్వం వాటిని తన సంరక్షణలోకి తీసుకోవాలన్న వాదన కూడా వినిపిస్తోంది.

క్షమాధనంతో గతంలో విడుదలైన ఘటనలు

దిల్లీ: యెమెన్‌లో ఉరిశిక్షను ఎదుర్కొంటున్న నిమిష ప్రియను క్షమాధనం చెల్లించి కాపాడేందుకు ప్రయత్నాలు సాగుతున్న తరుణంలో గత అనుభవాలను పరిశీలిస్తే.. బంగ్లాదేశీ కార్మికుడి హత్య కేసులో కేరళకు చెందిన ఏఎస్ శంకర నారాయణకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో మరణశిక్ష పడింది. ఈ కేసులో 'బ్లడ్ మనీ' కింద 2 లక్షల దిర్హామ్‌లు (భారత కరెన్సీలో ప్రస్తుతం దాదాపు రూ.47 లక్షలు) చెల్లించడంతో 2017లో శంకర నారాయణ యూఏఈ జైలు నుంచి విడుదలయ్యాడు. ■ 2017లో తెలంగాణకు చెందిన లింబాద్రి సౌదీ అరేబియాలో క్షమాధనంతోనే మరణ శిక్షను తప్పించుకున్నాడు. ■ రోడ్డు ప్రమాదంలో 9 మంది మరణానికి కారణమైన కర్ణాటకలోని బెంగళూరుకు చెందిన ట్రక్కు డ్రైవర్ సలీమ్ భాషాకు 2006లో అప్పటి సౌదీ అరేబియా రాజు అబ్దుల్లా ముందుకొచ్చి సాయం చేశారు. స్వయంగా ఆయనే దాదాపు రూ.1.5 కోట్ల 'క్షమాధనాన్ని' బాధిత కుటుంబాలకు చెల్లించడంతో 2013లో సలీమ్ శిక్ష నుంచి బయటపడ్డాడు. ■ కేరళకు చెందిన అబ్దుల్ రహీమ్.. 2006లో రియాద్‌లో తన యజమాని కుమారుడి హత్య కేసులో అరెస్టయ్యాడు. రూ.34 కోట్ల బ్లడ్ మనీని తీసుకునేందుకు బాలుడి కుటుంబం అంగీకరించడంతో రహీమ్ మరణ శిక్ష నుంచి తప్పించుకున్నాడు.

విమానంలో వెళ్దామనుకుంటే..

సీట్లు లేవని కారులో పంపించారు

అహ్మదాబాద్: విమానంలో వెళ్లాలనుకున్న ప్రయాణికులకు అనూహ్య ఘటన ఎదురైంది. ఎయిరిండియాలో ముందుగానే టికెట్లు బుక్ చేసుకున్న 13 మందిని సీట్లు సరిపోలేదని అధికారులు కారులో పంపిన ఘటన గుజరాత్‌లోని భుజ్ విమానాశ్రయంలో చోటుచేసుకుంది. గుజరాత్ నుంచి ముంబయి వెళ్లేందుకు విమానాశ్రయానికి చేరుకున్న 13 మంది ప్రయాణికుల్లో కొందరికి బోర్డింగ్ పాస్‌లు ఇవ్వలేదు. దీంతో ప్రయాణికులు అధికారులను సంప్రదించగా విమానంలో సీట్లు సర్దుబాటు కాలేదని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. తొలుత కారులో అహ్మదాబాద్‌కు, ఆ తర్వాత రోజు మరో విమానంలో ముంబయికి వెళ్లేలా ఏర్పాట్లు చేస్తామని వెల్లడించారు. కొందరు దీనిని తిరస్కరించారు. సీట్లు లేవనే విషయం ముందుగానే సమాచారం ఇవ్వకపోవడంపై ఆందోళన వ్యక్తంచేశారు. భుజ్ విమానాశ్రయ అధికారి అనురాగ్ వైష్ణవ్ ఈ ఘటనను ధ్రువీకరించారు. ముంబయికి వెళ్లాల్సిన ఏ321 విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో, ఏ320 చిన్న విమానాన్ని ఏర్పాటుచేశామని తెలిపారు. అందులో సీట్లు తక్కువగా ఉన్నాయని, ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. దీనిపై స్పందించిన ఎయిరిండియా విమానయాన సంస్థ ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నట్లు తెలిపింది.

ఈడీ అధికారాల సమర్థన తీర్పును సమీక్షించాలన్న పిటిషన్లపై విచారణ 31న

సుప్రీంకోర్టు వెల్లడి

దిల్లీ: నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ)లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కు కల్పించిన నిందితుల అరెస్టు, ఆస్తుల జప్తు అధికారాలను సమర్థించిన సుప్రీంకోర్టు తీర్పు-2022ను సమీక్షించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై ఈ నెల 31న విచారణ ప్రారంభంకానుంది. ఈ వ్యాజ్యంపై విచారణ బుధవారం(ఈ నెల 16న) జరగాల్సి ఉంది. అయితే, కేంద్రం తరఫున హాజరు కావాల్సిన అటార్నీ జనరల్ తుషార్ మెహతా ఆ రోజు అందుబాటులో ఉండనని తెలిపారు. దీంతో ఈ నెల 31 నాటి విచారణ కేసుల జాబితాలో చేర్చుతామని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి ధర్మాసనం మంగళవారం వెల్లడించింది. అందుకు అభ్యంతరం లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది కపిల్ సిబల్ తెలిపారు.

ఉగ్రవాది ముందస్తు విడుదలకు సుప్రీంకోర్టు నిరాకరణ

దిల్లీ: ముగ్గురి హత్యతో పాటు ఉగ్రచర్యలకు పాల్పడ్డాడనే కేసులో దోషిగా శిక్ష అనుభవిస్తున్న గులాం మహమ్మద్ భట్‌ను జైలు నుంచి విడుదల చేయాలన్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. గత 27 ఏళ్లుగా జైలులో ఉన్నాడనే కారణంతో విడుదల చేయాలన్న అభ్యర్థనపై జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్ ధర్మాసనం విచారణ జరిపింది. దోషి ముందస్తు విడుదలకు నిరాకరించింది. అయితే, ఖైదీల ముందస్తు విడుదలపై జమ్మూకశ్మీర్ ప్రభుత్వ విధానాన్ని సవాల్ చేయటానికి గాను గులాం మహ్మద్‌కు అనుమతిచ్చింది.

బిస్కెట్లు, చాక్లెట్ల మాటున రూ.62 కోట్ల కొకైన్

ముంబయిలో మహిళ అరెస్టు

ముంబయి: తినుబండారాల్లో రూ.62 కోట్ల విలువైన కొకైన్‌ను తరలిస్తున్న ఓ మహిళను ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు అరెస్టు చేశారు. దోహా నుంచి ముంబయికి వస్తున్న భారతీయ మహిళ అక్రమంగా మాదక ద్రవ్యాలు రవాణా చేస్తోందన్న నిఘా సమాచారం మేరకు అధికారులు విమానాశ్రయంలో ఆ మహిళను అడ్డుకున్నారు. ఆమె బ్యాగును తనిఖీ చేస్తే అందులో బిస్కెట్లు, చాక్లెట్ బాక్సుల మధ్య దాదాపు 300 తెల్లటి గుళికలు బయటపడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకుని పరీక్షించి కొకైన్‌గా అధికారులు నిర్ధారించారు. మహిళను అరెస్టు చేసినట్లు తెలిపారు.

భారత్‌లో సగానికి పైగా పిల్లలకు అందని టీకాలు

- మొత్తం 9 దేశాల్లో ఇదే పరిస్థితి
- డబ్ల్యూహెచ్‌వో, యూనిసెఫ్ సంయుక్త నివేదికలో వెల్లడి

లండన్: గతేడాది ప్రపంచవ్యాప్తంగా 1.40 కోట్ల మందికి పైగా పిల్లలు ఒక్క టీకా కూడా తీసుకోలేదని ఐక్యరాజ్యసమితి ఆరోగ్య విభాగం వెల్లడించింది. 2023లో కూడా దాదాపు ఇదే పరిస్థితి నెలకొందని, 9 దేశాల్లో సగానికి పైగా పిల్లలకు టీకాలు ఇవ్వలేదని పేర్కొంది. ఈ జాబితాలో భారత్ కూడా ఉండటం ఆందోళనకరం. ఈ వివరాలతో ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో), యూనిసెఫ్‌లు మంగళవారం సంయుక్త వార్షిక నివేదికను విడుదల చేశాయి. ఐరాస నివేదిక ప్రకారం.. 2024లో ఏడాదిలోపు పిల్లల్లో దాదాపు 89 శాతం మందికి కంఠసర్పి(డిఫ్తీరియా), ధనుర్వాతం (టెటనస్), కోరింత దగ్గు టీకాల మొదటి డోసులనే వేశారు. 2023లోనూ ఇదే పరిస్థితిని శిశువులు ఎదుర్కొన్నారు. సగానికి పైగా (52 శాతం మంది) పిల్లలు టీకాలకు నోచుకోని 9 దేశాల జాబితాలో భారత్, నైజీరియా, సూడాన్, కాంగో, ఇథియోపియా, ఇండొనేసియా, యెమెన్, అఫ్గానిస్థాన్, అంగోలా ఉన్నాయి. 2024లో 85 శాతం, 2023లో 84 శాతం మంది పిల్లలు హెపటైటిస్-బి 3 డోసుల టీకాను పూర్తి చేసుకున్నారు. 2024లో 76 శాతం మంది పిల్లలు తట్టు టీకాల రెండు డోసులను తీసుకున్నారు. గతేడాది దాదాపు 60 దేశాల్లో తట్టు పెద్దఎత్తున సంక్రమించింది. ఐరోపా దేశాల్లో 1.25 లక్షల తట్టు కేసులు నమోదయ్యాయి. అగ్రరాజ్యం అమెరికాలోనూ గత మూడు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా తట్టు ప్రబలుతోంది. సంపన్న దేశమైన బ్రిటన్‌లోనూ ఇప్పటికీ కేవలం 84 శాతం మంది పిల్లలకే వ్యాక్సినేషన్ చేయిస్తుండటం గమనార్హం.

నిధులు నిలిపివేయడంతో టీకా కార్యక్రమాలపై నీలినీడలు

అమెరికా లాంటి సంపన్న దేశాలు డబ్ల్యూహెచ్‌వో, యూనిసెఫ్‌కు నిధులను ఆపేయడంతో పేద, మధ్య ఆదాయ దేశాల్లో టీకా ప్రక్రియపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే, తాము గత కొన్ని దశాబ్దాలుగా చేసిన కృషి వృథా అయ్యేలా కనిపిస్తోందని డబ్ల్యూహెచ్‌ఓ చీఫ్ టెడ్రోస్ అధనోమ్ వ్యాఖ్యానించారు. అమెరికా లాంటి దేశాలు పునరాలోచన చేసి, టీకా కార్యక్రమాలకు ఆర్థికంగా సహకరించాలని పిలుపునిచ్చారు.

అమెరికా ఈశాన్య రాష్ట్రాలను ముంచెత్తిన భారీ వర్షాలు

న్యూయార్క్: అమెరికాలోని ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆకస్మిక వరదలు ముంచెత్తడంతో న్యూయార్క్, న్యూజెర్సీ, పెన్సిల్వేనియాలలో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపైకి వరద నీరు వచ్చి చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సబ్‌వే లైన్లను కూడా మూసివేశారు. భారీ వర్షాల కారణంగా న్యూజెర్సీ గవర్నర్ ఫిల్ మర్ఫీ రాష్ట్రంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ప్రజలు ఇళ్లలోనే ఉండాలని, అనవసర ప్రయాణాలు చేయవద్దని సూచించారు. న్యూయార్క్ నగరంలో పలు సబ్‌వే సేవలు రద్దుకాగా... రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మన్‌హట్టన్ సబ్‌వే స్టేషన్‌లోకి వరదనీరు ప్రవహిస్తున్న వీడియో సామాజిక మాధ్యమంలో చక్కర్లు కొట్టింది. స్టాటన్ ఐలాండ్‌లో 10.2-15.2 సె.మీ వర్షపాతం నమోదు కాగా... పెన్సిల్వేనియాలోని మౌంట్ జాయ్ ప్రాంతంలో కేవలం ఐదు గంటల్లోనే 17.8 సె.మీ వర్షం కురిసింది. దీంతో ఈ ప్రాంతంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. మంగళవారం నాటికి వర్ష బీభత్సం తగ్గినా... వరద నీటితో రోడ్లన్నీ నదులను తలపిస్తున్నాయి.

మణిపుర్‌లో ఐదుగురు మిలిటెంట్లు సహా ఏడుగురి అరెస్టు

ఇంఫాల్: మణిపుర్‌లో మూడు నిషేధిత సంస్థలకు చెందిన ఐదుగురు మిలిటెంట్లు సహా ఏడుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిషేధిత సంస్థలైన లిబరేషన్ ఆర్మీకి చెందిన ఓ కీలక నిందితుడు, కేసీపీ(ఎంఎఫ్ఎల్)కి చెందిన ఇద్దరు, కాంగ్లేయ్ యావోల్ కన్న లుప్(కేవైకేఎల్)కు ఆయుధాల రవాణాలో పాల్గొన్న ఇద్దరు కీలక కార్యకర్తలను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. వీరంతా దోపిడీ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. అదేవిధంగా అక్రమ ఆయుధాలు కలిగి ఉన్న మరో ఇద్దరిని కూడా అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

86 ఆయుధాలు, 974 రకాల మందుగుండు సామగ్రి స్వాధీనం

మణిపుర్‌లోని అయిదు జిల్లాల్లో నిర్వహించిన ఆపరేషన్‌లో 86 ఆయుధాలు, 974 రకాల మందుగుండు సామగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నట్లు మంగళవారం అధికారులు పేర్కొన్నారు. నిఘా సమాచారం మేరకు తూర్పు ఇంఫాల్, కాక్చింగ్, పశ్చిమ ఇంఫాల్, తౌబాల్, బిష్ణుపుర్ జిల్లాల్లో ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు.

పహల్గాంపై ప్రధాని సమాధానమివ్వాల్సిందే: కాంగ్రెస్

పార్లమెంటులో వ్యూహంపై సోనియా సమీక్ష

దిల్లీ: పహల్గాంలో ఉగ్రవాదులు విరుచుకుపడి 26 మంది పర్యాటకుల ప్రాణాలు బలిగొన్న దారుణఘటనపై ప్రధాని నరేంద్రమోదీ సమాధానం ఇవ్వాలని కాంగ్రెస్ పట్టుబట్టనుంది. దీంతోపాటు.. బిహార్‌లో వివాదంగా మారిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, జమ్మూ-కశ్మీర్‌కు పూర్తిస్థాయి రాష్ట్రహోదా పునరుద్ధరణ, దేశవ్యాప్తంగా మహిళలపై పెరిగిన అఘాయిత్యాలు వంటివాటిని పార్లమెంటులో లేవనెత్తనుంది. ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ఏయే అంశాలు ఎలా ప్రస్తావించాలో చర్చించడానికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ మంగళవారం సాయంత్రం తన నివాసంలో ఒక సమావేశం నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ విపక్షనేత రాహుల్‌గాంధీ, సీనియర్ నేతలు- జైరాంరమేశ్, మాణికం ఠాగూర్ తదితరులు దీనిలో పాల్గొన్నారు. సమావేశానంతరం పార్టీ నేత ప్రమోద్ తివారీ విలేకరులతో మాట్లాడుతూ- పహల్గాం దాడిపై చర్చకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాల్సిందిగా తమ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు.

నీళ్ల వ్యాపారిని ఐఏఎస్‌గా చూపి.. రూ.21.6 లక్షల మోసం!

ఇంటర్నెట్ డెస్క్: గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన తండ్రీకొడుకులు జయంతి భాయ్, కౌశిక్ పటేల్ నీళ్ల వ్యాపారిని ఐఏఎస్ అధికారిగా చూపించి.. ఓ వ్యాపారవేత్తను బురిడీ కొట్టించారు. మెహసాణా ప్రాంతానికి చెందిన వ్యాపారవేత్త దినేశ్ పటేల్‌తో కొంత కాలంగా వీరు స్నేహం నటించారు. ఈ క్రమంలో తమ ఇంట్లో ఐటీ దాడులు జరిగి రూ.300 కోట్లు సీజ్ చేశారని దినేశ్‌ను నమ్మించారు. స్థానికంగా నీళ్ల వ్యాపారం చేసే అర్పిత్ అలియాస్ రిషభ్‌రెడ్డిని ఐఏఎస్ అధికారిగా నమ్మించి.. నిజంగానే డబ్బు సీజ్ చేసినట్లు నకిలీ ఆధారాలు చూపించారు. న్యాయవాదికి ఇచ్చేందుకు డబ్బు కావాలని దినేశ్ వద్ద రూ.21.65 లక్షలు అప్పు తీసుకున్నారు. నెలలు గడిచినా తిరిగి ఇవ్వకపోవడంతో దినేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు రిషభ్‌రెడ్డి అసలు ఐఏఎస్ అధికారే కాదని.. అలా నటించినందుకు నిందితులు అతడికి రూ.80,000 ఇచ్చినట్లు కనుగొన్నారు. రిషభ్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని, పరారీలో ఉన్న తండ్రీకొడుకుల కోసం గాలిస్తున్నారు.



నకిలీ ఐఏఎస్ రిషభ్‌రెడ్డి

వైకాపా మద్యం ముఠాకు 22 వరకు రిమాండ్ పొడిగింపు

విజయవాడ ఏసీబీ కోర్టు ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి జైల్లో ఉన్న నిందితులకు ఈ నెల 22 వరకు జ్యుడీషియల్ రిమాండ్‌ను పొడిగిస్తూ విజయవాడ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి, సీఎంవో మాజీ కార్యదర్శి ధనుంజయరెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీ, ఎస్పీవై డిస్టిలరీస్ మాజీ డైరెక్టర్ సజ్జల శ్రీధర్‌రెడ్డి, రాజ్ కెసిరెడ్డి అనుచరులు బూనేటి చాణక్య, పైలా దిలీప్, వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వెంకటేశ్ నాయుడు, చెవిరెడ్డి పీఏలు నవీన్ కృష్ణ, బాలాజీ యాదవ్‌లను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టులో హాజరుపరచగా.. వారికి వారం రోజుల పాటు రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయాధికారి భాస్కర్‌రావు ఉత్తర్వులిచ్చారు.

గాలి జనార్దనరెడ్డికి కర్ణాటక హైకోర్టు నోటీసు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: కల్యాణ రాష్ట్ర ప్రగతి పక్ష వ్యవస్థాపకుడు, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డికి కర్ణాటక హైకోర్టు నోటీసు జారీ చేసింది. ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన ప్రమాణ పత్రంలో తప్పుడు సమాచారం ఉందని, ఆయన ఎన్నికను రద్దు చేయాలని దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ సునీల్‌దత్ యాదవ్ విచారణ చేపట్టారు. తపాల్ శ్యామ్‌ప్రసాద్ అనే వ్యక్తి అర్జీని పరిగణనలోకి తీసుకుని కేంద్ర ఎన్నికల సంఘానికి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి, గంగావతి నియోజకవర్గ ఆర్వోకు, ఎమ్మెల్యే జనార్దనరెడ్డికి న్యాయమూర్తి నోటీసులు జారీచేశారు. గాలి జనార్దనరెడ్డి తన వద్ద ఉన్న వాస్తవ స్థిర, చరాస్తులు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విచారణలో ఉన్న కేసులు, కోర్టులో శిక్షలు తదితర వివరాలను ప్రమాణ పత్రంలో పేర్కొనలేదని తపాల్ శ్యామ్‌ప్రసాద్ అభ్యంతరం వ్యక్తం చేశారు.



మంచి దుస్తులు ఎందుకు ధరించాలంటే..

ఉన్నంతలో ఎప్పుడూ మంచి దుస్తులు ధరించడానికి ప్రతిఒక్కరూ ప్రయత్నించాలి. ఎందుకంటే- మీ వేషధారణ బాగున్నప్పుడు..

- ✦ మీలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.
- ✦ ఇతరులు మిమ్మల్ని గౌరవించే అవకాశాలు ఎక్కువుంటాయి.
- ✦ చూడగానే ఎదుటివారి మనసులో మీపై మెరుగైన ముద్ర పడుతుంది.
- ✦ మీరు తెలివిగలవారిగా కనిపిస్తారు.

– రోహిత్ గుప్తా, మైండ్‌సెట్ మెంటార్

జగన్, భారతీరెడ్డిల పిటిషన్‌లపై ఎన్‌సీఎల్‌టీ తీర్పు వాయిదా

- ‘సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్’ వాటాల బదలాయింపు కేసులో..

ఈనాడు, హైదరాబాద్: సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ రిజిస్టర్‌లో వాటాదారుల పేర్లను సవరించి, తమ వాటాలను పునరుద్ధరించాలంటూ ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఆయన భార్య భారతీరెడ్డి, క్లాసిక్ రియాల్టీలు దాఖలు చేసిన పిటిషన్‌లలో మధ్యంతర ఉత్తర్వులు కోరుతూ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌లపై జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ ధర్మాసనం మంగళవారం తీర్పు వాయిదా వేసింది. ఈ పిటిషన్‌లపై ఎన్‌సీఎల్‌టీ జ్యుడిషియల్ సభ్యులు రాజీవ్ భరద్వాజ్, సాంకేతిక సభ్యుడు సంజయ్ పురీ విచారణ చేపట్టి తీర్పు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. పిటిషనర్ల తరపు న్యాయవాది సూర్యనారాయణ, విజయమ్మ తరపు న్యాయవాది మహర్షి విశ్వరాజు వాదనలు వినిపిస్తూ మధ్యంతర పిటిషన్‌లలో వాదనలు పూర్తయ్యాయని, దీనికి సంబంధించిన రాతపూర్వక వాదనలు సమర్పించినట్లు చెప్పడంతో ధర్మాసనం తీర్పును వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. గతంలో జగన్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ‘గిఫ్ట్’ పూర్తికాకుండానే మోసపూరితంగా వాటాల బదలాయింపు జరిగిందని తెలిపారు. వాటాల పత్రాలు, వాటాల బదలాయింపు ఫారాలు సమర్పిస్తేనే కంపెనీ వాటాలను బదలాయించాల్సి ఉందన్నారు. దీనికి విరుద్ధంగా కంపెనీ వాటాలను బదలాయించిందన్నారు. విజయమ్మ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఒకసారి గిఫ్ట్‌డీడ్ చేశాక వాటిపై ప్రశ్నించే హక్కు జగన్‌కు లేదన్నారు. అనంతరం కంపెనీ వ్యవహారాల్లో జోక్యం చేసుకునే అధికారం జగన్‌కు లేదన్నారు. ఎన్‌సీఎల్‌టీలో సెక్షన్ 59 కింద పిటిషన్ వేసి వివాదం చేయడంలో జగన్‌ది కుటిల పన్నాగమని పేర్కొన్నారు. వాటాల బదలాయింపుపై కంపెనీ చట్టంలోని సెక్షన్ 59 కింద పిటిషన్ వేయడానికి తగిన కారణం చూపాల్సి ఉందని తెలిపారు. క్లాసిక్ రియాల్టీ తగిన ప్రతిఫలం తీసుకున్నాక సండూర్ పవర్‌లోని 62 వేలకుపైగా వాటాలను విజయమ్మకు బదలాయించిందని, ఒకసారి ప్రతిఫలం తీసుకుని వాటాలను బదలాయించాక ఇక్కడ పిటిషన్ వేయడానికి వీల్లేదన్నారు. గిఫ్ట్‌డీడ్ అమలయ్యాక ఇక్కడ పిటిషన్ వేయడం చెల్లదన్నారు. దాత ఇచ్చిన కానుకను స్వీకర్త అంగీకరించాక అది పూర్తయినట్లేనని తెలిపారు. గిఫ్ట్‌డీడ్ చెల్లదని భావిస్తే దాని చట్టబద్ధతపై సివిల్ కోర్టును ఆశ్రయించాలేగానీ ట్రైబ్యునల్‌ను కాదన్నారు. సరస్వతి పవర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ వాటాల బదలాయింపు ప్రక్రియ అన్నది కంపెనీ విచక్షణాధికారంపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. జగన్, భారతీరెడ్డిలు బోర్డు డైరెక్టర్లుగా రాజీనామా చేసి వెళ్లిపోయాక కంపెనీ వ్యవహారాల్లో జోక్యం చేసుకోరాదన్నారు. ఈ వివాదంలో తనకు ప్రమేయం లేదని, తన పేరును తొలగించాలని కోరుతూ షర్మిల పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు, పిటిషన్‌లపై తుది తీర్పు వెలువడేవరకు బదలాయింపు ప్రక్రియను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని జగన్ తదితరులు కోరారు. ఈ నేపథ్యంలో మధ్యంతర ఉత్తర్వులకు సంబంధించిన అన్ని పిటిషన్‌లపై ఎన్‌సీఎల్‌టీ తీర్పును వాయిదా వేసింది.

దగ్గరకొస్తే గోదావరిలో దూకేస్తా..

- రోడ్ కం రైలు వంతెనపై 7 గంటలపాటు భీష్మించుకు కూర్చున్న మహిళ
- చివరకు నదిలో దూకేయడంతో రక్షించిన పోలీసులు



రైలు వంతెన ట్రాక్ గడ్డర్‌పై ప్రమాదకరంగా కూర్చున్న నాగమణి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: మానసిక స్థితి సరిగా లేని ఓ మహిళ గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నం చేసిన వైనం హైడ్రామాను తలపించింది. సుమారు ఏడు గంటల తర్వాత ఆమె గోదావరిలో దూకగా, అప్పటికే భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీసులు రక్షించి ఆసుపత్రికి తరలించారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో మంగళవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. దేవరపల్లి మండలం దుద్దుకూరుకు చెందిన చిలకపల్లి నాగమణి సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో కొవ్వూరు రోడ్ కం రైలు వంతెన ట్రాక్ గడ్డర్‌పై ప్రమాదకరంగా కూర్చుంది. ఆమెను గమనించిన రైలు పట్టాల పర్యవేక్షణ సిబ్బంది రైల్వే, పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. కొవ్వూరు సీఐ పి.విశ్వం, ఆర్పీఎఫ్ సీఐ బి.రాజు, డీఎస్పీ జి.దేవకుమార్ సిబ్బందితో సహా అక్కడకు వచ్చి ఎంత బతిమాలినా ఆమె తన వివరాలు చెప్పలేదు. ఎవరైనా తన దగ్గరకు వస్తే దూకేస్తానని బెదిరించింది. చివరకు తన పేరు నాగమణి అని, దుద్దుకూరు హైస్కూలు వీధిలో నివాసం ఉంటానని చెప్పడంతో.. పోలీసులు అక్కడకు వెళ్లి స్థానికులను తీసుకొచ్చారు. కాకినాడ నుంచి ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, స్థానిక జాలర్లను రప్పించారు. చాలాసేపు కదలకుండా కూర్చున్న ఆమె.. మంగళవారం ఉదయం 7.45కు గోదావరిలోకి దూకింది. అప్పటికే సిద్ధంగా ఉన్న ఈతగాళ్లు ఆమెను కాపాడి ఒడ్డుకు చేర్చారు. నాగమణికి వివాహం కాగా ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చాలాకాలం క్రితమే భర్తతో విడిపోయింది. పెద్ద కుమార్తె తండ్రితో ఉంటుండగా చిన్న కుమార్తె తల్లి వద్దే ఉండేది. నాలుగు నెలల క్రితం చిన్న కుమార్తె అదృశ్యం కావడంతో నాగమణి ఒంటరిగా మిగిలిపోయింది. దీంతో మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని వంతెనపైకి చేరుకున్నట్లు తెలుస్తోంది.

శ్రీశైలం జలాశయం గేటు మూసివేత

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: ఎగువ నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం తగ్గడంతో రేడియల్ క్రస్ట్ గేటును జలవనరులశాఖ అధికారులు మంగళవారం మూసేశారు. జూరాల నుంచి 22,497 క్యూసెక్కులు, సుంకేసుల జలాశయం నుంచి 28,448 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి వస్తోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి 882.20 అడుగులు ఉండగా, నీటి నిల్వ 200.1971 టీఎంసీలుగా నమోదైంది.

కల్తీ నెయ్యి కేసులో ఏఆర్ డెయిరీ ఎండీ రాజశేఖరన్‌కు బెయిల్

ఈనాడు, అమరావతి: తితిదే లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో ఏఆర్ డెయిరీ ఎండీ రాజు రాజశేఖరన్(ఏ2)కు హైకోర్టు షరతులతో బెయిలు మంజూరుచేసింది. నెల్లూరు ఏసీబీ కోర్టులో రూ.50వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని, ఆరు నెలలపాటు నెలకోసారి దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని షరతు విధించింది. దర్యాప్తునకు సహకరించాలని, కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లడానికి వీల్లేదని తెలిపింది. షరతులకు కట్టుబడి వ్యవహరించకపోతే బెయిలు రద్దు కోసం కోర్టును ఆశ్రయించేందుకు సిట్‌కు వెసులుబాటును ఇచ్చింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు మంగళవారం ఈ మేరకు తీర్పు ఇచ్చారు. దర్యాప్తు పూర్తిచేసి అభియోగపత్రం దాఖలుచేశారని, ఈ దశలో పిటిషనర్ విడుదలైనా దర్యాప్తును ప్రభావితం చేసేది ఏమీ ఉండదని అభిప్రాయపడ్డారు. పిటిషనర్ ఫిబ్రవరి 9న అరెస్టయినప్పటి నుంచి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారని గుర్తుచేశారు.

వైకాపా గుర్తుపై ఆ లేఖ అవాస్తవం

యుగతులసి పార్టీ అధ్యక్షుడు శివకుమార్

హైదరాబాద్, న్యూస్‌టుడే: వైకాపా ఎన్నికల గుర్తును ఫ్యాన్‌కు బదులుగా గొడ్డలి గుర్తు కేటాయించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌ను కోరుతూ తాను లేఖ రాసినట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న లేఖ పూర్తి అవాస్తవం, కల్పితమని యుగతులసి పార్టీ అధ్యక్షుడు, తితిదే పాలకమండలి మాజీ సభ్యుడు కొలిశెట్టి శివకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దుష్ప్రచారానికి కారకులైన వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరుతున్నట్లు పేర్కొన్నారు. తాను జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో పోటీ చేయనున్నట్లు చెప్పారు.



సరోజాదేవి భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న కర్ణాటక సీఎం సిద్ధరామయ్య తదితరులు

సరోజాదేవికి కన్నీటి వీడ్కోలు

రామనగర, న్యూస్‌టుడే: దేశంలో మొదటి లేడీ సూపర్‌స్టార్, చతుర్భాషా సినీ నటీమణి బి.సరోజాదేవి(87) భౌతికకాయానికి మంగళవారం కర్ణాటక ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు ముగిశాయి. ఆమె బెంగళూరులోని తన నివాసంలో కన్నుమూసిన సంగతి విదితమే. బ్యారికేడ్లు ఏర్పాటు చేసి సోమవారం ఉదయం నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకూ కడసారి చూపునకు అవకాశం కల్పించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తదితరులు భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం సొంత ఊరు మండ్య జిల్లా చెన్నపట్టణ తాలూకా దశవార గ్రామానికి భౌతికకాయాన్ని తరలించారు. మార్గం పొడవునా అభిమానులు నివాళులు అర్పించారు. దశవారలో తన తల్లి రుద్రమ్మ సమాధి పక్కనే ఒక్కలిగర సంప్రదాయం ప్రకారం సరోజాదేవి భౌతికకాయాన్ని ఖననం చేశారు. ఆమె కుమారుడు గౌతమ్ అంతిమ సంస్కారాలను పూర్తిచేశారు. గౌరవ పూర్వకంగా పోలీసులు మూడు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, పలువురు నటులు, ఎమ్మెల్యే సీపీ యోగేశ్వర్‌తో పాటు అధికారులు, స్థానిక నాయకులు కార్యక్రమానికి హాజరయ్యారు.

కౌంటర్‌పై నిర్ణయం తీసుకోవడానికి సమయమివ్వండి

సింగయ్య మృతి కేసులో హైకోర్టును కోరిన పీపీ

ఈనాడు, అమరావతి: దళితుడు చీలి సింగయ్య మృతి ఘటనకు సంబంధించి తమపై నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి, మరికొందరు దాఖలు చేసిన వ్యాజ్యాల్లో కౌంటర్ దాఖలు చేయడంపై నిర్ణయం తీసుకునేందుకు సమయం ఇవ్వాలని పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీనారాయణ హైకోర్టును అభ్యర్థించారు. కౌంటర్ వేసేందుకు స్వల్ప సమయం అవసరమని, ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులూ ఇవ్వవద్దని తాము చేసిన అభ్యర్థనను ఇదే కోర్టులోని మరో న్యాయమూర్తి పరిగణనలోకి తీసుకోకుండా ‘స్టే’ ఇచ్చారన్నారు. ఈ నేపథ్యంలో కౌంటర్ వేయాలా లేదా అనే వ్యవహారంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. విచారణను రెండు వారాలకు వాయిదా వేయాలని కోరారు. న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు అందుకు అంగీకరిస్తూ విచారణను వాయిదా వేశారు.

★ పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటన సందర్భంగా మాజీ సీఎం జగన్ వాహనం ఢీకొని సింగయ్య మృతి చెందారు. ఈ ఘటనపై జగన్‌తోపాటు మరికొందరిపై నల్లపాడు పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 105, 49 కింద కేసు నమోదు చేశారు. తమపై కేసును కొట్టేయాలని జగన్‌తో పాటు మాజీ మంత్రులు పేర్ని నాని, విడదల రజిని, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, జగన్ వ్యక్తిగత కార్యదర్శి కె.నాగేశ్వరరెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి.. ఈ కేసులో తదుపరి చర్యలన్నింటినీ నిలుపుదల చేస్తూ ఇటీవల స్టే ఇచ్చిన విషయం తెలిసిందే. మంగళవారం ఈ పిటిషన్లు హైకోర్టులో మరోసారి విచారణకు వచ్చాయి. జగన్ తరపున సీనియర్ న్యాయవాది శ్రీరామ్ వాదనలు వినిపించారు. కౌంటర్ వేసేందుకు పోలీసులు గత విచారణలో సమయం కోరారని, ఇప్పటి వరకు తమకు కౌంటర్ ప్రతి అందజేయలేదని చెప్పారు. పోలీసులు కౌంటర్ దాఖలు చేసినా, చేయకపోయినా వాదనలు వినిపించేందుకు తాము సిద్ధమన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. కౌంటర్ వేసే వ్యవహారంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పీపీ చెబుతున్నందున విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

EENADU Vol: 51, Issue: 337 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao



రాహుల్ ప్రధాని అవుతారని మీకు తెలుసా?

- పిటిషనర్‌పై బాంబే హైకోర్టు ఆగ్రహం

ముంబయి: తన పిటిషన్ కాపీని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చదివేలా ఆదేశాలివ్వాలంటూ కోరిన పిటిషనర్‌పై బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. సావర్కర్‌పై రాహుల్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించి న్యాయస్థానంలో దాఖలైన పిటిషన్‌పై పిటిషనర్‌కు మొట్టికాయలేసింది. వీర్ సావర్కర్‌కు వ్యతిరేకంగా రాహుల్ మాట్లాడుతున్నారని, ఆయన తన పిటిషన్‌ను చదివేలా ఆదేశించాలని ఓ వ్యక్తి బాంబే హైకోర్టును కోరారు. మీ పిటిషన్‌ను ఆయన ఎలా బలవంతంగా చదివేలా చేస్తామని న్యాయస్థానం అతడిని ప్రశ్నించింది. దీనిపై పిటిషనర్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ భవిష్యత్తులో ప్రధాని అయ్యే అవకాశం ఉన్నందున ఆయన దీనిని చదవాలన్నారు. ఒకవేళ ఆయన ప్రధాని అయితే విధ్వంసం సృష్టిస్తారని పేర్కొన్నారు. 'ఆయన ప్రధాని అవుతారని మాకు తెలియదు. మీకు తెలుసా' అని హైకోర్టు పిటిషనర్‌పై ఆగ్రహం వ్యక్తంచేసింది. అయితే, రాహుల్‌పై పరువునష్టం కేసు పెండింగ్‌లో ఉన్నందున పిటిషనర్‌కు న్యాయపరమైన అవకాశం ఉందని పేర్కొంది. ఈ అంశంపై సావర్కర్ మనవడు పుణె కోర్టును ఆశ్రయించారని, అక్కడ దీనిపై విచారణ జరుగుతుండటం ఈ సందర్భంగా న్యాయస్థానం గుర్తుచేసింది.

సైన్యంపై అనుచిత వ్యాఖ్యల కేసు..

రాహుల్‌గాంధీకి బెయిల్ మంజూరు

లఖ్‌నవూ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి పరువునష్టం కేసులో ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి లఖ్‌నవూ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. 2022లో భారత్ జోడో యాత్ర సందర్భంగా ఆయన సైన్యంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్(బీఆర్ఓ) మాజీ డైరెక్టర్ శంకర్ శ్రీవాస్తవ లఖ్‌నవూ కోర్టులో పరువునష్టం దావా వేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న కోర్టు రాహుల్‌గాంధీకి సమన్లు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రాహుల్.. కోర్టు ముందు మంగళవారం హాజరయ్యారు. బాండ్, ష్యూరిటీలు సమర్పించాక బెయిల్ మంజూరు చేస్తున్నట్లు జడ్జి ప్రకటించారు. ఈ కేసుకు సంబంధించి రాహుల్ గతంలో హైకోర్టును ఆశ్రయించినప్పటికీ ఊరట దక్కలేదు.

బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజీకి బాంబు బెదిరింపు

ముంబయి: మహారాష్ట్ర రాజధాని ముంబయిలోని బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజీ (బీఎస్ఈ) భవనానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. భవనంలో నాలుగు ఆర్డీఎక్స్ బాంబులను అమర్చినట్లు గుర్తుతెలియని వ్యక్తులు మెయిల్ పంపారు. అధికారులు వెంటనే అప్రమత్తమై ముంబయి పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాంబు నిర్వీర్య దళం, తనిఖీలు చేపట్టి ఉత్తుత్తి బెదిరింపులని తేల్చారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో బాంబు పేలుళ్లు సంభవిస్తాయని 'కామ్రేడ్ పినరయి విజయన్' పేరుతో దుండగులు ఆదివారం బీఎస్ఈకి మెయిల్ పంపినట్లు పోలీసులు వెల్లడించారు.

వీధి అంగళ్లలో ఆరోగ్య హెచ్చరికల ముద్రణకు ఆదేశించలేదు: కేంద్రం

దిల్లీ: పకోడీ, వడాపావ్, సమోసా, జిలేబీ, కచోరీ వంటి వీధి చిరుతిండ్లపై వాటిలో ఎంత శాతం నూనె, చక్కెర పదార్థాలు ఉంటాయో వీధి అంగళ్ల వ్యాపారులు ప్రదర్శించాలంటూ వచ్చిన వార్తలను కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తోసిపుచ్చింది. అవి తప్పుదోవపట్టించే, నిరాధారమైన, అసత్య కథనాలని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. చిరుతిళ్లలో నూనె, చక్కెర శాతం వివరాలు తెలిపేలా వీధి వ్యాపారులకు ఆదేశాలివ్వలేదని స్పష్టం చేసింది. దేశంలోని విస్తృతమైన వీధి ఆహార సంస్కృతిని లక్ష్యంగా చేసుకోవడం ప్రభుత్వ ఉద్దేశం కాదని తెలిపింది. వివిధ అసాంక్రమిక వ్యాధులకు కారణమవుతున్న ఊబకాయాన్ని నిరోధించడంపై ప్రజలను చైతన్యపరచడంలో భాగంగా చక్కెర, నూనె శాతం గురించి అవగాహన కల్పించాలని సంకల్పించామని వెల్లడించింది. దీనిలో భాగంగానే పాఠశాలలు, కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థల్లోని క్యాంటీన్లు, సమావేశ మందిరాల్లో వివిధ ఆహార పదార్థాల్లోని చక్కెర, నూనె శాతాలను తెలిపే డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేయాలని అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాలు, కార్పొరేషన్లకు లేఖ రాసిన విషయాన్ని కేంద్ర ఆరోగ్య శాఖ గుర్తుచేసింది.



ఆధార్ – సామాన్యుని హక్కు

చిన్నారుల ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ చేయండి

- భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ సూచన

దిల్లీ: చిన్నారుల ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్‌కు సంబంధించి భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) కీలక సూచన చేసింది. చిన్నారికి ఏడేళ్లు వచ్చినప్పటికీ బయోమెట్రిక్ వివరాలు అప్‌డేట్ చేయకపోయి ఉంటే ఆ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని తల్లిదండ్రులు/ సంరక్షకులకు సూచించింది. దగ్గర్లోని ఆధార్ సేవా కేంద్రం లేదా ఆధార్ సెంటర్‌లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని పేర్కొంది. స్కూల్ అడ్మిషన్, నగదు బదిలీ పథకాలు, స్కాలర్‌షిప్ వంటి ప్రయోజనాలు పొందాలంటే బయోమెట్రిక్ వివరాలు అప్‌డేట్ చేయడం ముఖ్యమని తెలిపింది. ఐదేళ్ల లోపు చిన్నారుల ఆధార్ నమోదు సమయంలో బయోమెట్రిక్ వివరాలు అవసరం లేదు. ఐదేళ్లు దాటిన తర్వాత బయోమెట్రిక్ వివరాలు అప్‌డేట్ చేయకపోతే నిబంధనల ప్రకారం ఆధార్ నంబర్ డీయాక్టివేట్ అయ్యే అవకాశం ఉందని గుర్తుచేసింది. 5 నుంచి 7 ఏళ్ల మధ్య చిన్నారులకు ఈ వివరాలు అప్‌డేట్‌కు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఏడేళ్లు దాటితే మాత్రం రూ.100 చెల్లించాల్సి ఉంటుంది.

భారత అంతరిక్ష లక్ష్యాలకు ఊపు!


- శుభాంశు యాత్రపై నిపుణుల విశ్లేషణ

దిల్లీ: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) భారత వ్యోమగామి శుభాంశు శుక్లా చేపట్టిన యాత్ర వల్ల భారత రోదసి లక్ష్యాలకు ఊతం లభిస్తుంది. సొంతంగా చేపట్టాలనుకుంటున్న మానవసహిత అంతరిక్షయాత్ర 'గగన్‌యాన్'కు, భూ కక్ష్యలో అంతరిక్ష కేంద్రం నిర్మాణానికి ఇది సాయపడనుంది.

సొంత రాకెట్, వ్యోమనౌక ద్వారా గగన్‌యాన్‌ను 2027లో నిర్వహించాలని భారత్ తలపోస్తోంది. ఈ యాత్ర కోసం జోరుగా సన్నాహాలు జరుగుతున్నాయి. అలాగే భారతీయ అంతరిక్ష కేంద్రం కోసం తొలి మాడ్యూల్‌ను 2028లో కక్ష్యలోకి పంపాలని మన దేశం భావిస్తోంది. 2035 కల్లా పూర్తిస్థాయి ల్యాబ్‌ను సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకొంది. 2040లో చందమామపైకి వ్యోమగామిని పంపాలనుకుంటోంది. "ఆకాంక్షను సామర్థ్యంగా మార్చుకోవడంలో శుభాంశు యాత్ర ఒక పెద్ద ముందడుగు" అని ఖగోళభౌతిక శాస్త్రవేత్త సోమక్ రాయ్‌చౌధరి తెలిపారు. ఐఎస్ఎస్‌లో శుభాంశు చేపట్టిన ప్రయోగాలు.. రోదసిలో సేద్యం నుంచి పదార్థ శాస్త్రం, ఆరోగ్యం, కృత్రిమ మేధ (ఏఐ) వరకూ వివిధ రంగాల్లో కొత్త అవకాశాలకు బాటలు పరుస్తాయని పేర్కొన్నారు. ఐఎస్ఎస్‌లో శుభాంశు గడించిన అనుభవం.. గగన్‌యాన్‌కు సాయపడుతుందని ఇస్రో పేర్కొంది. అంతర్జాతీయ సిబ్బందితో సమన్వయం చేసుకోవడం, మానసిక సన్నద్ధత, వ్యోమగామి ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం, ప్రయోగాల నిర్వహణ, భూకేంద్రంలోని సిబ్బందితో సమన్వయం వంటి అంశాల్లో ఇది ఉపయోగపడుతుందని వివరించింది. యాక్సియం-4 యాత్ర భారత ప్రైవేటు పరిశ్రమలు, అంతర్జాతీయ సంస్థలకు ఊతమిస్తుందని తెలిపింది. గ్రహాలను శోధించాలన్న భారత ఆకాంక్షలకు యాక్సియం-4 మిషన్ దోహదపడుతుందని ఇస్రోకు కీలక విడిభాగాలను సరఫరా చేసే అనంత్ టెక్నాలజీస్ సంస్థ సీఎండీ డాక్టర్ పావులూరి సుబ్బారావు పేర్కొన్నారు. "గ్రహాలను మన పూర్వీకులు సహజ జ్ఞానంతో అన్వేషించారు. ఇప్పుడు మనం ప్రయోగాలు, యాత్రల ద్వారా ఆ పనిని చేస్తున్నాం" అని తెలిపారు.

అంతరిక్షంలో హెయిర్ కట్

భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్నప్పుడు చోటుచేసుకున్న ఓ ఆసక్తికర సన్నివేశం ఇప్పుడు వైరల్‌గా మారింది. భారరహిత స్థితిలో ఆయన హెయిర్ కట్ చేయించుకున్నారు. శుక్లాకు అమెరికన్ వ్యోమగామి నికోల్ అయర్స్ క్షవరం చేశారు. "గత వారాంతంలో యాక్సియం-4 వ్యోమగాములకు హెయిర్‌కట్ చేశా. అది వారికి నచ్చిందని అనుకుంటున్నా. అయితే వారు ఇంకా రివ్యూలు ఇవ్వలేదు. భూమిపైకి తిరిగి వెళ్లాక హెయిర్ కట్ బిజినెస్ బాగా నడుస్తుందా..? అని మేమంతా సరదాగా అనుకున్నాం" అని నికోల్ పేర్కొన్నారు. రోదసిలో హెయిర్‌స్టైలింగ్ చేయించుకున్న తొలి భారతీయుడిగా శుభాంశు నిలిచారు.



కుటుంబాలకు కుటుంబాలే హతం

- గాజాలో ఒక్కరోజులోనే 93 మంది మృతి

డెయిర్ అల్-బలా: గాజాపై సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకూ ఇజ్రాయెల్ జరిపిన దాడిలో కుటుంబాలకు కుటుంబాలే హతమయ్యాయి. పాలస్తీనా లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడితో పాటు మరో కుటుంబంలోని 19 మంది మరణించారు. ఈ దాడుల్లో మొత్తం 93 మంది మృతి చెందారు. 278 మందికి గాయాలయ్యాయి. వీరిలో పిల్లలు, మహిళలే అధికంగా ఉన్నారు.

- ■ ఉత్తర షాటీ శరణార్థ శిబిరంపై జరిగిన దాడిలో 68 ఏళ్ల హమాస్ సభ్యుడు, పాలస్తీనా లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడు అయిన మహమ్మద్ ఫరాజ్ అల్-గౌల్ మృతి చెందారు. ఆయనతోపాటు అక్కడే ఉన్న భార్యాభర్తల తోపాటు వారి ఆరుగురు పిల్లలు మరణించారు.
- ■ గాజా సిటీ.. టెల్ అల్-హవాలోని ఒక ఇంటిపై జరిగిన భీకర దాడిలో ఒకే కుటుంబానికి చెందిన 19 మంది మృతి చెందారు. ఇందులో 8 మంది మహిళలు, ఆరుగురు చిన్నారులున్నారు. ఇదే ప్రాంతంలోని మరో టెంట్ ఆవాసంపై జరిగిన దాడిలో భార్యాభర్తలు, వారి ఇద్దరు పిల్లలు మరణించారు.
- ■ 24 గంటల్లో 93 మృతదేహాలు ఆసుపత్రులకు వచ్చాయని, గాయపడిన 278 మంది వచ్చారని గాజా ఆరోగ్యశాఖ వెల్లడించింది.

నెతన్యాహు సంకీర్ణానికి షాక్

ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. సైనిక ముసాయిదా బిల్లును కీలక భాగస్వామి అయిన యునైటెడ్ టోరా జుడాయిజం పార్టీ వ్యతిరేకించింది. తాము ప్రభుత్వం నుంచి వైదొలగుతున్నామని ఈ యూదు సంప్రదాయ పార్టీలోని రెండు గ్రూపులూ మంగళవారం ప్రకటించాయి. నెతన్యాహు ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికీ వెనకాడబోమని హెచ్చరించాయి. కొత్త బిల్లు ప్రకారం దేశంలోని ప్రతి ఒక్కరూ సైన్యంలో పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే తమ నియోజకవర్గాల్లోని ప్రజలు సైన్యంలో చేరడాన్ని స్వచ్ఛందం చేయాలని, వారిని యూదు మత గ్రంథాలను అభ్యసించడానికి అనుమతించాలని యునైటెడ్ టోరా జుడాయిజం పార్టీ సభ్యులు డిమాండు చేస్తున్నారు.

విద్యాశాఖలో లే ఆఫ్‌లకు అమెరికా సుప్రీం సమ్మతి

వాషింగ్టన్: ఫెడరల్ ప్రభుత్వ రూపురేఖలను మార్చేయడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలకు సుప్రీంకోర్టు పూర్తి మద్దతు ఇస్తోంది. ఫెడరల్ ప్రభుత్వ సిబ్బందిని గణనీయంగా తగ్గించాలన్న విధానాన్ని గతవారం సమర్థించిన సుప్రీంకోర్టు, సోమవారం ఫెడరల్ విద్యా శాఖలో 1,400 మంది సిబ్బంది లే ఆఫ్‌నకు అనుమతించింది. దీంతో విద్యా శాఖ రద్దవడం ఖాయమైంది. లే ఆఫ్‌లు విద్యా శాఖను దెబ్బతీస్తాయంటూ వాటిని నిలిపేసిన బోస్టన్ జిల్లా జడ్జి మైయోంగ్ జౌన్ తీర్పుపై సుప్రీంకోర్టుకు అప్పీలు చేయగా, సర్వోన్నత న్యాయస్థానం ట్రంప్ నిర్ణయాన్నే సమర్థించింది. సుప్రీం తీర్పు దేశమంతటా విద్యార్థులు, తల్లిదండ్రులకు గొప్ప విజయమనీ, ఫెడరల్ విద్యా శాఖ విధుల్లో అనేకం రాష్ట్రాలకు బదిలీ అవుతాయని ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో ఉద్ఘాటించారు. ట్రంప్ ప్రభుత్వ నిర్ణయాన్ని తాము ఎందుకు సమర్థించినదీ సుప్రీంకోర్టు వివరించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. దీనిపై తమ న్యాయపోరాటం కొనసాగుతుందని మసాచుసెట్స్ రాష్ట్రంలోని నగరాలు, విద్యాసంస్థల తరఫు న్యాయవాది ఒకరు చెప్పారు.

ఇమ్రాన్ మాజీ భార్య రెహామ్ కొత్త పార్టీ



కరాచీ: పాకిస్థాన్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. పాకిస్థాన్ తెహ్రీక్-ఎ-ఇన్సాఫ్(పీటీఐ) వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్ మాజీ సతీమణి రెహామ్ ఖాన్ కొత్త పార్టీని ప్రకటించారు. 'పాకిస్థాన్ రిపబ్లిక్ పార్టీ' పేరుతో దీన్ని ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్న ఆమె.. ప్రజా సమస్యలను లేవనెత్తడంలో సామాన్యుడి గొంతుకగా నిలబడతానన్నారు. "గతంలో ఎప్పుడూ రాజకీయ పదవులు చేపట్టలేదు. ఓ సారి ఒక్క వ్యక్తి (ఇమ్రాన్‌ను ఉద్దేశిస్తూ) కోసం పార్టీలో చేరా. కానీ ఈ రోజు మాత్రం సొంతంగా రాజకీయాల్లోకి ప్రవేశించా. ఇది కేవలం పార్టీ మాత్రమే కాదు.. రాజకీయాలను సేవగా మార్చే ఉద్యమం" అని రెహామ్ ఖాన్ వెల్లడించారు. దేశంలో ప్రస్తుత రాజకీయాలపై ప్రజల్లో పెరుగుతున్న నిరాశ నేపథ్యంలోనే పార్టీ స్థాపించానని, పాలకవర్గాన్ని సవాల్ చేయడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. కరాచీలో ప్రెస్ క్లబ్‌లో ఈ వివరాలు వెల్లడించిన ఆమె.. కష్టకాలంలో ఈ ప్రదేశం తనకు అండగా నిలిచిందన్నారు. త్వరలోనే పార్టీ మ్యానిఫెస్టోను విడుదల చేస్తామని ప్రకటించారు.



సంజయ్‌దత్ చెప్పి ఉంటే..

ముంబయి పేలుళ్లు తప్పేవి: ఉజ్వల్ నికమ్

ఇంటర్నెట్ డెస్క్: దాదాపు మూడు దశాబ్దాల క్రితం దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో జరిగిన బాంబు పేలుళ్ల కేసు వాదించిన ప్రముఖ న్యాయవాది ఉజ్వల్ నికమ్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రపతి రాజ్యసభకు నామినేటు చేయడంతో రాజకీయాల్లోకి అడుగుపెడుతున్న ఉజ్వల్.. ఓ జాతీయ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. "1993 మార్చి 12న ముంబయిలో వరుస పేలుళ్లు జరిగాయి. ఆ ఘటనకు కొన్నిరోజుల ముందే సంజయ్‌దత్ ఇంటికి ఓ వ్యాను వచ్చింది. అండర్‌వరల్డ్ గ్యాంగ్‌స్టర్ దావూద్ ఇబ్రహీం అనుచరుడు అబూ సలేం దాన్ని తీసుకొచ్చాడు. అందులో హ్యాండ్ గ్రెనేడ్లు, ఏకే 47 తుపాకుల వంటి ఆయుధాలున్నాయి. వ్యానులో నుంచి కొన్ని హ్యాండ్ గ్రెనేడ్లు, తుపాకులను సంజయ్‌దత్ బయటకు తీశారు. ఒక ఏకే 47ను తన వద్ద ఉంచుకొని మిగతావాటిని తిరిగిచ్చేశారు. ఆ సమయంలో ఆయుధాల వ్యాను గురించి సంజయ్‌దత్ పోలీసులకు సమాచారం ఇచ్చి ఉంటే.. ముంబయి పేలుళ్లు జరిగేవి కావు" అని ఉజ్వల్ నికమ్ అభిప్రాయపడ్డారు. తుపాకులపై ఆసక్తితో సంజయ్‌దత్ ఏకే 47ను తీసుకొన్నప్పటికీ.. దాన్ని ఎప్పుడూ కాల్చలేదని నటుడి న్యాయవాది చెప్పినట్లు ఉజ్వల్ నికమ్ గుర్తుచేసుకున్నారు. అక్రమ ఆయుధాల కేసులో సంజయ్‌దత్‌కు కోర్టు అయిదేళ్ల జైలుశిక్ష విధించిన విషయం తెలిసిందే. కాగా, 2024 సార్వత్రిక ఎన్నికల్లో భాజపా తరఫున ఉత్తర - మధ్య ముంబయి లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి వర్షా గైక్వాడ్ చేతిలో ఉజ్వల్ ఓడిపోయారు.

ఐటీఐలకు మహర్దశ!

దిల్లీ: కేంద్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదించిన రూ.60 వేల కోట్ల కేంద్ర ప్రాయోజిత కార్యక్రమం కింద పారిశ్రామిక శిక్షణ సంస్థల(ఐటీఐ)ల ఆధునికీకరణ, అయిదు జాతీయ ఉత్కృష్ట నైపుణ్య శిక్షణ కేంద్రాల స్థాపన చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్రం రూ.30 వేల కోట్లను, రాష్ట్రాలు రూ.20 వేల కోట్లను, పరిశ్రమలు రూ.10 వేల కోట్లను సమకూరుస్తాయి. దీని కింద దేశంలోని 3 వేల ఐటీఐలలో 1,000 ఐటీఐలను ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) పద్ధతిలో ఆధునీకరించనున్నట్లు మంగళవారం కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రి జయంత్ చౌధరీ వెల్లడించారు. ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ఆరేళ్లలో 4.5 లక్షల సీట్లు ఖాళీగా ఉన్న ఐటీఐలను మూసివేసినట్లు ఆయన చెప్పారు. గత రెండేళ్లుగా 99,000 సీట్లు ఖాళీగా ఉన్న ఐటీఐలను మూసివేస్తున్నామని వివరించారు. దీంతో సక్రమంగా నడుస్తున్న ఐటీఐలలో ప్రవేశాలు 2024లో 11 శాతం పెరిగాయని కేంద్ర మంత్రి చెప్పారు. మరోవైపు.. 6 నుంచి 12వ తరగతి స్కూలు విద్యార్థులకు కృత్రిమ మేధా (ఏఐ) నైపుణ్యాలు నేర్పేందుకు ఈ నెల 22న పలు కార్యక్రమాలను ప్రారంభిస్తున్నట్లు చౌధరీ వెల్లడించారు. వీటి కోసం పైలట్ ప్రాజెక్టు కింద దేశమంతటా వివిధ పాఠశాలల్లో లక్ష మంది విద్యార్థులను ఎంపిక చేస్తామని చెప్పారు.

వీధికుక్కలను ఇంట్లోకి తీసుకువెళ్లి ఆహారం పెట్టొచ్చుగా?: సుప్రీం



దిల్లీ: వీధికుక్కలకు ఆహారం పెట్టాలనుకునేవారు వీధుల్లో కాకుండా వారి ఇంట్లోకి తీసుకువెళ్లి ఆహారం ఎందుకు పెట్టకూడదని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. కాలనీలోని వీధికుక్కలకు తాను ఆహారం పెడుతుంటే స్థానికులు వేధిస్తున్నారని ఓ వ్యక్తి దాఖలు చేసిన పిటిషనుపై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం పిటిషనరు తరఫు న్యాయవాదితో మాట్లాడుతూ.. వీధికుక్కలకు ఆహారం పెట్టేందుకు అందరూ వీధులను, రోడ్లను ఉపయోగించుకుంటే ఇక మనుషులకు స్థలం ఎక్కడ ఉంటుందని ప్రశ్నించింది. ప్రేమ ఉన్నవారు కుక్కలను తమ ఇంటికే తీసుకువెళ్లి ఆహారం పెడితే ఎవరు ఆపుతారని అడిగింది. నిబంధనల ప్రకారం.. స్థానికంగా ఉన్న సంక్షేమ సంఘాలు, అపార్ట్‌మెంట్ల యజమానుల సంఘాలు తమ ప్రాంతంలోని కుక్కలకు ఆహారం పెట్టడానికి అవసరమైన ఏర్పాట్లు చేసే బాధ్యత ఉంటుందని నొయిడాకు చెందిన పిటిషనరు తొలుత అలహాబాద్ హైకోర్టులో పిటిషను వేశారు. ఇందు కోసం ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించని ప్రదేశాల్లో ఫీడింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలని కోరారు. పిటిషనరు తన ఇంట్లోనే ఓ షెల్టరు ఏర్పాటుచేసి.. వీధికుక్కలకు ఆశ్రయం కల్పించాలని హైకోర్టు సూచించింది. వీధుల్లో కుక్కలు ఎక్కువ కావడంతో వాకింగుకు వెళ్లేవారు, ద్విచక్ర వాహనదారులు, చిన్నారులు, వృద్ధులు పలుమార్లు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేసింది. కుక్కల దాడుల్లో కొందరు ప్రాణాలు సైతం కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజల ప్రయోజనాలకు భంగం కలగకుండా వీధి జంతువుల రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశిస్తూ హైకోర్టు ఈ పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో పిటిషనరు సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. అక్కడా ఇదే అనుభవం ఎదురైంది.

అత్యంత అరుదైన కేసుల్లోనే భూమికి భూమి పరిహార నిర్ణయం

- రాష్ట్రాలకు సుప్రీంకోర్టు స్పష్టీకరణ

దిల్లీ: భూసేకరణ నిబంధనలు రూపొందించే రాష్ట్రాలను అప్రమత్తం చేస్తూ సుప్రీంకోర్టు కీలక ఆదేశాలిచ్చింది. అత్యంత అరుదైన కేసుల్లోనే భూమికి భూమి పరిహారం నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. రాజ్యాంగ అధికరణ 21లోని జీవనోపాధి హక్కును చూపుతూ ప్రభుత్వాలు చేపట్టే భూసేకరణను వ్యతిరేకించడాన్ని సమర్థించలేమని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్ ధర్మాసనం పేర్కొంది. నిర్వాసితులకు అనుకూలంగా ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును పంజాబ్, హరియాణా హైకోర్టు సమర్థించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. హరియాణా పట్టణాభివృద్ధి సంస్థ ఎస్టేట్ అధికారి, ఇతరులు సుప్రీంకోర్టులో ఈ పిటిషన్ వేశారు. ప్రజాప్రయోజనాల నిమిత్తం 1990లో హరియాణా ప్రభుత్వం చేపట్టిన భూసేకరణకు సంబంధించి ఈ వివాదం తలెత్తింది. 1992లో ప్రభుత్వం తీసుకొచ్చిన పథకం కన్నా మెరుగ్గా ఉన్న 2016 పునరావాసం పథకం ప్రకారం పరిహారం పొందే హక్కు భూ నిర్వాసితులకు ఉందని హైకోర్టు పేర్కొంది. అత్యంత అరుదైన కేసుల్లోనే భూ నిర్వాసితులకు నగదు రూపంలో పరిహారం చెల్లించడంతో పాటు పునరావాసం కల్పించాలని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. ప్రతి భూసేకరణకూ ఈ విధానాన్ని పాటించాల్సిన అవసరం లేదని తెలిపింది. భూసేకరణ జరిగిన తర్వాత 14 నుంచి 20 ఏళ్ల వరకూ వ్యాజ్యాలు దాఖలు కావడాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రస్తావించింది. తీవ్రజాప్యంతో కూడిన భూ నిర్వాసితుల వ్యాజ్యాలకు సాంకేతికంగా విచారణార్హత లేకున్నప్పటికీ 2016 విధానం ప్రకారం పరిహారం చెల్లించాలని తెలిపింది. 1992 పాలసీ ప్రకారం ఖరారు చేసిన ధరకు ప్లాట్లను కేటాయించాలని ఆదేశించింది. నాలుగు వారాల్లోగా లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవడంతో పాటు నిర్ణీత బయానా సొమ్మునూ చెల్లించాలని స్పష్టం చేసింది. ఈ వివాదం...భూమికి భూమి విధానాన్ని రూపొందించే రాష్ట్రాలకు కనువిప్పు కావాలని పేర్కొంది.

ఫోరెన్సిక్ సాక్ష్యాల ప్రతి కదలికనూ పక్కాగా నమోదు చేయాలి

- డీఎన్ఏ నమూనాలపై సుప్రీం మార్గదర్శకాలు
- ఓ వ్యక్తి మరణ శిక్షను రద్దు చేస్తూ ఆదేశాలు

దిల్లీ: శిక్ష ఖరారుకు ఫోరెన్సిక్ సాక్ష్యంగా చూపించే డీఎన్ఏ నమూనాల సేకరణ, వాటిని భద్రపరచడం, అధికారుల సంతకాల సేకరణ తదితర ప్రక్రియల్లో జరిగిన లోపాలను ఎత్తిచూపుతూ ఓ వ్యక్తి మరణ దండనను సుప్రీంకోర్టు రద్దు చేసింది. డీఎన్ఏ నమూనాలను ఫోరెన్సిక్ సాక్ష్యాలుగా పరిగణనలోకి తీసుకోవడానికి సంబంధించి దేశమంతటికీ వర్తించే మార్గదర్శకాలను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం జారీ చేసింది.

'డీఎన్ఏ నమూనాలను ప్రామాణిక నిబంధనల ప్రకారం సరైన పద్ధతిలో సేకరించాలి. వాటిని సేకరించిన వైద్యనిపుణుల హోదా, సంతకాల వివరాలను సంబంధిత పత్రంలో పొందుపరచాలి. డీఎన్ఏను సేకరించిన 48 గంటల్లోగా ఫోరెన్సిక్ ల్యాబ్‌కు చేర్చాలి. నివేదికను కోర్టుకు సమర్పించడం, వాటిని న్యాయస్థానం ఆదేశాల మేరకు భద్రపరచడం సహా అన్ని ప్రక్రియలు పారదర్శకంగా, సందేహాలకు తావు లేకుండా, పద్ధతి ప్రకారం చేయాల'ని అన్ని రాష్ట్రాల డీజీపీలకు సూచించింది. ఈ ప్రక్రియలో లోపాలు ఉన్నందునే ప్రస్తుత కేసులో మద్రాస్ హైకోర్టు విధించిన మరణ దండనను రద్దు చేస్తూ ముద్దాయి విడుదలకు ఆదేశిస్తున్నట్లు తెలిపింది.

ఉక్రెయిన్ ప్రధాని రాజీనామా

- జెలెన్‌స్కీ ప్రభుత్వంలో భారీ పునర్వ్యవస్థీకరణ!


ఉప ప్రధాని యూలియా

కీవ్: ఉక్రెయిన్ ప్రధానమంత్రి డెనిస్ ష్మిహాల్ (39) మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాసిన లేఖను తన టెలిగ్రాం పేజీలో ఆయన పోస్టు చేశారు. అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రభుత్వంలో గణనీయమైన భారీ పునర్వ్యవస్థీకరణకు ఇది తొలి సూచికగా భావించవచ్చు. ఇదే క్రమంలో వాషింగ్టన్‌లో ఉక్రెయిన్ రాయబారి నియామకం కూడా జరిగే అవకాశముంది. ప్రస్తుతం ఉక్రెయిన్ ఉప ప్రధానిగా, మహిళా ఆర్థికమంత్రిగా ఉన్న యూలియా స్విరైదెంకోను ప్రధాని పదవికి తాను ప్రతిపాదిస్తున్నట్లు జెలెన్‌స్కీ సోమవారమే వెల్లడించారు. అమెరికా, ఉక్రెయిన్ ఖనిజ ఒప్పందం చర్చల్లో స్విరైదెంకో కీలకపాత్ర పోషించారు. పశ్చిమ దేశాల మిత్రులతో జరిగిన పలు ఉన్నతస్థాయి చర్చల్లోనూ ఈమె చురుగ్గా వ్యవహరించారు.

అఫ్గానీలకు బ్రిటన్ రహస్య పునరావాసం

లండన్: బ్రిటిష్ దళాలతో కలిసి పనిచేసిన వారితో సహా వేల మంది అఫ్గానీలకు రహస్యంగా పునరావాసం కల్పించినట్లు బ్రిటన్ ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. వ్యక్తిగత వివరాలు బహిర్గతమవడంతో వీరికి తాలిబన్ల నుంచి ప్రమాదం ఎదురవుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. తాలిబన్లు అఫ్గాన్‌ను తిరిగి ఆధీనంలోకి తీసుకున్న తర్వాత బ్రిటన్‌కు రావడానికి దరఖాస్తు చేసుకున్న దాదాపు 19 వేలమంది అఫ్గానీల వివరాలు 2022లో బహిర్గతమయ్యాయి. దీంతో బ్రిటన్ కోర్టు వీరి ఉనికిని బహిర్గతం చేయకుండా నిషేధిస్తూ కఠిన ఆదేశాలను జారీచేసింది. గత ప్రభుత్వం అఫ్గానీలకు పునరావాసం కల్పించేలా ఓ రహస్య కార్యక్రమాన్ని ప్రారంభించింది. మంగళవారం ఈ నిషేధాన్ని ఎత్తివేస్తూ ప్రస్తుత ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రకటించింది.

ఐదేళ్లలో 65 విమాన ఇంజిన్ల వైఫల్యం: డీజీసీఏ

ఇంటర్నెట్ డెస్క్: ఎయిరిండియా విమాన ప్రమాదం తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ విమానయాన సంస్థలు అప్రమత్తమయ్యాయి. తమ విమానాల ఇంజిన్లు, ఇంధన స్విచ్‌లవంటి వాటిపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) విడుదల చేసిన ఓ నివేదిక పలు కీలక విషయాలను వెల్లడించింది. దేశవ్యాప్తంగా గత ఐదేళ్లలో 65 విమాన ఇంజిన్ల వైఫల్యాలు చోటుచేసుకున్నాయని పేర్కొంది. 2024 జనవరి 1 నుంచి 2025 మే 31 మధ్యలో 11 మేడే కాల్స్ నమోదైనట్లు తెలిపింది. విమానాలు, నౌకలు తీవ్ర ముప్పులో చిక్కుకుని, అందులోని ప్రయాణికుల ప్రాణాలు పెను ప్రమాదంలో పడినప్పుడు తక్షణ సాయం కోరుతూ పైలట్లు మేడే సందేశాన్ని పంపుతుంటారు. అయితే ఈ 11 మేడే కాల్స్ సమయాల్లో పైలట్లు చాకచక్యంగా వ్యవహరించి ఆయా విమానాలను సురక్షితంగా దింపడంతో ప్రమాదం తప్పిందని పేర్కొంది.

బోయింగ్ ఇంధన స్విచ్‌లపై ముందే హెచ్చరించిన బ్రిటన్

అహ్మదాబాద్ విమాన ప్రమాదానికి నాలుగు వారాల ముందే బోయింగ్ విమానాల్లోని ఇంధన స్విచ్‌లపై హెచ్చరికలు చేసినట్లు బ్రిటన్‌కు చెందిన పౌర విమానయాన అథారిటీ (సీఏఏ) పేర్కొంది. 787 డ్రీమ్‌లైనర్‌తోసహా ఐదు రకాల బోయింగ్ విమానాల ఇంధన స్విచ్‌లపై మే 15న ఓ భద్రతా నోటీసు జారీ చేసినట్లు తెలిపింది.

కాక్‌పిట్‌లో చొరబాటుకు యత్నం

- విమానంలో ఇద్దరు మహిళల హల్‌చల్

దిల్లీ: దేశ రాజధాని దిల్లీ నుంచి ముంబయి వెళ్లాల్సిన ఓ స్పైస్‌జెట్ విమానంలో ఇద్దరు మహిళా ప్రయాణికులు హల్‌చల్ చేశారు. టేకాఫ్‌కు సిద్ధమవుతుండగా.. కాక్‌పిట్‌లోకి బలవంతంగా వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ ఘటన దిల్లీ విమానాశ్రయంలో సోమవారం చోటుచేసుకుంది. ఓ స్పైస్‌జెట్ విమానం మధ్యాహ్నం 12.30 గంటలకు ముంబయి బయలుదేరాల్సి ఉండగా. . టేకాఫ్ చేసేందుకు ట్యాక్సీయింగ్‌కు తీసుకొచ్చారు. ఆ సమయంలో ఇద్దరు మహిళా ప్రయాణికులు ఉన్నట్టుండి తమ సీట్లలో నుంచి లేచి గొడవపడ్డారు. అనంతరం కాక్‌పిట్‌లోకి బలవంతంగా వెళ్లేందుకు ప్రయత్నించారు. తోటి ప్రయాణికులు, క్యాబిన్ సిబ్బంది చెప్పినా వారు తమ సీట్లలోకి వెళ్లేందుకు నిరాకరించారు. దీంతో పైలట్ విమానాన్ని బే వద్దకు తీసుకెళ్లారు. అనంతరం వారిని సీఐఎస్ఎఫ్ సిబ్బందికి అప్పగించారు. దీంతో విమానం దాదాపు ఏడు గంటలు ఆలస్యంగా బయలుదేరింది.

దేశంలో నిరుద్యోగిత యథాతథం

దిల్లీ: ఈ ఏడాది మే నెల మాదిరిగానే జూన్‌లోనూ దేశంలో నిరుద్యోగిత 5.6 శాతంగా ఉందని మంగళవారం ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. స్త్రీపురుషులిద్దరిలో ఇదే నిరుద్యోగం రేటు ఉంది. అయితే మేలో మహిళల్లో 5.8 శాతంగా ఉన్న నిరుద్యోగిత జూన్ కల్లా 5.6 శాతానికి తగ్గింది. ఇదే కాలంలో పట్టణాల్లో నిరుద్యోగిత 17.9 శాతం నుంచి 18.8 శాతానికి పెరిగింది. గ్రామాల్లో 13.7 శాతం నుంచి స్వల్పంగా 13.8 శాతానికి పెరిగింది. కేంద్ర గణాంకాల శాఖ విడుదల చేసిన ఆవర్తన శ్రామిక శక్తి సర్వే (పీఎల్ఎఫ్ఎస్) ప్రకారం జూన్‌లో 15ఏళ్లు పైబడిన వారిలో శ్రామిక శక్తిలో పాల్గొన్నవారి సంఖ్య మే నెలలో 54.8 శాతం కాగా, జూన్‌లో 54.2 శాతానికి తగ్గింది. మే నెలలో వ్యవసాయంలో నిమగ్నమైన మహిళా కార్మికులు 70.2 శాతం కాగా, జూన్‌లో అది 69.8 శాతానికి తగ్గింది. ఈ ఏడాది జూన్‌లో గ్రామీణ జనాభాలో 15 ఏళ్లుపైబడినవారిలో 53.3 శాతంమంది పనుల్లో నిమగ్నమయ్యారు. పట్టణాల్లో ఇదే వయోవర్గంలో 46.8 శాతమే పనికెళ్లారు.

'ఖైదీలకు ఖరీదైన ఆహారం నిరాకరణ ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కాదు'

దిల్లీ: జైలులో ఖైదీలకు వారు కోరుకున్న లేదా ఖరీదైన ఆహారాన్ని నిరాకరించడాన్ని ప్రాథమిక హక్కుల ఉల్లంఘనగా పరిగణించలేమని సుప్రీంకోర్టు పేర్కొంది. దివ్యాంగులైన ఖైదీలకూ ఇది వర్తిస్తుందని స్పష్టంచేసింది. రాజ్యాంగ అధికరణ 21లో పేర్కొన్న జీవించే హక్కు ఖైదీలందరికీ వర్తిస్తుందని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్ ధర్మాసనం తెలిపింది. అయితే, ప్రత్యేకించిన లేదా విలాసవంతమైన ఆహార పదార్థాలను ఖైదీలు ఓ హక్కుగా డిమాండ్ చేయలేరంది. 'ఖైదీ ఆరోగ్య పరిస్థితిని అనుసరించి, వైద్యుల సూచన మేరకు ఆహారాన్ని అందించడం ప్రభుత్వ బాధ్యత. దివ్యాంగులతో సహా సాధారణంగా ఖైదీలందరికీ తగిన పోషక విలువలతో కూడిన ఆహారం జైళ్లలో సరఫరా అవుతుంది' అని ధర్మాసనం పేర్కొంది. మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

అమెరికా హెచ్చరికలను తేలిగ్గా తీసుకున్న రష్యా

తియాంజిన్ (చైనా): యుద్ధాన్ని ముగించకపోతే 100 శాతం సుంకాలను విధిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన హెచ్చరికలను రష్యా తేలిగ్గా తీసుకుంది. తామూ అదనపు సుంకాలతో సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేసింది. చైనాలో షాంఘై సహకార సదస్సులో పాల్గొన్న అనంతరం రష్యా విదేశాంగశాఖ మంత్రి సెర్గీ లవ్రోవ్ మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే తమపై అనేక ఆంక్షలు ఉన్నాయని, కొత్త భారాలను ఎదుర్కొనే శక్తి తమకు ఉందని తెలిపారు.



లోయలో పడిన వాహనం: జమ్మూలో ఏడుగురి మృతి

జమ్మూ: ప్రయాణికుల వాహనం లోయలో పడటంతో జమ్మూకశ్మీర్‌లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 17 మంది గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం దోడా పట్టణ సమీపంలోని కిల్లర్ మలుపు వద్ద చోటుచేసుకుంది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. అధిక బరువు కారణంగా మలుపు వద్ద వాహనం అదుపు తప్పి లోయలో పడినట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

ఈనాడు సినిమా

'రామాయణ' బడ్జెట్ రూ. నాలుగు వేల కోట్లు

– చిత్ర నిర్మాత నమిత్ మల్హోత్రా



రణ్‌బీర్ కపూర్




సాయి పల్లవి

నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'రామాయణ'. ఈ సినిమా బడ్జెట్‌పై ఇప్పటివరకు సామాజిక మాధ్యమాలలో అనేక ఊహాగానాలు చక్కర్లు కొట్టాయి. దీనిపై నిర్మాత నమిత్ మల్హోత్రా స్పందించారు. అత్యంత ఖరీదైన భారతీయ చిత్రంగా రూ. 4వేల కోట్లతో ఈ సినిమా రూపొందుతోందని అన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన ఈ సినిమా బడ్జెట్ గురించి పలు విశేషాలను పంచుకున్నారు. "మేము ఎవరి నుంచి డబ్బు తీసుకోవాలనుకోవడం లేదు. ఏడు సంవత్సరాల క్రితమే దీని నిర్మాణం కోసం పనులు ప్రారంభించాము. ఈ సినిమా సుమారు రూ.4వేల కోట్లతో తెరకెక్కుతోంది. ఈ ఇతిహాసాన్ని ప్రపంచమంతా చూడాలి. ఆ లక్ష్యంతోనే దీన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నాం. హాలీవుడ్ చిత్రాల బడ్జెట్ కంటే ఇది కొంచెం తక్కువే అని నేను భావిస్తున్నాను. మన సంస్కృతికి పునాదిగా నిలిచిన ఇతిహాసాన్ని మనం గర్వంగా భావిస్తున్నాం. దానిని సాధ్యమైనంత గొప్పగా తెరకెక్కించనున్నాం"అని నమిత్ మల్హోత్రా తెలిపారు. అలానే నమిత్ 'రామాయణ' సినిమాతో ప్రపంచమంతా భారత్ వైపు చూస్తుందన్నారు. ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. మొదటి పార్ట్ 2026 దీపావళికి, రెండవ భాగం 2027లో విడుదల కానుంది. ఇప్పటికే ఈ చిత్ర ప్రధాన తారాగణం ఖరారైంది. ఇందులో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీదేవోల్ నటిస్తున్నారు.

తెరపైకి సంత్ తుకారాం జీవితం


కథానాయకుడు ఆదిత్య ఓం దర్శకత్వంలో తెరకెక్కిన 'సంత్ తుకారాం' ఈ నెల 18న ప్రేక్షకుల ముందుకొస్తోంది. మరాఠీ నటుడు సుబోధ్ భావే ప్రధాన పాత్రధారిగా నటించిన చిత్రమిది. పురుషోత్తం స్టూడియోస్‌తో కలిసి కర్జన్ ఫిల్మ్స్ పాన్ ఇండియా స్థాయిలో నిర్మించింది.



సుబోధ్ భావే

"17వ శతాబ్దపు మరాఠా సాధువు, కవి సంత్ తుకారాం జీవితం ఆధారంగా రూపొందించిన చిత్రమిది. వారసత్వం, సాహిత్య విప్లవం ఈ కథలో కీలకం. ఇందులోని ప్రతి పాట భావోద్వేగ, తాత్విక పరిణామాన్ని ప్రతిధ్వనిస్తుంది. హీరోగా మెప్పించిన ఆదిత్య ఓం దర్శకుడిగా మారి ఈ చిత్రాన్ని తెరకెక్కించిన తీరు చాలా బాగుంది. భాషతో సంబంధం లేకుండా ఈ చిత్రం ప్రేక్షకులకు చేరువ అవుతుంది. ప్రముఖ నటుడు ముఖేశ్ ఖన్నా ఇచ్చిన వాయిస్ ఓవర్ ఈ సినిమాకి హైలెట్ అవుతుంద"ని సినీ వర్గాలు తెలిపాయి. శివ సూర్యవంశీ, షానా చోహాన్, సంజయ్ మిశ్రా, అరుణ్ గోవిల్, శిశిర్ శర్మ, హేమంత్ పాండే, గణేశ్ యాదవ్, లలిత్ తివారీ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: నిఖిల్ కామత్, రవి త్రిపాఠి, వీరల్, లావన్.

రామ్ పాట... అనిరుధ్ నోట



రామ్ పోతినేని

తెలుగులో ఓ మంచి ప్రేమ పాట విని చాలా రోజులు అయిందిగా...' అంటూ తన 'ఆంధ్రా కింగ్ తాలూకా' పాటల ప్రచారాన్ని షురూ చేశారు కథానాయకుడు రామ్ పోతినేని. ఈ నెల 18న సినిమాలోని ఓ ప్రేమ గీతాన్ని విడుదల చేస్తున్నారు. ఈ పాటని రామ్ పోతినేని స్వయంగా రచించగా, సంగీత సంచలనం అనిరుధ్ ఆలపించడం విశేషం. వివేక్ - మెర్విన్ స్వరాలు సమకూర్చారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రంలో రామ్ సరసన భాగ్య శ్రీ బోర్సే నటిస్తున్నారు. ఉపేంద్ర ముఖ్య భూమిక పోషించారు. మహేశ్‌బాబు.పి దర్శకుడు. నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు. ప్రస్తుతం చివరిదశ నిర్మాణానంతర కార్యక్రమాల్లో ఉన్న ఈ సినిమాకి ఛాయాగ్రహణం: సిద్ధార్థ నుని, కూర్పు: శ్రీకర్‌ప్రసాద్, ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా.

"హా.. హా.. హాసిని" అంటూ 'బొమ్మరిల్లు' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల మదిలో గుర్తుండిపోయిన నటి జెనీలియా. ఆమె దాదాపు 13ఏళ్ల విరామం తర్వాత 'జూనియర్' చిత్రంతో దక్షిణాది ప్రేక్షకుల్ని తిరిగి పలకరించనుంది. కిరీటి హీరోగా పరిచయమవుతున్న ఈ పాన్ ఇండియా సినిమాని రాధాకృష్ణ తెరకెక్కించారు. ఇందులో జెనీలియా ఓ ముఖ్య పాత్ర పోషించారు. ఈ చిత్రం ఈనెల 18న థియేటర్లలోకి రానున్న నేపథ్యంలో ఆమె మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు.

ఆ గుర్తింపు నాకెంతో ఆనందం

"3ఏళ్ల క్రితం మా ఆయన రితేశ్ ద్వారా ఈ చిత్రం నా దగ్గరకు వచ్చింది. అప్పటికి నేను సినిమాలు చేయట్లేదు. మా పిల్లల ఆలనాపాలనా చూసుకుంటున్నా. మళ్లీ సినిమాలు చేయాలా.. వద్దా? అనే సంశయంలో ఉన్నా. కానీ, రితేశ్ 'నువ్విది కచ్చితంగా చేయాలి.. నువ్వు కోరుకునేది దీంట్లో ఉంద'ని చెప్పారు. ఆ తర్వాత దర్శకుడు రాధాకృష్ణ కథ వినిపించినప్పుడు.. ఇలాంటి పాత్ర నేను ఇది వరకెప్పుడూ చేయలేదు కదా అనిపించింది. రేపు తెరపై సినిమా చూసినప్పుడు ప్రేక్షకులకు కూడా నన్ను సరికొత్తగా చూసిన అనుభూతి కలుగుతుంది. ఈ కథలో నా పాత్రకు చాలా ప్రాధాన్యముంది. మంచి బాస్‌గా గంభీరమైన పాత్రలో కనిపిస్తా. కథ ముందుకు సాగే కొద్దీ నా పాత్రలోని విభిన్న కోణాలు బయటకొస్తాయి".

☛ "నేను నా కెరీర్‌లో చాలా మంది కొత్త హీరోలతో కలిసి పని చేశాను. వాళ్లంతా ఇప్పుడు టాప్ స్టార్స్‌గా ఉన్నారు. ఇప్పుడు రీఎంట్రీలో కిరీటితో కలిసి నటించే అవకాశమొచ్చింది. కష్టపడే వ్యక్తిత్వం ఉన్న నటుడు అతను. ఎంత చక్కగా నటిస్తాడో.. అంతే అద్భుతంగా డ్యాన్సులు, ఫైట్లు చేస్తాడు. దీంట్లో మా ఇద్దరి పాత్రలు ఎలా ముడిపడి ఉంటాయి.. మా మధ్య ఉన్న సంఘర్షణ ఏంటన్నది సినిమా చూసే తెలుసుకోవాలి. ఇది బలమైన కథ, యాక్షన్, ఎమోషన్స్‌తో పూర్తి ప్యాకేజ్ చిత్రంగా ఉంటుంది. అలాగే దీంట్లో 'బొమ్మరిల్లు' తరహాలో తండ్రీకొడుకుల సెంటిమెంట్ చక్కగా కుదిరింది. ఈ సినిమాతో చాలా ఏళ్ల తర్వాత దేవిశ్రీ ప్రసాద్, సెంథిల్ కుమార్ లాంటి గొప్ప టెక్నీషియన్స్‌తో మళ్లీ కలిసి పని చేయగలిగా. ఒకరకంగా ఈ చిత్రం మా అందరికీ ఓ రీయూనియన్ లాంటిదే".

☛ "దక్షిణాది ప్రేక్షకులు నాకెంతో ప్రేమనిచ్చారు. ఇక్కడ నన్నెవరూ జెనీలియాగా గుర్తుంచుకోలేదు. 'బాయ్స్'తో హరిణిగా.. 'ఢీ', 'రెడీ'లతో పూజాగా.. 'బొమ్మరిల్లు'తో హాసినిగా.. ఇలా నేను పోషించిన పాత్రలతోనే వాళ్ల మదిలో నన్ను దాచుకున్నారు. ఇది ఓ నటిగా నాకు గొప్ప ఆనందాన్నిస్తోంది. నిజానికి ఓ నటికి కుర్రాళ్లలో అభిమానులుంటారు గానీ, అమ్మాయిల్లో పెద్దగా ఉండరు. కానీ, హాసిని పాత్రతో నాకెంతో మంది అభిమానులయ్యారు. నాకు మళ్లీ తెలుగులోనూ సినిమాలు చేయాలని ఉంది. ప్రయోగాత్మకంగా ఉండే ఏ పాత్ర చేయడానికైనా సిద్ధమే. నాకు తెరపై ఎంత సేపు కనిపించామన్నది ముఖ్యం కాదు. చేసేది చిన్న పాత్రైనా కథపై బలమైన ప్రభావం చూపించేలా ఉండాలి. ప్రేక్షకులు ఎప్పటికీ గుర్తు పెట్టుకునేలా ఉండాలి".



జెనీలియా

☛ "నేను నటి అవ్వాలని ఎప్పుడూ అనుకోలేదు. ఎవరో నా ఫొటోలు తీసి దర్శకుడు శంకర్‌కు పంపడం.. ఆయన నాకు 'బాయ్స్'లో అవకాశమివ్వడం.. ఆ తర్వాత రాజమౌళి నన్ను 'సై'లోకి తీసుకోవడం.. దిల్‌రాజు 'బొమ్మరిల్లు' ఇవ్వడం.. ఇలా బోలెడంత ప్రేమ చూపించారు. అది నాకు దక్కిన ఆశీర్వాదం. దీనికి తగ్గట్లుగా ఆ పాత్రల కోసం నేను పడిన కష్టం ప్రేక్షకులకు నన్ను మరింత దగ్గర చేసింది. నాకు ప్రత్యేకంగా ఫలానా పాత్రలు చేయాలని కోరికలేం లేవు. వరుసగా సినిమాలు చేయాలన్న ఆలోచనా లేదు. మంచి కథలు, పాత్రల్లో భాగమవ్వాలని ఉంది".

☛ "నేను నమ్మేది ఒకటే. ఎవరైనా వచ్చి కథ చెబితే.. అది అర్థవంతంగా అనిపిస్తే చేసేయాలి. ఆ తర్వాత తెరపై మన పని మాట్లాడుతుంది. ప్రేక్షకులే మనల్ని గుర్తిస్తారు. నేను తమిళంలో 'బాయ్స్'తో విజయాన్ని అందుకున్నాక తెలుగులో 'సత్యం' చేశాను. నిజానికి దాన్ని ఒప్పుకున్నప్పుడు చాలా మంది 'ఆ సినిమా చేయొద్ద'ని సలహా ఇచ్చారు. 'బాయ్స్'లో చేసిన యూత్‌ఫుల్ పాత్రలే చేస్తే మేలన్నారు. కానీ, నేను నా మనసు మాట విని ఆ చిత్రం చేశాను. అది విడుదలయ్యాక మంచి విజయాన్ని అందుకుంది".

☛ "కోట శ్రీనివాసరావు నటనకు నిలయం లాంటి వారు. 'బొమ్మరిల్లు' చేసే సమయంలో ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నా. ఆయనతో పాటు ప్రకాశ్‌రాజ్ లాంటి వారితో కలిసి నటించడం నా అదృష్టం. ఇప్పుడా చిత్రాలు చూస్తుంటే 'ఇంత పెద్ద నటులతోనా నేను చేసింది' అనిపిస్తుంది. 'ఆర్‌ఆర్‌ఆర్‌'లో రామ్‌చరణ్‌ను చూసినప్పుడు ఈ అబ్బాయితోనా నేను 'ఆరెంజ్' చేసింది అనుకున్నా. ఎన్టీఆర్ అద్భుతమైన నటుడు. మూడు పేజీల డైలాగ్ ఉన్నా.. ఇలా చూసి అలా చెప్పేస్తారు. అలాగే అల్లు అర్జున్‌లో మంచి ఎనర్జీ ఉంటుంది".

భాష కారణంగా ఎప్పుడూ ఇబ్బందులు ఎదుర్కోలేదు



మాధవన్

ఇటీవలే విడుదలైన 'ఆప్ జైసా కోయి' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరిస్తున్నారు నటుడు ఆర్ మాధవన్. ఈ నేపథ్యంలోనే తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో భాషా వివాదంపై వేసిన ప్రశ్నకుగానూ మాధవన్ తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. 'ఇన్నేళ్ల నా కెరీర్‌లో భాష కారణంగా నేను ఎప్పుడు ఇబ్బందులు ఎదుర్కోలేదు. అలాంటి అనుభూతిని ఎప్పుడూ అనుభవించలేదు. నేను తమిళం, హిందీ రెండూ మాట్లాడతాను. అలానే కొల్హాపూర్‌లో చదువుకున్నాను. అలా మరాఠీ కూడా నేర్చుకున్నాను. అందుకే భాష కారణంగా నాకు ఎప్పుడూ ఎలాంటి సమస్య రాలేదు'' అని అన్నారు. వివిధ ప్రాంతాల్లో విభిన్న సంస్కృతులు ఉంటాయని మాధవన్ అన్నారు. ఇటీవల జరిగిన కొన్ని ఇంటర్వ్యూలలో భాషా వివాదంపై మాధవన్ కంటే ముందుగా కొందరు సెలబ్రిటీలను ఈ అంశంపై తమ అభిప్రాయాలను పంచుకోవాలని అడిగారు. కానీ వారు దాని గురించి మాట్లాడడానికి నిరాకరించారు. మహారాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలో మరాఠీ, ఇంగ్లీషుతో పాటు హిందీని మూడో భాషగా బోధించడం ప్రారంభించాలని కోరినప్పుడు ఈ భాషా వివాదం ప్రారంభమైంది.

మండల వెనక మిస్టరీని తెలుసుకుంటా!



'మండలా మర్డర్స్'

బాలీవుడ్ నటి వాణీ కపూర్ కీలకపాత్రలో నటిస్తున్న క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ 'మండలా మర్డర్స్'. గోపి పుత్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. యశ్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తోంది. మిస్టరీ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సిరీస్ ఈ నెల 25 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ ట్రైలర్ చరణ్‌దాస్‌పూర్‌లో జరిగిన హత్యల నేపథ్యంలో సాగుతోంది. ఇందులో వాణీకపూర్ శక్తిమంతమైన పోలీసు ఆఫీసర్ పాత్రలో కనిపిస్తూ.."ఈ మండల వెనుక ఉన్న మిస్టరీని ఛేదించే వరకూ నేను ఆగను'' అంటూ ఆసక్తిని రేకెత్తిస్తోంది. థ్రిల్‌ని పంచే సన్నివేశాలతో, కారణం తెలియని హత్యలతో సాగుతున్న ఈ ట్రైలర్ ఆద్యంతం మిస్టరీ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంది.

ఇది హారర్ చిత్రం కాదు..కానీ!



ప్రవీణ

'కేరాఫ్ కంచర పాలెం', 'ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య' లాంటి విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకుల్ని మెప్పించిన నిర్మాత ప్రవీణ పరుచూరి. ఇప్పుడామె 'కొత్తపల్లిలో ఒకప్పుడు' చిత్రంతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. మనోజ్ చంద్ర, మోనికా ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా రానా దగ్గుబాటి సమర్పణలో ఈ నెల 18న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శక నిర్మాత ప్రవీణ మాట్లాడుతూ.. ' 'అందరూ అనుకున్నట్లు ఇది హారర్ చిత్రం కాదు. కాకపోతే దీంట్లో ఓ చిన్న సూపర్ నేచురల్ అంశం ఉంది. మనకు చాలా మంది గ్రామ దేవతలు ఉన్నారు. వాటిపై మనలో చాలా మందికి విశ్వాసం, నమ్మకం ఉంటుంది. ఈ సినిమాలో అలాంటి ఓ నమ్మకాన్ని న్యూట్రల్‌గా చూపించనున్నాం. దీని స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది'' అన్నారు.



టీజే అరుణాచలం, జననీ, రాశి

వాస్తవ సంఘటనలతో...

సహజమైన ప్రేమ కథతో తెరకెక్కించిన 'ఉసురే' ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోతుందని చెప్పారు నవీన్ డి.గోపాల్. ఆయన దర్శకుడిగా... టీజే అరుణాచలం, జననీ కునశీలన్ జంటగా తెరకెక్కిన చిత్రమిది. సీనియర్ నటి రాశి కీలక పాత్ర పోషించారు. మౌళి ఎం.రాధాకృష్ణ నిర్మాత. ఈ చిత్రం ఆగస్టు 1న రానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం ట్రైలర్‌ని విడుదల చేసింది. దర్శకుడు మాట్లాడుతూ "యదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కించిన ప్రేమకథ ఇది'' అన్నారు. రాశి వ్యతిరేక ఛాయలతో కూడిన పాత్రలో నటించినట్టు ట్రైలర్‌ని బట్టి అర్థమవుతోంది.

మరోసారి ప్రేమలో..



వనిత

రమణ సాకే హీరోగా తెరకెక్కిన చిత్రం 'ప్రేమలో రెండోసారి'. వనిత గౌడ కథానాయిక. ఈ సినిమాకి సత్య మార్క దర్శకత్వం వహించారు. సాకే నీరజ లక్ష్మీ నిర్మిస్తున్న ఈ సినిమాకి సంబంధించిన ఫస్ట్ లుక్‌ను ఇటీవల నిర్మాత సి.కల్యాణ్ విడుదల చేశారు. హీరో మాట్లాడుతూ "సినిమా చాలా బాగా వచ్చింది. మా దర్శకుడు సత్య మార్క ఈ ట్రెండ్‌కి తగ్గట్టు చాలా అద్భుతంగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు. ఇందులో నా పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. నేటి యువతీ యువకులకు బాగా కనెక్ట్ అవుతుంది'' అని అన్నారు. ఈ సినిమాలో జబర్దస్త్ శ్రీను, ఫణి, బాబీ, దుర్గారావు, రాణి, చిరంజీవి విక్టర్, సతీశ్ సారపల్లి తదితరులు నటించారు.

1980ల నాటి పరిస్థితుల్ని కళ్లకు కట్టేలా!



ఆర్.విక్రమ్, శ్రీలు

తెలంగాణలోని ఒక మారుమూల ప్రాంతం ఇతివృత్తంగా... మనుషుల్లోని ప్రేమ, పగ, ఈర్ష్య, అసూయ, ద్వేషం చుట్టూ సాగే కథతో 'ప్రభుత్వ సారాయి దుకాణం' చిత్రాన్ని తెరకెక్కించినట్టు తెలిపారు నరసింహ నంది. ఆయన దర్శకత్వంలో... ఆర్.విక్రమ్, సదన్ హాసన్, వినయ్, అదితి మైఖేల్, శ్రీలు దాసరి, మోహన సిద్ధి ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రమిది. దైవ నరేశ్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మాతలు. ఈ సినిమా ఫస్ట్‌లుక్ విడుదల కార్యక్రమం ఇటీవల హైదరాబాద్‌లో జరిగింది. నిర్మాత టి.ప్రసన్నకుమార్, దర్శకుడు సముద్ర, నటుడు పృథ్వీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నిర్మాతలు మాట్లాడుతూ "1980 నేపథ్యంలో సాగే కథ ఇది. నాటి పరిస్థితులు, పరిణామాల్ని కళ్లకు కడుతూ దర్శకుడు నరసింహ నంది చిత్రాన్ని తీర్చిదిద్దిన విధానం చాలా బాగుంది" అన్నారు.

ఈ ఆటలో ఎవరినీ నమ్మలేం



సిరీస్: 'లో లైఫ్'
నటీనటులు: ర్యు సెయుంగ్-ర్యోంగ్, యాంగ్ సే-జోంగ్
విడుదల: బుధవారం
ప్లాట్‌ఫామ్: జియో హాట్‌స్టార్

కథాంశం: అత్యాశ మనిషిని ఎంతకైనా దిగజారుస్తుంది. తప్పుడు దారి పట్టేలా చేస్తుంది. ఇప్పుడిలానే తక్కువ సమయంలోనే ఎక్కువ డబ్బు సంపాదించాలని అనుకుంటున్నారు ఓ ఇద్దరు వ్యక్తులు. తమ జీవితాలను మార్చుకోవాలనే ఆశతో నిధిని వెతుక్కుంటూ బయలు దేరారు. ఎవరా వ్యక్తులు? ఆ నిధి ఎక్కడిది? అనేది తెలుసుకోవాలంటే 'లో లైఫ్' సిరీస్ చూడాల్సిందే. కాంగ్ యున్ సంగ్ దర్శకత్వం వహించారు. ఈ పీరియాడిక్ డ్రామాలో ర్యు సెయుంగ్-ర్యోంగ్, యాంగ్ సే-జోంగ్, కిమ్ సంగ్-ఓహ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇందులో ర్యు సెయుంగ్.. గ్యాన్ సియోక్ పాత్రలో.. హీ-డాంగ్‌గా యాంగ్‌సే కనిపించనున్నారు. వీరిద్దరూ మామ అల్లుళ్లు. చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంటారు. ఈ క్రమంలోనే భారీ సంపదతో నిండిన ఓ ఓడ సముద్రంలో మునిగిపోయిందనే వార్తలు వస్తుంటాయి. దీంతో ఆ నిధి అంతా దక్కించుకొని ధనవంతులు కావాలని ఆశపడతారు ఆ ఇద్దరూ. ఆ తర్వాత ఏమైందనేదే ఈ సిరీస్ కథాంశం. మరి 'ఈ ఆటలో ఎవరినీ నమ్మలేం' అంటోన్న 'లో లైఫ్' కథేంటో మీరూ చూసెయ్యండి.



పేరెంటింగ్ వీడియోలు చూసి పిల్లల్ని పెంచే ఓ తండ్రి కథ



సిరీస్: కేటలాగ్
నటీనటులు: మొహమ్మద్ ఫర్రాగ్, రిహామ్ అబ్దేల్ గఫూర్
విడుదల: గురువారం
ప్లాట్‌ఫామ్: నెట్‌ఫ్లిక్స్

కథాంశం: భార్యా...భర్త...ఇద్దరు పిల్లలు..ఇలా ఒక అందమైన కుటుంబం. అనుకోని పరిస్థితుల్లో భార్య అమీనా (రిహామ్ అబ్దేల్ గఫూర్) చనిపోతుంది. పిల్లలు తల్లి మీద బెంగ పెట్టుకుంటారు. భార్య చనిపోయాక పిల్లల్ని చూసుకోవడం భర్త యూసఫ్(మొహమ్మద్ ఫర్రాగ్)కు ఇబ్బందిగా మారుతుంది. అమీనా ఉన్నప్పుడు పిల్లలకు అన్నీ సక్రమంగా జరిగాయి. చాలామంది తండ్రుల మాదిరిగానే, యూసఫ్ తన పిల్లల్ని ప్రేమిస్తాడు. కానీ వాళ్లని పెంచడం, స్కూల్‌కి తయారు చేసి పంపడం, బాధ్యత తీసుకోవడం కష్టం అవుతుంది. పనిలో పడి పిల్లల్ని సరిగా పట్టించుకోడు. దాంతో పిల్లలు అలుగుతారు. అతని కూతురు తండ్రితో నా జీవితంలో ఇదే నా చెత్త పుట్టిన రోజు చేసుకోవడం అంటుంది. ఆ పిల్లలు తండ్రితో సరిగా ఉండరు. అది అర్థం చేసుకుని తండ్రి వాళ్లతో సమయం గడపడానికి చాలా ప్రయత్నాలు చేస్తుంటాడు. మంచి తండ్రిగా ఉండటానికి ఏం చేయాలా అని ఆలోచిస్తుంటాడు. అలాంటి పరిస్థితుల్లో తన భార్య చనిపోయే ముందు రికార్డ్ చేసిన పేరెంటింగ్ వీడియోలు దొరుకుతాయి. వాటిని అనుసరిస్తూ పిల్లల్ని పెంచుతాడు ఆ తండ్రి. మరి ఆ పేరెంటింగ్ వీడియోలు అతడికి ఉపయోగపడ్డాయా? లేదా తెలియాలంటే ఎల్ హాలా ఫావీ దర్శకత్వం వహించిన 'కేటలాగ్' సిరీస్ చూడాల్సిందే.

జెండా పండుగకు 'టెహ్రాన్'?



మానుషి చిల్లర్

వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకుల్ని మెప్పిస్తోంది కథానాయిక మానుషి చిల్లర్. ఆమె, బాలీవుడ్ విలక్షణ నటుడు జాన్ అబ్రహం ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'టెహ్రాన్'. అరుణ్ గోపాలన్ దర్శకత్వం వహించారు. పొలిటికల్ థ్రిల్లర్ నేపథ్యంలో దీన్ని తీర్చిదిద్దుతున్నారు. తాజాగా ఈ సినిమాను ఆగస్టులో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. "కొన్ని కారణాల వల్ల ఇప్పటికే పలుమార్లు వాయిదా పడింది. ఎట్టకేలకు ఈ సినిమాను ఆగస్టులో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఓటీటీలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించుకుంది చిత్రబృందం. త్వరలో ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించనున్నార"ని మానుషి సన్నిహిత వర్గాలు తెలిపాయి. వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాను మడాక్ ఫిల్మ్స్ నిర్మిస్తోంది.



ఈనాడు బిజినెస్



కియా కారెన్స్ క్లేవిస్ ఈవీ

ధరల శ్రేణి రూ.17.99-24.49 లక్షలు

404-490 కిలోమీటర్ల ప్రయాణం

దిల్లీ: దేశీయంగా తొలిసారిగా ఉత్పత్తి చేసిన తన విద్యుత్ వాహనం కారెన్స్ క్లేవిస్ ఈవీని కియా ఇండియా మంగళవారం విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం ప్లాంట్‌లో వీటిని ఉత్పత్తి చేస్తున్నారు. రెండు బ్యాటరీ ఎంపికల్లో ఇవి లభిస్తున్నాయి. ఒకసారి ఛార్జింగ్‌తో 42 కిలోవాట్ అవర్ బ్యాటరీతో 404 కి.మీ., 51.4 కిలోవాట్ అవర్ బ్యాటరీతో 490 కి.మీ. (ఏఆర్ఏఐ ధ్రువీకరణ) వరకు ప్రయాణించొచ్చని కంపెనీ వెల్లడించింది. వీటి ధరల శ్రేణి రూ.17.99-24.49 లక్షలు. ఫాస్ట్ ఛార్జింగ్‌తో ఈ మోడళ్లు 39 నిమిషాల్లోనే 10-80 శాతం రీఛార్జ్ అవుతాయని కంపెనీ తెలిపింది. 7-సీట్లతో అడాస్ లెవెల్ 2, ఇతర 20 ఫీచర్లు ఈ మోడళ్లలో ఉన్నాయని కియా ఇండియా ఎండీ, సీఈఓ గ్వాంగూ లీ వెల్లడించారు.

డీమ్యాట్ ఖాతాలు 19.4 కోట్లు

ముంబయి: క్యాపిటల్ మార్కెట్లలో రిటెయిల్ మదుపర్ల భాగస్వామ్యం పెరిగిందని సెబీ తెలిపింది. ఈ విభాగంలో డీమ్యాట్ ఖాతాలు 2019లో 3.6 కోట్లుగా ఉండగా, 2025 నాటికి 19.4 కోట్లకు పెరిగాయని సెబీ ఉన్నతాధికారి రుచి ఛోజెర్ తెలిపారు. ఇదే సమయంలో కంపెనీల్లో దేశీయ సంస్థాగత మదుపర్ల వాటా 13% నుంచి 20 శాతానికి పెరిగింది. విదేశీ సంస్థాగత మదుపర్ల వాటా 22% నుంచి 17 శాతానికి తగ్గింది. గత పక్షంలో దేశీయ కంపెనీలు ఈక్విటీ, రుణాల రూపేణ రూ.93 లక్షల కోట్లు సమీకరించాయి. 2024-25లో ఈక్విటీల ద్వారా రూ.4.3 లక్షల కోట్లు సమీకరించాయి. ఇందులో రూ.1.7 లక్షల కోట్లు ఐపీఓలవే.

4 నెలల కనిష్ఠానికి వాణిజ్య లోటు

దిల్లీ: జూన్‌లో మన దేశ ఎగుమతులు 35.14 బిలియన్ డాలర్ల వద్ద స్తబ్దుగా నమోదయ్యాయి. అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితులు ఇందుకు కారణమయ్యాయి. 2024 జూన్‌లో ఎగుమతులు 35.16 బి.డాలర్లు కావడం గమనార్హం. ఇదే సమయంలో దిగుమతులు కూడా 3.71% తగ్గి 53.92 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ముడిచమురు, పసిడి దిగుమతుల్లో క్షీణత నమోదైన ఫలితంగా వాణిజ్య లోటు 4 నెలల కనిష్ఠమైన 18.78 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

✦ గత నెలలో కీలక ఎగుమతి రంగాలైన పెట్రోలియం, దుస్తులు, రత్నాభరణాలు, తోళ్లు, ముడి ఇనుము, నూనె గింజలు, జీడిపప్పు, సుగంధ ద్రవ్యాలు, పొగాకు, కాఫీ ప్రతికూల వృద్ధిని నమోదుచేశాయి. ఇంజినీరింగ్, టీ, బియ్యం, రెడీమేడ్ దుస్తులు, రసాయనాలు, సముద్ర, ఫార్మా ఉత్పత్తులు మాత్రం సానుకూల వృద్ధి సాధించాయి.

కోడి గుడ్డు

16న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100 గుడ్ల రూపాయలలో)

హైదరాబాద్	510
వరంగల్	512
విజయవాడ	515
గోదావరి	496
విశాఖపట్నం	540
చిత్తూరు	583

టెస్లా వై వచ్చేసింది



ప్రారంభ ధరలు రూ.59.89-67.89 లక్షలు

● ఒక ఛార్జింగ్‌తో 500-622 కి.మీ. ప్రయాణానికి వీలు ● ముంబయిలో తొలి షోరూం ప్రారంభం

ముంబయి: అంతర్జాతీయ విద్యుత్ కార్ల దిగ్గజం టెస్లా మనదేశంలో అధికారికంగా విక్రయాలకు శ్రీకారం చుట్టింది. ఇక్కడి బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ)లో టెస్లా ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ మంగళవారం ప్రారంభించారు. అమెరికా కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన టెస్లా, మధ్యశ్రేణి ఎస్‌యూవీ 'మోడల్ వై' కారును ఇక్కడ ఆవిష్కరించింది. చైనా (షాంఘై)లోని తమ ప్లాంటులో పూర్తిగా తయారైన కారును (కంప్లీట్లీ బిల్ట్ యూనిట్-సీబీయూ) దిగుమతి చేసుకుని, ఇక్కడ విక్రయిస్తున్నారు. ఇది సెల్ఫ్ డ్రైవింగ్ మోడల్ కారు కాదు. ముంబయిలో అయిదేళ్లకు లోధా లాజిస్టిక్స్‌లో 24,565 చ.అ. గిడ్డంగిని టెస్లా లీజుకు తీసుకుంది.

రెండు వేరియంట్లలో..

ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యధికంగా విక్రయమైన విద్యుత్తు కారుగా ఉన్న 'మోడల్ వై'ని రెండు వేరియంట్లలో మనదేశంలో విక్రయించనున్నారు. రేర్-వీల్ డ్రైవ్ వేరియంట్ ధర రూ.59.89 లక్షల నుంచి ప్రారంభం అవుతుంది. ఒక ఛార్జింగ్‌తో 500 కి.మీ. ప్రయాణించొచ్చు. మరింత ఎక్కువ దూరం ప్రయాణించగలిగే లాంగ్ రేంజ్ రేర్ వీల్ డ్రైవ్ ప్రారంభ ధర రూ.67.89 లక్షలుగా ఉంది. ఒక ఛార్జింగ్‌తో 622 కి.మీ. పయనించొచ్చు. ఈ రెండు వేరియంట్ల డెలివరీలు వరుసగా ఈ ఏడాది మూడో, నాలుగో త్రైమాసికం నుంచి మొదలవుతాయి. తొలుత దిల్లీ, ముంబయి, గురుగ్రామ్‌లలో ఈ వాహనాల డెలివరీ, రిజిస్ట్రేషన్ ఉంటుంది. వినియోగదార్లు కావాలంటే ఎక్స్‌టీరియర్, ఇంటీరియర్, ఇతర ఫీచర్లను తమకు ఇష్టమైనట్లు మార్చుకునే వీలు టెస్లా డిజైన్ స్టూడియోలో ఉంది.

అమెరికా ధర కంటే దాదాపు రెట్టింపు

ప్రస్తుతం భారత తయారీ సంస్థలు టాటా మోటార్స్, మహీంద్రా అందిస్తున్న విద్యుత్తు కార్ల ధరలు రూ.30 లక్షల్లోపే ఉన్నాయి. అమెరికాలో మోడల్ వై లాంగ్ రేంజ్ రేర్ వీల్ డ్రైవ్ వేరియంట్ ధర 37,490 డాలర్లు (దాదాపు రూ.32 లక్షలు)గా ఉంది. దిగుమతి సుంకాల కారణంగా మన వద్దకు వచ్చేసరికి ఈ కారు ధర దాదాపు రెట్టింపైంది. మనదేశంలోకి దిగుమతి చేసుకుంటున్న కారు ధర 40,000 డాలర్లకు మించితే 100% సుంకం, ఆ పరిమితిలోపైతే 70% దిగుమతి సుంకం వర్తించడమే ఇందుకు కారణం.

వివిధ దేశాల్లో మోడల్ వై ధరలు ఇలా

దేశం	ప్రారంభ ధర
అమెరికా	37,490 డాలర్లు (దాదాపు రూ.32 లక్షలు)
చైనా	2,63,500 యువాన్ (సుమారు రూ.31.57 లక్షలు)
జర్మనీ	45,970 యూరోలు (దాదాపు రూ.46.03 లక్షలు)
బ్రిటన్	44,990 యూరోలు (సుమారు రూ.45.05 లక్షలు)

ఇక్కడ తయారీ చేపట్టాలి

భారత్‌లో పరిశోధన-అభివృద్ధి (ఆర్ అండ్ డీ), తయారీ కేంద్రాలను టెస్లా ఏర్పాటు చేయాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. తమ రాష్ట్రాన్ని ఒక భాగస్వామిగా పరిశీలించాలనీ విజ్ఞప్తి చేశారు.

✦ మనదేశంలో విద్యుత్ కార్ల తయారీని ప్రోత్సహించేందుకు కేంద్రప్రభుత్వం గతంలో నిర్ణయాలు తీసుకుంది. విదేశీ సంస్థలు 8,000 వరకు కార్లను 70-100% బదులుగా 15% దిగుమతి సుంకంతోనే ఇక్కడ విక్రయించుకునేందుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. అయితే కనీసం రూ.4,150 కోట్ల పెట్టుబడులతో స్థానికంగా తయారీ చేపట్టాలన్న షరతును పాటించాలి.

✦ భారత్‌లో షోరూంలను ఏర్పాటు చేయడంపైనే టెస్లా ఆసక్తిగా ఉందని, తయారీపై ఆసక్తి కనబరచడం లేదని కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి హెచ్‌డీ కుమారస్వామి గత నెలలో పేర్కొన్నారు. ఐరోపా, చైనాల్లో ఇతర సంస్థల నుంచి తీవ్ర పోటీ కారణంగా, తమ విక్రయాలు తగ్గిన తరుణంలో టెస్లా భారత్‌లోకి అడుగుపెట్టడం గమనార్హం.

స్పామ్‌ను గుర్తించేందుకు

ఎస్ఎంఎస్ హెడర్లపై సఫిక్స్‌లు

దిల్లీ: మొబైల్ వినియోగదారులకు వచ్చే ఎస్ఎంఎస్‌ల్లో సరైనవేవో, అవాంఛితమైనవి (స్పామ్) ఏవో గుర్తించే సౌలభ్యాన్ని టెలికాం ఆపరేటర్లు తీసుకొచ్చారు. ఎస్ఎంఎస్ పంపే వారి పేరు లేదా హెడర్‌కు ముందు సఫిక్స్‌లు ఇస్తున్నాయని సెల్యులార్ ఆపరేటర్ల సంఘం కాయ్ తెలిపింది. 'ఎస్ఎంఎస్ హెడర్లపై ప్రమోషనల్ ('పి'), సేవలకు సంబంధించిన ('ఎస్'), లావాదేవీల ('టీ'), ప్రభుత్వ ('జి') కమ్యూనికేషన్స్‌పై సఫిక్స్‌లను అన్ని టెలికాం సేవల ప్రొవైడర్లు తీసుకొచ్చాయ'ని కాయ్ డైరెక్టర్ జనరల్ ఎస్‌పీ కొచ్చర్ తెలిపారు. వినియోగదారులు తమకు వచ్చే సందేశాల స్వభావాన్ని సులభంగా గుర్తించేందుకు ఇవి దోహదపడతాయన్నారు. ప్రజలను మోసగించేందుకు ఓవర్ ది టాప్/ఇంటర్నెట్ మెసేజింగ్ యాప్స్ మార్గాలను మోసగాళ్లు ఎంచుకుంటున్నారని కాయ్ ఆందోళన వ్యక్తం చేసింది. ఫలితంగా స్పామ్ లేదా మోసపూరిత మెసేజ్‌లపై కఠిన చర్యలు చేపడుతున్న లక్ష్యం నెరవేరదని భావన ఉంది.

ఎన్‌హెచ్ఐటీ పెట్టుబడుల్లో

ఎస్‌బీఐ ముందు చూపు

ముఖ్య రుణదాత హోదా ఇవ్వాలని ఎన్‌హెచ్ఏఐకి విజ్ఞప్తి

దిల్లీ: నేషనల్ హైవేస్ ఇన్‌ఫ్రా ట్రస్ట్ (ఎన్‌హెచ్ఐటీ)లో తమ పెట్టుబడుల విషయంలో సీనియర్ క్రెడిటర్ (ముఖ్య రుణదాత) హోదా ఇవ్వాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ)ను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కోరినట్లు సమాచారం. ఒక వేళ రుణ ఎగవేత లేదా లిక్విడేషన్ సందర్భాలు ఎదురైనప్పుడు, రీపేమెంట్లపై ముందస్తు హక్కులను పొందడానికి ఈ హోదా పనికి వస్తుందన్నది ఎస్‌బీఐ ఉద్దేశం. ఎన్‌హెచ్ఏఐకి చెందిన ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్)లను మేనేజింగ్ ఎన్‌హెచ్ఐటీ ఉంది. ఇన్విట్‌ల ద్వారా తన రోడ్డు ఆస్తులను నగదీకరించుకుని, రూ.20,000 కోట్లు సమీకరించాలన్న ప్రణాళిక ఎన్‌హెచ్ఏఐకి ఉన్న నేపథ్యంలో.. ఎస్‌బీఐ ఈ అడుగు వేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. 2020 నుంచి నాలుగు దశల ఇన్విట్ ద్వారా రూ.46,000 కోట్లను ఎన్‌హెచ్ఏఐ ఇప్పటికే సమీకరించింది.

ఆస్ట్రా జెనెకా నుంచి బ్లాడర్ కేన్సర్ ఔషధం

దిల్లీ: మజిల్ ఇన్‌వేసివ్ బ్లాడర్ కేన్సర్ (ఎంఐబీసీ) చికిత్సలో వినియోగించే దుర్వాలుమ్యాబ్ సొల్యూషన్ ఔషధాన్ని దిగుమతి చేసుకుని, మనదేశంలో విక్రయించడానికి ఆస్ట్రా జెనెకా ఫార్మా ఇండియా అనుమతి సంపాదించింది. సీడీఎస్‌సీఓ (సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్) దీనికి అనుమతి ఇచ్చినట్లు కంపెనీ వెల్లడించింది. జెమ్‌సిటబైన్, సిస్‌ప్లాటిన్ మందులతో కలిసి దుర్వాలుమ్యాబ్‌ను ఎంఐబీసీ బాధితులకు చికిత్సలో వినియోగిస్తున్నారు. కొత్త మందులను స్థానికంగా అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆస్ట్రాజెనెకా ఫార్మా ఇండియా ఎండీ ప్రవీణ్ అక్కినేపల్లి వివరించారు. ప్రపంచవ్యాప్తంగా కేన్సర్ వ్యాధిన బారిన పడే వారిలో ఎంఐబీసీ రోగులు ఎంతో అధికం. ప్రపంచవ్యాప్తంగా 2022లో 6 లక్షల మందికి కొత్తగా ఈ వ్యాధి రాగా, 2.2 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. మనదేశంలో ఆ ఏడాదిలో 22,500 మందికి ఎంఐబీసీ వ్యాధి నిర్ధారణ అవ్వగా, 12,000 మంది చనిపోయారు. దుర్వాలుమ్యాబ్‌ను మనదేశంలో నాన్-స్మాల్ సెల్ లంగ్ కేన్సర్, బిలియరీ ట్రాక్ట్ కేన్సర్, హెపటో సెల్యులార్ కార్సినోమా, ఎండోమెట్రియల్ కేన్సర్ చికిత్సల్లో వినియోగిస్తున్నారు.



5 లక్షల మంది ఉద్యోగార్థులకు శిక్షణ: ఇన్ఫోసిస్ ఫౌండేషన్

దిల్లీ: దేశంలో 5 లక్షల మంది ఉద్యోగార్థులకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ మంగళవారం ప్రకటించింది. 2030 నాటికి అర్థవంతమైన ఉపాధే లక్ష్యంగా, యువతకు శిక్షణ ఇవ్వడానికి తొలి దశలో రూ.200 కోట్లకు పైగా నిధులు వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. ఇందు కోసం ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డ్ లైవ్‌లీహుడ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. స్టెమ్, ఇతర రంగాల గ్రాడ్యుయేట్లు, అండర్ గ్రాడ్యుయేట్లకూ శిక్షణ ఇస్తారు. కృత్రిమమేధ (ఏఐ), మెషీన్‌లెర్నింగ్, డిజిటల్ మార్కెటింగ్, ఫైనాన్స్ అంశాల్లో ఈ శిక్షణ ఉంటుంది. సమర్థంగా సమయ నిర్వహణ, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూకు సిద్ధం అయ్యే మెళకువలూ నేర్పుతారు.

హైదరాబాద్‌లో టఫే పరిశోధనా కేంద్రం

చెన్నై: పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ క్రాప్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది సెమీ-ఎరిడ్ ట్రాపిక్స్ (ఇక్రిశాట్)తో, తమిళనాడు కేంద్రంగా పనిచేసే ట్రాక్టర్ల తయారీ సంస్థ ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్‌మెంట్ (టఫే) లిమిటెడ్ అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. సుస్థిర సాగు విధానాలు, భూసార పరిరక్షణ, నీటి సమర్థ నిర్వహణపై రైతులకు అవగాహన పెంచుతారు. ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ పనిముట్ల నిర్వహణ-సర్వీసింగ్‌లోనూ శిక్షణ ఇస్తారు.

అహ్మదాబాద్-లండన్ హీత్రూ మధ్య

వారానికి 3 విమాన సర్వీసులు

ముంబయి: అహ్మదాబాద్ నుంచి లండన్ గాట్విక్ మార్గంలో ప్రస్తుతం వారానికి 5 విమాన సర్వీసులు నడుపుతున్న ఎయిరిండియా.. వీటి స్థానంలో అహ్మదాబాద్ నుంచి లండన్ హీత్రూ విమానాశ్రయానికి వారానికి 3 విమాన సర్వీసులు నడపనుంది. ఈ మార్పులు ఆగస్టు 1 నుంచి సెప్టెంబరు 30 వరకు అమల్లో ఉంటాయి. జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ బయలుదేరిన విమానం క్షణాల్లోనే కుప్పకూలాక.. 'సేఫ్టీ పాజ్' కింద రద్దు చేసిన దేశీయ, అంతర్జాతీయ విమానాలను పాక్షికంగా పునరుద్ధరిస్తున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. అక్టోబరు 1 నుంచి సర్వీసుల పూర్తిస్థాయి పునరుద్ధరణ ఉంటుందని తెలిపింది. అమృత్‌సర్-లండన్ (గాట్విక్), గోవా (మోపా)-లండన్ (గాట్విక్), బెంగళూరు-సింగపూర్, పుణె-సింగపూర్ సేవల రద్దు సెప్టెంబరు 30 వరకు కొనసాగుతుందని వివరించింది.

బీమా కంపెనీల ఉల్లంఘనల పరిశీలనకు సంఘాల ఏర్పాటు

దిల్లీ: బీమా కంపెనీలు, ఇంటర్మీడియరీలు పాల్పడే నిబంధనల ఉల్లంఘనలను పరిశీలించే నిమిత్తం పూర్తి కాల సభ్యులతో బీమా నియంత్రణాధికార సంస్థ ఐఆర్‌డీఏఐ పలు సంఘాలను ఏర్పాటు చేసింది. 132వ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంగళవారం ఐఆర్‌డీఏఐ తెలిపింది.

18 నెలల కనిష్ఠానికి కార్ల టోకు విక్రయాలు



ముంబయి: పట్టణాలు, నగరాల్లో గిరాకీ నెమ్మదించడంతో.. ఈ ఏడాది జూన్‌లో కంపెనీల నుంచి కార్లను డెలివరీ తీసుకోవడంలో డీలర్లు ఆచితూచి వ్యవహరించారు. ఫలితంగా 18 నెలల కనిష్ఠానికి ఇవి పరిమితమయ్యాయి. 2024 జూన్‌లో 3,37,757 కార్లు డీలర్లకు సరఫరా కాగా, ఈసారి 7.4% తక్కువగా 3,12,849కి పరిమితమయ్యాయని వాహన తయారీదార్ల సమాఖ్య (సియామ్) వెల్లడించింది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం మొత్తంమీద చూస్తే 10,11,882 ప్రయాణికుల వాహనాలను (పీవీ-కార్లు, ఎస్‌యూవీలు, వ్యాన్లు) డీలర్లకు సరఫరా చేసినట్లు సియామ్ తెలిపింది. 2024-25 ఇదే కాలంలో సరఫరా చేసిన 10,26,006 పీవీలతో పోలిస్తే, ఇవి 1.4% తక్కువ. అయినా కూడా ఆర్థిక సంవత్సర తొలి త్రైమాసికంలోనే 10 లక్షలకు పైగా పీవీల టోకు విక్రయాలు జరపడం వరుసగా ఇది రెండో ఏడాదని సియామ్ వివరించింది.

✦ పీవీల్లో బహుళ వినియోగ వాహనాల వాటా 66 శాతానికి పెరిగింది. 2024-25 ఇదే కాల విక్రయాల కంటే ఇది 3.8% ఎక్కువ. అయితే కార్ల విక్రయాలు 11.2% తగ్గాయి.

✦ ఎప్పుడు లేనంతగా పీవీలు ఈ త్రైమాసికంలో 2.04 లక్షలు ఎగుమతి అయ్యాయి. 2024-25 ఇదే కాల ఎగుమతుల కంటే ఇవి 13.2% ఎక్కువ.

✦ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును తగ్గించడం, వర్షపాత అనుకూలతలు, పండుగలు సమీపిస్తున్నందున.. కార్లు, ద్విచక్ర వాహనాలకు గిరాకీ పెరగొచ్చని సియామ్ అంచనా వేస్తోంది.

ఏప్రిల్-జూన్‌లో వాహనాల టోకు సరఫరాలు

వాహనం	2025	2024	వృద్ధి(%)
ద్విచక్ర	46,74,562	49,85,631	- 6.2
త్రిచక్ర	1,65,211	1,65,081	0.1
వాణిజ్య	2,23,215	2,24,575	- 0.6

చైనాకు ఏఐ చిప్‌ల విక్రయానికి ట్రంప్ ఆమోదం



ఎన్‌విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్

బ్యాంకాక్: కృత్రిమేధ(ఏఐ)ను అభివృద్ధి చేయడానికి వినియోగించే అత్యాధునిక హెచ్20 కంప్యూటర్ చిప్‌లను చైనాకు విక్రయించడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుమతి పొందినట్లు ఎన్‌విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ వెల్లడించారు. 'హెచ్20ల రవాణాకు లైసెన్సులు ఇవ్వడానికి అమెరికా ప్రభుత్వం అంగీకరించిందని ఇవాళ నేను ప్రకటిస్తున్నా' అంటూ బీజింగ్‌లో విలేకర్లతో హువాంగ్ పేర్కొన్నారు. ప్రపంచంలో సగం మంది ఏఐ పరిశోధకులు చైనాలోనే ఉన్నట్లు ఆయన గుర్తు చేశారు. 'అమెరికా కంపెనీలు.. వినూత్న, డైనమిక్ మార్కెట్ అయిన చైనాలో పోటీపడడం చాలా ముఖ్యమైన విషయమ'ని ఆయన అన్నారు. ఇటీవలే ట్రంప్‌తో పాటు అమెరికా ప్రభుత్వ ప్రతినిధులతో హువాంగ్ సమావేశమయ్యాక, ఈ పరిణామం చోటు చేసుకుంది. చైనా అధికారులు, సరఫరాదార్లనూ ఆయన కలిశారు. ఏఐని అందిపుచ్చుకోవడానికి కంపెనీలు పోటీ పడుతుండడంతో, అందులో ప్రధానమైన చిప్‌ల తయారీ కంపెనీ ఎన్‌విడియా భారీ లాభాలను అందుకుంటోంది. మార్కెట్ విలువ 4 లక్షల కోట్ల డాలర్లను అధిగమించిన తొలి కంపెనీగా ఎన్‌విడియా నిలిచింది.

133 దేశాలకు అరబిందో హెచ్ఐవీ ఔషధం

ఈనాడు, హైదరాబాద్: హెచ్ఐవీ చికిత్సలో వినియోగించే కాబోటెగ్రవిర్ ఇంజక్టబుల్ ఔషధాన్ని అరబిందో ఫార్మా 133 దేశాలకు సరఫరా చేయనుంది. ఈ జనరిక్ మందును అందించడానికి మెడిసిన్స్ పేటెంట్ పూల్ (ఎంపీపీ), వివ్ హెల్త్‌కేర్‌తో అరబిందో ఫార్మా వాలంటరీ లైసెన్సింగ్ ఒప్పందం కుదుర్చుకోనుంది. హెచ్ఐవీ బాధితులపై ఈ మందు ప్రభావం ఎక్కువ సమయం ఉంటుంది. రోజుకు ఒక ట్యాబ్లెట్ వేసుకోవడానికి బదులు కాబోటెగ్రవిర్ ఇంజెక్షన్‌ను నెలకోసారి లేదా రెండు నెలలకోసారి తీసుకుంటే సరిపోతుంది. ఈ మందును ప్రపంచ వ్యాప్తంగా అందించడం ద్వారా ఎక్కువ మంది బాధితులకు ఉపశమనం కలిగించొచ్చని అరబిందో ఫార్మా వైస్‌ఛైర్మన్, ఎండీ కె.నిత్యానందరెడ్డి వివరించారు. హెచ్ఐవీ ఔషధాల విభాగంలో వివ్ హెల్త్‌కేర్ ఎంతో క్రియాశీలకంగా ఉంది. ఈ కంపెనీలో జీఎస్‌కే, ఫైజర్, షియోనోగి అనే బహుళ జాతి ఫార్మా కంపెనీలు, మెడిసిన్స్ టాలెంట్ పూల్ ప్రధాన వాటాదార్లుగా ఉన్నాయి. హెచ్ఐవీ చికిత్సకు కాబోటెగ్రవిర్, రిల్‌పివిరైన్ మిశ్రమ ఔషధం బాగా పనిచేస్తుందని ఇటీవల ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సిఫారసు చేయడం గమనార్హం. ఈ నేపథ్యంలో కాబోటెగ్రవిర్ ఔషధాన్ని, దీంతో కూడిన మిశ్రమ ఔషధాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు ఫార్మా కంపెనీలు ప్రయత్నాలు చేపట్టాయి.

పాము పొడ నివారణకు ఫెలుజిత్: బేయర్

ఈనాడు, హైదరాబాద్: వరిలో పాము పొడ తెగులు నివారణ కోసం శిలీంధ్ర నాశిని ఫెలుజిత్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు బేయర్ వెల్లడించింది. వరి పండించే అన్ని రాష్ట్రాల్లో ఇది లభిస్తుందని పేర్కొంది. మొక్క అంతా విస్తరించడం ద్వారా తెగులును సమర్థంగా నిరోధిస్తుందని, దిగుబడి నాణ్యత పెంచేందుకు ఇది తోడ్పడుతుందని బేయర్ భారత క్రాప్ సైన్స్ విభాగం క్లస్టర్ కమర్షియల్ లీడ్ మోహన్ బాబు అన్నారు. లీటరు, 320 ఎంఎల్ పరిమాణంలో ఈ మందు లభిస్తుందని పేర్కొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ లాభం 546 కోట్లు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) మొదటి త్రైమాసికంలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ రూ.546 కోట్ల నికర లాభాన్ని నమోదుచేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.478 కోట్లతో పోలిస్తే ఇది 14.4% అధికం. నికర ప్రీమియం ఆదాయం రూ.12,509.62 కోట్ల నుంచి రూ.14,466 కోట్లకు వృద్ధి చెందింది.

✦ హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ నికర లాభం మొదటి త్రైమాసికంలో రూ.568 కోట్లుగా నమోదైంది. 2024-25 ఇదే కాల లాభం రూ.582 కోట్లతో పోలిస్తే, ఇది 2.4% తక్కువ. మొత్తం ఆదాయం రూ.2,387 కోట్ల నుంచి 14.2% వృద్ధితో రూ.2,726 కోట్లకు చేరింది. సంస్థ నిర్వహణలోని ఆస్తులు (ఏయూఎం) 14.7% అధికమై రూ.1,09,690 కోట్లకు చేరాయి

వరుస నష్టాల నుంచి ఊరట



ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.120 కోట్లు

డీఐఐ కొనుగోళ్లు: రూ.1,555 కోట్లు

సెన్సెక్స్ ▲ 317 — 82571

నిఫ్టీ ▲ 114 — 25196

సమీక్ష

సూచీలు 4 రోజుల వరుస నష్టాల నుంచి కాస్త కోలుకోవడంతో, మదుపర్లు స్వల్ప ఊరట చెందారు. వాహన, ఔషధ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడం సూచీలకు కలిసొచ్చింది. రిటెయిల్ ద్రవ్యోల్బణం ఆరేళ్ల కనిష్ఠానికి చేరడం సానుకూల ప్రభావం చూపింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 16 పైసలు లాభపడి 85.76 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 0.17% తగ్గి 69.09 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, హాంకాంగ్ సూచీలు లాభాల్లో ముగియగా, షాంఘై సూచీ డీలా పడింది. ఐరోపా మార్కెట్లు సానుకూలంగా కదలాడాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.68 లక్షల కోట్లు పెరిగి, రూ.460.33 లక్షల కోట్ల (5.36 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

✦ సెన్సెక్స్ ఉదయం 82,233.16 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,253.46) ప్రతికూలంగా ప్రారంభమైంది. తదుపరి 82,221.74 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. అనంతరం లభించిన కొనుగోళ్ల మద్దతుతో లాభాల్లోకి వచ్చిన సూచీ ఒక దశలో 82,743.62 పాయింట్ల గరిష్ఠాన్ని తాకింది. చివరకు 317.45 పాయింట్ల లాభంతో 82,570.91 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సైతం 113.50 పాయింట్లు పెరిగి 25,195.80 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,245.20-25,088.45 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 22 లాభపడ్డాయి. సన్ ఫార్మా 2.71%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.69%, టాటా మోటార్స్ 1.55%, ట్రెంట్ 1.48%, ఎం అండ్ ఎం 1.28%, బజాజ్ ఫైనాన్స్ 1.01%, ఎస్‌బీఐ 0.92%, ఇన్ఫోసిస్ 0.91%, టీసీఎస్ 0.89%, అదానీ పోర్ట్స్ 0.82%, టెక్ మహీంద్రా 0.71% చొప్పున పెరిగాయి. హెచ్‌సీఎల్ టెక్ 3.31%, ఎటెర్నల్ 1.57%, టాటా స్టీల్ 0.81%, కోటక్ బ్యాంక్ 0.68%, యాక్సిస్ బ్యాంక్ 0.67% నష్టపోయాయి.

✦ రంగాల వారీ సూచీలకొస్తే వాహన, ఆరోగ్య సంరక్షణ, ఎఫ్ఎంసీజీ, స్థిరాస్తి, సేవల రంగాలు రాణించాయి. యుటిలిటీస్ సూచీ ఒక్కటే డీలా పడింది. బీఎస్ఈలో 2,504 షేర్లు సానుకూలంగా, 1,558 షేర్లు ప్రతికూలంగా ముగిశాయి. 153 షేర్లలో మార్పు లేదు.

✦ అమెరికాకు చెందిన ఇన్‌సైట్ కార్పొరేషన్‌తో లెక్సెల్వి ఔషధానికి సంబంధించి పరిష్కార ఒప్పందం చేసుకోవడంతో సన్ ఫార్మా షేరు బీఎస్ఈలో 2.71% పెరిగి రూ.1,727.70 వద్ద ముగిసింది.

✦ జూన్ త్రైమాసికంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ నికర లాభం 9.7% తగ్గడంతో బీఎస్ఈలో షేరు 3.31% తగ్గి రూ.1,566.35 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.14,545 కోట్లు తగ్గి రూ.4,25,055 కోట్లకు పరిమితమైంది.

✦ అగ్రిబిజినెస్ రంగంలో డిజిటల్ పరివర్తన దిశగా అడుగులు వేసేందుకు, ఏఐ ఆధారిత సేవలు, కన్సల్టింగ్ సేవలు అందిస్తున్న విప్రోతో వ్యూహాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు క్రాపిన్ పార్ట్‌నర్స్ మంగళవారం ప్రకటించింది.

✦ మైగ్రేటెడ్ వెంచర్ క్యాపిటల్ ఫండ్స్ (వీసీఎఫ్) ద్వారా మూసివేత నిబంధనల ఉల్లంఘనలు పరిష్కరించడంలో సహాయ పడటానికి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఈ నెల 21 నుంచి సెటిల్‌మెంట్ పథకాన్ని ప్రకటించింది. 2026 జనవరి 19 నాటికి ఈ పథకం పూర్తవుతుందని సెబీ తెలిపింది.

✦ ప్రీమియం ఫ్లెక్సిబుల్ వర్క్‌స్పేస్ ఆపరేటర్ వుయ్‌వర్క్ ఇండియా మేనేజ్‌మెంట్ లిమిటెడ్, హెల్మెట్ల తయారీ సంస్థ స్టడ్స్ యాక్సెసరీస్ పబ్లిక్ ఇష్యూ ప్రతిపాదనలకు సెబీ ఆమోదం తెలిపింది.

✦ విటోల్ ఏషియా పీటీఈ లిమిటెడ్ నుంచి 10 లక్షల టన్నుల ద్రవరూప సహజ వాయువు (ఎల్ఎన్‌జీ)ను కొనుగోలు చేసేందుకు గ్యాస్ సేల్స్ అండ్ పర్చేజ్ అగ్రిమెంట్ (జీఎస్‌పీఏ)పై సంతకం చేసినట్లు ప్రభుత్వ రంగ సంస్థ గెయిల్ ఇండియా తెలిపింది. 2026 నుంచి పదేళ్ల పాటు ఈ ఒప్పందం అమల్లో ఉండనుంది.

✦ ఫిన్‌టెక్ సంస్థ ఇన్ఫీబీమ్ అవెన్యూస్ రూ.700 కోట్ల రైట్స్ ఇష్యూకు 1.4 రెట్ల స్పందన లభించింది.

✦ కున్‌షాన్ క్యూ టెక్ మైక్రోఎలక్ట్రానిక్స్ (ఇండియా)లో 51% వాటా కొనుగోలు చేసేందుకు బైండింగ్ టర్మ్‌షీట్‌పై సంతకం చేసినట్లు డిక్సన్ టెక్నాలజీస్ వెల్లడించింది.

నేటి బోర్డు సమావేశాలు

టెక్ మహీంద్రా, ఐటీసీ హోటల్స్, ఏంజెల్ వన్, ఎల్&టీ టెక్నాలజీ సర్వీసెస్, రిలయన్స్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కల్పతరు, డీబీ కార్ప్

ఏప్రిల్ - జూన్ త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్	302	225	8,503	7,875
ర్యాలీస్ ఇండియా	95	48	957	783
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	1,593	1,293	7,878	6,769
ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్	747	580	6,083	5,352
జస్ట్ డయల్	159.6	141.2	297.8	280.5
హిమాద్రీ స్పెషాలిటీ	183	123.45	1,100.42	1,199.77

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

హ్యూమన్ రిసోర్సెస్

సంస్థ: లెర్న్‌పడ్డీ
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, ఎంఎస్-ఆఫీస్, రిక్రూట్‌మెంట్, రెజ్యూమె స్క్రీనింగ్
స్టైపెండ్: రూ.5,000
https://shorturl.at/fecxX

మెడికో జర్నలిజం

సంస్థ: ద రైట్ డాక్టర్స్
నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం
స్టైపెండ్: రూ.5,000-10,000
https://shorturl.at/KFSE0

ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్

సంస్థ: వైట్ ఔల్ వెంచర్స్
నైపుణ్యాలు: ఫైనాన్షియల్ అనలిటిక్స్, ఫైనాన్షియల్ లిటరసీ, ఫైనాన్షియల్ మోడలింగ్, లింక్డ్ఇన్, సోషల్ మీడియా మార్కెటింగ్, మార్కెట్ రిసెర్చ్, ప్రజెంటేషన్ స్కిల్స్, రిపోర్ట్ రైటింగ్, రిసెర్చ్ అనలిటిక్స్
స్టైపెండ్: రూ.9,000-18,000
https://shorturl.at/qWNUu

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: బ్లాక్ బై బ్లాక్ సొల్యూషన్స్
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఫొటోషాప్, కేన్వా, గూగుల్ స్లైడ్స్, ఎంఎస్-పవర్ పాయింట్, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్, వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: రూ.6,000-10,000
https://shorturl.at/v9pzE

కంటెంట్ అండ్ సోషల్ మీడియా మార్కెటింగ్

సంస్థ: లుజో గిఫ్ట్స్
నైపుణ్యాలు: కంటెంట్ ఎడిటింగ్, కంటెంట్ రైటింగ్, గ్రాఫిక్ డిజైన్, మార్కెటింగ్ క్యాంపెయిన్స్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్
స్టైపెండ్: రూ.4,000-5,000
https://shorturl.at/ZhgKZ

రిక్రూట్‌మెంట్

సంస్థ: బిగ్ బుల్స్
నైపుణ్యం: ఇంగ్లిష్ మాట్లాడటం
స్టైపెండ్: రూ.6,000-20,000
https://shorturl.at/OoBhx

ఎకనామిక్స్/ పాలసీ రిసెర్చ్

సంస్థ: కొయన్ అడ్వైజరీ
నైపుణ్యాలు: ఎకనామెట్రిక్స్, ఎంఎస్-ఎక్సెల్, రిపోర్ట్ రైటింగ్, ఎస్‌టీఏటీఏ
స్టైపెండ్: రూ.5,000-6,000
https://shorturl.at/JKWxv

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: ఆగస్టు 8



అందరూ వెళ్లే దారి కాకుండా ఆసక్తి ఉన్న మార్గం ఎంచుకుంటే ఆశాభంగం ఎదురు కాదు. అవరోధాలు వచ్చినా ఎదురొడ్డే శక్తి లభిస్తుంది. స్వర్ణాభరణాల, వజ్రాల పరిశ్రమలోకి ప్రవేశించాలనే అభిరుచి ఉన్న యువత ముందుగా అందుకు అనుగుణమైన కోర్సులను అన్వేషించాలి. ఆపై కోర్సు పూర్తి చేసుకొని పసిడి కాంతులీనే ఈ పరిశ్రమలో ప్రవేశించేందుకు ఉద్యుక్తులు కావాలి!



నగల పరిశ్రమలో ఏయే హోదాలు?

మనదేశ స్వర్ణాభరణాల, వజ్రాల పరిశ్రమలో వైవిధ్యమైన ఉద్యోగావకాశాలున్నాయి. ఆభరణాల డిజైనింగ్ నుంచి తయారీ వరకూ, సేల్స్ నుంచి మార్కెటింగ్ వరకూ వివిధ దశల్లో ఏటా అవకాశాలు కొత్త కంపెనీల రాకతో పెరుగుతున్నాయి. జ్యూలరీ డిజైనర్స్, జెమాలజిస్టులు, జువెలర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, స్టోర్ మేనేజర్స్ ఖాళీల భర్తీ కోసం కంపెనీలు ఎదురుచూస్తున్నాయి. ఇవికాక కాడ్ (సీఏడీ) నిపుణుల అవసరమున్న కంపెనీలున్నాయి. గోల్డ్ జ్యూలరీ కంపెనీలు విస్తరణ పథంలో ఉండడంతో వీటిపై కోర్సులు చేసివున్న యువతను జోరుగా నియమించుకుంటున్నాయి.

సాంకేతిక ఉద్యోగాలు

జ్యూలరీ డిజైనర్: మారిన వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా వేర్వేరు ప్రాంతాల్లో షోరూమ్స్ నిర్వహిస్తున్న చెయిన్ స్టోర్స్ అధినేతలు వేల, లక్షల నగల డిజైన్లు అందుబాటులో ఉంచుతున్నారు. బ్యాంగిల్స్, నెక్లెస్‌లు, చైన్స్, పెండెంట్స్.. ఇలా ప్రతి ఒక్క బంగారు వస్తువుకూ ఒక్కో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి కస్టమర్లను ఆకట్టుకుంటున్నారు. అత్యధిక డిజైన్ల ఆభరణాలను ప్రదర్శించడం ఆకర్షణీయ వ్యూహం కావడంతో జ్యూలరీ డిజైనర్లకు డిమాండ్ ఏర్పడింది. క్యాడ్ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి కొత్త కొత్త డిజైన్లను సృష్టించగల యువతకు మంచి అవకాశాలున్నాయి. సాంకేతిక నైపుణ్యాలకు తోడు సృజనాత్మకత, వినియోగదారుల అభిరుచులను పసిగట్టగల సామర్థ్యం, మార్కెట్ ధోరణులను గ్రహించే సునిశిత పరిశీలన శక్తి అదనపు అర్హతలు.

బెంచ్ జువెలర్స్: విలువైన లోహాలు, రాళ్లపై డిజైన్ల నైపుణ్యాలను వీరు ప్రదర్శిస్తారు. సూక్ష్మస్థాయి డిజైన్లను సృష్టించే నైపుణ్యాలున్నవారిని ఈ తరహా కంపెనీలు కోరుకుంటున్నాయి. 'ఇది సాధ్యమేనా?' అంటూ అబ్బురపరచే అతి చిన్న డిజైన్లను చెక్కగల వారికి అవకాశాలు పుష్కలం. హస్తకళా సామర్థ్యం ఉంటే ఈ విభాగంలో రాణిస్తారు.

జెమాలజిస్ట్: ఆభరణాల పరిశ్రమలో అవసరమైన వజ్రాలు, రత్నాలను విశ్లేషించడం, వివిధ వర్గాలుగా విభజించడం, విలువను అంచనా వేయడం వీరికి ఉండాల్సిన కౌశలాలు. అత్యంత విలువైన రాళ్లతో పనిచేస్తారు కాబట్టి మదింపులో ఏ చిన్న పొరపాటు జరిగినా నష్టం భారీగా ఉంటుంది. అందువల్ల మంచి ప్యాకేజీ ఆఫర్ చేసే ఈ పొజిషన్లో సామర్థ్యం గరిష్ఠ స్థాయిలో ఉండాలి.

కటింగ్, షేపింగ్ నిపుణులు: వజ్రాలు, రత్నాలను అవసరమైన ఆకారంలో కటింగ్ చేసి కావలసిన రూపులోకి తీసుకురావడం, పాలిష్ చేసే నిపుణులు. బంగారు నగల్లో వజ్రాలూ, రత్నాలను పొదిగేందుకు వీరి సేవలు అవసరమవుతాయి.



ఇప్పటివరకూ ప్రస్తావించినవి సాంకేతికపరమైనవి. నగలు తయారయ్యాక వాటిని వినియోగదారుని చెంతకు తీసుకువెళ్లడం, విక్రయాల్లోకి మారే దశల్లో మరికొన్ని హోదాలు యువతకు అవకాశాలు కల్పిస్తున్నాయి.

ఇతర కొలువులు

ఇవి సాధారణమైనవే కానీ, సాదాసీదావి మాత్రం కావు. కంపెనీలకు బాగా ముఖ్యమైన పోస్టులు.

జ్యూలరీ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్: వర్క్‌షాపులో ఆభరణాలను ఎంత అద్భుతంగా తయారుచేసినా వాటిని వినియోగదారుల ముందు అందంగా ప్రజెంట్ చేయకపోతే ఉపయోగం ఏముంటుంది? జ్యూలరీ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ వినియోగదారులతో ప్రత్యక్షంగా వ్యవహరిస్తారు. కస్టమర్ అభిరుచి, అవసరం, సందర్భం అర్థం చేసుకొని అందుకు తగ్గట్టు ఆభరణాల మోడల్స్ చూపుతారు. అమ్మక ప్రక్రియలో లాఘవం మాత్రమే కాక ఆభరణాల గురించి తగిన పరిజ్ఞానం ఉంటేనే మంచి సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లుగా మనగలుగుతారు. వినియోగదారుల మనస్తత్వాన్ని అర్థం చేసుకోగలగడం అదనపు అర్హత.

స్టోర్ మేనేజర్: మేనేజ్‌మెంట్, ఉద్యోగులు, కస్టమర్లకు మధ్య అనుసంధానకర్తగా ఉంటూ అమ్మక లక్ష్యాలను చేరే హోదా ఇది. కొన్నేళ్లపాటు పరిశ్రమలో అనుభవం గడిస్తే ఈ పొజిషన్ రావచ్చు. కానీ జాతీయ స్థాయిలో పేరున్న కంపెనీలు వేగంగా కొత్త స్టోర్లను విస్తరిస్తున్నందున బిజినెస్ మేనేజ్‌మెంట్లో విద్యార్హతలతో పాటు మార్కెట్టుపై అవగాహన, త్వరగా నేర్చుకోగలిగే నైపుణ్యం ఉన్నా నేరుగా ఈ పొజిషన్ ఆఫర్ చేస్తున్నారు. మొత్తం స్టోర్ పర్యవేక్షణ, సేల్స్ తీరు, స్టాక్స్‌పై అవగాహన ఉండాలి. ఉద్యోగులు, వినియోగదారులతో సత్సంబంధాలు నెరపగలగాలి.

నాణ్యత నిర్ధరణ నిపుణులు: ఆభరణాల్లోని బంగారం నాణ్యతను పరీక్షిస్తారు. సాధారణంగా ఏ బంగారు షాపులోనైనా వినియోగదారులు తమ వద్ద ఉన్న పాత ఆభరణాలను తీసుకొచ్చి వాటిని మార్పిడి చేసి కొత్తవి కొనుగోలు చేస్తున్నందువల్ల పాత బంగారం నాణ్యతను పరీక్షించేందుకు వీరి సేవలు అవసరమవుతున్నాయి.

ఇవే కాక ఆయా షోరూమ్స్ స్వభావం, మేనేజ్‌మెంట్ దృక్పథాన్ని బట్టి వేర్వేరు ప్రత్యేక పొజిషన్లను ఆఫర్ చేస్తున్నారు. హోదా ఏమైనా అందుకు తగ్గ విద్యార్హతలు, నేర్చుకున్న నైపుణ్యాలు, నేర్చుకునే స్వభావం ఎలా ఉందన్నది ముందుగా పరిశీలిస్తారు.




- యస్.వి. సురేష్
సంపాదకుడు, ఉద్యోగ సోపానం

సాఫ్ట్‌వేర్ కొలువు సాధ్యమేనా?



15 ఏళ్ల కిందట బీఈ ఎలక్ట్రానిక్స్ చేశాను. వ్యక్తిగత కారణాల వల్ల ఉద్యోగం చేయలేదు. ఇప్పుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేయాలంటే ఏ కోర్సులు నేర్చుకోవాలి? ఈ 40 ఏళ్ల వయసులో సాధ్యమేనా? - మధు



■ ప్రస్తుత ఉద్యోగ మార్కెట్లో దాదాపు 70 శాతం మంది ఇంజినీరింగ్ పట్టభద్రులు కంప్యూటర్, ఐటీ, ఏఐ, ఎంఎల్, డేటా సైన్స్ రంగాలకు సంబంధించినవారే. చాలా ఐటీ ఉద్యోగాలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ద్వారానే భర్తీ అవుతున్నాయి. ఐటీ రంగంలో ఉద్యోగానుభవం లేకుండా నలభై ఏళ్ల వయసులో ఫ్రెషర్‌గా ఐటీ ఉద్యోగం పొందడం చాలా కష్టం. కానీ అసాధ్యం మాత్రం కాదు. మీరు ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తిచేశారు కాబట్టి కొంతకాలం కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ తీసుకొని ఉద్యోగ ప్రయత్నాలు చేయవచ్చు.

మొదటిగా మీకు ఆసక్తి ఉన్న రంగాన్ని గుర్తించండి. ఐటీ, డిజిటల్ మార్కెటింగ్, డేటా అనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ మీడియా లాంటి అనేక కోర్సులున్నాయి. కొన్ని ప్రత్యేకమైన నైపుణ్యాలు నేర్చుకుంటే వయసుతో సంబంధం లేకుండా మంచి అవకాశాలు దొరుకుతాయి. ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో ప్రభుత్వ సంస్థలందిస్తున్న స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌లు, ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించుకోండి. ఇంటర్నెట్ ద్వారా పని చేసే ఫ్రీలాన్సింగ్ అవకాశాలు, రిమోట్ ఉద్యోగాలు, యూట్యూబ్, బ్లాగింగ్ వంటి వాటి గురించీ ఆలోచించవచ్చు.

అవకాశం ఉంటే డేటా సైన్స్/ ఏఐ/ ఎంఎల్‌లలో ఎంటెక్ కానీ, కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీల్లో ఎంఎస్సీ కానీ, ఎంబీఏలో బిజినెస్ అనలిటిక్స్ కానీ చదివి ఉద్యోగ ప్రయత్నాలు చేయండి. పీజీ చదవడం వీలు కాకపోతే కింద పేర్కొన్న సాఫ్ట్‌వేర్ కోర్సుల గురించి ఆలోచించవచ్చు.

1. ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్: జావా, జావా స్క్రిప్ట్.
2. డేటా సైన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్: డేటా అనాలిసిస్, ప్రెడిక్టివ్ మోడలింగ్, మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్స్, పైథాన్, ఆర్ ప్రోగ్రామింగ్.
3. క్లౌడ్ కంప్యూటింగ్
4. సైబర్ సెక్యూరిటీ: నెట్‌వర్క్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్.
5. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డీప్ లెర్నింగ్.

రోజుకు 3-4 గంటల ప్రాక్టీస్ చేస్తే మీ నైపుణ్యాలు మెరుగై సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగం పొందే వీలుంటుంది. అనుభవం పొందడం కోసం మొదటి ఉద్యోగాన్ని తక్కువ వేతనంతో అయినా మొదలుపెట్టండి. కొంత అనుభవం గడిచాక మెరుగైన కొలువు దక్కే అవకాశం ఉంది. నిరంతర కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉంటే ప్రైవేటు ఉద్యోగానికి వయసు పెద్ద అడ్డంకి కాదు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్,
కెరియర్ కౌన్సెలర్

కాపీ కొట్టి రాసేస్తే..



సొంతంగా రాయాల్సిన అసైన్‌మెంట్లలో, ప్రాజెక్టుల్లో, పరీక్షల్లో, పరిశోధన పత్రాల్లో కాపీ చేస్తే? ఎదురయ్యే దుష్ఫలితాలను విద్యార్థులు గ్రహించి వీటికి దూరంగా ఉండాలి. తెలియనితనం వల్ల చేసిన చిన్న తప్పయినా పెద్ద శిక్ష తప్పదు. అది ఏడాది చదువు కోల్పోవడమో, యూనివర్సిటీ నుంచి బహిష్కృతులు కావడమో, వీసా రద్దో, చట్టపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి రావడమో కావొచ్చు.

విద్యాసంస్థలు నిర్వహించే పరీక్షలంటే.. నేర్చిన చదువుకే కాదు, విద్యార్థుల చిత్తశుద్ధికీ, నిజాయతీ, క్రమశిక్షణలకు కూడా పరీక్షలే. ఒకవేళ.. చూసి రాయకపోతే పరీక్ష గట్టెక్కలేని దయనీయ పరిస్థితి ఉంటే.. అదెలా ఏర్పడిందో తరచిచూసుకుని విద్యార్థులు ఎవరికి వారే సరిదిద్దుకోవాలి.

ఇప్పటి విద్యార్థులు స్థానిక కాలేజీలకే పరిమితం కావడం లేదు. దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో ఉన్నతవిద్యను అభ్యసిస్తున్నారు. అందుకే ఇదొక అంతర్జాతీయ సమస్య. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ వ్యవస్థలో అంతర్జాతీయ విద్యార్థులు 10% మంది. కానీ విద్యాపరమైన నిజాయతీ లేని కేసుల్లో 47% ఉన్నారు. 25 బ్రిటిష్ విశ్వవిద్యాలయాల్లో యూరోపియన్ యూనియన్ వెలుపలి విద్యార్థులు 12% ఉన్నారు. కానీ విద్యాపరమైన నిజాయతీ లేని కేసుల్లో 35% ఉన్నారు. ఈ గణాంకాలు ఈ సమస్య ఎంత తీవ్రమైనదో చెబుతున్నాయి.

మాల్ ప్రాక్టీసులు ఎన్ని రకాలో...

- ✦ పరీక్ష గదిలోకి చీట్ షీట్స్/ నకలు చిట్టీలు తీసుకెళ్లడం
- ✦ ఒకరి స్థానంలో మరొకరు వెళ్లి అసైన్‌మెంట్లనూ, పరీక్షలనూ పూర్తిచేయడం.
- ✦ అసైన్‌మెంట్లూ, పరీక్షలను వేరొకరు రాసేలా డబ్బు చెల్లించి అవుట్‌సోర్స్ చేయడం.
- ✦ ఘోస్ట్ రైటింగ్: వేరొకరిచేత రాయించి, తమ పేరు వేసుకోవడం
- ✦ గ్రంథ చౌర్యం (ప్లేజరిజం): వేరొకరు రాసిన భాషను, భావాలను తనవిగా రాయడం
- ✦ స్వీయ చౌర్యం (సెల్ఫ్ ప్లేజరిజం): ఒకచోట సబ్మిట్ చేసిన థీసిస్‌నో, వ్యాసాన్నో అక్కడి అనుమతి లేకుండా మరొకచోట సబ్మిట్ చేయడం.
- ✦ ఆన్‌లైన్ అసైన్‌మెంట్లలో, టైమ్ జోన్ల అవకాశాన్ని దుర్వినియోగం చేయడం.
- ✦ చాట్ జీపీటీ, చాట్ బాట్ తదితర ఏఐ టూల్స్ చేసిన రచనలను తమవిగా ప్రజెంట్ చేయడం.
- ✦ అవాంఛనీయ అధ్యయన పద్ధతులు పాటించడం, మూల రచయితలకూ, రిసెర్చ్ స్కాలర్లకూ ఇవ్వవలసిన క్రెడిట్ ఇవ్వకపోవడం.

వీటి పర్యవసానాలు

- ✦ చట్టపరమైన శిక్ష, న్యాయబద్ధ దండన
- ✦ సాటివారిలో అగౌరవం, పరువు నష్టం
- ✦ ఆ వ్యక్తి మీద సాటివారు నమ్మకాన్ని కోల్పోవడం
- ✦ చదువుకోవాలన్న జిజ్ఞాస, జ్ఞాన తృష్ణ, లక్ష్యం నశించడం.
- ✦ అర్హులకు చెందాల్సిన ప్రయోజనాన్ని అనుచితంగా పొందడం.

మరి ప్రత్యామ్నాయాలు?

- ✦ మొదటిపాఠం నుంచే చదువు మీద తగిన శ్రద్ధ
- ✦ పాఠాన్ని అర్థం చేసుకోవడంపై దృష్టి
- ✦ అధ్యాపకుల నుంచి అవసరమైన సహాయం పొందడం
- ✦ సమర్థ సమయపాలన, వ్యక్తిగత క్రమశిక్షణ
- ✦ అభ్యాసం, అధ్యయనాలపై శ్రద్ధ
- ✦ విద్యా వనరుల సద్వినియోగం

ఏఐ టూల్స్ రోజురోజుకూ పెరిగిపోతున్న ఈ తరుణంలో తెలియకుండానే 'చూసి రాతల' మాయాజాలంలో పడిపోయే ప్రమాదం ఉంది ఇప్పటికే సెబ్రియాన్ రోబుల్స్ వంటి వారు విద్యార్థుల ఆన్‌లైన్ యాక్టివిటీని ఆద్యంతం మానిటర్ చేయాలనీ, ఏఐకీ- అకడెమిక్ డిజానెస్టీల మధ్య సంఘర్షణను గుర్తించి విస్తృతంగా చర్చించాలనీ ప్రతిపాదిస్తున్నారు.

చూసి రాయమని సైగ చేసినా..

ఆ రోజు స్కూల్స్ ఇన్‌స్పెక్టర్ బడిపిల్లల ఆంగ్ల పరిజ్ఞానాన్ని పరీక్షిస్తున్నాడు. చెప్పిన ఐదు పదాల్లో ఒకటి కెటిల్. ఆ బాలుడు తప్పు రాశాడు. పక్క పిల్లవాడి దగ్గర చూసి కాపీ చేయమని ఉపాధ్యాయుడు సైగ చేసినా ఆ అబ్బాయికి మనసొప్పలేదు. తనకు తెలిసినంతమేరకే నిజాయతీగా రాశాడు. ఆ పూట పరీక్షలో తప్పింది అతడొక్కడే. అయినా ఎన్నటికీ 'చూసి రాసే కళ' అతడికి అబ్బలేదు. ఆ ఏడేళ్ల బాలుడెవరో గ్రహించే ఉంటారు. మోహన్‌దాస్. పెద్దయ్యాక జాతిపిత మహాత్మా గాంధీ అయ్యారు. అందరు ఎగ్జామినర్లూ ఆ ఉపాధ్యాయుడిలాగానే ఉండరు. కానీ మోహన్‌దాస్ లాంటి బాలలు ప్రతి తరగతిలోనూ ఉంటారు. వారి నిబద్ధతను ప్రోత్సహించాలి. ఏనాడైనా నిజాయతీ అత్యుత్తమ విధానమే!



– చంద్రలత

ఉద్యోగాలు

సెంట్రల్ ఆయుర్వేదిక్ సైన్సెస్‌లో..

దిల్లీలోని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రిసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్ వివిధ విభాగాల్లో 394 గ్రూప్-ఏ, బీ, సీ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, ఎండీ/ఎంఎస్, ఎంఫార్మ్, బీఎస్సీ, ఎమ్మెస్సీ, ఎంఏతో పాటు పని అనుభవం.
వయసు: 27- 40 ఏళ్ల మధ్య ఉండాలి.
వేతన శ్రేణి: నెలకు గ్రూప్-ఏకు రూ.15,600 - రూ.39,100, గ్రూప్-బీ, గ్రూప్-సీ లకు రూ.9300 - రూ.34,800.
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేదీ: 01.08.2025.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 31.08.2025
దరఖాస్తు ఫీజు: గ్రూప్-ఏ, బీ, సీ పోస్టులకు జనరల్, ఓబీసీలకు వరుసగా రూ.1000, 500, 200. ప్రాసెసింగ్ ఫీజు 500, 200, 100. ఎస్సీ, ఎస్టీ ఈడబ్ల్యూఎస్, పీడబ్ల్యూబీడీ, మహిళలకు ఫీజు లేదు.
ఎంపిక: సీబీటీ, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూలతో.
వెబ్‌సైట్: https://ccras.nic.in/

ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలో టెక్నీషియన్లు

ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ మెదక్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో 35 టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
▲ డిప్లొమా టెక్నీషియన్(సీఎన్‌సీ ఆపరేటర్): 10
▲ జూనియర్ టెక్నీషియన్(మెషినిస్ట్): 15
▲ జూనియర్ టెక్నీషిన్(మిల్లర్): 06
▲ జూనియర్ టెక్నీషియన్(ఫిట్టర్ జనరల్): 04
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, ఎన్ఏసీ/ఎన్‌టీసీతో పాటు పని అనుభవం.
వయసు: 18 - 30 ఏళ్లు.
వేతనం: నెలకు డిప్లొమా టెక్నీషియన్‌కు రూ.23,000, జూనియర్ టెక్నీషియన్‌కు రూ.21,000.
ఎంపిక: షార్ట్ లిస్టింగ్, ట్రేడ్ టెస్ట్‌లతో.

33 జూనియర్ టెక్నీషియన్లు

ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ, మెదక్ ఒప్పంద ప్రాతిపదికన పలు విభాగాల్లో 33 జూనియర్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
▲ వెల్డర్: 05 ▲ మెషినిస్ట్: 04
▲ ఫిట్టర్ ఎలక్ట్రిక్: 05
▲ ఫిట్టర్ జనరల్: 10 ▲ మిల్‌రైట్: 09
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఎన్ఏసీ/ఎన్‌టీసీతో పాటు పని అనుభవం. **గరిష్ఠ వయసు:** 64 ఏళ్లు.
వేతనం: నెలకు రూ.30,000.
ఎంపిక: షార్ట్ లిస్టింగ్, ఇంటర్వ్యూలతో.
దరఖాస్తు: ఆఫ్‌లైన్ ద్వారా.
ఈ రెండు రకాల పోస్టులకూ..
దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ: 21.07.2025
చిరునామా: డిప్యూటీ జనరల్ మేనేజర్/ హెచ్ ఆర్, ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ మెదక్, ఎద్దుమైలారం, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ- 502205.
వెబ్‌సైట్: https://ddpdoo.gov.in/career

నోటీస్ బోర్డు

ఎన్‌హెచ్ఏఐలో అడ్వైజర్‌లు

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ) ఒప్పంద ప్రాతిపదికన టెక్నికల్ విభాగంలో 5 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
▲ అడ్వైజర్ (టెక్నికల్): 02 ▲ జాయింట్ అడ్వైజర్(టెక్నికల్): 03
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్ (సివిల్)తో పాటు పని అనుభవం.
గరిష్ఠ వయసు: 26.07.2025 నాటికి 65 ఏళ్లు. ఎస్సీ, ఎస్టీలకు 5 ఏళ్లు, ఓబీసీలకు 3 ఏళ్లు, పీడబ్ల్యూబీడీకి 15 ఏళ్లు సడలింపు ఉంటుంది.
వేతనం: నెలకు అడ్వైజర్‌కు రూ.2,35,000, జాయింట్ అడ్వైజర్‌కు రూ.1,75,000. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 26.07.2025
వెబ్‌సైట్: https://nhai.gov.in/

నార్త్ వెస్టర్న్ రైల్వేలో..

నార్త్ వెస్టర్న్ రైల్వే స్పోర్ట్స్ కోటాలో వివిధ విభాగాల్లో 54 ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
క్రీడా విభాగాలు: ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, గోల్ఫ్, కబడ్డీ, రెజ్లింగ్, షూటింగ్, సైక్లింగ్, హాకీ, క్రికెట్, వాలీబాల్.
అర్హత: పోస్టును అనుసరించి ప్రభుత్వ గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్ నుంచి డిగ్రీ, ఇంటర్, పదో తరగతి, ఐటీఐ.
వయసు: 01.07.2025 నాటికి 18 - 25 ఏళ్లు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 10.08.2025
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.500. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈబీసీలకు రూ.250.
ఎంపిక: డాక్యుమెంట్ వెరిఫికేషన్, క్రీడా ప్రదర్శనలతో.
వెబ్‌సైట్: https://rrcjaipur.in/Notice

ఎడ్‌సిల్ ఇండియాలో కన్సల్టెంట్లు

ఎడ్‌సిల్ ఇండియా లిమిటెడ్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో 8 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
▲ చీఫ్ కన్సల్టెంట్: 01 ▲ సీనియర్ కన్సల్టెంట్: 01
▲ కన్సల్టెంట్: 04 ▲ ఐటీ మేనేజర్: 01 ▲ ఆఫీస్ మేనేజర్: 01
అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, పీజీ, బీఈ/బీటెక్/బీసీఏతో పాటు పని అనుభవం. **వేతనం:** నెలకు చీఫ్ కన్సల్టెంట్‌కు రూ.1,20,000 - రూ.1,50,000, సీనియర్ కన్సల్టెంట్‌కు రూ.1,00,000 - రూ.1,20,000, కన్సల్టెంట్, ఐటీ మేనేజర్, ఆఫీస్ మేనేజర్‌లకు రూ.80,000 - రూ.1,00,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 25.07.2025
ఎంపిక: ఇంటర్వ్యూతో.
వెబ్‌సైట్: https://www.edcilindia.co.in/TCareers

ఏపీ సెంట్రల్‌వర్సిటీలో..

అనంతపురంలోని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్.. ఔట్‌సోర్సింగ్/ తాత్కాలిక ప్రాతిపదికన 19 నాన్ టీచింగ్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
▲ డాక్టర్- 02 ▲ అకౌంటెంట్- 01 ▲ డేటా ఎంట్రీ ఆపరేటర్- 02
▲ అసిస్టెంట్- 01 ▲ ల్యాబ్ అసిస్టెంట్ (కంప్యూటర్ ల్యాబ్)- 04
▲ ల్యాబ్ అసిస్టెంట్ (జాగ్రఫీ అండ్ స్పేస్ సైన్స్)- 01
▲ హాస్టల్ కేర్ టేకర్(బాయ్స్ & గర్ల్స్)- 04
▲ నర్స్- 01 ▲ హిందీ ట్రాన్స్‌లేటర్ కమ్ టైపిస్ట్- 01
▲ టెక్నికల్ అసిస్టెంట్ (డేటా సెంటర్)- 01 ▲ ప్లంబర్- 01
అర్హత: పోస్టులను అనుసరించి టెన్త్/ ఇంటర్మీడియట్/ ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, జీఎన్ఎం/బీఎస్సీ నర్సింగ్/ ఎమ్మెస్సీ నర్సింగ్, బీటెక్/బీఏ/ఎంసీఏ, ఎమ్మెస్సీ, ఎంఈ, బీకాం/ఎంకాం, ఎంబీబీఎస్, ఎండీతో పాటు ఉద్యోగానుభవం.
ఎంపిక: విద్యార్హతలు, ఉద్యోగానుభవంతో.
దరఖాస్తు: ఈమెయిల్ arcuap@gmail.com ద్వారా.
దరఖాస్తుకు చివరి తేదీ: 31.07.2025.
వెబ్‌సైట్: https://cuap.ac.in/vacancy-details/

ఇర్కాన్‌లో ఇంజినీర్ ఖాళీలు

ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఒప్పంద ప్రాతిపదికన 5 ఇంజినీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
▲ వర్క్స్ ఇంజినీర్(సివిల్): 04
▲ వర్క్స్ ఇంజినీర్(ఎలక్ట్రికల్): 01
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్ (సివిల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్)తో పాటు పని అనుభవం. **గరిష్ఠ వయసు:** 01.07.2025 నాటికి 30 ఏళ్లు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది. **వేతనం:** నెలకు రూ.36,000.
దరఖాస్తు: ఆఫ్‌లైన్ ద్వారా. **దరఖాస్తుకు చివరి తేదీ:** 08.08.2025.
చిరునామా: జేజీఎం, హెచ్‌ఆర్‌ఎం, ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, సీ-4, డిస్ట్రిక్ట్ సెంటర్, సాకెట్, న్యూ దిల్లీ-110017.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో.
వెబ్‌సైట్: https://ircon.org/

అప్రెంటిస్

గ్రాడ్యుయేట్, డిప్లొమా అప్రెంటిస్‌లు

ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వివిధ విభాగాల్లో 30 అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: సివిల్, ఎలక్ట్రికల్, ఎస్&టీ
▲ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్: 20 ▲ డిప్లొమా అప్రెంటిస్: 10
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ (ఇంజినీరింగ్), డిప్లొమా. **వయసు:** 01.07.2025 నాటికి 18- 30 ఏళ్లు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది. **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.10,000, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.8,500.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 31.07.2025
వెబ్‌సైట్: https://ircon.org/

ప్రవేశాలు

దూరవిద్యలో యూజీ, పీజీ

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ జి. రామ్ రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, 2025-26 విద్యా సంవత్సరానికి దూరవిద్య విధానంలో (ఫేజ్-1) అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
▲ ఎంబీఏ, ఎంసీఏ ▲ ఎంఏ: హిందీ, ఉర్దూ, తెలుగు, సంస్కృతం, ఇంగ్లిష్, ఫిలాసఫీ, సోషియాలజీ, పబ్లిక్ పర్సనల్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ ▲ ఎమ్మెస్సీ: మ్యాథ్స్, స్టాటిస్టిక్స్ ▲ ఎంకాం ▲ బీఏ (మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్) ▲ బీకాం (జనరల్) ▲ బీబీఏ
▲ అడ్వాన్స్‌డ్ డిప్లొమా: మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్, బయోఇన్ఫర్మేటిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, డేటా సైన్స్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్, వేదిక్ ఆస్ట్రాలజీ
▲ అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా: వేదిక్ ఆస్ట్రాలజీ
▲ సర్టిఫికెట్ కోర్సు: యోగా
అర్హత: కోర్సును అనుసరించి పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ.
బోధన మాధ్యమం: కోర్సును బట్టి ఇంగ్లిష్/ తెలుగు/ఉర్దూ మాధ్యమాలు ఉంటాయి.
ఫేజ్–I అడ్మిషన్లకు చివరి తేదీ: 15.09.2025.
వెబ్‌సైట్: https://www.osmania.ac.in/

ఈనాడు ప్రతిభ
బుధవారం, జులై 16, 2025
19
pratibha.eenadu.net/eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్



✿ నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఎన్ఏఎల్ఎస్ఏ) నూతన ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఇటీవల ఎవరు బాధ్యతలు స్వీకరించారు? (సుప్రీంకోర్టులో రెండో సీనియర్ న్యాయమూర్తిని ఈ పదవికి భారత రాష్ట్రపతి నామినేట్ చేస్తారు.) **జ:** జస్టిస్ సూర్యకాంత్

✿ అంతర్జాతీయ మొక్కల ఆరోగ్య దినోత్సవాన్ని

మాదిరి ప్రశ్నలు

ఐక్యరాజ్యసమితి ఏటా ఏ రోజున నిర్వహిస్తుంది? ('ది ఇంపార్టెన్స్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ ఇన్ వన్ హెల్త్' అనే థీమ్‌తో ఈ దినోత్సవాన్ని నిర్వహించారు.) **జ:** మే 12

✿ విరాట్ కోహ్లి ఇటీవల టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. కోహ్లి టెస్ట్ కెరీర్‌లో అత్యధిక స్కోరు ఎంత? (2019లో దక్షిణాఫ్రికాపై ఈ స్కోరు చేశాడు. 14 ఏళ్ల టెస్ట్ కెరీర్‌లో 123 మ్యాచ్‌లు ఆడిన కోహ్లి 46.85 సగటుతో 9,230 పరుగులు సాధించాడు. తన ఖాతాలో 30 సెంచరీలు, 31 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.) **జ:** 254

✿ బ్రహ్మోస్ క్షిపణి ఉత్పత్తి కేంద్రాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇటీవల ఎక్కడ ప్రారంభించారు? (రూ.300 కోట్ల పెట్టుబడితో నిర్మించిన ఈ కేంద్రం ఏటా 80–100 బ్రహ్మోస్ క్షిపణులను తయారుచేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.) **జ:** లఖ్‌నవూ

మరింత సమాచారం

మాక్ కౌన్సెలింగ్ 2025

ఐసెట్


నీట్



సత్వర గణనకు సరళ మార్గాలు!

జనరల్ స్టడీస్
అరిథ్‌మెటిక్

ఒక సంఖ్య మరో సంఖ్యను శేషం లేకుండా భాగించగలుగుతుందో లేదో వేగంగా, సులభంగా తెలుసుకోవడానికి ఉపయోగపడే పద్ధతులే భాజనీయత సూత్రాలు. ఇవి భాగించే ప్రక్రియను చేయకుండానే సంఖ్య లక్షణాలను బట్టి భాజనీయతను నిర్ధారిస్తాయి. ప్రధాన కారణాంకాలను కనుక్కోవడానికి, భిన్నాలను సరళీకరించడానికి, సత్వర గణనకు సాయపడతాయి. ఈ సూత్రాలను నేర్చుకోవడం వల్ల సంఖ్యల నిర్మాణంపై మంచి అవగాహన ఏర్పడుతుంది. అభ్యర్థులు సూత్రాల్లోని తర్కాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. వీలైనన్ని ఎక్కువ ఉదాహరణలను ప్రాక్టీస్ చేయాలి. ప్రతి సూత్రాన్ని తరచూ రివిజన్ చేసుకోవాలి.



భాజనీయతా సూత్రాలు

★ భాజనీయతా సూత్రాలు ఉపయోగించడం ద్వారా భాగహారం చేయకుండానే ఆప్షన్స్ ఎలిమినేషన్ పద్ధతిలో సరైన జవాబును సులభంగా గుర్తించవచ్చు.

⇒ చివరి అంకె/అంకెల ఆధారంగా ⇒ 2, 5, 10, 4, 8 కి సంబంధించిన భాజనీయతా సూత్రాలు.

A) 2 భాజనీయతా సూత్రం

★ ఒక సంఖ్య చివర ఒకట్ల స్థానంలో 0, 2, 4, 6, 8 ఉండాలి.



ఉదా: 2452 2456
2468 1234

B) 5 భాజనీయతా సూత్రం

★ ఒక సంఖ్య చివర ఒకట్ల స్థానంలో 0 లేదా 5 ఉండాలి.

ఉదా: 12345
14560

C) 10 భాజనీయతా సూత్రం

ఒక సంఖ్య చివర ఒకట్ల స్థానంలో '0' మాత్రమే ఉండాలి.

ఉదా: 123450

D) 4 భాజనీయతా సూత్రం

★ ఒక సంఖ్యలో చివరి రెండు అంకెలు 4తో భాగించబడాలి లేదా చివరి రెండు అంకెలు '00'లు ఉండాలి.

ఉదా: 1232 6700
4568 6840

E) 8 భాజనీయతా సూత్రం

★ ఒక సంఖ్యలో చివరి మూడు అంకెలు 8తో భాగించబడాలి లేదా చివరి మూడు అంకెలు '000'లు ఉండాలి.

ఉదా: 123456 123000
78640

⇒ అంకెల మొత్తం ఆధారంగా ⇒ 3, 9 భాజనీయతా సూత్రాలు.

F) 3 భాజనీయతా సూత్రం

★ ఒక సంఖ్య అంకమూలం 3, 6, 9 అవ్వాలి.

ఉదా: ఎ) 12345

అంకమూలం = 1 + 2 + 3 + 4 + 5 = 15

⇒ 1 + 5 = 6

అంకమూలం '6' కాబట్టి 12345 అనేది 3 తో భాగించబడుతుంది.

బి) 45723

G) 9 భాజనీయతా సూత్రం

★ ఒక సంఖ్య అంకమూలం '9' అవ్వాలి.

ఉదా: 45,225

★ అంకమూలం = 9 కాబట్టి ఇది 9 తో భాగించబడుతుంది.

H) 11 భాజనీయతా సూత్రం

★ ఇచ్చిన సంఖ్యలో సరి స్థానాల్లోని అంకెల మొత్తం, బేసి స్థానాల్లోని అంకెల మొత్తానికి సమానం లేదా వాటి భేదం 11 గుణిజం అయితే ఆ సంఖ్య 11తో భాగించబడుతుంది.

a b c d e f

a + c + e = b + d + f లేదా

(a + c + e) – (b + d + f) అనేది 11 గుణిజం అవ్వాలి.

ఉదా: 1) 1 5 3 1 5 3 (9, 9)

2) 5 2 4 2 0 5 (9, 9)

3) 7 4 5 2 5 (6, 17)



భేదం = 17 – 6 = 11

నోట్: పోటీ పరీక్షల దృష్ట్యా 11, 9, 3 చాలా ముఖ్యం.

I) 6 భాజనీయతా సూత్రం

★ ఒక సంఖ్య 2, 3 లతో భాగించబడాలి.

J) 7 భాజనీయతా సూత్రం

★ ఇచ్చిన సంఖ్యలో ఒకట్ల స్థానంలోని అంకెను రెట్టింపు చేసి, మిగిలిన సంఖ్య నుంచి తీసివేస్తూ వెళ్లాలి. చివరికి 0 లేదా 7 గుణిజం రావాలి.

ఉదా: 763 ⇒ 76
–6
70 ఇది 7 గుణిజం.

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో 4 తో భాగించబడని సంఖ్య?
   1) 24432 2) 35628
   3) 15630 4) 68640

వివరణ: 3వ ఆప్షన్ 15630 లో చివరి 2 అంకెల సంఖ్య 30 అనేది 4 తో భాగించబడదు. **జ: 3**

2. 23,474 అనే సంఖ్య కింది వాటిలో వేటితో భాగించబడుతుంది?
   1) 2, 3 2) 2, 4
   3) 2, 11 4) 2 మాత్రమే

వివరణ: 23,474 లో చివరి అంకె 4 కాబట్టి 2 తో భాగించబడుతుంది.

2 3 4 7 4 (10, 10)

సరిస్థానాల్లోని అంకెల మొత్తం = బేసి స్థానాల్లోని అంకెల మొత్తం

కాబట్టి '11'తో భాగించబడుతుంది. **జ: 3**

3. 5x793x4 అనే సంఖ్యను 3 నిశ్శేషంగా భాగిస్తే x గరిష్ఠ విలువ?
   1) 9 2) 7 3) 4 4) 3

వివరణ: 5x793x4 అంకమూలం

5 + x + 7 + 9 + 3 + x + 4 = 28 + 2x

= 1 + 2x

గరిష్ఠ విలువ 7.

1 + 2(7) = 15

దీన్ని 3 తో భాగించవచ్చు.

1 + 5 = 6 **జ: 2**

4. 348★471 అనేది 9తో నిశ్శేషంగా భాగించబడితే, 'a' కనిష్ఠ సహజ సంఖ్య ఎంత?
   1) 0 2) 3 3) 6 4) 9

వివరణ: 348★471 అంకమూలం

3 + 4 + 8 + ★ + 4 + 7 + 1 = 9 + ★

★ స్థానంలో '0' లేదా 9 రాయవచ్చు. అయితే '0' సహజ సంఖ్య కాదు కాబట్టి జవాబు '9'. **జ: 4**

5. ఒక పది అంకెల సంఖ్య 54726x79y6 ను 72 నిశ్శేషంగా భాగిస్తుంది. అయితే y కనిష్ఠ విలువకు 5x - 3y విలువ ఎంత?
   1) 16 2) 15 3) 14 4) 13



వివరణ: ఇచ్చిన సంఖ్య 72తో భాగించబడాలంటే 8, 9 లతో భాగించబడాలి.

8... భాజనీయతా సూత్రం ప్రకారం ఇచ్చిన సంఖ్యలో చివరి 3 అంకెలు 9y6ను 8తో భాగించాలంటే y = 3 ఉండాలి.

9... భాజనీయతా సూత్రం ప్రకారం ఇచ్చిన సంఖ్య అంకమూలం 5 + 4 + 7 + 2 + 6 + x +7 + 9 + 3 + 6 = 49 + x


x = 5 అయినప్పుడు మాత్రమే అంకమూలం 9 అవుతుంది.

అడిగిన ప్రశ్న 5x – 3y

= 5(5)–3(3) = 25–9 = 16 **జ: 1**



రచయిత: పిరాది నరేష్





ప్రాక్టీస్ బిట్స్

1. కింది వాటిలో 11 తో భాగించబడేది?
   1) 59609 2) 45332
   3) 23581 4) 44433
2. 8A5146B అనే సంఖ్య 88 తో నిశ్శేషంగా భాగించబడుతుంది. అయితే A^B విలువ ఎంత?
   1) 27 2) 81 3) 64 4) 12
3. మూడంకెల సంఖ్యలు abc, cab, bca ల మొత్తం కింది వాటిలో దేంతో భాగించబడదు?
   1) 37 2) 3 3) 31 4) a + b + c
4. 823p2q అనే 6 అంకెల సంఖ్య 7, 11, 13 లతో భాగించబడుతుంది. అయితే p - q =?
   1) 8 2) 5 3) 11 4) 3
5. x యొక్క ఏ విలువకు 46393x8 అనే సంఖ్య 11 తో నిశ్శేషంగా భాగించబడుతుంది?
   1) 7 2) 2 3) 5 4) 3

సమాధానాలు: 1-1; 2-2; 3-3; 4-2; 5-4.

గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు

1. 517x324 అనే సంఖ్య 12 తో భాగించబడాలంటే x కనిష్ఠ విలువ?
   1) 0 2) 2 3) 1 4) 3
2. 8439x53 అనే ఏడంకెల సంఖ్య 99 తో భాగించబడాలంటే x విలువ?
   1) 6 2) 4 3) 3 4) 9
3. ఒక సంస్థ ఒక క్రికెట్ టీంలోని 11 మంది ఆటగాళ్లకు 10x + y టీషర్ట్‌లు కొనుగోలు చేసింది. మళ్లీ తిరిగి 10y + x టీషర్ట్‌లు కొనుగోలు చేసింది. వాటిని వారందరికీ సమంగా పంచితే, మిగిలిన టీషర్ట్‌లు ఎన్ని?
   1) 0 2) 1 3) 2 4) 3
4. $N = 9^9$ అయితే N ను భాగించే కచ్చితమైన ఘన కారణాంకాలు ఎన్ని?
   1) 6 2) 7 3) 4 4) 5

సమాధానాలు: 1-2; 2-2; 3-1; 4-2.

ఆ చట్టంతోనే దేశ విభజనకు బీజాలు!

భారత రాజ్యాంగం చారిత్రక పరిణామ క్రమం

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ


భారత్‌ను వలసరాజ్యంగా చేసుకోవడానికి బ్రిటిష్ ప్రభుత్వం రూపొందించిన చట్టాలు, వాటిలోని అంశాలెన్నో ఆ తర్వాత దేశ రాజ్యాంగ రూపకల్పనలో సాయపడ్డాయి. వలస పాలకులు తీసుకొచ్చిన రాజకీయ, పాలనా వ్యవస్థలు, పాలక వర్గాలు, న్యాయవ్యవస్థ, చట్ట సభల నిర్మాణం, ద్వంద్వ పాలన తదితరాలను రాజ్యాంగ నిర్మాతలు దృష్టిలో ఉంచుకున్నారు. అందుకే రాజ్యాంగ పరిణామ క్రమాన్ని అర్థం చేసుకోవాలంటే స్వాతంత్ర్యానికి ముందు క్రమంగా వచ్చిన కౌన్సిల్ చట్టాలు, భారత ప్రభుత్వ చట్టాలు, వాటి విశేషాలు, సందర్భాను సారంగా పాలనావ్యవస్థలో తెచ్చిన మార్పులు, చేపట్టిన సంస్కరణలు, సృష్టించిన పదవులు, అధికారాలు మొదలైన వివరాలను పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. వలస చట్టాల అసలు ఉద్దేశాలను, వాటిపై జాతీయ నాయకులు చేసిన విమర్శలపై అవగాహన పెంచుకోవాలి.

1. ఆంగ్లేయుల పాలనా కాలంలో ఏ చట్టం ద్వారా 'భారతరాజ్య కార్యదర్శి' (సెక్రటరీ ఆఫ్ స్టేట్ ఫర్ ఇండియా) పదవిని సృష్టించారు?
   1) చార్టర్ చట్టం-1833
   2) భారత ప్రభుత్వ చట్టం-1858
   3) ఇండియన్ కౌన్సిల్ చట్టం-1861
   4) ఇండియన్ కౌన్సిల్ చట్టం-1892
2. 'భారత ప్రభుత్వ చట్టం-1858'.. భారత ప్రజల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకు మాగ్నాకార్టా లాంటిది' అని ఎవరు అభివర్ణించారు?
   1) మహాత్మా గాంధీ
   2) జేమ్స్ ప్రిన్స్
   3) విక్టోరియా మహారాణి
   4) మోతీలాల్ నెహ్రూ



విక్టోరియా మహారాణి

3. భారత ప్రభుత్వ చట్టం-1858లోని అంశాన్ని గుర్తించండి.
   ఎ) భారత గవర్నర్ జనరల్ అనే హోదాను 'వైస్రాయ్ ఆఫ్ ఇండియా'గా మార్పు చేశారు.
   బి) భారతదేశంలో బ్రిటిష్ చక్రవర్తి ప్రతినిధిగా 'వైస్రాయ్' పాలిస్తాడు.
   సి) వైస్రాయ్ పదవీ కాలం ఐదేళ్లు.
   డి) మొదటి వైస్రాయ్ - లార్డ్ కానింగ్
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
4. భారతదేశంలో నియమించిన మొదటి భారత రాజ్య కార్యదర్శి ఎవరు?
   1) ఎడ్వర్డ్ స్టాన్లీ 2) చార్లెస్ ఉడ్స్
   3) టి.బి.మెకాలే 4) సత్యేంద్ర ప్రసాద్ సిన్హా
5. కింది అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
   ఎ) భారత రాజ్య కార్యదర్శి బ్రిటన్ మంత్రివర్గంలో సభ్యుడై ఉండి బ్రిటిష్ పార్లమెంట్‌కు బాధ్యత వహిస్తాడు.
   బి) భారత రాజ్య కార్యదర్శికి పరిపాలనలో సహకరించేందుకు 15 మంది సభ్యులతో కూడిన 'సలహా మండలి' ఉంటుంది.
   సి) 'భారత ప్రభుత్వ చట్టం-1858' ను 'గుడ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా చట్టం'గా పేర్కొంటారు.
   1) ఎ, సి 2) ఎ, బి
   3) బి, సి 4) ఎ, బి, సి
6. ఇండియన్ కౌన్సిల్ చట్టం-1861లోని అంశాన్ని గుర్తించండి.
   ఎ) శాసన నిర్మాణ ప్రక్రియలో మొదటిసారిగా భారతీయులకు అవకాశం కల్పించారు.
   బి) ముంబయి, మద్రాస్ ప్రెసిడెన్సీల శాసనాధికారాలను పునరుద్ధరించారు.
   సి) వైస్రాయ్‌కు ఆర్డినెన్స్‌ను జారీ చేసే అధికారం కల్పించారు.
   డి) భారత్‌లో కేంద్ర స్థాయిలో 'ద్వంద్వ పాలన' ప్రవేశపెట్టారు.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
7. 1862లో లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు లార్డ్ కానింగ్ నామినేట్ చేసిన భారతీయుల్లో సరికాని వారిని గుర్తించండి.
   1) బెనారస్ - ఈశ్వరి ప్రసాద్ నారాయణ్ సింగ్
   2) పాటియాల - మహేందర్ సింగ్
   3) బాంబే ప్రెసిడెన్సీ - సర్ దినకర్‌రావు
   4) మద్రాస్ ప్రెసిడెన్సీ - ముత్తు లక్ష్మి
8. మనదేశంలో 1859లో 'పోర్ట్ ఫోలియో' (మంత్రులకు మంత్రిత్వశాఖల కేటాయింపు) విధానాన్ని ఎవరు ప్రవేశపెట్టారు?
   1) కారన్ వాలీస్
   2) థామస్ మన్రో
   3) లార్డ్ కానింగ్
   4) లార్డ్ వెల్లస్లీ




లార్డ్ కానింగ్

9. ఇండియన్ కౌన్సిల్ చట్టం-1861 ప్రకారం 1862లో హైకోర్టులను ఎక్కడ ఏర్పాటు చేశారు?
   1) ముంబయి, కోల్‌కతా, మద్రాస్
   2) ముంబయి, మద్రాస్, దిల్లీ
   3) మద్రాస్, కోల్‌కతా, అలహాబాద్
   4) కోల్‌కతా, అహ్మదాబాద్, దిల్లీ
10. చట్టసభల సభ్యులకు బడ్జెట్‌పై మాట్లాడే అధికారాన్ని, ప్రజాప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వాన్ని ఉద్దేశించి ప్రశ్నలు వేసే అధికారాన్ని ఏ చట్టం ద్వారా కల్పించారు?
    1) ఇండియన్ కౌన్సిల్ చట్టం-1861
    2) ఇండియన్ కౌన్సిల్ చట్టం-1892
    3) ఇండియన్ కౌన్సిల్ చట్టం-1909
    4) చార్టర్ చట్టం-1833
11. ఇండియన్ కౌన్సిల్ చట్టం-1892 లోని అంశాన్ని గుర్తించండి.
    ఎ) కేంద్ర శాసన సభలో అనధికార సభ్యుల సంఖ్య 10 మందికి తక్కువ కాకుండా, 20 మందికి మించకుండా ఉండాలని నిర్దేశించారు.
    బి) రాష్ట్రాల శాసనసభల్లో అనధికార సభ్యుల సంఖ్య 8 మందికి తక్కువ కాకుండా, 20 మందికి మించకుండా ఉండాలని నిర్దేశించారు
    సి) కేంద్ర, రాష్ట్రాల శాసన సభల్లో అనధికార సభ్యులను నింపే విధానం పరిమిత, పరోక్ష పద్ధతిలో ఉంటుంది.
    డి) సివిల్ సర్వీసుల పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల వయోపరిమితిని 24 సంవత్సరాలకు పెంచారు.
    1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
    3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
12. ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1909కు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
    ఎ) దీన్ని 'మింటో - మార్లే' సంస్కరణల చట్టం అంటారు.
    బి) ఈ చట్టం రూపకల్పన సమయంలో అప్పటి భారత రాజ్యకార్యదర్శి - లార్డ్ మార్లే.
    సి) ఈ చట్టం రూపకల్పన సమయం నాటి వైస్రాయ్ - లార్డ్ మింటో.
    డి) ఈ చట్టం ద్వారా మనదేశంలో సార్వజనీన వయోజన ఓటు హక్కును ప్రవేశపెట్టారు.
    1) ఎ, సి, డి 2) ఎ, బి, డి
    3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
13. మన దేశంలో 'మత నియోజక వర్గాలను' ఎవరు ప్రవేశపెట్టారు?
    1) లార్డ్ మింటో
    2) లార్డ్ వెల్లింగ్టన్
    3) లార్డ్ అమిగోజ్
    4) చార్లెస్ విల్కిన్స్



లార్డ్ మింటో

14. మింటో – మార్లే సంస్కరణల చట్టం-1909లోని అంశాన్ని గుర్తించండి.
    ఎ) కేంద్ర లెజిస్లేటివ్ కౌన్సిల్‌ను 'ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్'గా మార్పు చేశారు.
    బి) ముస్లింలకు ప్రత్యేక మతపరమైన నియోజకవర్గాలను ప్రతిపాదించారు.
    సి) వైస్రాయ్ కార్యనిర్వాహక మండలిలో మొదటిసారిగా భారతీయులకు ప్రవేశం కల్పించారు.
    డి) తొలి హైకోర్టును కోల్‌కతాలో ఏర్పాటు చేశారు.
    1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
    3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
15. వైస్రాయ్ కార్యనిర్వాహక మండలిలో సభ్యత్వం పొందిన తొలి భారతీయుడు ఎవరు?
    1) దాదాబాయ్ నౌరోజీ
    2) సురేంద్రనాథ్ బెనర్జీ
    3) సత్యేంద్ర ప్రసాద్ సిన్హా
    4) రాస్ బిహారి ఘోష్



సత్యేంద్ర ప్రసాద్ సిన్హా


16. 'మింటో–మార్లే సంస్కరణల చట్టం-1909' హిందూ–ముస్లింల మధ్య వేర్పాటు బీజాలు నాటి తర్వాత కాలంలో భారతదేశ విభజనకు దారితీసిందని ఎవరు పేర్కొన్నారు?
    1) మహాత్మా గాంధీ 2) జవహర్‌లాల్ నెహ్రూ
    3) సుభాష్ చంద్రబోస్ 4) ఫిరోజ్ మెహతా
17. మన దేశంలో రాష్ట్రస్థాయిలో ద్వంద్వ పాలనా విధానాన్ని ఏ చట్టం ద్వారా ప్రవేశపెట్టారు?
    1) మింటో-మార్లే సంస్కరణల చట్టం-1909
    2) ఇండియన్ కౌన్సిల్ చట్టం-1861
    3) మాంటేగ్-చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల చట్టం-1919
    4) ఇండియన్ కౌన్సిల్ చట్టం-1892
18. మన దేశంలో మొదటిసారిగా కేంద్రంలో ద్విసభా పద్ధతిని ఏ చట్టం ద్వారా ప్రవేశపెట్టారు?
    1) భారత ప్రభుత్వ చట్టం-1935
    2) మాంటేగ్ చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల చట్టం-1919
    3) మింటో- మార్లే సంస్కరణల చట్టం-1909
    4) ఇంపీరియల్ కౌన్సిల్ చట్టం-1901
19. మాంటేగ్–చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల చట్టం -1919కి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
    ఎ) ఈ చట్టం-1921 నుంచి అమల్లోకి వచ్చింది.
    బి) కేంద్ర బడ్జెట్ నుంచి రాష్ట్ర బడ్జెట్‌ను వేరు చేశారు.
    సి) రాష్ట్రాలకు పన్నులు విధించే అధికారం కల్పించారు.
    డి) సాధారణ బడ్జెట్ నుంచి రైల్వే బడ్జెట్‌ను వేరు చేశారు.
    1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
    3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
20. మాంటేగ్–చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల చట్టం–1919 ప్రకారం రాష్ట్రాల పాలనాంశాలకు సంబంధించి వివరణకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
    ఎ) రాష్ట్రాల పాలనాంశాలను ట్రాన్స్‌ఫర్డ్, రిజర్వ్‌డ్ అంశాలుగా విభజించారు.
    బి) ట్రాన్స్‌ఫర్డ్ అంశాలు 22. వీటిని రాష్ట్ర శాసన సభకు బాధ్యత వహించే మంత్రిమండలి సలహాతో గవర్నర్ నిర్వహిస్తారు.
    సి) రిజర్వ్‌డ్ అంశాలను రాష్ట్ర శాసన సభకు బాధ్యత వహించకుండా గవర్నర్, అతడి కార్యనిర్వాహక మండలి (బ్రిటిష్ కౌన్సిలర్లు) నిర్వహిస్తారు.
    డి) రిజర్వ్‌డ్ అంశాలు మొత్తం - 28.
    1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
    3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
21. మాంటేగ్–చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల చట్టం-1919 ప్రకారం ఏర్పడిన కేంద్రంలో ఉన్న కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్ (ఎగువ సభ)కు సంబంధించి సరైన జవాబుని గుర్తించండి.
    ఎ) దీనిలో మొత్తం సభ్యుల సంఖ్య - 60.
    బి) దీనిలో ఎన్నికైన సభ్యులు 34 మంది, గవర్నర్ జనరల్‌తో నామినేట్ అయ్యే సభ్యులు 26 మంది.
    సి) ఈ సభ పదవీకాలం ఆరేళ్లు.
    డి) ఈ సభకు తొలి అధ్యక్షుడు సర్ ఫ్రెడరిక్ వైట్.
    1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
    3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
22. మాంటేగ్–చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల చట్టం-1919 ప్రకారం ఏర్పడిన కేంద్రంలో ఉన్న సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ (దిగువ సభ)కు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
    ఎ) దీనిలో మొత్తం సభ్యుల సంఖ్య 145. వీరిలో ఎన్నికయ్యే సభ్యులు 104 మంది కాగా, గవర్నర్ జనరల్ నామినేట్ చేసే సభ్యులు 41 మంది.
    బి) ఈ సభ పదవీకాలం మూడేళ్లు.
    సి) ఈ సభకు తొలి అధ్యక్షుడు విఠల్‌భాయ్ పటేల్.
    డి) ఈ సభకు తొలి ఉపాధ్యక్షుడు సచ్చిదానందా సిన్హా.
    1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
    3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
23. మాంటేగ్–చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల చట్టం-1919 ప్రకారం 'ప్రభుత్వ ఖాతాల సంఘం' (పబ్లిక్ అకౌంట్స్ కమిటీ) ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1921 2) 1924 3) 1927 4) 1929
24. ఎవరి సిఫార్సుల మేరకు సివిల్ సర్వెంట్లను ఎంపిక చేయడం కోసం 1926లో 'కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్' (సెంట్రల్ పబ్లిక్ సర్వీస్ కమిషన్)ను ఏర్పాటు చేశారు?
    1) కాలేల్కర్ కమిషన్
    2) ఆక్వర్త్ కమిటీ
    3) లీ కమిషన్
    4) రెజినాల్డ్ కమిషన్



రచయిత: బంగారు సత్యనారాయణ

సమాధానాలు

1-2; 2-3; 3-4; 4-1; 5-4; 6-1; 7-4; 8-3; 9-1; 10-2; 11-4; 12-3; 13-1; 14-1; 15-3; 16-2; 17-3; 18-2; 19-4; 20-4; 21-3; 22-4; 23-1; 24-3.



కారణం కచ్చితమైతేనే సరైన నిశ్చితం

పోటీపరీక్షల్లో లాజికల్ రీజనింగ్ విభాగం నుంచి ప్రశ్నలు అడుగుతుంటారు. దీనిలో నిశ్చిత వాక్యం - కారణం అనే అంశం ఒకటి. ఇందులో ఒక నిశ్చిత వాక్యం, దానికి అనుబంధంగా కారణాలు ఇస్తారు. ఇచ్చిన అంశాలను నిశితంగా పరిశీలించి, సమాధానాన్ని గుర్తించాల్సి ఉంటుంది. సబ్జెక్టుపై మంచి అవగాహన ఉంటేనే ఇలాంటి ప్రశ్నలను సాధించడం వీలవుతుంది.

పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్

నిశ్చిత వాక్యం - కారణం

సూచన (ప్ర. 1 – 17): దిగువ ఇచ్చిన ప్రశ్నలను పరిశీలించినప్పుడు మీ సమాధానం

A నిజం, కానీ R తప్పయితే 1 అని

A తప్పు, కానీ R నిజమైతే 2 అని

A, Rలు రెండూ తప్పయితే 3 అని

A, R రెండూ నిజం, కానీ R అనేది A కి సరైన వివరణ కాకపోతే 4 అని

A, R రెండూ నిజం, R అనేది A కి సరైన వివరణైతే 5 అని గుర్తించండి.

1. నిశ్చితం **(A):** తమిళనాడులో వర్షాలు ఎక్కువగా శీతాకాలంలోనే కురుస్తాయి.

కారణం **(R):** తమిళనాడులో వర్షాలు తిరోగమన రుతుపవనాల వల్ల కురుస్తాయి.

సాధన: తమిళనాడులో వర్షాలు తిరోగమన రుతుపవనాల వల్ల కురుస్తాయి. ఈ రుతుపవనాలు శీతాకాలంలో వస్తాయి. కాబట్టి రెండూ నిజమైనవే. ఇక్కడ R అనేది A కి సరైన వివరణ.

సమాధానం: 5

2. నిశ్చితం **(A):** మనం వేడి, తేమతో ఉన్న వాతావరణంలో సౌకర్యవంతంగా ఉండగలం.

కారణం **(R):** తేమతో ఉన్న వాతావరణంలో చెమట వేగంగా ఆవిరైపోతుంది.

సాధన: వేడి వాతావరణంలో మనం సౌకర్యవంతంగా ఉండలేం. వేడి వాతావరణంలో తేమశాతం తక్కువగా ఉండటంతో చెమట మెల్లగా ఆవిరైపోతుంది. A, Rలు రెండూ తప్పే.

సమాధానం: 3

3. నిశ్చితం **(A):** కార్బన్ మోనాక్సైడ్ పీల్చితే చనిపోతారు.

కారణం **(R):** కార్బన్ మోనాక్సైడ్ హిమోగ్లోబిన్‌తో కలుస్తుంది.

సాధన: కార్బన్ మోనాక్సైడ్ హిమోగ్లోబిన్‌తో కలవడం ప్రమాదకరం. దీని కారణంగా ప్రాణం పోయే ముప్పు ఉంది. రెండూ సరైనవే. ఇక్కడ R అనేది A కి సరైన వివరణ.

సమాధానం: 5

4. నిశ్చితం **(A):** నది నుంచి సముద్రంలోకి ప్రవేశించినప్పుడు ఓడ పైకి లేస్తుంది.

కారణం **(R):** నది నీటితో పోలిస్తే సముద్రపు నీటి సాంద్రత ఎక్కువగా ఉంటుంది.

సాధన: సముద్రపు నీటికి సాంద్రత ఎక్కువ. నదీ జలాల ద్వారా ఉత్పత్తి చేసిన దానితో పోలిస్తే, ఓడలో సముద్రపు నీటి వల్ల ఉత్పన్నమయ్యే వ్యతిరేక దిశ ఎక్కువగా ఉంటుంది.

సమాధానం: 5

5. నిశ్చితం **(A):** మైదానాల కంటే పర్వతాల మీద చల్లగా ఉంటుంది.

కారణం **(R):** ఎత్తు పెరిగేకొద్దీ ఉష్ణోగ్రత తగ్గుతుంది.

సాధన: సముద్రమట్టం కంటే ఎత్తులో ఉండే పర్వత శిఖరాల్లో చల్లగా ఉంటుంది. ప్రతి 165 మీటర్ల ఎత్తుకు ఉష్ణోగ్రత $1^{\circ}C$ చొప్పున తగ్గుతుంది.

సమాధానం: 5

6. నిశ్చితం **(A):** చలికాలంలో తెల్లని దుస్తులు ధరించడానికి ఇష్టపడతారు.

కారణం **(R):** తెల్లని దుస్తులు వేడిని బాగా గ్రహిస్తాయి.

సాధన: చలికాలంలో ముదురు రంగు దుస్తులు ధరించడానికి ఇష్టపడతారు. ఎందుకంటే అవి వేడిని గ్రహించి శరీరాన్ని వెచ్చగా ఉంచుతాయి. తెల్లని దుస్తులు వేసవిలో వేసుకుంటారు. ఎందుకంటే అవి వేడిని గ్రహిస్తాయి.

సమాధానం: 2

7. నిశ్చితం **(A):** బంగ్లాదేశ్ భారతదేశం నుంచి జనపనారను దిగుమతి చేసుకుంటుంది.

కారణం **(R):** బంగ్లాదేశ్‌లో చాలావరకు జనపనార మిల్లులు ఉన్నాయి.

సాధన: భారతదేశ విభజన తర్వాత బంగ్లాదేశ్ ఏర్పడినప్పుడు జనపనార మిల్లులు భారత్‌లోనే మిగిలిపోయాయి. జనపనార ఉత్పత్తి ప్రాంతాలు మాత్రం బంగ్లాదేశ్‌లోకి వెళ్లిపోయాయి.

సమాధానం: 3

8. నిశ్చితం **(A):** వేడినీటిలో బట్టలు సరిగా ఉతకలేం.

కారణం **(R):** కఠిన జలం అనేక ఖనిజాలను కలిగి ఉంటుంది.

సాధన: కఠిన జలంలో మనం బట్టలు సరిగా ఉతకలేం. ఎందుకంటే అందులో ఖనిజాలు ఉంటాయి. రెండూ సరైనవే. ఇక్కడ R అనేది A కి సరైన వివరణ అవుతుంది.

సమాధానం: 5

9. నిశ్చితం **(A):** భారత రాష్ట్రపతి రాష్ట్రాలకు అధిపతి.

కారణం **(R):** భారత పార్లమెంట్‌లో రాష్ట్రపతి, లోక్‌సభ, రాజ్యసభ భాగం.

సాధన: భారత రాష్ట్రపతి కార్యనిర్వహణ వ్యవస్థకు రాజ్యాంగపరమైన లేదా నామమాత్రపు అధిపతి, నిజమైన అధికారం మంత్రిమండలికి ఉంటుంది.

సమాధానం: 4

10. నిశ్చితం **(A):** శివాజీ గెరిల్లా యుద్ధం చేశాడు.

కారణం **(R):** శివాజీకి మొగలులంటే భయం.

సాధన: మొగలులను ఓడించడానికి శివాజీ గెరిల్లా యుద్ధాన్ని ప్రారంభించాడు. కానీ అతను వారికి భయపడలేదు.

సమాధానం: 1

11. నిశ్చితం **(A):** గాంధీజీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ఉపసంహరించుకున్నారు.

కారణం **(R):** చౌరీ చౌరా సంఘటనలో హింస చోటుచేసుకుంది.

సాధన: చౌరీ చౌరా సంఘటనలో హింస కారణంగా గాంధీజీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ఉపసంహరించుకున్నారు.

సమాధానం: 5

12. నిశ్చితం **(A):** మొక్కల ఆకులు ఆకుపచ్చగా ఉంటాయి.

కారణం **(R):** మొక్కలు క్లోరోప్లాస్ట్‌లు అనే ఆకుపచ్చ వర్ణద్రవ్యం కలిగి ఉంటాయి.

సాధన: మొక్కల ఆకులు ఆకుపచ్చగా ఉండటానికి కారణం వాటిలో ఉండే ఆకుపచ్చ వర్ణద్రవ్యం క్లోరోఫిల్. క్లోరోప్లాస్ట్ కాదు.

సమాధానం: 1

13. నిశ్చితం **(A):** బెరి-బెరి ఒక వైరల్ ఇన్ఫెక్షన్.

కారణం **(R):** విటమిన్ లోపం వ్యాధులకు కారణమవుతుంది.

సాధన: విటమిన్ లోపం వల్ల వ్యాధులు వస్తాయి. విటమిన్ B_1 లోపం కారణంగా బెరి-బెరి వ్యాధి వస్తుంది.

సమాధానం: 2

14. నిశ్చితం **(A):** ఉండుకం అనేది మానవ శరీరంలోని ఒక అవయవం.

కారణం **(R):** ఇది జీర్ణక్రియలో పాల్గొనదు.

సాధన: వాదన, కారణం ఒకదానినొకటి సమర్థిస్తున్నాయి.

సమాధానం: 5

15. నిశ్చితం **(A):** మొలకెత్తిన ధాన్యాలను తినకూడదు.

కారణం **(R):** మొలకెత్తినప్పుడు ముఖ్యమైన విటమిన్లు నశిస్తాయి.

సాధన: మొలకెత్తిన విత్తనాలను తినడం ఆరోగ్యానికి మంచిది. ఎందుకంటే వాటిలో అనేక రకమైన పోషక పదార్థాలు ఉంటాయి.

సమాధానం: 3

16. నిశ్చితం **(A):** ఎలక్ట్రికల్ వైర్లు తయారు చేయడానికి వెండిని ఉపయోగిస్తారు.

కారణం **(R):** వెండి ఒక విద్యుత్ బంధకం

సాధన: వెండి విద్యుత్‌కు మంచి వాహకమే కానీ ఖరీదైంది. కాబట్టి దీన్ని ఎలక్ట్రిక్ వైర్లు తయారు చేయడానికి వినియోగించరు.

సమాధానం: 1

17. నిశ్చితం **(A):** పెట్రోల్ ద్వారా వచ్చే మంటను నీటితో ఆర్పలేం.

కారణం **(R):** పెట్రోల్ కంటే నీరు బరువుగా ఉంటుంది.

సాధన: నీరు బరువుగా ఉండటం వల్ల కిందకి జారిపోతుంది. కాబట్టి పెట్రోల్ మంటలపై ఇసుక వేయడం ద్వారా మంటలను ఆర్పవచ్చు.

సమాధానం: 4



రచయిత
బూసర గణేష్,
విషయ నిపుణులు

712 Word of the Day

Nosedive

Telugu meaning: తీవ్రంగా పడిపోవడం, గణనీయంగా తగ్గిపోవడం

English meaning: The word nosedive (నోస్‌డైవ్) is a noun and verb that refers to a sudden and steep drop or decline, especially in value or quality.

Synonyms: Plunge, Drop

Antonyms: Rise, Increase

Usage: **1. (As a Noun):** The company's shares took a nosedive after the scandal was made public.

2. (As a Verb): Sales nosedived last quarter due to a lack of innovation and poor marketing.

కరెంట్ అఫైర్స్



ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ 2025 పురుషుల సింగిల్స్ విజేతగా ఇటలీ ఆటగాడు యానిక్ సినర్ నిలిచాడు. జులై 13న జరిగిన ఫైనల్‌లో టాప్‌సీడ్ సినర్ 4-6, 6-4, 6-4, 6-4తో రెండోసీడ్ అల్కరాజ్‌ను ఓడించాడు. మొదటి సెట్‌లో పైచేయి సాధించిన అల్కరాజ్‌పై తర్వాతి మూడు సెట్లలో ఆధిపత్యం ప్రదర్శించిన సినర్ తొలి వింబుల్డన్ టైటిల్‌ను గెలిచాడు. ఇతడికి ఇది నాలుగో గ్రాండ్‌స్లామ్ టైటిల్.

✦ మహిళల డబుల్స్ టైటిల్‌ను ఎలిస్ మెర్టిన్స్ (బెల్జియం) - కుద్రిమెతోవా (రష్యా) జంట గెలుచుకుంది. వీరు 3-6, 6-2, 6-4తో సువీయ్ (తైపీ)-జెలెనా ఒస్తాపెంకో (లాత్వియా) జంటను ఓడించారు.



సీనియర్ ఐపీఎస్ అధికారిణి సోనాలీ మిశ్ర రైల్వే రక్షక దళం (ఆర్‌పీఎఫ్) డైరెక్టర్ జనరల్‌గా నియమితులయ్యారు. సోనాలీ 1993 ఐపీఎస్ బ్యాచ్ మధ్యప్రదేశ్ కేడర్‌కు చెందినవారు. 31 జులై 2025న పదవీ విరమణ చేయనున్న మనోజ్ యాదవా స్థానంలో ఈమె బాధ్యతలు చేపట్టనున్నారు. 31 అక్టోబరు 2026 వరకు ఆమె ఈ పదవిలో కొనసాగనున్నారు. ఆర్‌పీఎఫ్‌కు డైరెక్టర్ జనరల్‌గా మహిళా అధికారి నియమితులవడం ఇదే తొలిసారి.



హర్షవర్ధన్ శ్రింగ్లా



ఉజ్వల్ నికమ్

పలు రంగాలకు చెందిన నలుగురిని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రాజ్యసభకు నామినేట్ చేశారు. వీరిలో భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ మాజీ కార్యదర్శి హర్షవర్ధన్ శ్రింగ్లా, ప్రముఖ న్యాయవాది ఉజ్వల్ నికమ్, చరిత్రకారిణి మీనాక్షి జైన్, కేరళకు చెందిన ఉపాధ్యాయుడు సి.సదానందన్ మాస్టర్ ఉన్నారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ప్రధాన నదులు - ఆనుకుని ఉన్న నగరాలు

స్టడీ - జోన్

సాధారణంగా ఎత్తయిన ప్రదేశాల్లో పుట్టి, మైదానాల ద్వారా పయనిస్తూ చివరకు సరస్సులు లేదా సముద్రాల్లో కలిసే మంచినీటి ప్రవాహాలను నదులు అంటారు. భూ ఉపరితల విస్తీర్ణంలో దాదాపు 71% నీరు ఆవరించి ఉంది. అందులో దాదాపు 97.3% సముద్రాల్లో ఉప్పు నీటి రూపంలో ఉండగా, 2.14% ధ్రువాల వద్ద మంచుగా పేరుకుపోయి ఉంది. కేవలం 0.86% మంచినీరు మాత్రమే నదులు, చెరువులు, సరస్సులు మొదలైన వాటిలో లభిస్తూ మానవ అవసరాలను తీరుస్తోంది. ఈ మంచినీటి వనరుల్లో అత్యంత ప్రధానమైనవి నదులు.



✦ ప్రధాన నది తన ప్రవాహ మార్గంలో చిన్న చిన్న సెలయేర్లు, వాగులు, వంకలు, ఉపనదులను కలుపుకొని ప్రవహిస్తూ ఉంటుంది. ఈ మొత్తం పరీవాహక వ్యవస్థను నదీ వ్యవస్థ అంటారు.

✦ నది పుట్టిన ప్రదేశాన్ని నదీముఖద్వారం అని, ప్రవహించే మార్గాన్ని నదీప్రవాహ మార్గం అని పిలుస్తారు. నదుల గురించి అధ్యయనం చేసే శాస్త్రమే 'పొటమాలజీ'.

✦ ప్రపంచంలోని ప్రధాన నదులన్నీ ముఖ్యంగా హిమాలయాలు (ఆసియా), రాకీ (ఉత్తర అమెరికా), ఆండీస్ (దక్షిణ అమెరికా) పర్వత ప్రాంతాల్లో పుట్టి ప్రవహిస్తున్నాయి.


మన దేశంలో ముఖ్య నగరాల మీదుగా ప్రవహించే ప్రధాన నదులను పరిశీలిస్తే..

నగరం	నది	రాష్ట్రం
హరిద్వార్	గంగా	ఉత్తరాఖండ్
కాన్పూర్	గంగా	ఉత్తర్‌ప్రదేశ్
అలహాబాద్	త్రివేణి సంగమం (గంగా, యమున, సరస్వతి)	ఉత్తర్‌ప్రదేశ్
వారణాసి	గంగా	ఉత్తర్‌ప్రదేశ్
హైదరాబాద్	మూసీ	తెలంగాణ
కరీంనగర్	మానేరు	తెలంగాణ
విజయవాడ	కృష్ణా	ఆంధ్రప్రదేశ్
రాజమహేంద్రవరం	గోదావరి	ఆంధ్రప్రదేశ్
దిల్లీ	యమున	దిల్లీ
ఆగ్రా	యమున	ఉత్తర్‌ప్రదేశ్
కోల్‌కతా	హుగ్లీ	పశ్చిమ బెంగాల్
సాంచి	బెట్వా	మధ్యప్రదేశ్

జనరల్ స్టడీస్ - భౌతికశాస్త్రం

అయస్కాంతత్వం

అయస్కాంతం ప్రదర్శించే గుణం లేదా ధర్మాన్ని అయస్కాంతత్వం అంటారు. నిత్యం మనం వాడే అనేక వస్తువుల్లో అయస్కాంతత్వ ప్రభావాలను చూస్తుంటాం. ఇళ్లలోని మోటార్లు, విద్యుత్తును ఉత్పత్తి చేసే జనరేటర్లు, ఏటీఎం, క్రెడిట్ కార్డులు, కంప్యూటర్ హార్డ్‌డ్రైవ్‌లు, సీడీలు, ఎం.ఆర్.ఐ. స్కానింగ్, దిక్సూచి, మైకులు, సౌండ్ బాక్స్‌లు, ఇయర్‌ఫోన్లు మొదలైన వాటిలో అయస్కాంతత్వం ఇమిడి ఉంటుంది.



మాగ్నటైట్

కొన్ని రకాల సహజసిద్ధమైన రాళ్లు ఇనుము లాంటి (చిన్న పరిమాణంలోని) పదార్థాలను ఆకర్షిస్తున్నాయని క్రీ.పూ.120లోనే గమనించారు. ఈ సహజమైన రాళ్లలో మాగ్నటైట్ అనే లోహ ఖనిజం ఉందని గుర్తించారు. మాగ్నటైట్ తరహా రాళ్లను (సహజ అయస్కాంతాలను) ఆసియా మైనర్‌లోని 'మాగ్నీసియా' ప్రాంతంలో కనుక్కోవడం ద్వారా వీటికి అయస్కాంతాలు అనే పేరు వచ్చింది.

అయస్కాంతాల రకాలు

1. సహజ అయస్కాంతాలు
2. కృత్రిమ అయస్కాంతాలు
3. శాశ్వత అయస్కాంతాలు
4. తాత్కాలిక అయస్కాంతాలు

అయస్కాంత ధర్మాలు

- ఆకర్షణ ధర్మం
- దిశా ధర్మం
- ద్విధ్రువం
- ప్రేరణ ధర్మం

విద్యుదయస్కాంతాలు - ఉపయోగాలు, అయస్కాంతీకరణ పద్ధతులు, కూలుమ్స్ విలోమ వర్గ నియమం, అయస్కాంత ప్రేరణ, అయస్కాంత బల (క్షేత్ర) రేఖలు, అయస్కాంత క్షేత్రం, అయస్కాంత పదార్థాలు, పారా అయస్కాంతత్వం, ఫెర్రో అయస్కాంతత్వం, భూ అయస్కాంతత్వంతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..

Latest Updates

Non-Executive Posts

Goa Shipyard Limited (GSL) invites applications for the recruitment of Non-Executive posts on Contractual Basis. The no.of posts is 102. Last date of online applications is 11 August 2025.

Manager Posts in NMDC

National Mineral Development Corporation Limited (NMDC) Hyderabad is inviting applications for the Junior Manager and Assistant General Manager posts. The no.of posts is 17. Last date of online applications is 28 July 2025.

Faculty Posts in NIELIT

National Institute of Electronics and Information Technology (NIELIT), New Delhi invites applications for the Professor, Associate Professor, Assistant Professor, Engineering, Developer, Designer posts in various departments on contractual basis. The total no.of Posts is 83. The application fee Rs.500. Last date for applications is 25 July 2025.

Did You Apply..?

Today (July 16) is the last date for the following jobs/ Apprentice posts/ Admissions

☛ 43 posts in Kurnool Government Medical College. ***Eligibility:*** Degree, B.Sc., Diploma, Inter, 10th class.

☛ 54 Faculty posts in ESIC. ***Eligibility:*** MD, MSc.

☛ 15 Epidemiologist (IDSP) posts in AP MSRB. ***Eligibility:*** MBBS.

For more information and other notifications - scan QR code

Bank Exams

English

Fillers

Directions (Qs. 1 - 15): *Here, a sentence is given with one, two or three blank spaces, indicating that those words have been omitted from it. Select the word/words that fit in the blank, thereby making the sentence meaningful and grammatically correct.*

1. The committee has been formed to .... the implementation of welfare schemes in rural districts.
A) avoid B) monitor
C) discourage D) conceal
E) resist

2. Despite repeated attempts, the bank was unable to .... the fraudulent transactions.
A) continue B) ignore C) detect
D) delay E) recover

3. The credit policy was .... to promote financial inclusion and .... access to banking services.
A) terminated, reduce
B) dismissed, neglect
C) avoided, discourage
D) delayed, suppress
E) implemented, expand

4. The online portal allows customers to .... their account details, ... transactions, and .... service requests easily.
A) access, perform, raise
B) ignore, delay, complicate
C) hide, cancel, disturb
D) limit, restrict, stop
E) close, misplace, prevent

5. The Reserve Bank's decision to increase the repo rate will likely .... the cost of borrowing.
A) decrease B) maintain
C) accelerate D) increase
E) eliminate

6. The bank launched a new app to .... digital payments and ensure .... financial services.
A) promote, secure
B) discourage, risky
C) complicate, restricted
D) ignore, safe
E) suppress, public

7. In order to .... customer grievances effectively, the institution has set up a dedicated redressal mechanism.
A) entertain B) raise
C) delay D) address
E) suppress

8. The manager's decision was based on .... analysis and not mere ....
A) casual, logic
B) speculative, assumption
C) strategic, guess
D) weak, observation
E) thorough, speculation

9. The newly introduced credit card offers .... interest rates, ... reward points, and .... transaction limits.
A) higher, limited, reduced
B) moderate, no, huge
C) competitive, attractive, high
D) uncertain, unclear, delayed
E) minimal, discouraging, flat

10. Employees who consistently .... performance targets are likely to be considered for .... roles.
A) miss, lateral
B) achieve, leadership
C) avoid, honorary
D) underperform, demoted
E) criticize, supportive

11. The bank is planning to .... outdated software and .... the entire core banking system.
A) retain, lock
B) eliminate, upgrade
C) dismiss, block D) prolong, avoid
E) reassign, reduce

12. The economic survey revealed a significant .... in consumer confidence over the last quarter.
A) decline B) boom
C) growth D) investment
E) transaction

13. The financial advisor was hired to .... risks and .... the returns on investment.
A) magnify, reduce
B) eliminate, complicate
C) minimize, maximize
D) evaluate, delay
E) track, suppress

14. Banks are required to .... Know Your Customer (KYC) norms to prevent .... transactions.
A) ignore, legal B) reject, authorized
C) skip, clean D) follow, illegal
E) break, verified

15. To tackle rising NPAs, the bank initiated a drive to .... stressed assets and .... recovery processes.
A) overlook, slow
B) inflate, suppress
C) mismanage, cancel
D) hide, delay
E) restructure, fast-track

Scan the QR code for Key

Writer: *P. Manoj Kumar, Subject Expert*

శుభాంశు శుక్లాకు గవర్నర్ అభినందన

ఈనాడు, అమరావతి: రోదసిలో 18 రోజులు గడిపి, అనేక ప్రయోగాలను నిర్వహించి భూమికి తిరిగివచ్చిన వ్యోమగామి శుభాంశు శుక్లాకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అభినందనలు తెలిపారు. శుక్లాతోపాటు మరో ముగ్గురిని తీసుకువెళ్లిన డ్రాగన్ గ్రేస్ వ్యోమనౌక మంగళవారం కాలిఫోర్నియా సముద్రతీరంలో దిగిన నేపథ్యంలో గవర్నర్ స్పందించారు.

అరుదైన ఘనత సాధించిన శుభాంశు శుక్లా: సీఎం చంద్రబాబు

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లి అనేక ప్రయోగాలు చేసి విజయవంతంగా తిరిగొచ్చిన శుభాంశు శుక్లాకు సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. తొలి భారతీయుడిగా అరుదైన ఘనత సాధించారని మంగళవారం ఎక్స్ వేదికగా కొనియాడారు. 'చరిత్రాత్మక మీ ప్రయాణం ఎంతో గర్వకారణం. యువతకు స్ఫూర్తిగా నిలిచిన మీరు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నా' అని పేర్కొన్నారు.

భారత్ గర్వించదగ్గ క్షణం: జగన్

'భారతదేశానికి ఇది గర్వకారణమైన క్షణం. ఐఎస్ఎస్ నుంచి విజయవంతంగా తిరిగివచ్చిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా, యాక్సియం-4 మొత్తం బృందానికి అభినందనలు' అని మాజీ ముఖ్యమంత్రి జగన్ మంగళవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

శుక్లా రోదసి యాత్ర అద్భుతం: పీవీఎన్ మాధవ్

'ప్రతి భారతీయుడు గర్వపడేలా శుభాంశు శుక్లా రోదసిలో 18 రోజులు గడిపి భూమిపైకి రావడం అద్భుతం. వివిధ అంశాలపై ప్రయోగాలు చేసి భారతదేశ ఖ్యాతిని చాటారు' అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కొనియాడారు.

డీమ్డ్ టు బీ విశ్వవిద్యాలయంగా మిట్స్

సాంకేతిక విద్యలో రాయలసీమలో ఇదే మొదటిది

ఈనాడు, అమరావతి: అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్సెస్ (మిట్స్) కళాశాలకు డీమ్డ్ టు బీ విశ్వవిద్యాలయం హోదా కల్పిస్తూ విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ) మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దాంతో సాంకేతిక విద్యలో రాయలసీమలోనే మొదటి డీమ్డ్ టు బీ విశ్వవిద్యాలయం ఇది నిలిచింది. ఇప్పటి వరకు ఇంజినీరింగ్ కళాశాలగా ఉన్న మిట్స్ ఈ విద్యా సంవత్సరం నుంచి డీమ్డ్ విశ్వవిద్యాలయంగా వంద శాతం ప్రవేశాలను సొంతంగానే నిర్వహించుకోనుంది. డీమ్డ్ విశ్వవిద్యాలయాలకు యూజీసీ అనుమతులు ఇస్తున్నందున రాష్ట్రం నుంచి 10కి పైగా కళాశాలలు దరఖాస్తు చేసుకున్నాయి. వీటిలో ఈ ఏడాది మిట్స్‌కు యూజీసీ అనుమతి ఇచ్చింది. దాంతో ఈ ఏడాది ఈఏపీసెట్ ప్రవేశాల కౌన్సెలింగ్ నుంచి ఈ కళాశాలను మినహాయించారు.

17 వరకు ఎండీఎస్ సీట్లకు ఐచ్ఛికాలు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ప్రస్తుత విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని దంత వైద్య కళాశాలల్లో అందుబాటులో ఉన్న పీజీ దంత వైద్య (ఎండీఎస్) కన్వీనర్, యాజమాన్య సీట్ల భర్తీకి ఐచ్ఛికాలు ఇచ్చుకునేందుకు గడువును విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పెంచింది. కన్వీనర్ కోటా సీట్లకు ఈ నెల 14 నుంచి ఐచ్ఛికాలు మొదలుకాగా.. 16వ తేదీ మధ్యాహ్నం ఒంటి వరకు అవకాశం ఇచ్చింది. యాజమాన్య సీట్లకు ఈ నెల 15 నుంచి 17వ తేదీ మధ్యాహ్నం ఒంటి వరకు గడువు ఇచ్చింది.

డిగ్రీ కళాశాలల ప్రవేశాల్లో జాప్యంపై చర్యలు తీసుకోండి

- మంత్రి లోకేశ్‌కు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ లేఖ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో డిగ్రీ కళాశాలల ప్రవేశాల్లో జాప్యంపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కు మంగళవారం లేఖ రాశారు. 2025-26 విద్యా సంవత్సరానికిగాను తెలంగాణలో ఇప్పటికే ప్రవేశాలు పూర్తి చేసి తరగతులు ప్రారంభించారని, రాష్ట్రంలో మాత్రం స్పష్టత కొరవడిందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, కళాశాల విద్యా సంచాలకుల మధ్య సమన్వయ లోపం చక్కదిద్దాలని కోరారు. డిగ్రీ ప్రవేశ నోటిఫికేషన్, విద్యా క్యాలెండర్ వెంటనే విడుదల చేయాలని కోరారు.

నేటి నుంచి ఐసెట్ వెబ్ ఐచ్ఛికాల నమోదు

ఈనాడు, అమరావతి: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కౌన్సెలింగ్‌లో వెబ్ ఐచ్ఛికాల నమోదు గడువు పొడిగించారు. ముందు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 13 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం కావాల్సి ఉండగా.. కళాశాలల అనుమతులు రావడంలో జాప్యం జరగడంతో గడువు పొడిగించారు. ఈ నెల 16 నుంచి 21 వరకు వెబ్ ఐచ్ఛికాల నమోదుకు అవకాశం కల్పించారు. ఐచ్ఛికాల మార్పు 22న, సీట్ల కేటాయింపు 25న చేయనున్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు 26 నుంచి 28 లోపు కళాశాలల్లో చేరాలి. స్పెషల్ కేటగిరి విద్యార్థులకు 19 వరకు అవకాశం కల్పించారు.

'సీపీఎస్ ఉద్యోగులందరికీ 14% వాటా అమలు చేయాలి'

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకే కాకుండా సీపీఎస్‌లో ఉన్న ప్రతి ఉద్యోగికీ చెల్లించాల్సిన కంట్రిబ్యూషన్‌ను 10 శాతం నుంచి 14 శాతానికి పెంచాలని ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొరుకొండ సతీష్, దాస్ కోరారు. "2019 జనవరి 1 నుంచి సీపీఎస్‌లో ఉన్న ఐఏఎస్, ఐపీఎస్, ఇతర అఖిల భారత సర్వీస్ అధికారులకు ప్రభుత్వం చెల్లించే వాటాను 10% నుంచి 14 శాతానికి పెంచుతూ ప్రభుత్వం జీవో ఇచ్చింది. మిగిలిన ఉద్యోగులందరికీ 10% అలాగే ఉండటం రాజ్యాంగ విరుద్ధం. ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఒకే విధంగా వర్తింపజేయాలి. 2003 నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన సీపీఎస్ వారికి పాత పెన్షన్ అమలు చేయాలి. అదే 2003 నోటిఫికేషన్‌తో ఎంపికైన 11 వేల మంది ఉద్యోగులను మాత్రం సీపీఎస్‌లో ఉంచారు" అని ఆవేదన వ్యక్తం చేశారు.

'తల్లికి వందనం'తో పేదలకు మేలు ఎలా?

- క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుతో వచ్చే మార్పులేంటి?
- గ్రూప్-1 ఇంటర్వ్యూల్లో అభ్యర్థులకు ప్రశ్నలు
- ముగిసిన ఇంటర్వ్యూలు.. వారంలోగా ఎంపిక జాబితా!

ఈనాడు – అమరావతి: 'తల్లికి వందనం పథకం కింద ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం వల్ల పేద కుటుంబాలకు ఎంత వరకు లబ్ధి చేకూరుతుంది? విద్యా రంగంలో వచ్చే సానుకూల మార్పులు ఏమిటి? ఏ పంట పండిస్తే అధిక దిగుబడి వస్తుంది? నువ్వే రైతువైతే ఏం చేస్తావు?'.. గ్రూప్-1 ప్రధాన అభ్యర్థులకు ఇంటర్వ్యూలో ఎదురైన కొన్ని ప్రశ్నలివి. రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమల్లో క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలు, సానుకూల మార్పులు, వర్తమాన అంశాలపై అభ్యర్థులకు ఉన్న అవగాహన, విషయ పరిజ్ఞానాన్ని కూడా ప్రశ్నల ద్వారా ఏపీపీఎస్సీ పరీక్షించింది. అభ్యర్థులకు విషయ పరిజ్ఞానంతోపాటు సామాజిక అంశాలపై ఉన్న స్పృహ, నాయకత్వ లక్షణాలను లోతుగా పరీక్షించింది. గత నెల 10న ప్రకటించిన గ్రూప్-1 ప్రధాన పరీక్షల ఫలితాలను అనుసరించి ఎంపిక చేసిన 182 మందికి ఇంటర్వ్యూలను గత నెల 23న ప్రారంభించి, మంగళవారం ముగించింది. ప్రతి అభ్యర్థిని అరగంటకు మించకుండా ఇంటర్వ్యూ చేశారు. 75 మార్కులకు నిర్దేశించిన ఈ ముఖాముఖీలో సుమారు 10 ప్రశ్నలకు అభ్యర్థులు జవాబులు చెప్పాల్సి వచ్చింది.

స్వస్థలం నేపథ్యం ఆధారంగా..

ఉపాధి హామీ పథకం అమలు తీరు, పరిశ్రమల రాకతో రానున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, వ్యవసాయ రంగం ఎలా ఉంది? ఈ రంగంలో వచ్చిన మార్పుల గురించిన ప్రశ్నలు ఇంటర్వ్యూ బోర్డు నుంచి అభ్యర్థులకు ఎదురయ్యాయి. అభ్యర్థుల విద్యార్హతలను అనుసరించి కొన్ని ప్రశ్నలు అడిగారు. అభ్యర్థి బీటెక్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసినట్లయితే పరిశ్రమల అభివృద్ధి గురించి, ఎలక్ట్రికల్ వాహనాలు, గ్రీన్ ఎనర్జీ ప్రాధాన్యం గురించి ప్రశ్నించారు. పలువురు అభ్యర్థులకు రాష్ట్ర రాజధాని అభివృద్ధిపైన ప్రశ్నలు సంధించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు వల్ల పరిశోధనలు, యువతకు ఉద్యోగ అవకాశాలు ఎలా మెరుగుపడతాయి? దేశ ఉజ్వల భవిష్యత్తుకు ఏ మేర ఉపయోగపడుతుందని కూడా అభ్యర్థులను ఇంటర్వ్యూలో పరీక్షించారు. ప్రభుత్వ సబ్సిడీలు, పథకాల అమలు తీరు అభ్యర్థుల సొంత జిల్లాల్లో ఎలా ఉంది? ఎవరెవరు లబ్ధి పొందుతున్నారన్న దానిపైనా ప్రశ్నలడిగారు.

మార్కుల ప్రాతిపదికన పోస్టులు

క్రీడా కోటాలో ఎంపిక చేయాల్సిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన అనంతరమే ఏపీపీఎస్సీ ఫలితాలను ప్రకటించనుంది. ఈసారి ప్రధాన పరీక్షలు, ఇంటర్వ్యూల్లో అభ్యర్థులకు వచ్చిన మార్కులను విడివిడిగా ఏపీపీఎస్సీ ప్రకటించనుంది. ప్రధాన పరీక్షలు, ఇంటర్వ్యూలో వచ్చిన మార్కులను అనుసరించి, ప్రాధాన్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ కమర్షియల్ ట్యాక్స్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, డిప్యూటీ సూపరింటెండెంట్ జైల్స్, డివిజనల్/డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్లు, రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్లు, బీసీ, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, డిప్యూటీ రిజిస్ట్రార్ (కో-ఆపరేటివ్ సొసైటీ), మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-1, అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్, ఇతర పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు.



నిందితులు, ద్విచక్రవాహనాలతో చీరాల డీఎస్పీ మొయిన్, అద్దంకి సీఐ సుబ్బరాజు, సిబ్బంది

యూట్యూబ్ చూసి.. బుల్లెట్ బైక్‌ల చోరీలు

- ఏడుగురు ఇంజినీరింగ్ విద్యార్థుల అరెస్టు

అద్దంకి, న్యూస్‌టుడే: యూట్యూబ్ చూసి బుల్లెట్ ద్విచక్రవాహనాల తాళాలు ఎలా తీయాలో నేర్చుకొని దొంగతనాలు చేస్తున్న ఏడుగురు ఇంజినీరింగ్ విద్యార్థులను అద్దంకి పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.25.20 లక్షల విలువైన 16 బుల్లెట్‌లు, ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. ప్రకాశం జిల్లాకు చెందిన రాయపూడి వసంతకుమార్, అక్కల వెంకటసాయి రెడ్డి, దివి వేణుగోపాల్, బాపట్ల జిల్లాకు చెందిన పల్లా సాయిరాం, పల్నాడు జిల్లాకు చెందిన నార్లగడ్డ గోవిందరాజు, నెల్లూరు జిల్లాకు చెందిన కోడెల పవన్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన జీనేపల్లి నరేంద్రవర్మ బీటెక్ చదువుతున్నారు. వీరంతా ఒంగోలు వీఐపీ రోడ్డులో గది అద్దెకు తీసుకుని కళాశాలకు వెళ్లి వస్తున్నారు. వ్యసనాలకు బానిసలైన వీరు సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆశతో చోరీల బాట ఎంచుకున్నారు. బుల్లెట్ ద్విచక్రవాహనాల తాళాలు ఎలా తీయాలో తాను యూట్యూబ్‌లో చూశానని గోవిందరాజు మిగిలినవారికి వివరించాడు. దీంతో శింగరకొండ తిరునాళ్ల నుంచి ఇప్పటివరకు 17 ద్విచక్రవాహనాలను దొంగతనం చేశారు. అద్దంకిలో తొమ్మిది, చిలకలూరిపేటలో మూడు, జె.పంగులూరులో రెండు, నరసరావుపేట గ్రామీణ, మేదరమెట్ల, మద్దిపాడుల్లో ఒక్కొక్కటి చొప్పున కేసులు నమోదయ్యాయి. ఒకే తరహాలో బుల్లెట్‌లు అపహరణకు గురికావడాన్ని బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తీవ్రంగా పరిగణించారు. అద్దంకి సీఐ సుబ్బరాజు నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. టవర్ డంప్ (టవర్ పరిధిలోని మొబైల్ నంబర్లపై నిఘా) సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుల ఆచూకీ తెలుసుకున్నారు. అపహరించిన ద్విచక్రవాహనాలను అద్దంకి పట్టణ శివారు బ్రహ్మానందం కాలనీలో దాచినట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

జల వివాదాలపై... అర్ధరాత్రి వరకు సీఎం చర్చలు

- పరిణామాలన్నీ వివరించిన అధికారులు
- గత రెండు ఎపెక్స్ కౌన్సిల్ సమావేశాల చర్చలపై దృష్టి
- మళ్లీ నేడు 11 గంటలకు భేటీకి నిర్ణయం



ఈనాడు, అమరావతి: పోలవరం-బనకచర్ల అనుసంధానంతో పాటు జల వివాదాలపై రెండు తెలుగు రాష్ట్రాల సీఎంల దిల్లీ భేటీ నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి వరకు అధికారులతో చంద్రబాబు చర్చలు జరిపారు. దిల్లీ పర్యటనలో ఉన్న సీఎం... జలవనరుల శాఖ అధికారులను తన ఇంటికి పిలిపించుకున్నారు. రాత్రి 11 గంటలకు సమావేశం ప్రారంభమైంది. గంటకు పైగా కొనసాగింది. దిల్లీ భేటీ నేపథ్యంలో అన్ని పరిణామాలనూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, సలహాదారు వెంకటేశ్వరరావులు ముఖ్యమంత్రికి వివరించారు. ఎజెండాలో ఏయే అంశాలను చేర్చారు? వాటికి సంబంధించి రాష్ట్ర వాదనలు ఏమిటి? వ్యూహం ఏమిటి అనే అంశాలు చర్చకు వచ్చాయి. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాసిన లేఖలోని అంశాలతో పాటు తెలంగాణ రాష్ట్రం ఎజెండా అంశాలు ఏమేం ప్రతిపాదించిందో ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఆ తర్వాత గతంలో చోటు చేసుకున్న పరిణామాలపై సీఎం చంద్రబాబు ఆరా తీశారు. రాష్ట్ర విభజన తర్వాత సీఎంగా చంద్రబాబు.. కేంద్ర జలశక్తి మంత్రిగా ఉమాభారతి ఉన్న సమయంలో నిర్వహించిన మొదటి ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్ణయాలు, చర్చలపై వివరాలను అడిగారు. ఆ నోట్స్‌ను తీసుకుని అక్కడే చదివారు. జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన రెండో ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్ణయాలు, అప్పటి ఎజెండా అంశాలు, చర్చలకు సంబంధించిన నోట్స్ అడిగి తీసుకున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు మళ్లీ సమావేశమవుదామని జలవనరుల శాఖ అధికారులకు సీఎం సూచించారు. ఈ సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి, చీఫ్ ఇంజినీరు రాంబాబు, ఈఈ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్-16పై ట్రంపెట్ ఇంటర్‌ఛేంజ్

- రూ.46.49 కోట్లతో టెండర్లు



ఈనాడు, అమరావతి: చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి-16 నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి రాకపోకలు సాగించేందుకు వీలుగా ట్రంపెట్ ఇంటర్‌ఛేంజ్ నిర్మాణానికి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) శ్రీకారం చుట్టింది. సవరవిల్లికి సమీపంలో విమానాశ్రయ రహదారి కలిసేచోట ఈ నిర్మాణాన్ని చేపట్టేందుకు టెండర్లు ఆహ్వానించింది. దీనిని ఈపీసీ విధానంలో, రూ.46.49 కోట్ల అంచనా విలువతో నిర్మించనున్నారు. బిడ్లు దాఖలు చేసేందుకు సెప్టెంబరు ఒకటి వరకు అవకాశం కల్పించారు. సెప్టెంబరు 2న టెండర్లు తెరవనున్నారు. బిడ్లు ఖరారయ్యాక 8 నెలల్లో గుత్తేదారు ఈ నిర్మాణాన్ని పూర్తిచేయాల్సి ఉంటుంది.

అమరావతిలో రాష్ట్ర పర్యాటక భవన్

- కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని మంత్రి దుర్గేష్ ఆదేశం

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో రాష్ట్ర పర్యాటక భవన్ ఏర్పాటుకు అవసరమైన నిధులకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు. విభజన తర్వాత కొత్త రాష్ట్రమైన ఏపీకి పర్యాటక భవన్.. కేంద్రం మంజూరు చేసే అవకాశం ఉందన్నారు. పర్యాటకశాఖ పనితీరుపై మంగళవారం సచివాలయంలో మంత్రి సమీక్షించారు. 'రాష్ట్ర పర్యాటక రంగానికి విస్తృత ప్రచారం కల్పించేలా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, ముంబయిలో రోడ్డు షోలు నిర్వహించాలి. రాష్ట్రంలోని 22 దేవాలయాల పరిసరాల్లో టెంట్ సిటీలు నెలకొల్పేలా ప్రైవేటు సంస్థలను ప్రోత్సహించాలి. రుషికొండ బ్లూ ఫ్లాగ్ బీచ్ సుందరీకరణకు చర్యలు తీసుకుని పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పించాలి. లేపాక్షి, లంబసింగి పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. ఈ ఏడాది సెప్టెంబరు 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని సూర్యలంక బీచ్‌లో పెద్దఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలి' అని మంత్రి ఆదేశించారు. పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, పర్యాటకాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రామాయపట్నం పోర్టు నిర్మాణ గడువు పెంపు ప్రతిపాదనపై మంత్రివర్గ ఉపసంఘం

- డ్రాఫ్ట్ పెంపు అంశంపైనా సిఫార్సులు చేయనున్న కమిటీ

ఈనాడు, అమరావతి: రామాయపట్నం పోర్టు తొలి దశ నిర్మాణ గడువు పెంపు, పోర్టు డ్రాఫ్ట్‌ని 16 మీటర్ల నుంచి 18.5 మీటర్లకు పెంపు ప్రతిపాదనల్ని పరిశీలించి సిఫార్సులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పెట్టుబడులు, మౌలిక వసతులశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ కమిటీలో సభ్యులుగా ఉంటారు. పెట్టుబడులు, మౌలిక వసతులశాఖ కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. రామాయపట్నం పోర్టు పనుల్ని నవయుగ ఇంజినీరింగ్ కంపెనీ లిమిటెడ్(ఎన్ఈసీఎల్), అరబిందో రియల్టీ లిమిటెడ్ సంస్థల భాగస్వామ్యంతో ఏర్పడిన సంస్థ(జేవీ) దక్కించుకుంది. మొదట నిర్దేశించిన గడువు ప్రకారం రూ.4,929.39 కోట్లతో చేపట్టే తొలి దశ పనుల్ని 2025 జూన్ 23కు పూర్తి చేయాలి. కానీ పనులు నిలిచిపోవడం, గుత్తేదారు సంస్థకు భూమి అప్పగించడంలో జాప్యం, ఇతర అంశాల్ని పరిగణనలోకి తీసుకుని గడువు పొడిగించాలని ఈ నెల నాలుగో తేదీన జరిగిన ఈపీసీ కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. దాని ఆధారంగా 2026 ఏప్రిల్ 27వ తేదీ వరకు గడువు పొడిగించాలని ఏపీ మారిటైమ్ బోర్డు సీఈఓ ప్రభుత్వానికి లేఖ రాశారు. మరోపక్క పోర్టులోకి కేప్ సైజ్, సూపర్ కేప్ సైజ్ నౌకలు వచ్చేందుకు వీలుగా ప్రతిపాదిత డ్రాఫ్ట్‌ని 16 మీటర్ల నుంచి 18.5 మీటర్లకు పెంచేందుకు అనుమతివ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీనికోసం అప్రోచ్ చానల్, బెర్త్ పాకెట్స్‌లో అదనపు డ్రెడ్జింగ్, ప్రతిపాదిత బ్యాకప్ యార్డ్ వరకు అదనపు రైల్వే లైన్ల నిర్మాణం, కార్గో నిల్వ, ట్రక్‌ల రాకపోకలు, మెటీరియల్ హ్యాండ్లింగ్ పరికరాల కోసం బ్యాకప్ యార్డ్ సదుపాయాల అభివృద్ధి, అదనపు రోడ్డు కనెక్టివిటీ, పోర్టు లోపల అంతర్గత రోడ్డు కనెక్టివిటీ వంటి పనులు చేపట్టాల్సి ఉంటుందని, దానికి అవసరమైన మార్గదర్శనం చేయాలని మారిటైమ్‌బోర్డు సీఈఓ ప్రభుత్వాన్ని కోరారు. దానిపై ప్రభుత్వం మంత్రుల కమిటీని నియమించింది. వీలైనంత త్వరగా నివేదిక అందజేయాలని సూచించింది.

పట్టణ స్వయం సహాయక సంఘాలకు ఆడిట్

- 'స్టార్ రేటింగ్' పొందిన వాటికి రూ.2 కోట్ల వరకూ రుణాలు

ఈనాడు, అమరావతి: పట్టణ స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ)కు ఆడిట్ నిర్వహించనున్నారు. వాటి పనితీరు ఆధారంగా 'స్టార్ రేటింగ్' ఇచ్చి బ్యాంకుల ద్వారా రూ.2 కోట్ల వరకూ రుణం అందిస్తారు. ఫలితంగా ఎస్‌హెచ్‌జీలు స్వయం ఉపాధి రంగంలో మరింత అభివృద్ధి సాధిస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలో ఇప్పటికే ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టారు. ఇప్పుడు దీన్ని మరో 14 నగరాలకూ విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో 123 పట్టణ స్థానిక సంస్థల్లో 2.47 లక్షల స్వయం సహాయక సంఘాలున్నాయి. వీటిలో 22 లక్షల మంది సభ్యులు ఉన్నారు. సంఘాల ఆధ్వర్యంలో స్వయం ఉపాధి కొత్త యూనిట్ల ఏర్పాటుకు, ఇప్పటికే ఉన్న యూనిట్ల విస్తరణకు బ్యాంకుల నుంచి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఏటా కోట్ల రూపాయల రుణాలు అందిస్తోంది. ఈ విషయంలో ఇప్పటివరకు సరైన విధానం లేని కారణంగా రుణాలు దుర్వినియోగం అవుతున్నాయన్న విమర్శలూ ఉన్నాయి. వీటిని అధిగమించే క్రమంలో సంఘాల పనితీరుపై ఆడిట్ నిర్వహించి రేటింగ్ ఆధారంగా రుణాలివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

సీఎం దిల్లీ పర్యటనలపై శ్వేతపత్రం విడుదల చేయాలి: సీపీఐ

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబు దిల్లీ పర్యటనలపై శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. కేంద్రం రాష్ట్రానికి అందించిన సాయం వెల్లడించాలని, అమరావతిలో బలవంతపు భూసమీకరణను విరమించుకోవాలన్నారు. విజయవాడలోని దాసరి భవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. "ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు పరస్పరం పొగడ్తలతో ముంచెత్తుతున్నారేగాని, రాష్ట్రానికి ఏం చేశారనే దానిపై నోరు మెదపడం లేదు. ఏడాదిలో కేంద్రం నుంచి అదనంగా సాధించిన దానిపై స్పష్టమైన వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలి. ప్రతి దానికీ అప్పులు తీసుకుంటున్నారు. పోలవరం ఎత్తును తగ్గించడంపై సీఎం స్పందించకుండా మౌనమేందుకు వహించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రక్రియ ఆగిపోలేదు. అయిన వేలాది మంది కార్మికులను తొలగిస్తున్నారు. రాజధాని అమరావతి కోసం తొలి విడతగా 55వేల ఎకరాలు సమీకరించారు. ఆ భూముల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాకే మరో విడత భూ సమీకరణకు ముందుకు వెళ్లాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

ఇతర రాష్ట్రాల్లో ఇంటర్ చదివిన విద్యార్థులను స్థానికులుగా పరిగణించాలి

ఏపీలో పదో తరగతి వరకు చదివి, ఇంటర్మీడియట్ ఇతర రాష్ట్రాల్లో చదివిన విద్యార్థులను ఈఏపీసెట్ ప్రవేశాల కౌన్సెలింగ్‌లో స్థానికులుగా పరిగణించాలని కోరుతూ విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ రాశారు. 'ఏడేళ్లు ఒకేచోట చదివితే వారిని ఆ జిల్లా, రాష్ట్రంలో స్థానికులుగా గుర్తిస్తారు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం కౌన్సెలింగ్‌కు ముందు నాలుగేళ్లలో ఏ ఒక్క ఏడాది ఇతర రాష్ట్రంలో చదివినా వారిని స్థానికేతరులుగా పరిగణించేలా ఉంది. ఆయా విద్యార్థుల తల్లిదండ్రులు నివాస ధ్రువీకరణ పత్రాలు కౌన్సెలింగ్‌కు అప్‌లోడ్ చేస్తే 15% స్థానికేతరుల కేటగిరీ కింద సీట్లు కేటాయిస్తారని తెలుస్తోంది. దీంతో వందల మంది ప్రతిభావంతులు తీవ్రంగా నష్టపోతున్నారు" అని ఆయన పేర్కొన్నారు.

పుర కమిషనర్ల పోస్టుల్లో 10% లోపే ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్లు

- పురపాలకశాఖ మార్గదర్శకాలు
- 'ఈనాడు' కథనానికి స్పందన

ఈనాడు, అమరావతి: నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో కమిషనర్, అదనపు కమిషనర్ పోస్టుల్లో డిప్యుటేషన్‌పై చేపట్టే నియామకాలకు ఇతర శాఖల నుంచి 10%లోపే తీసుకోవాలని ప్రభుత్వం పరిమితి విధించింది. పంచాయతీరాజ్, రెవెన్యూ, రాష్ట్ర ఆడిట్, సచివాలయ శాఖల నుంచే డిప్యుటేషన్‌పై తీసుకోవాలని నిర్ణయించింది. మాతృ శాఖలోనూ ఐదేళ్ల సర్వీసుతోపాటు బ్యాచిలర్ డిగ్రీ, అకౌంట్ టెస్టుల్లో ఉత్తీర్ణులై విజిలెన్స్ కేసులు లేని వారే అందుకు అర్హులని తేల్చింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ మంగళవారం మార్గదర్శకాలు జారీ చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసులపై ఇతర శాఖల అధికారులను డిప్యుటేషన్లపై కమిషనర్లుగా నియమించడంపై దుమారం చెలరేగుతోంది. పురపాలక శాఖలో అర్హులు ఉన్నా ఇతరులకు ప్రాధాన్యమివ్వడంపై ఈనెల 10న 'పుర కమిషనర్లుగా.. ఇతర శాఖల అధికారులు' శీర్షికతో 'ఈనాడు'లో వెలువడిన కథనంపై ప్రభుత్వం స్పందించింది. ఇతర శాఖల అధికారులు నియంత్రణకు మార్గదర్శకాలు విడుదల చేసింది.

ఎంపిక చేసిన శాఖల్లోనూ ఎవరెవరంటే....

- పంచాయతీరాజ్ శాఖలో మండల పరిషత్తు అభివృద్ధి అధికారులు, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారులు, జిల్లా పరిషత్తు సీఈఓ, డిప్యూటీ సీఈఓలు
- రెవెన్యూ శాఖలో తహసీల్దార్లు, డిప్యూటీ కలెక్టర్లు
- రాష్ట్ర ఆడిట్ శాఖలో అసిస్టెంట్ ఆడిట్ అధికారులు, జిల్లా ఆడిట్ అధికారులు
- సచివాలయ శాఖలో సెక్షన్ ఆఫీసర్లు, అసిస్టెంట్ సెక్రటరీలు
- మున్సిపల్ కమిషనర్, అదనపు కమిషనర్ (గ్రేడ్ 3 నుంచి సెలెక్షన్ గ్రేడ్) పోస్టుకు అనుగుణంగా జీతభత్యాలు కలిగిన అధికారులనే డిప్యుటేషన్‌కు పరిగణలోకి తీసుకుంటారు.
- పుర పరిపాలన, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, స్వచ్ఛాంధ్ర తదితర అంశాల్లో శిక్షణ తీసుకున్నాకే డిప్యుటేషన్‌పై కమిషనర్లుగా తీసుకోనున్నారు.

గురుకులాలు, వసతి గృహాల్లో మిగిలిన సీట్లను భర్తీ చేయాలి

- సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా

ఈనాడు, అమరావతి: సాంఘిక సంక్షేమ గురుకులాలు, వసతి గృహాల్లో మిగిలిన సీట్లను వెంటనే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులకు జాప్యం జరగకుండా ముందుగానే స్టడీ మెటీరియల్ పంపిణీ చేయాలన్నారు. సచివాలయంలో ఆయన మంగళవారం అధికారులతో సమీక్షించారు. గ్రామ, వార్డు సచివాలయ సంక్షేమ సహాయకుడు తప్పనిసరిగా ఆ గ్రామంలోని గురుకులం, వసతి గృహాన్ని తనిఖీ చేయాలన్నారు. విద్యార్థుల విద్య, ఆరోగ్యం, భద్రతపై రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

క్యాప్టివ్ పోర్టు ఆపరేటర్ల రాయల్టీపై నిర్ణయం

ఈనాడు, అమరావతి: క్యాప్టివ్ పోర్టు ఆపరేటర్ల నుంచి వసూలు చేసే వాటర్ ఫ్రంట్ రాయల్టీలను నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పోర్టు నుంచి జరిపే ఎరువులు, సిమెంటు, ధాన్యం, లిక్విఫైడ్ పెట్రోలియం, గ్రానైట్, బొగ్గు సహా 28 రకాల ఉత్పత్తుల ఎగుమతులు, దిగుమతులపై యూనిట్ ఛార్జీలను నిర్దేశించింది. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఏపీ మారిటైం బోర్డు సీఈఓను ప్రభుత్వం ఆదేశించింది.

వర్కింగ్ జర్నలిస్టులకు ఆరోగ్య బీమా పొడిగింపు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 'వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీం'ను ఏడాది పాటు పొడిగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి పొడిగించిన బీమా సౌకర్యం ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి వస్తుందని పేర్కొంది. గుర్తింపు పొందిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, అక్రెడిటేషన్ ఉన్న ఫ్రీలాన్స్, వెటరన్ జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ అనుబంధ వైద్యశాలల్లో నగదు రహిత వైద్యసేవలు పొందే వీలు కల్పించింది.

రెండు ప్రైవేట్ నర్సింగ్ కళాశాలల గుర్తింపు రద్దు

ఈనాడు, అమరావతి: అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలంలోని నైటింగేల్, ఫ్లోరెన్స్ నర్సింగ్ కళాశాలల గుర్తింపును రద్దు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. క్లినికల్ శిక్షణ ఒప్పందాలు, విద్యార్థుల శిక్షణకు సంబంధించి నకిలీ పత్రాలు సమర్పించడంతో ఈ చర్యలు తీసుకుంది. విశాఖలోని 1 బోన్స్ అండ్ జాయింట్ ఆసుపత్రి యాజమాన్యం ఆయా నర్సింగ్ కళాశాలలు తమ వైద్యశాలలో ఎటాచ్‌మెంట్ అనుమతి పొందలేదని, విద్యార్థులకు తాము శిక్షణ ఇవ్వలేదని ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో నకిలీ పత్రాల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అధికారులు విచారణ జరపగా.. నైటింగేల్ కళాశాల తమ విద్యార్థులకు 'క్యూ 1 ఆసుపత్రి', కమల నర్సింగ్ హోమ్‌లలో క్లినికల్ శిక్షణ ఇప్పించినట్లు, ఫ్లోరెన్స్ కళాశాల కేజీహెచ్‌తోపాటు.. 'క్యూ 1 ఆసుపత్రి'లో శిక్షణ ఇప్పించినట్లుగా తప్పుడు పత్రాలు సమర్పించాయని తేలింది. దీంతో ప్రభుత్వం ఈ రెండు విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేసింది. ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులను గుర్తింపు పొందిన ఇతర కళాశాలల్లో చేర్చాలని ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌ను ఆదేశించింది.

భూసార పరిరక్షణ విభాగంలో పోస్టుల పేర్లు మార్పు

ఈనాడు, అమరావతి: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోని భూసార పరిరక్షణ విభాగంలో పోస్టుల పేర్లు మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఇకపై.. సబ్ డివిజన్‌లోని వ్యవసాయ అధికారిని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ), సహాయ సంచాలకుల్ని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (డీఈఈ), డిప్యూటీ డైరెక్టర్ స్థాయి అధికారిని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ), కమిషనరేట్‌లోని జాయింట్ డైరెక్టర్ స్థాయి అధికారిని సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ)గా పిలుస్తారు. కేటగిరీ 2లో 6 ఈఈ, కేటగిరీ 3లో 14 డీఈఈ పోస్టులు ఉంటాయని పేర్కొంది.

తెదేపా గ్రీవెన్స్‌కు.. పెద్దిరెడ్డి బాధితులు

- మాజీ మంత్రి భార్య పేరుతో అక్రమ రిజిస్ట్రేషన్
- వివిధ సమస్యలపై బాధితుల వినతులు

ఈనాడు, అమరావతి: మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరుడు శ్రీపాదరాజు తమ భూములను అక్రమంగా విక్రయించారని చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం రాగనిపల్లికి చెందిన తుంగా రమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలని తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్‌లకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు. ఆ భూములను పెద్దిరెడ్డి భార్య స్వర్ణలత తన పేరిట రికార్డుల్లో మార్చుకుందని అందులో పేర్కొన్నారు. వివిధ సమస్యలపై పలువురు బాధితులు వినతులు అందించి.. న్యాయం చేయాలని కోరారు.

- రోడ్డు మెటల్ క్వారీ లీజును మాజీ మంత్రి పెద్దిరెడ్డి అండతో వైకాపా ఎంపీటీసీ సభ్యుడు బత్తుల శ్రీనివాసరావు దౌర్జన్యంగా రద్దు చేయించి.. వైకాపా వారికి ఇప్పించారని గుంటూరుకు చెందిన లావు వీరయ్య ఫిర్యాదు చేశారు.
- మత్స్యశాఖ తమకు కేటాయించిన చెరువుల్లో ఎమ్ శ్రీరాములు అనే వ్యక్తి అక్రమంగా చేపలు పట్టి తమను బెదిరిస్తున్నారంటూ చిత్తూరు జిల్లా పుంగనూరు మండలానికి చెందిన కృష్ణమూర్తి అర్జీ ఇచ్చారు.
- పశ్చిమ ఆఫ్రికాలో కేయెస్ నగరంలోని సిమెంటు ఫ్యాక్టరీలో పనిచేస్తున్న తన కుమారుడిని ఇటీవల ఉగ్రవాదులు కిడ్నాప్ చేసినట్లు ఫ్యాక్టరీ నిర్వాహకులు ఫోన్ చేసి చెప్పారని.. ఉగ్రవాదుల చెర నుంచి విడిపించి స్వదేశానికి రప్పించాలని పల్నాడు జిల్లా మాచర్ల మండలం జమ్మలమడక గ్రామానికి చెందిన కురాకుల వెంకటేశ్వర్లు గ్రీవెన్స్‌లో అభ్యర్థించారు.
- ఒకే స్థలాన్ని రెండు సార్లు రిజిస్టర్ చేసిన శ్రీధర్ రెడ్డిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని నెల్లూరుకు చెందిన దేవరపల్లి సాయి కోరారు.